'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 292

సోమవారం 12-1-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

TIRUMALA

2025లో ప్రతిష్టాత్మక IIT/NIT/IIIT/BITS లలో సాధించిన అడ్మిషన్లు **926**

2025లో మా విద్యార్థులు సాధించిన MBBS సీట్లు **251**

TIRUMALA

A/C Hostel | Day Scholar

E. M. SCHOOL | Jr. COLLEGE | IIT & MEDICAL ACADEMY

కాతేరు, రాజమహేంద్రవరం. తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్. Cell : 79979 89322, 79979 89323, 79979 89324.

విశాఖపట్నం : రాజుల తాళ్ళవలస, N.H-16 ప్రక్కన, ✆: 7799954622, 7799954624 | భీమవరం : ప్రకృతి ఆశ్రమం, ✆: 9912301409 , 9182623317 | తణుకు : కొమరవరం, ఇరగవరం రోడ్డు, ✆: 7386620777, 7396615777 | పాయకరావుపేట : N.H-16 ప్రక్కన, ✆: 8008478777, 8520926777 | కాపవరం : N.H-16 ప్రక్కన, కాపవరం, చాగల్లు మండలం, తూ. గో. జిల్లా. ✆: 809 639 7777, 809 646 7777

నిరంతరం శ్రమించే అధ్యాపకులు - నిర్విరామంగా కృషిచేసే విద్యార్థులు
అచంచల విశ్వాసం గల తల్లిదండ్రులు - అందుకే ఈ ఘన విజయాలు

నీట్-2025కు దేశవ్యాప్తంగా 22 లక్షలకు పైగా విద్యార్థులు హాజరుకాగా ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 19వ ర్యాంకు మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ 1st ర్యాంకు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన విద్యాసంస్థ "తిరుమల"

NEET - 2025 ఫలితాలలో OPEN CATEGORYలో మా విద్యార్థి సాధించిన ALL INDIA ర్యాంకు

ALL INDIA 19th RANK

D. K. RAM KIREETI

OPEN CATEGORYలో STATE 1st RANK

THE GLORY OF TIRUMALA

ఇప్పటివరకు గత 12 సం॥లలో మా విద్యార్థులు IIT/ NIT/IIIT/ BITS లలో సాధించిన సీట్లు

@ 2014 - 2025	
2014	57
2015	112
2016	123
2017	133
2018	238
2019	253
2020	458
2021	459
2022	591
2023	646
2024	833
2025	926
TOTAL :	4829

ఇప్పటివరకు గత 12 సం॥లలో మా విద్యార్థులు సాధించిన MBBS సీట్లు

@ 2014 - 2025	
2014	11
2015	32
2016	67
2017	73
2018	101
2019	105
2020	163
2021	169
2022	202
2023	233
2024	250
2025	251
TOTAL :	1657

2025 లో ప్రతిష్టాత్మక IIT/ NIT/ IIIT/ BITS లలో మా విద్యార్థులు సాధించిన సీట్లు

926

IIT - 402 | NIT - 366 | IIIT - 144 | BITS - 14

IIT Admissions 402

IIT-Bhilai	12
IIT-Bhubaneswar	32
IIT-Bombay	15
IIT-Delhi	4
IIT-Dhanbad	52
IIT-Dharwad	17
IIT-Gandhinagar	8
IIT-Goa	1
IIT-Guwahati	14
IIT-Hyderabad	23
IIT-Indore	13
IIT-Jammu	4
IIT-Jodhpur	6
IIT-Kanpur	12
IIT-Kharagpur	49
IIT-Madras	30
IIT-Mandi	5
IIT-Palakkad	15
IIT-Patna	17
IIT-Roorkee	10
IIT-Ropar	7
IIT-Tirupati	8
IIT-Varanasi	17
IIST-Thiruvananthapuram	4
IIPE-Vizag	24
RGIPT - Amethi	3

NIT Admissions 366

NIT-Agartala	25
NIT-Allahabad	4
NIT-Andhra Pradesh	39
NIT-Arunachal Pradesh	6
NIT-Bhopal	7
NIT-Calicut	32
NIT-Delhi	3
NIT-Durgapur	37
NIT-Goa	3
NIT-Hamirpur	2
NIT-Jaipur	1
NIT-Jalandhar	4
NIT-Jamshedpur	8
NIT-Kurukshetra	9
NIT-Manipur	10
NIT-Meghalaya	3
NIT-Mizoram	8
NIT-Nagaland	12
NIT-Nagpur	12
NIT-Patna	15
NIT-Puducherry	7
NIT-Raipur	23
NIT-Rourkela	16
NIT-Silchar	19
NIT-Srinagar	8
NIT-Surat	6
NIT-Surathkal	9
NIT-Tiruchirappalli	12
NIT-Warangal	14
IIEST - Shibpur	7
ISI - Kolkata	2
IISER - Pune	1
IISER - Tirupati	2

IIIT Admissions 144

IIIT-Agartala	1
IIIT-Allahabad	2
IIIT-Bangalore	4
IIIT-Bhagalpur	5
IIIT-Bhopal	2
IIIT-Bhubaneswar	3
IIIT-Dharwad	18
IIIT-Guwahati	1
IIIT-Gwalior	1
IIIT-Hyderabad	2
IIIT-Jabalpur	6
IIIT-Kalyani	6
IIIT-Kancheepuram	9
IIIT-Kottayam	18
IIIT-Kurnool	13
IIIT-Lucknow	1
IIIT-Manipur	13
IIIT-Nagpur	2
IIIT-Naya Raipur	9
IIIT-Pune	1
IIIT-Raichur	5
IIIT-Ranchi	3
IIIT-SriCity	8
IIIT-Srirangam	3
IIIT-Surat	2
IIIT-Vadodara	6

BITS Admissions 14

BITS- Pilani	2
BITS- Hyderabad	4
BIT - Patna	3
BIT - Ranchi	5

2025 లో IIT/ NIT/ IIIT/ BITS లలో సీట్లు సాధించిన 926 మందిలో కొందరు విద్యార్థులు

5,6,7,8,9,10 వ తరగతులు పూర్తిచేస్తున్న విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు JEE Advanced, JEE Main & NEET పరీక్షలపై

for Registration

అవగాహన సదస్సు

ONLINE REGISTRATION IS A MUST Visit : www.tirumalaedu.com

రాజమహేంద్రవరం క్యాంపస్‌లో	విశాఖపట్నం క్యాంపస్‌లో	భీమవరం క్యాంపస్‌లో
18.01.2026	18.01.2026	25.01.2026
ఆదివారం ఉదయం10 గం॥లకు	ఆదివారం ఉదయం10 గం॥లకు	ఆదివారం ఉదయం10 గం॥లకు
✆ 79979 89322, 79979 89323	✆ 91333 32103, 91333 32104	✆ 73309 69423, 91826 23317

TIRUMALA

A/C Hostel | Day Scholar

E. M. SCHOOL | Jr. COLLEGE | IIT & MEDICAL ACADEMY

RAJAMAHENDRAVARAM | VISAKHAPATNAM | BHIMAVARAM | TANUKU | PAYAKARAOPETA | KAPAVARAM

NEET - 2025 STATE BEST RANKS

OPEN CATEGORY లో STATE 1st RANK – D.K. RAM KIREETI

10th RANK – K. EEPSITH KASHYAP

34 K.V.V.N. Sai Pavan | 71 T. Sahithi | 79 M.S. Santhosh | 101 T. Ramchandran | 118 Ch. Lakshman Susrut | 119 L. Abhishek | 251 V.H.V. Sai Manikanta

267 K. Mouli | 303 M. Vaishnavi | 318 N. Vaishnavi | 336 S. Ramya | 366 M. Anirudh | 367 P. Lavanya | 369 G. Sahasra | 454 P.V. Akhila Sai | 495 G.P.A.G. Mani Kumar | 521 N.R. Sai Sarayu

ANALYSIS: 1000 లోపు 43 | 5000 లోపు 198 | 10000 లోపు 374 | 20000 లోపు 672

2025 లో MBBS సీట్లు సాధించిన మా విద్యార్థులు **251**

AIIMS - 7 | JIPMER - 2

Medical College	Location	Admissions
AIIMS	New Delhi	2
AIIMS	Bhuvaneswar	1
AIIMS	Hyderabad	2
AIIMS	Raibarelly	1
AIIMS	Gorakhpur	1
JIPMER	Puducherry	2
GSL Medical College	Rajahmundry	23
ASRAM	Eluru	21
Rangaraya Medical College	Kakinada	21
Andhra Medical College	Visakhapatnam	19
Govt. Medical College	Rajahmundry	17
Gayathri Medical College	Visakhapatnam	12
Nri Medcial College	Visakhapatnam	11
Govt. Medical College	Ongole	10
Konaseema Medical College	Amalapuram	9
Maharaja Medical College	Vizianagaram	9
NRI Medical College	Chinakakani	8
Siddhartha Medical College	Vijayawada	8
Govt. Medical College	Eluru	7
Guntur Medical College	Guntur	7
Katuri Medical College	Guntur	7
Govt. Medical College	Machilipatnam	7
Govt. Medical College	Srikakulam	6
Govt. Medical College	Vizianagaram	6
Great Easter Medical College	Srikakulam	5
Dr. Pinnamaneni Siddhartha Medical College	Gannavaram	3
Viswabharathi Medical College	Kurnool	3
Mallareddy Medical College	Hyderabad	2
Govt. Medical College	Kadapa	2
Govt. Medical College	Paderu	2
Sri Balaji Medical College	Renugunta	2
Gitam Medical College	Visakhapatnam	2
Kasturba Medical College	Manguluru	2
T S Misra Medical College & Hospital	Lucknow	1
Govt. Medical College	Kurnool	1
Teerthankar Mahaveer Medical College	Moradabad	1
Santhiram Medical College	Nandyala	1
MIMS Medical College	Nellimarla	1
ACSR Medical College	Nellore	1
ESIC Medical College	Punjab	1
CMC Medical College	Tamilnadu	1
Sri Padmavathi Medical Colege	Tirupathi	1
Nimra Medical College	Vijayawada	1
Kakatiya Medical College	Warangal	1

Results@2025

MED SYNAPSE @ 2025

MEDSYNAPSE@2025

2025 లో MBBS సీట్లు సాధించిన 251 మందిలో కొందరు విద్యార్థులు

JEE Main - 2025 లో OPEN CATEGORY లో మా విద్యార్థుల 100లోపు ALL INDIA ర్యాంకులు

46th RANK K. YASWANTH RAJA | 53rd RANK K. YASWANTH SATWIK | 56th RANK K. PRANEETH

వివిధ కేటగిరిలలో మా విద్యార్థులు సాధించిన అత్యద్భుత ఆలిండియా ర్యాంకులు

2nd RANK K. PRANEETH | 3rd RANK K. YASWANTH SATWIK | 9th RANK P. SARATH SANTOSH | 18th RANK V. TEJASRI

ఆలిండియా 2000లోపు 155 | ఆలిండియా 5000లోపు 321 | ఆలిండియా 10000లోపు 567 | ఆలిండియా 20000లోపు 957

JEE Advanced - 2025 లో OPEN CATEGORY లో ALL INDIA ర్యాంకులు సాధించిన మా విద్యా కుసుమాలు

OPEN CATEGORY ALL INDIA 113 RANK – K. YASWANTH SATWIK

ALL INDIA 311 K. PRANEETH | ALL INDIA 371 D.A. SAI SREEKAR | ALL INDIA 368 D. HARSHA VARDHAN | ALL INDIA 480 K. YASWANTH RAJA

వివిధ కేటగిరిలలో మా విద్యార్థులు సాధించిన అత్యద్భుత ఆలిండియా ర్యాంకులు

ALL INDIA 2nd RANK K. PRANEETH | ALL INDIA 8th RANK K. YASWANTH SATWIK | ALL INDIA 12th RANK E. VARSHITH

ఆలిండియా 500లోపు 49 | ఆలిండియా 1000లోపు 102 | ఆలిండియా 5000లోపు 457 | ఆలిండియా 10000లోపు 647

10వ తరగతి ఫలితాలలో తిరుమల విజయ దరహాసం

OUR BEST MARK – Y. LAASYA SRI SAI 597/600

4గురు విద్యార్థులకు 596/600: Ch. S. BHARDWAJ | U. JASWANTH PAVAN | K. DURGA KASHYAP | K. SRIVALLI

8మంది విద్యార్థులకు 595/600: CH LASYA HARSHITA | S. NANDINI | D. Ch. SAHASRA | K. SRAVANI | A. LAKSHMI DIVYA | B. KEERTHI SREE | G. VARUN VARSHITH | B. KALYAN RAM

పరీక్షకు హాజరైన వారు	2732
above 595 Marks	13
above 590 Marks	104
above 585 Marks	316
above 580 Marks	590
above 570 Marks	1131
above 550 Marks	1806
above 500 Marks	2480

AP EAPCET RESULTS @ 2025

ENGINEERING: STATE 3rd RANK K. YASWANTH SATWIK

STATE 20 A.M. SATYA SRI HARSHA | STATE 26 K. YASWANTH RAJA | STATE 27 CH. SAI KESHAV RAM | STATE 31 V. TEJASRI | STATE 36 K. PRANEETH | STATE 66 D. ASHISH SAI SREEKAR | STATE 77 K. SHANKAR MANIK | STATE 93 K.V. RAMA VINEESH

AGRI/ PHARMA: STATE 8th RANK D.K. RAM KIREETI | STATE 12 M.S. SANTHOSH REDDY

STATE 39 L. ABHISHEK | STATE 47 K.V.V. NAGA SAI PAVAN | STATE 55 T. SAHITHI | STATE 58 K. EEPSITH KASHYAP | STATE 63 L. SWAMI VENKATA SAI | STATE 73 P. LAKSHMI SAI DINESH | STATE 77 T. RAMCHANDRAN | STATE 81 M. VAISHNAVI

500లోపు 121 | 1000లోపు 279 | 5000లోపు 647 | 10000లోపు 2051

'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 292

సోమవారం 12-1-2026

కోహ్లి పరుగుల బాటతో..
తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ విజయం
9 లో

సూపర్ సోఫీ
గుజరాత్‌ను గెలిపించిన కివీస్ క్రికెటర్.. ఢిల్లీకి రెండో ఓటమి
9 లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి టెన్త్‌క్లాస్ స్పెషల్

బయాలజీ
ముఖ్యమైన ప్రశ్నలు- సమాధానాలు, క్విజ్

- వివరాలు 7,8ల్లో▶

లిక్కర్ సిండికేట్‌కు

సంక్రాంతి కిక్కు!

జీవో రాకముందే మద్యం ధరల పెంపు

జోరుగా సాగుతున్న మద్యం సిండికేట్ దందా

మూడు రోజులుగా రూ.15 కోట్ల దోపిడీ

- కూటమి ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక మామూళ్లు
- జీవో వచ్చాక కూడా దోపిడీ కొనసాగేలా సిండికేట్ స్కెచ్
- చేష్టలుడిగి చూస్తున్న ఎక్సైజ్ శాఖ

2 లో

కూలీలకు డబ్బుల్లేవ్... పనులకు కోత

కూలిన 'ఉపాధి'!

దాదాపు ఆరు నెలలుగా కూలీలకు డబ్బులు ఇవ్వకుండా తొక్కిపెట్టిన బాబు సర్కారు

- పండుగ నాడూ నిరుపేదల పస్తులు
- కూలీలకు చెల్లించాల్సిన ఉపాధి డబ్బులు రూ.454 కోట్లు
- ఆగస్టు 10 తర్వాత డబ్బులు అందక నిరుపేదల అగచాట్లు
- మరోవైపు రాష్ట్రంలో బాగా తగ్గిపోయిన 'ఉపాధి' కల్పన
- 2023 ఏప్రిల్ – డిసెంబర్ మధ్య జగన్ ప్రభుత్వంలో 21.75 కోట్ల పనిదినాలు
- 2025 ఏప్రిల్ – డిసెంబర్ మధ్య బాబు సర్కారు కల్పించింది 16.29 కోట్ల పనిదినాలే

2 లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84	ఫారం దగ్గర లైవ్ బర్డ్	159 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో	270 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	186 కిలో	స్కిన్ లెస్	307 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

కండలేరు సందర్శనపైనా ఆంక్షల సంకెళ్లు

అనుమతివ్వని పోలీసులు.. అడుగడుగునా వైఎస్సార్‌సీపీ నేతలకు అడ్డంకులు

- కండలేరు ముఖద్వారం వద్దే నిలిపివేత
- అక్కడే బైఠాయించిన కాకాణి, ఆనం, నేదురుమల్లి, కిలివేటి
- వర్షాన్నీ లెక్కచేయక నాలుగు గంటల పాటు నిరసన
- చివరికి నేతల అరెస్టు.. రాపూరు స్టేషన్‌కు తరలింపు
- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- అరెస్టులకు భయపడేదిలేదు.. చావుకు సిద్ధపడే వచ్చాం: కాకాణి

3 లో

ఆదివారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో నిర్వహించిన 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'లో డోలు వాయిస్తున్న ప్రధాని మోదీ

మన చుట్టూ.. సోమనాథ్ పునర్‌నిర్మాణ వ్యతిరేక శక్తులు

6 లో

క్లుప్తంగా...

వడ్డే ఓబన్నకు వైఎస్ జగన్ ఘన నివాళి

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. 'తెలుగు నేల గర్వపడే పోరాట యోధుడు, స్నేహానికి అర్థం చెప్పిన రేనాటి వీరుడు వడ్డే ఓబన్న. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైన్యాధిపతిగా ఉంటూ బ్రిటిష్ సామ్రాజ్యానికే సవాల్ విసిరిన ఓబన్న జయంతి సందర్భంగా నివాళులు' అంటూ వైఎస్ జగన్ ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

వడ్డెరలను రాజకీయంగా ప్రోత్సహించింది జగనే

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, వడ్డెర సంఘం నాయకులు

సాక్షి, అమరావతి: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వడ్డెర సంక్షేమం కోసం మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన కృషిని, రాజకీయంగా ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేసుకుని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెరలకు వైఎస్ కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని, వారిని ఆర్థికంగా, రాజకీయంగా వైఎస్ జగన్ ముందుకు తీసుకెళ్లారని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, గుంటూరు జిల్లా జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనూరాధ, పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి, పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, పార్టీ బీసీ సెల్ జనరల్ సెక్రటరీ బత్తుల రామారావు, చిత్తూరు జిల్లా పార్టీ సోషల్ మీడియా అడ్వైజర్ పవన్, హైకోర్టు అడ్వకేట్ బేబీ రాణి, వివిధ పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు సంక్రాంతి సంతోషం లేకుండా చేసిన ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి

సాక్షి, అమరావతి: సంక్రాంతికి ఉద్యోగుల పరిస్థితి అధ్వానంగా తయారైందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎవరూ సంతోషంగా పండుగ జరుపుకొనే పరిస్థితి లేదన్నారు. అధికారంలోకి వచ్చిన 19 నెలల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అదనంగా ఒక్క ప్రయోజనం కూడా కలిగించలేదని ఆమె ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు కేవలం ఒక్క డీఏ ఇచ్చి నాలుగు డీఏలు బకాయిలు పెట్టారన్నారు. ఉద్యోగ సంఘాలు ఎన్నిసార్లు కోరినా పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను నియమించలేదనీ, కనీసం ఐఆర్ ఇచ్చే ఉద్దేశమేలేనట్టు ప్రభుత్వం వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో కరోనా సమయంలో కూడా ఉద్యోగులకు డీఏలు, ఐఆర్, పీఆర్సీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం ఉద్యోగుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకా నయం! నేను ప్రజాసేవ చేయడానికొచ్చారనుకున్నా!!

● కూలీలకు డబ్బుల్లేవ్... పనులకు కోత

కూలిన 'ఉపాధి'!

దాదాపు ఆర్నెల్లుగా కూలీలకు డబ్బులు ఇవ్వకుండా తొక్కిపెట్టిన బాబు సర్కారు

- పండుగ నాడూ నిరుపేదల పస్తులు
- కూలీలకు చెల్లించాల్సిన ఉపాధి డబ్బులు రూ.454 కోట్లు
- ఆగస్టు 10 తర్వాత డబ్బులు అందక నిరుపేదల అగచాట్లు
- మరోవైపు రాష్ట్రంలో బాగా తగ్గిపోయిన 'ఉపాధి' కల్పన
- 2023 ఏప్రిల్ – డిసెంబరు మధ్య జగన్ ప్రభుత్వంలో 21.75 కోట్ల పనిదినాలు
- 2025 ఏప్రిల్ – డిసెంబరు మధ్య బాబు సర్కారు కల్పించింది 16.29 కోట్ల పనిదినాలే

సాక్షి, అమరావతి: ఎండల్లో చెమటోడ్చి చేసిన పనికి కూలి డబ్బులు ఇవ్వకుండా చంద్రబాబు సర్కార్ నిరుపేదలను వేధిస్తోంది. ఒకపక్క ఉపాధి పనుల్లో కోత.. మరోపక్క దాదాపు ఆరు నెలలుగా కూలి డబ్బులు అందక నిరుపేదలు నరక యాతన పడుతున్నారు. ఉపాధి హామీ కూలీలు పండగ పూట సైతం పస్తులతో గడపాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కూలీలకు నెలల తరబడి ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో లక్షలాది పేద కుటుంబాల్లో సంక్రాంతి సంతోషం ఛాయలు కానరావడం లేదు. నిబంధనల ప్రకారం గరిష్టంగా 15 రోజులకు మించి ఉపాధి కూలీలకు కూలి డబ్బులు బకాయి పెట్టకూడదని కేంద్ర చట్టం చెబుతోంది. అయితే రాష్ట్రంలో గతేడాది ఆగస్టు 10 తర్వాత ఉపాధి కూలీలకు ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి కూలీలకు రూ.425 కోట్ల మేర కూలి డబ్బుల బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం 20 రోజుల క్రితం రాజ్యసభకు లిఖితపూర్వకంగా వెల్లడించింది. జనవరి 10వతేదీ నాటికి కూలీలకు చెల్లించాల్సిన బకాయిల మొత్తం రూ.454 కోట్లకు పెరిగినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కూలి డబ్బులపై ఆధారపడి జీవనం సాగించే లక్షలాది నిరుపేద కుటుంబాలు రోజువారీ అవసరాల కోసం అల్లాడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

'ఉపాధి' బకాయిలు ఏపీలోనే అత్యధికం

దేశవ్యాప్తంగా ఉపాధి హామీ కూలీలకు వేతన బకాయిలు ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా ఉన్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల పార్లమెంట్‌కు ఇచ్చిన సమాచారం ప్రకారం దేశవ్యాప్తంగా ఉపాధి కూలీలకు రూ.1,766 కోట్లు వేతన బకాయిలు ఉండగా అందులో నాలుగో వంతు ఏపీలోనే ఉండటం గమనార్హం.

పనులు భారీగా తగ్గుదల..

మరోవైపు గత ప్రభుత్వంతో పోలిస్తే చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనుల కల్పన కూడా భారీగా తగ్గిపోయింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2023 ఏప్రిల్ – డిసెంబర్ మధ్య 21.75 కోట్ల పనిదినాలు కల్పించి గ్రామీణ పేదలను ఆదుకోగా.. చంద్రబాబు సర్కారు 2025 ఏప్రిల్ – డిసెంబరు మధ్య కేవలం 16.29 కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించింది. గత ప్రభుత్వంతో పోలిస్తే దాదాపు ఐదున్నర కోట్ల మేర పని దినాల కల్పన తగ్గిపోవడం గమనార్హం.

తగ్గిపోయిన లబ్ధిదారులు..

అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 47 లక్షల కుటుంబాలకు చెందిన 75 లక్షల మంది పేదలు ఏటా వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులు చేసుకుంటూ ప్రయోజనం పొందుతుంటారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో 75.43 లక్షల మంది కూలీలు 25.30 కోట్ల పనిదినాల ద్వారా రూ.6,277 కోట్ల మేర లబ్ధి పొందారు. అదే 2025 ఏప్రిల్ నుంచి 2026 జనవరి 10 వరకు కేవలం 41 లక్షల కుటుంబాలకు సంబంధించి 65 లక్షల మంది ఉపాధి కూలీలకు రూ.4,400 కోట్లు మాత్రమే ప్రయోజనం చేకూరింది.

నిరుపేద ఎస్సీలకు కోత..

చంద్రబాబు సర్కారు వచ్చాక ఉపాధి హామీ పథకం పనులు భారీగా తగ్గిపోవడంతో నిరుపేద ఎస్సీలే అధికంగా నష్టపోయారు. 2023–24లో గత ప్రభుత్వం కల్పించిన మొత్తం 25.30 కోట్ల పనిదినాల్లో 22.41 శాతం మేర పనిదినాలు ఎస్సీలకే దక్కాయి. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం 2025–26లో కల్పించిన 16 కోట్ల పనిదినాల్లో ఎస్సీలు కేవలం 20.60 శాతం పనిదినాలు మాత్రమే పొందగలిగారు.

పండుగ చేసుకునే పరిస్థితి లేదు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఉపాధి హామీ పథకం కూలీల ఉసురు తీస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే గత ఐదు నెలల నుంచి రూ.454 కోట్లు వేతనాలు ఇవ్వలేదు. వేతనాలు సక్రమంగా వచ్చి ఉంటే ప్రతి కుటుంబానికీ కనీసం రూ.3 వేల మేర కూలి అందేది. ఇప్పుడు ఉత్తరాంధ్ర, రాయలసీమలో చాలా పేద కుటుంబాలైతే, పండుగ ప్రశాంతంగా జరుపుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వం సంక్రాంతి లోపు కూలీలకు వేతన బకాయిలన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాం.

– వి.వెంకటేశ్వర్లు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పనులే కల్పించడం లేదు

రెండు నెలలుగా మా గ్రామంలో ఉపాధి పనులు పెట్టలేదు. వర్షం పడిందని పనులు ఆపేశారు. ఆ తరువాత ఎవరూ పట్టించుకోవడం లేదు. పనులు పెట్టమని అడుగుతున్నాం. ఉపాధి పనులు చేస్తే మాకు కాస్త చేదోడుగా ఉంటుంది. పనులు ఉంటే చేతిలో కాస్త డబ్బులు ఉంటాయి. సంక్రాంతి పండుగ సంతోషంగా జరుపుకునేవాళ్లం. అధికారులు స్పందించి మాగ్రామంలో ఉపాధి పనులు ఏర్పాటు చేయాలి.

– దగ్గుమాటి శ్యామల, ఆత్మకూరు గ్రామం, ఉలవపాడు మండలం, ప్రకాశం జిల్లా

డబ్బులు జమ చేయడం లేదు

ఉపాధి హామీలో నేను పని చేసి నాలుగు నెలలైంది. అప్పటి నుంచి పని కల్పించడం లేదు. కనీసం మా ఖాతాలో డబ్బులు జమ చేయలేదు. సంక్రాంతి పండుగ సమయంలో డబ్బులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసి సొమ్ములు ఖాతాలో జమ అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలి.

– మెరుగు బాబూరావు, కొత్తూరు, కామవరపుకోట మండలం, ఏలూరు జిల్లా

తినడానికి కూడా కష్టంగా ఉంది..

ఉపాధి హామీ పనులే మాకు జీవనాధారం. ఈ పనులు చేసుకునే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. చేసిన పనులకు కూలి డబ్బులు పడకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. తినడానికి కూడా కష్టంగా ఉంది. సంక్రాంతి పండుగ సమయంలో కూడా కూలి డబ్బులు పడకపోతే పస్తులు ఉండాల్సిందే.

– గోదా వెంకట్రావు, ఉపాధి హామీ కూలీ, కొత్తూరు, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా

ఎలా నెట్టుకురావాలో ?

రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం మాది. పనులు చేస్తేనే కుటుంబం గడిచేది. ఉపాధి హామీ పనులు చేసినప్పటికీ కూలి డబ్బులు ఇంతవరకు జమ కాలేదు. కుటుంబాన్ని ఎలా నెట్టుకు రావాలో తెలియక నానా కష్టాలు పడుతున్నాం. పరిస్థితి ఇలాగే కొనసాగితే బతుకుదెరువు కోసం మరో పని చూసుకోవాల్సిందే. త్వరగా కూలి డబ్బులు ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలి.

– వల్లెల మేరి, ఉపాధి హామీ కూలీ, కొత్తూరు, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా

లిక్కర్ సిండికేట్‌కు సంక్రాంతి కిక్కు!

జీవో రాకముందే మద్యం ధరల పెంపు ■ మూడు రోజులుగా జోరుగా సాగుతున్న దందా

రోజుకు రూ.15 కోట్ల దోపిడీ ■ కూటమి ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక మామూళ్లు

జీవో వచ్చాక కూడా దోపిడీ కొనసాగేలా సిండికేట్ స్కెచ్ ■ చేష్టలుడిగి చూస్తున్న ఎక్సైజ్ శాఖ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జీవోతో మాకేం సంబంధం లేదు.. ప్రభుత్వమే మాది.. మా దోపిడీని ఆపేదెవర్రా.. అన్నట్లుంది రాష్ట్రంలో టీడీపీ మద్యం సిండికేట్ బరితెగింపు. మద్యం ధరల పెంపుపై ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు (జీవో) విడుదల కాకముందే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేసి, మూడు రోజులుగా అనధికారికంగా దోపిడీకి తెగబడుతున్నారు. అందుకు ఎక్సైజ్ అధికారులు అడ్డుకోకుండా చూస్తామని చెప్పి.. టీడీపీ కూటమి ప్రజా ప్రతినిధులు సంక్రాంతి సీజన్ వేళ మద్యం దుకాణాల నుంచి భారీగా మామూళ్లు వసూలు చేశారు. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచుతూ ఈ నెల 8న రాష్ట్ర మంత్రి మండలి తీర్మానించింది. ఒక్కో బాటిల్‌పై రూ.10 పెంపునకు నిర్ణయించింది. కాగా, అందుకు అనుమతినిస్తూ అధికారికంగా జీవో ఇంకా విడుదల కాలేదు. అంటే మద్యం ధరల పెంపు అధికారికంగా ఇంకా అమలులోకి రాలేదు. కానీ ఈ అధికారిక ప్రక్రియతో తమకు సంబంధం లేదంటూ మద్యం సిండికేట్ బరితెగించింది. ఈ నెల 9 నుంచే మద్యం ధరలు పెంచేసింది. మూడు రోజులుగా రాష్ట్రంలో మద్యం దుకాణాలు, బార్లలో ధరల పెరుగుదల అనధికారికంగా అమలులోకి వచ్చేసింది. 'ముఖ్య' ప్రజా ప్రతినిధి దన్ను ఉండటంతో ఎక్సైజ్ శాఖ చోద్యం చూడటం మినహా ఏమీ చేయలేక పోతోంది.

సంక్రాంతి స్పెషల్

బాటిల్‌పై రూ.10 అదనం అంటే ఏముందీలే అనుకోవద్దు. ఎందుకంటే రాష్ట్రంలో 3,636 మద్యం దుకాణాలు, 540 బార్లు ఉన్నాయి. వాటిలో నెలకు 6 లక్షల కేసుల వరకు మద్యం విక్రయిస్తున్నారు. రోజుకు దాదాపు రూ.100 కోట్ల మద్యం విక్రయాలు సాగుతున్నాయి. అనధికారికంగా బాటిల్‌పై రూ.10 పెంపుదలతో రోజుకు రూ.5 కోట్లు చొప్పున అనధికారికంగా కొల్లగొడుతున్నారు. ఇలా మూడు రోజులుగా రూ.15 కోట్ల వరకు దందా సాగించారు. ఇక సంక్రాంతి సీజన్‌ను సొమ్ము చేసుకునేందుకు మద్యం సిండికేట్.. బెల్ట్ దుకాణాల్లో మరో రూ.5 అదనంగా పెంచింది. అందుకోసమే ఏకంగా 75 వేల వరకు బెల్ట్ దుకాణాలను బరితెగించి మరీ ఏర్పాటు చేసింది. మద్యం ధర పెంపు జీవో వచ్చిన తర్వాత కూడా అధికారిక పెంపుదల రూ.10తోపాటు అనధికారికంగా మరో రూ.10 పెంపుదలకు సిండికేట్ ఇప్పటికే నిర్ణయించింది. వెరసి ఒక్కో బాటిల్‌పై రూ.15 అదనపు దోపిడీ ఇకపై కూడా వర్తించనుందన్నది సుస్పష్టం.

కూటమి ప్రజాప్రతినిధులకు మామూళ్లు

మద్యం సిండికేట్ డిమాండ్‌ను తమ ప్రభుత్వం ఆమోదించి ధరలు పెంచింది కాబట్టి.. తమకు మామూళ్లు ఇవ్వాల్సిందేనని టీడీపీ ప్రజా ప్రతినిధులు తేల్చి చెప్పారు. దీంతో సిండికేట్.. ఒక్కో మద్యం దుకాణం నుంచి రూ.50 వేలు, ఒక్కో బార్ నుంచి రూ.2 లక్షలు చొప్పున వసూలు చేసి కూటమి ప్రజా ప్రతినిధులకు ముట్టజెబుతోంది. ఆ ప్రకారం రాష్ట్రంలో 3,636 మద్యం దుకాణాల నుంచి రూ.18.18 కోట్లు, బార్ల నుంచి రూ.10.80 కోట్లు కూటమి ప్రజా ప్రతినిధులు వసూలు చేశారు. మద్యం దుకాణాల నుంచి సంక్రాంతి మామూళ్ల వసూళ్ల ప్రక్రియను కూటమి ప్రజా ప్రతినిధులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

బెజవాడ పున్నమి ఘాట్ వద్ద కారు బీభత్సం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులోని పున్నమిఘాట్ ప్రాంతంలో కారు బీభత్సం సృష్టించింది. ఆదివారం రాత్రి ఏపీ 39 కేఎన్ 2562 నంబర్ కారులో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న పెద్ద చిచ్చా, చిన్న చిచ్చా, గొల్లపూడికి చెందిన భార్గవ్ సింగ్ అలియాస్ జగదీష్‌తోపాటు మరో ఇద్దరు పున్నమిఘాట్‌లో ఆవకాయ్ ఫెస్టివల్ నిర్వహించిన ప్రదేశానికి వచ్చి మితిమీరిన వేగంతో చక్కర్లు కొడుతూ అక్కడున్న వారిని ఢీకొట్టారు. స్థానికులు కారు ఆపి అందులో ఉన్నవారిని నిలదీశారు. దీంతో వారు కారులో తక్షణం పరారయ్యారు. ఈ ప్రమాదంలో సాక్షి చానల్ రిపోర్టర్ నాగేంద్ర, మరో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న భవానీపురం పోలీస్ స్టేషన్ సీఐ ఉమామహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. ప్రమాదానికి కారకుడైన పెద్ద చిచ్చాతోపాటు భార్గవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిసింది.

కోట్లు మేస్తున్న కంచె!

రైల్వే ట్రాక్‌ల వెంబడి రెండువైపులా కంచె నిర్మిస్తున్న రైల్వే శాఖ

రూ.3 వేల కోట్లకు పైగా వెచ్చిస్తున్న వైనం

ఈ మొత్తంతో 30 వందేభారత్ రైళ్లు తయారు చేయవచ్చనే అభిప్రాయం

వందల కి.మీ. కొత్త రైల్వే రూట్ రూపొందించేందుకూ అవకాశం

సాక్షి, హైదరాబాద్: కబ్జాల నుంచి స్థలాలను కాపాడుకునేందుకు వాటి చుట్టూ కంచె నిర్మించుకోవటం సాధారణ విషయమే. కానీ.. రైల్వే శాఖ ఇప్పుడు రూ.3 వేల కోట్లు వెచ్చించి కంచె నిర్మిస్తోంది. ఇదేదో ఆస్తులను కాపాడుకునేందుకు కాకుండా ప్రజల్లో లోపించిన క్రమశిక్షణ ఫలితంగా చేస్తున్న వృథా ఖర్చు కావడం గమనార్హం. అవే డబ్బులు వెచ్చిస్తే 30 వందేభారత్ రైళ్లు తయారవడం లేదా వందల కి.మీ. మేర కొత్త రైల్వే రూట్ రూపొందే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రైల్వే కారిడార్లు జనావాసాలు, పొలాలు, అడవుల మీదుగా సాగుతాయన్న విషయం తెలిసిందే. చెరువు కట్టలా ఎత్తుగా ఉండే రైలు మార్గం, అక్కడి ప్రాంతాన్ని రెండుగా విభజిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు దాన్ని దాటేందుకు నిర్మాణ సమయంలో ప్రత్యేక వెసులుబాట్లు కల్పిస్తుంది. పశువులు దాటేందుకు కూడా వీలుంటుంది. కానీ ప్రజలు దీన్ని పట్టించుకోకుండా ఎక్కడ కుదిరితే అక్కడ నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్ దాటుతున్నారు. చివరకు వంతెనలు ఉన్నచోట కూడా రైలు మార్గం మీదుగా దాటే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రైళ్లు ఢీకొట్టడంతో ఎంతో మంది చనిపోతున్నారు. ముఖ్యంగా వేల సంఖ్యలో జంతువులు ప్రాణాలు కోల్పోతున్నాయి. మరోవైపు ఇది రైల్వేకు పెద్ద సమస్యగా మారింది. చనిపోయిన మనుషులు, జంతువుల ప్రాణాలకు విలువ కట్టి పరిహారం చెల్లించాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు ట్రాక్ పొడవునా రెండు వైపులా కంచె నిర్మాణాన్ని రైల్వే శాఖ చేపట్టింది. ఇప్పటికే కొంతపని పూర్తి కాగా, మిగతా ప్రాంతాల్లో ఈ ప్రక్రియను వేగవంతం చేసింది.

ఆ మార్గాలపై ప్రత్యేక దృష్టి

ఇటీవల పలు ప్రధాన రైలు మార్గాల్లో రైళ్ల వేగాన్ని గంటకు 130 కి.మీ.కు పెంచారు. ఆ మేరకు ట్రాక్‌ను పటిష్టం చేశారు. వేగంగా వెళ్లే వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టడమే కాకుండా వాటి సంఖ్య క్రమంగా పెంచుతున్నారు. కొత్తగా వందే భారత్ స్లీపర్ కేటగిరీ రైళ్లు కూడా పట్టాలెక్కబోతున్నాయి. వీటి వేగం ఎక్కువగా ఉంటున్నందున, ట్రాక్ సామర్థ్యాన్ని కూడా ఆ మేరకు పెంచాల్సి ఉంది. రైళ్ల వేగం పెరిగే కొద్దీ నిర్లక్ష్యంగా ట్రాక్ దాటే వారికి ప్రమాదం జరిగే అవకాశం కూడా పెరుగుతుంది. రెప్పపాటులో రైలు దూసుకొచ్చినప్పుడు తప్పించుకునే చాన్స్ తక్కువగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో రైళ్లు పట్టాలు తప్పేందుకు కూడా ఇది కారణమవుతోంది. అప్పుడు రైళ్లలోని ప్రయాణికులు కూడా ప్రమాదానికి గురవుతారు. ఎంత చెప్పినా, ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు దాటటాన్ని జనం వదులుకోవటం లేదు. ఈ నేపథ్యంలోనే.. 4,019 ట్రాక్ కి.మీ. మేర ఇనుప కంచె, 410 కి.మీ. మేర ప్రహరీ గోడలు నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రణాళికలు రూపొందించి పనులు మొదలుపెట్టింది. కంచె కోసం రూ.2,056 కోట్లు, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.1,136 కోట్లు వ్యయం చేయనుంది. ఇప్పటికే 875 కి.మీ. నిడివిలో కంచె నిర్మించగా, దానికి ఈ కొత్త ప్రణాళిక అదనం కావటం విశేషం. ఇటీవల అస్సాంలో రైలు ఢీకొని ఒకేసారి ఏడు ఏనుగులు చనిపోవటం రైల్వేను కుదిపేసింది. ఇప్పుడు ట్రాక్ చుట్టూ కంచె నిర్మాణం వేగవంతం కావటానికి ఇది ప్రధాన కారణంగా మారింది. ఇక తరచూ మనుషులు చనిపోవటం ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రైల్వే భద్రత చర్యల కోసం ఏకంగా రూ.1.16 లక్షల కోట్లు వ్యయం చేస్తుండగా, ఇందులో దేశవ్యాప్తంగా కంచె, ప్రహరీ గోడల నిర్మాణానికి దాదాపు రూ.23 వేల కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం.

పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్వీర్యం!

- గతంలో సెలవు రోజుల్లోనూ ప్రజలకు సేవలందించిన యూపీహెచ్‌సీలు
- ఇందుకోసం ఆ రోజుల్లో పనిచేసిన స్టాఫ్‌నర్సులకు 35 క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేసిన వైఎస్ జగన్ సర్కార్
- వాటిని 15కు కుదిస్తూ చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు
- దీనివల్ల సెలవు రోజుల్లో యూపీహెచ్‌సీలు మూత.. ప్రజలకు వైద్య సేవలు దూరం

సాక్షి, అమరావతి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా పేద ప్రజలకు ఉచిత వైద్యం, విద్యను దూరం చేస్తున్న చంద్రబాబు సర్కార్.. ఇప్పుడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(యూపీహెచ్‌సీలు)ను సైతం నిర్వీర్యం చేస్తోంది. రాష్ట్రంలోని నగర, పట్టణ ప్రజలకు ఉచిత వైద్య సేవల కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన యూపీహెచ్‌సీలు మూతపడేలా చంద్రబాబు సర్కార్ ప్రమాదకర నిర్ణయాలు తీసుకుంటోంది. సెలవుల్లో సైతం అందుబాటులో ఉండి విధులు నిర్వర్తించే స్టాఫ్ నర్సుల కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన క్యాజువల్ లీవ్‌లను.. ప్రస్తుత ప్రభుత్వం సగానికి సగం కుదించేసింది. తద్వారా యూపీహెచ్‌సీలు మూత పడే పరిస్థితి కల్పించింది. రాష్ట్రవ్యాప్తంగా 560 యూపీహెచ్‌సీలను వైఎస్ జగన్ ప్రభుత్వం నెలకొల్పింది. పండుగలు, ప్రత్యేక సెలవు దినాల్లో సైతం ఆరోగ్య కేంద్రాలు పనిచేసేలా అప్పట్లో చర్యలు తీసుకుంది. సెలవు రోజుల్లో కూడా స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండి.. ప్రజలకు వైద్య సేవలు అందించేలా వారికి 35 రోజుల క్యాజువల్ లీవ్‌లు(సీఎల్స్) మంజూరు చేసింది. దీంతో పండుగలు, ఇతర సెలవు రోజుల్లో మెడికల్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది విధులకు హాజరవ్వకపోయినా.. స్టాఫ్ నర్స్‌లు మాత్రం ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలందించేవారు. ఆ నర్సులు అదనంగా మంజూరైన సెలవులను తమకు అవసరమైనప్పుడు వాడుకోవడానికి వీలుండేది. కానీ, ఈ విధానాన్ని రద్దు చేస్తూ గత నెల 24న వైద్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వంలోని ఇతర ఉద్యోగుల తరహాలోనే ఆరోగ్య కేంద్రాల నర్సులకు కూడా 15 సీఎల్స్ మాత్రమే ఉంటాయని స్పష్టం చేసింది. దీనివల్ల నర్సులు సెలవు దినాల్లో ప్రజలకు అందుబాటులో ఉండని పరిస్థితి తలెత్తి.. ఆరోగ్య కేంద్రాలకు తాళాలు పడతాయని తెలిసినా చంద్రబాబు సర్కార్‌లో మాత్రం చలనం లేదు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

క్లుప్తంగా...

నిస్సిగ్గుగా అసత్య ప్రచారం

- రాజధానిపై రైతులను మభ్యపెడుతున్న కూటమి నేతలు
- వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్

చిల్లకల్లు (జగ్గయ్యపేట): రాజధాని విషయంలో మంత్రులు, కూటమి నేతలు నిస్సిగ్గుగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజధాని విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన వైఖరితో ఉన్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని కప్పిపుచ్చుకునేందుకు రాజధాని విషయంలో జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని పేరుతో మూడుపంటలు పండే 50 వేల ఎకరాలు తీసుకున్నారని చెప్పారు. ఎకరాకు రూ.2 కోట్లు ఖర్చుచేస్తున్నామని అధికార పార్టీ నేతలు చెబుతున్నారని, 50 వేల ఎకరాలకు రూ.లక్షకోట్లకుపైగా ఖర్చవుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యంగాని హామీలతో ప్రజలను మోసం చేసినట్లే రాజధాని రైతులను అబద్ధపు ప్రచారంతో మరోసారి మభ్యపెట్టేయత్నం చేస్తున్నారని విమర్శించారు. గతంలో ఐదేళ్ల ప్రభుత్వంలో ఉండి ఎన్నికలకు నెలరోజుల ముందు టీడీపీలో చేరిన వసంత కృష్ణప్రసాద్ కూడా జగన్‌మోహన్‌రెడ్డిపై మాట్లాడేస్థాయికి వచ్చారని ఎద్దేవా చేశారు. నయవంచకుడెవరు అని కృష్ణప్రసాద్ స్వగ్రామంలో అడిగితే అక్కడి ప్రజలే చెబుతారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట, వేమూరు నియోజకవర్గాల సమన్వయకర్తలు తన్నీరు నాగేశ్వరరావు, వరికూటి అశోక్‌బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బూడిద నరసింహారావు, శివరాత్రి పృథ్వీ, ఏలూరి శివాజీ పాల్గొన్నారు.

పవన్ జీవితం.. సనాతన ధర్మానికి వ్యతిరేకం

సీపీఐ నేత నారాయణ



భీమవరం: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితం సనాతన ధర్మానికి వ్యతిరేకమని సీపీఐ జాతీయ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ కె.నారాయణ అన్నారు. కేవలం ప్రధాని నరేంద్ర మోదీ ప్రాపకం కోసమే సనాతన ధర్మమంటూ సనాతనిగా నటిస్తున్నారని ఇటువంటి వ్యక్తి మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమన్నారు. భీమవరంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సనాతన ధర్మంలో భార్యాభర్తల విడాకుల ప్రసక్తి లేదన్నారు. అయితే విడాకులు తీసుకుని పెళ్లిళ్లు చేసుకుంటున్న పవన్‌కళ్యాణ్ సనాతన ధర్మాన్ని ఎలా పాటిస్తారని ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కూడా సనాతనవాది కాదని.. అవసరాల రీత్యా నాయకులతో అంటకాగుతారని చెప్పారు.

తెలంగాణ

మేడారం.. భక్త జనసంద్రం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: తెలంగాణలోని ములుగు జిల్లా ఎస్‌ఎస్‌తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం జనసంద్రంగా మారింది. మహాజాతర సమీపిస్తున్న నేపథ్యంలో వేలాది మంది భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలివచ్చారు. జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ టాప్స్ కింద స్నానాలు చేసి ఎత్తుబంగారం, పసుపు కుంకుమ, చీరసారె, ఒడిబియ్యం సమర్పించి సమ్మక్క–సారలమ్మకు మొక్కులు చెల్లించారు. గద్దెల సమీపంలోని చెట్ల కింద వంటలు చేసుకుని భోజనాలు చేశారు.

రూ.547 కోట్ల భారీ సైబర్ స్కాం

- 17 మంది అకౌంట్ హోల్డర్ల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితులు

సత్తుపల్లి: ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన కొందరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారీ సైబర్ నేరాలకు పాల్పడ్డారని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఈ ముఠా సభ్యులు మొత్తం రూ.547 కోట్లు కొల్లగొట్టారని వెల్లడించారు. ఖమ్మం జిల్లా వీఎం బంజరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఠాలో కీలక వ్యక్తులైన సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్‌కల్యాణ్ ఖాతాలో రూ.114.18 కోట్లు, ఆయన సతీమణి మేడా భానుప్రియ ఖాతాలో రూ.40.21 కోట్లు, వేంసూరుకు చెందిన బావమరిది మేడా సతీశ్ ఖాతాలో రూ.135.48 కోట్లు, బొమ్మిడాల నాగలక్ష్మి (సత్తుపల్లి) ఖాతాలో రూ.81.72 కోట్లు, నర్సింహాకృష్ణ (కరీంనగర్) ఖాతాలో రూ.92.54 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ.80.41 కోట్లు.. మొత్తం రూ.547 కోట్ల సైబర్ క్రైం లావాదేవీలు జరిపినట్లు విచారణలో తేలిందని వివరించారు. వీరిలో పోట్రు ప్రవీణ్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపించగా, ప్రధాన నిందితులైన పోట్రు మనోజ్ కల్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి, మేడా సతీశ్, బొమ్మిడాల నాగలక్ష్మి, మేడా భానుప్రియ, మోరంపూడి చెన్నకేశవరావు(లింగపాలెం) పరారీలో ఉన్నట్లు తెలిపారు.

యక్ష ప్రశ్నలు.. ముప్పుతిప్పలు

కష్టతరంగా మారుతున్న అమెరికా చదువు

- ప్రవేశానికి ముందే పలు సవాళ్లు.. అన్ని విధాలా కూపీ లాగుతున్న వర్సిటీలు
- సోషల్ మీడియా ఖాతాలూ క్షుణ్ణంగా తనిఖీ
- ఐ–20 పొందడం సవాలుగా మారుతున్న వైనం
- విద్యార్థి సమర్పించిన వివరాల్లో తప్పులున్నా, చివరికు స్పెల్లింగ్ మిస్టేకులున్నా కష్టమే
- ట్రంప్ సర్కార్ మార్గదర్శకాలే కారణం

సాక్షి, హైదరాబాద్: అమెరికా వర్సిటీలు విద్యార్థులకు చుక్కలు చూపిస్తున్నాయి. కీలకమైన ఐ–20 పత్రాల జారీకి ముప్పుతిప్పలు పెడుతున్నాయి. చిన్న చిన్న కారణాలతో కాలయాపన చేస్తున్నాయి. విద్యార్థి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పడుతున్నాయి. ఏ మాత్రం అనుమానం వచ్చినా పత్రాల జారీ ఆపేస్తున్నాయి. ఆర్థిక లావాదేవీల పత్రాలపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిణామాలతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా దాదాపు 3 లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో చదువు కోసం వెళ్తుంటారు. వీరిలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లేవారు లక్ష వరకు ఉంటారు. కాగా ఆగస్టులో మొదలయ్యే విద్యా సంవత్సరానికి ఆరు నెలల ముందే అనుమతులు పొందాల్సి ఉంటుంది. యూఎస్ వీసా తీసుకోవడం ఒక ఎత్తైతే, తాజాగా వర్సిటీల్లో ఐ–20 పత్రం పొందడం మరో ఎత్తవుతోంది. వీసా వచ్చినా ఐ–20 రాకపోతే యూఎస్ వెళ్లేందుకు వీలుండదు.

ఐ-20 అంటే ఏమిటి?

ఎంఎస్ కోసం అమెరికాకు వెళ్ళే విద్యార్థులు ముందుగా అక్కడి వర్సిటీలను ర్యాంకు ఆధారంగా ఎంపిక చేసుకుంటారు. సీటివ్వడానికి ఒప్పుకున్న యూనివర్సిటీ సర్టిఫికెట్ ఆఫ్ ఎలిజిబిలిటీ (ఐ–20) పత్రం ఇవ్వాలి. ఇందులో విద్యార్థి ఎంపికైన కోర్సు, ఆ కోర్సు కాలవ్యవధి, ఫీజు వివరాలు, విద్యార్థి ఆర్థిక సామర్థ్యం వివరాలు ఉంటాయి. దీని ఆధారంగా యూఎస్‌లో యూనిక్ కోడ్ ఇస్తారు. వర్సిటీ ఇచ్చే వివరాల ఆధారంగా స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎస్ఈవీఐఎస్) అనే సంస్థ పూర్తి సమాచారాన్ని క్రోడీకరిస్తుంది. ఇది విద్యార్థికి చాలా కీలకం. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్–1 వీసాకు దీన్ని ముఖ్యమైన డాక్యుమెంట్‌గా గుర్తిస్తారు.

సమస్య ఎక్కడ?

విద్యార్థులు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వర్సిటీలపైనే చర్యలు తీసుకుంటామని ట్రంప్ సర్కార్ ఇటీవల ప్రకటించింది. అవసరమైతే యూనివర్సిటీ గుర్తింపునే రద్దు చేస్తామని హెచ్చరించింది. దీంతో ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు విద్యార్థుల ప్రతీ డాక్యుమెంట్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. ఈ క్రమంలో పాస్ పోర్టు వివరాల్లో తప్పులున్నా, అకడమిక్ వివరాల్లో స్పెల్లింగ్ తప్పిదాలున్నా, మార్క్‌షీట్ల తేదీల్లో తేడాలున్నా ఐ–20 పత్రాలు ఆపేస్తున్నాయి. యూఎస్‌లో కోర్సు చేసేందుకు వచ్చే విద్యార్థులకు ఫీజులు, జీవించడానికి అయ్యే ఖర్చుల అంచనాలను వర్సిటీలే లెక్కగడతాయి. ఆ మొత్తాన్ని బ్యాంకు బాలెన్స్‌గా చూపించాల్సి ఉంటుంది. కన్సల్టెన్సీలు ఈ మొత్తాన్ని విద్యార్థి ఖాతాలో వేయడం, విద్యార్థి అమెరికా వెళ్ళగానే తీసుకోవడం చేస్తుంటాయి. ప్రస్తుతం వర్సిటీలు కొత్తగా ఆరు నెలల బ్యాంక్ బ్యాలెన్స్, అది ఏ రూపంలో జమ అయ్యిందో చూస్తున్నాయి. వాటిని స్పాన్సర్ చేసిన వ్యక్తుల వ్యక్తిగత వివరాలు పరిశీలిస్తున్నారు. ఎంపిక చేసుకునే కోర్సులకు సంబంధించి భారత్‌లో విద్యార్థి చేసిన కోర్సు, సాధించిన మార్కులు, ఇంటర్న్‌షిప్‌లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. ఇందులో ఏ ఒక్కటి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా, అనుమానాస్పదంగా ఉన్నా పత్రాల జారీ నిలిపివేస్తున్నారు.

సోషల్ మీడియాపై దృష్టి

విద్యార్థి సామాజిక ఖాతాను లోతుగా విశ్లేషిస్తున్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమ ఖాతాలు ఎన్ని ఉంటే అన్నింటి వివరాలు ఇవ్వాలని యూనివర్సిటీలు కోరుతున్నాయి. వీటిల్లో గత కొన్నేళ్ళుగా విద్యార్థి ఎలాంటి పోస్టింగ్‌లు పెట్టాడు? ఏయే సంస్థలతో లింక్ అయి ఉన్నాడు? అమెరికాలోని ఏయే వ్యక్తులతో అతనికి సంబంధాలున్నాయి? వాళ్ళ వ్యక్తిగత వివరాలు ఏమిటి? ఆర్థిక పరమైన లావాదేవీలు ఏమిటి? కుటుంబ నేపథ్యం ఏమిటి? అనే వివరాలను లోతుగా అధ్యయనం చేస్తున్నారు. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క పోస్టు కన్పించినా ఐ–20 పత్రం ఇవ్వడానికి వర్సిటీలు సాహసించడం లేదు. సదరు విద్యార్థితో సంబంధం ఉన్న వ్యక్తుల్లో ఎవరిలోనైనా యూఎస్ వ్యతిరేక భావజాలం ఉన్నట్టు కన్పించినా విచారణకు ఆదేశిస్తున్నారు.

యూనిక్ ఐడీ ఇవ్వడానికి ఇదే కొలమానం

ఏడాదిగా అమెరికా భద్రత వ్యవహారాల్లో యూనివర్సిటీల బాధ్యత పెంచారు. విదేశీ విద్యార్థులను రప్పించే క్రమంలో అన్ని వివరాలు పరిశీలిస్తున్నారు. అమెరికన్ చట్టాలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యకలాపాలకు విద్యార్థులు పాల్పడినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ప్రభుత్వం హెచ్చరించింది. దీంతో మరింత జాగ్రత్త పడుతున్నారు. ఐ–20 పత్రాలు ఆలస్యం అవ్వడానికి ఇదే కారణం.

– నవీన్ చావ్లా (యూఎస్ వర్సిటీలో భారతీయ అధ్యాపకుడు)

విదేశీ స్నేహితుల వివరాలు అడిగారు

అమెరికా యూనివర్సిటీలో సీటు వచ్చింది. ఆగస్టులో అక్కడికి వెళ్ళడానికి సిద్ధమయ్యాం. ఫేస్‌బుక్‌లో ఇతర దేశాల్లో ఉన్న స్నేహితులూ యాడ్ కావడంతో వాళ్ళ గురించిన వివరాలు అడిగారు. ఆ తర్వాత ఆర్థిక సంబంధమైన వివరాలు కోరారు. వీటిపై సమగ్ర విచారణ జరిపిన తర్వాతే పత్రాలు వస్తాయని కన్సల్టెన్సీ సంస్థలు చెబుతున్నాయి.

– రోషన్ స్తపతి (హైదరాబాద్ విద్యార్థి)

వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుదాం

- త్వరలోనే పార్టీ సభ్యత్వం, కమిటీలు పూర్తి చేయనున్నాం
- వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎం చేసుకోవాలనే నిశ్చయంతో ఉన్నాం
- ఉమ్మడి అనంతపురం జిల్లా పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో రీజనల్ కో-ఆర్డినేటర్ పీవీ మిథున్‌రెడ్డి

మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా సభ్యత్వ నమోదు చేపట్టనున్నామని, సంస్థాగత కమిటీలు త్వరలోనే పూర్తి చేస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విస్తృత స్థాయి సమావేశంలో మిథున్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఐటీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ చల్లా మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, పీఏసీ సభ్యుడు శంకర్‌నారాయణ, రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ అనంతపురం పార్లమెంట్ పరిశీలకులు నరేశ్‌కుమార్‌రెడ్డి, హిందూపురం పార్లమెంటరీ పరిశీలకులు రమేశ్‌కుమార్‌రెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం పీవీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ స్థాయి నుంచి కమిటీలను ఫిబ్రవరి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ జెండా మోసే ప్రతి ఒక్కరికీ సభ్యత్వం ఇవ్వడంతో పాటు గ్రామ/వార్డు స్థాయి నుంచి కమిటీల్లో లక్షలాది మందికి చోటు కల్పిస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేసి.. ముందుకు నడిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, వార్డు స్థాయి వరకు అనుబంధ విభాగాల్లో కమిటీలు పూర్తి చేయాలన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు చాలా ధైర్యంగా ఉండాలని జగనన్న భరోసా ఇచ్చినట్లు తెలియజేశారు.

ఢిల్లీకి మించి భూముల ధరలు

దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంటు భవనం నిర్మాణాలు చదరపు అడుగు విలువ కంటే అమరావతిలో అధిక ధరలకు నిర్మాణాలు చేపడుతున్నారని మిథున్‌రెడ్డి మండిపడ్డారు. పార్లమెంటు కట్టిన చదరపు అడుగు ధర కంటే రెండింతల అధిక ధరలకు అమరావతిలో నిర్మాణాలు చేపట్టిన విషయంపై వైఎస్సార్‌సీపీ ప్రశ్నిస్తోందన్నారు. అమరావతిలో రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అక్కడ పేద రైతులకు ప్లాట్లు డెవలప్‌మెంట్ చేసి ఇస్తామని చెప్పి.. ఇప్పటికీ అతీగతీ లేదన్నారు. ఈ విషయంలో ఇటీవల ఓ రైతు తన బాధను తెలియజేసి గుండెపోటుతో మరణించడం బాధాకరమన్నారు. వైఎస్ జగన్ ఎవరినీ వ్యక్తిగతంగా దూషించలేదని, మీడియా సమావేశంలో ఆధారాలతో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని కూటమి నాయకులు.. వ్యక్తిగత విమర్శలకు దిగుతుండటం వారి దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రయోజనాలను పక్కనబెట్టి.. స్వప్రయోజనాల కోసం చంద్రబాబు నీటి పంపకాల విషయంలో సంబంధం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

నాయకులందరూ కార్యకర్తలను కాపాడుకోవడమే లక్ష్యంగా పని చేస్తారన్నారు.

శోభాయాత్రలో కళాకారుల ప్రదర్శన

సందడి తెచ్చిన గండికోట ఉత్సవాలు

- శోభాయాత్రతో సరికొత్త వైభవం
- మంత్రముగ్ధుల్ని చేసిన సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, వీణ, నాదస్వర ప్రదర్శనలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన హెలికాప్టర్ రైడ్

జమ్మలమడుగు/జమ్మలమడుగు రూరల్: వైఎస్సార్ కడప జిల్లాలో పర్యాటక ప్రాంతమైన గండికోటలో వారసత్వ ఉత్సవాలు ఆదివారం సాయంత్రం శోభాయాత్రతో ప్రారంభమయ్యాయి. గండికోట సాంస్కృతిక, చారిత్రక వైభవాన్ని శోభాయాత్ర ప్రతిబింబించింది. పురాతన రాచరిక సంస్కృతిని గుర్తుచేసే వేషధారణలు, సంప్రదాయ కళారూపాలు, జానపద నృత్యాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల్లో భాగంగా సంప్రదాయ నృత్యాలు, జానపద గీతాలు, వీణ, నాదస్వర ప్రదర్శనలు మంత్రముగ్ధుల్ని చేశాయి. హస్తకళల ప్రదర్శన, స్థానిక వంటకాల స్టాళ్లు సందర్శకులకు ప్రత్యేక అనుభూతిని కలిగించాయి. హెలికాప్టర్ రైడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను రాయలసీమ సంస్కృతి, చరిత్ర, ప్రకృతి అందాలను ప్రపంచానికి చాటిచెప్పేలా డిజైన్ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు లైవ్ కాన్సర్ట్‌లు (రామ్ మిరియాల, డ్రమ్స్ శివమణి వంటి ప్రముఖుల ప్రదర్శనలు), డ్రోన్ షో, ఫైర్ క్రాకర్స్, హెలికాప్టర్ రైడ్స్, పారాగ్లైడింగ్, బోటింగ్, ట్రెక్కింగ్ వంటి అడ్వెంచర్ యాక్టివిటీలు ఉన్నాయి. లేజర్ షో, ముషాయిరా తదితర కార్యక్రమాలు ఆకట్టుకోగా.. మంగ్లీ పాట కచేరీ ఉర్రూతలూగించింది. తొలుత సాహితీవేత్తలు జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, తవ్వా ఓబుల రెడ్డి, నగిలి సుధారాణి గండికోట చరిత్రను వివరించారు. శోభాయాత్రలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తదితరులు పాల్గొన్నారు.

కండలేరు సందర్శనపైనా ఆంక్షల సంకెళ్లు

- అనుమతివ్వని పోలీసులు.. అడుగడుగునా నేతలకు అడ్డంకులు
- కండలేరు ముఖద్వారం వద్దే నిలిపివేత
- అక్కడే బైఠాయించిన కాకాణి, ఆనం, నేదురుమల్లి, కిలివేటి

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై ఖాకీల క్రౌర్యం

రిజర్వాయర్ ఆర్చి వద్ద బైఠాయించిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి. పక్కన కిలివేటి, నేదురుమల్లి, విజయకుమార్‌రెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/రాపూరు–సైదాపురం: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలం కండలేరు జలాశయం సందర్శనకు ఆదివారం బయల్దేరిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలను పోలీసులు అడుగడుగునా ఆంక్షలతో అడ్డుకున్నారు. సోమశిల జలాశయ సందర్శనపై శనివారం ఉక్కుపాదం మోపినట్లుగానే తాజాగా కండలేరు సందర్శననూ పోలీసులు నిలువరించారు. నెల్లూరు జిల్లా ప్రజలు, రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలిపేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పలువురు నేతలు కండలేరు ప్రాజెక్టుకు ఆదివారం బయల్దేరారు. ఆయనతో పాటు పార్టీ నెల్లూరు రూరల్, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్తలు ఆనం విజయకుమార్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యను కండలేరు ముఖద్వారం వద్దే పోలీసులు అడ్డుకున్నారు. మార్గంమధ్యలో నెల్లూరు, పొదలకూరు, డేగపూడి, కండలేరు డ్యామ్ మెయిన్ రోడ్డు వద్ద బారికేడ్లను అడ్డుపెట్టి నిలువరించారు. రాపూరు, సైదాపురం, వెంకటగిరి, కలువాయి, పొదలకూరు, చేజర్ల మండలాలకు చెందిన రైతుల్ని కండలేరు వద్దకు వెళ్లనీయకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయితే, ఎలాగోలా రైతులు పెద్ద సంఖ్యలో కండలేరు ముఖద్వారం వద్దకు చేరుకుని నేతలకు మద్దతు ప్రకటించారు. జై జగన్ నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు.

అడ్డుకున్న డీఎస్పీ .. నేతలు బైఠాయింపు..

కండలేరు ముఖద్వారం వద్దకు చేరుకున్న కాకాణి, ఆనం, నేదురుమల్లి, కిలివేటిని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ అక్కడే నిలిపేశారు. ఐదుగుర్ని మాత్రమే జలాశయ సందర్శనకు అనుమతిస్తామని తేల్చిచెప్పారు. దీంతో తమను ఎందుకు పంపరని పోలీసులను ప్రశ్నిస్తూ ముఖద్వారం వద్ద కాకాణి, ఆనం, నేదురుమల్లి, కిలివేటి బైఠాయించారు. పోలీసులు సైతం ముఖద్వారం వద్ద భారీగా మోహరించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పర్యవేక్షణలో ఆరుగురు సీఐలు, ఎస్సైలు, అదనపు బలగాలతో నేతలను నియంత్రించారు. ప్రాజెక్టు సందర్శనకు 50 మందికి అనుమతివ్వాలని కాకాణి డిమాండ్ చేశారు. పోలీస్ అధికారులు ససేమిరా అనడంతో నాలుగు గంటల పాటు ముఖద్వారం వద్దే నేతలు బైఠాయించారు.

బలవంతంగా నేతల అరెస్టు..

తుపాను ప్రభావంతో వర్షం కురుస్తున్నా వైఎస్సార్‌సీపీ నేతలు ఏ మాత్రం తగ్గకుండా అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. సుమారు నాలుగు గంటలపాటు బైఠాయించిన నాయకులు ఎంతసేపైనా అక్కడే ఉంటామని వెల్లడించడంతో రైతులు వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని షామియానాలను తీసుకొచ్చారు. అయితే, వీటిని తొలగించేందుకు పోలీసులు యత్నించడంతో తోపులాట జరిగింది. సా.3.45 గంటల సమయంలో పోలీసులు తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య కాకాణి, ఆనం, నేదురుమల్లి, కిలివేటిని అరెస్టుచేసి రాపూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో కాకాణి, కిలివేటిని లాక్కెళ్లేందుకు పోలీసులు యత్నించడంతో కార్యకర్తలు అడ్డుకునే యత్నం చేయగా తోపులాట జరిగింది. ఆ తర్వాత నేతలను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

బాబు అర్ధంతరంగా ప్రాజెక్టును ఆపేశారు..

ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమతో పాటు నెల్లూరు ప్రాంత రైతులకు ఎలాంటి కష్టాలు రాకూడదని, మెట్ట ప్రాంతాలైన రాయలసీమ, నెల్లూరుకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.3,825 కోట్లతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి పనులు ప్రారంభించారని చెప్పారు. పనులు జరుగుతున్న సమయంలోనే చంద్రబాబు అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టును అర్ధంతరంగా నిలిపివేశారని మండిపడ్డారు. అరెస్టులకు భయపడేదిలేదని, చావుకైనా సిద్ధపడే వచ్చామని ఆయన స్పష్టంచేశారు. ఎవరైతే దీనిపై గళం విప్పుతారో వారిని అరెస్టుచేస్తున్నారని.. రైతు ద్రోహిగా ముద్రపడుతుందనే భయంతో ఇలా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. ఇక రేవంత్‌రెడ్డి, చంద్రబాబు మధ్య జరిగిన చీకటి ఒప్పందాలను ప్రజలకు తెలియజేసేందుకే జలాశయ సందర్శనకు వచ్చామని వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

నక్కపల్లి ప్రజాప్రతినిధులు గుజరాత్ స్టీల్‌ప్లాంట్ సందర్శన

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా): గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో ఉన్న ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన స్టీల్ ప్లాంట్‌ను అనకాపల్లి జిల్లా నక్కపల్లి నిర్వాసిత గ్రామాల ప్రజాప్రతినిధులు బృందం ఆదివారం సందర్శించింది. నక్కపల్లి మండలంలో చందనాడ, అమలాపురం, డీఎల్‌పురం, బుచ్చిరాజుపేట గ్రామాల పరిధిలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ ఇండియా లిమిటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుజరాత్‌లో ఆ కంపెనీ నిర్మించిన స్టీల్ ప్లాంట్ నిర్వహణ, అక్కడి నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనను చూపించేందుకు యాజమాన్యం నిర్వాసిత గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఏపీఐఐసీజెడ్ఎం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో కూడిన ప్రత్యేక బృందాన్ని రెండురోజుల సూరత్ పర్యటనకు తీసుకెళ్లింది.

పట్టపగలే మహిళపై వ్యక్తి దాడి

- అసభ్య పదజాలంతో దూషణ
- సోషల్ మీడియాలో ఆవేదనను వ్యక్తం చేసిన బాధితురాలు
- ఇది వైరల్ కావడంతో తాపీగా స్పందించిన పోలీసులు..
- నిందితుడి అరెస్ట్.. విశాఖలో ఘటన



అల్లిపురం (విశాఖ): విశాఖ జగదాంబ జంక్షన్‌లో పట్టపగలు బస్సుదిగి నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళపై అకస్మాత్తుగా ఓ వ్యక్తి దాడి చేశాడు. ఆమె చెంపపై బలంగా కొట్టాడు. అంతేకాకుండా అసభ్య పదజాలంతో తీవ్రంగా దూషించాడు. ఈ హఠాత్పరిణామానికి హతాశురాలైన ఆమె హాహాకారాలు చేసినా స్థానికులు, పోలీసులు స్పందించకపోవడంతో తీవ్రంగా కలత చెందింది. శనివారం ఉదయం జరిగిన ఈ ఘటనను వివరిస్తూ సోషల్ మీడియాలో బాధితురాలు తన ఆవేదనను వెలిబుచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం ప్రకారం.. మధురవాడకు చెందిన దేవి జగదాంబ జంక్షన్‌లో బస్సు దిగి నడిచి వెళ్తుండగా కనకమహాలక్ష్మి మాలధారణలో ఉన్న ఒక వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి ఆమె చెంపపై గట్టిగా కొట్టడంతో పాటు ఇష్టానుసారంగా బూతులు తిట్టాడు. ఈ దాడికి ఆమె కళ్లజోడు కిందపడి విరిగిపోయింది. అత్యంత రద్దీగా ఉండే జగదాంబ సెంటర్లో ఈ ఘటన జరిగినప్పటికీ, స్థానికులు, పోలీసులు స్పందించకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దిశ పోలీసులకూ ఫిర్యాదు చేశారు. బాధితురాలి పోస్టు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు స్పందించారు. నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. కాగా, నిందితుడు మానసిక రోగి అని పోలీసులు ముక్తాయింపునివ్వడం గమనార్హం.

ద్వేషాన్నీ మరియు దుర్భావాన్నీ రూపుమాపు.
శరీరాన్నీ, మనస్సునూ, ప్రాణాన్నీ
స్నేహ సద్భావాలతో నింపు.

– ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి

సోమవారం, 12 జనవరి 2026

శీతకాలం కోత పెట్టగ...

చల్లదనం గురించీ, వేడి గురించీ ఒక్కోసారి మన ఊహల్ని తలకిందులు చేస్తూ, మాటలకు మనమిచ్చే అర్థాలను సవరించుకోవలసిన పరిస్థితులు ఎదురవుతాయి. ఈ శీత ఋతువులో అదే జరుగుతోంది. శీతవాయువు కోతకత్తిగా మారి శరీరాన్ని నిలువునా కోసి చలికారం అద్దుతోంది. మండువేసవిని మించి, రోజంతా చలి దహిస్తోంది. బతుకైనా, బాగైనా మితిలోనే ఉందనీ, అతి అన్నిటా అనర్థానికే దారి తీస్తుందనీ మళ్ళీ మళ్ళీ గుర్తు చేస్తోంది. ఈ ఏడాది దేశంలో అనేకచోట్ల సాధారణ ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయి చలిగాలుల ఊపేస్తాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది.

భూమి చరిత్రలోనే కానీ, మానవ చరిత్రలోనే కానీ ఋతుగమనం హఠాత్తుగా తూకం తప్పి బతుకులను తలకిందులు చేసిన ఘట్టాలు అసంఖ్యాకం. చరిత్రకెక్కినవి కొన్నే. సాధారణ శకం 536లో అగ్నిపర్వతాలు బద్దలై యూరప్, మధ్యప్రాచ్యం, ఆసియాలలో ఆకాశాన్ని అంధకారంతో కప్పేసి అతి శీతల వత్సరాలను సృష్టించాయి. అది అసాధారణ స్థాయిలో హిమపాతానికీ, కరవు కాటకాలకూ, మానవ, జంతు మరణాలకూ దారితీసింది. యూరప్‌తో సహా పలుచోట్ల 1300–1850 మధ్యకాలాన్ని చిన్నపాటి మంచుయుగంగా లెక్కించారు. 1709లో యూరప్‌లో విస్తారమైన ప్రాంతాలు మంచు భూములుగా మారిపోయి, అనేక ప్రాణాలకు సమాధులయ్యాయి. 1783–84లో ఉత్తర అమెరికాలో విపరీత శైత్యం తీవ్ర దుర్భిక్షానికీ, చివరికి ఫ్రెంచి విప్లవానికీ దారితీసింది. 1816లో వేసవే లేకుండా పోయింది. 1963లో బ్రిటన్‌లో, 1972లో ఇరాన్‌లో, 2008లో అఫ్గానిస్తాన్‌లో హిమపాతాలూ, చలిగాలులూ పెద్ద సంఖ్యలో ప్రాణాలు హరించాయి.

శిశిరం శివతాండవం చేస్తూ కరవు కాటకాలతో జీవజాలాన్ని ఆకుల్లా రాల్చి వేయడం గమనిస్తే శ్రీశ్రీ 'దేశచరిత్రలు' కవిత గుర్తొస్తుంది. అంతా తన ప్రయోజకత్వమే అనుకుంటూ మనిషి స్థాపించిన సామ్రాజ్యాలు... 'ఇతరేతర శక్తులు' లేస్తే పేకమేడల్లా పడిపోయా యంటాడాయన. అలాగే, మౌర్య సామ్రాజ్యంలో తలెత్తినట్టు చెబుతున్న పన్నెండేళ్ళ దుర్భిక్షానికి అతిశీతల వాతావరణమో, లేదా అలాంటి మరేదైనా 'ఇతరేతర' శక్తో కారణం కావచ్చు. అప్పుడు భద్రబాహుడనే జైనముని జైన సంఘాన్ని వెంట బెట్టుకుని దక్షిణ భారతానికి తరలివచ్చాడనీ, చక్రవర్తి చంద్రగుప్తుడు కూడా సింహాసనాన్ని త్యజించి దక్షిణాపథానికి వచ్చాడనీ చరిత్ర చెబుతోంది.

సమతూకపు ఋతుగమనానికీ, భూమ్మీద జీవజాలం మనుగడకూ ఉన్న పీటముడి ఎలాంటిదో – ఆ తూకం హఠాత్తుగా తారుమారైనప్పుడే తెలిసి వస్తుంది. శీతర్తువు కరుణించి తగినంత వెచ్చదనాన్ని జోడించినప్పుడు, పోతన భాగవతంలో వర్ణించినట్టు మన్మథుడు విరహులకు హేమంతం అడుగుపెట్టినట్టు గబ్బున తోపించి అదేపనిగా వేధిస్తూ అర్ధాంగి నులివెచ్చని ఆలింగన సౌఖ్యం వైపు నడిపిస్తాడు. హాలుడు 'గాథాసప్తశతి'లో అభివర్ణించినట్టు, ఆ భరోసాతోనే భర్త పశువులను కొనుక్కోడానికి పైబట్టను అమ్ముకుంటాడు. 'చలి వడి కించే శైశిర కాలం వస్తూపోతూ దాగుడుమూతల క్రీడలాడుతవి మీ నిమిత్తమే'నంటూ మహాకవి శ్రీశ్రీ శైశవగీతిని ఆలపిస్తాడు. అదే శీతర్తువు ఒకింత గతి తప్పిందా... అస్తిత్వమే అల్లకల్లోలమైపోతుంది.

చలిగాలుల విజృంభణకు శాస్త్రవేత్తలిప్పుడు వివిధ కారణాలు ఎత్తి చూపుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే వాతావరణ పరిస్థితులూ, మధ్యధరా సముద్ర ప్రాంతంలో సంభవించే అలజడులూ చల్లని ఉత్తరపు గాలుల్ని సృష్టించి హిమాలయాల మీదుగా వ్యాపింపజేస్తాయంటున్నారు. శిలాజ ఇంధనాల విచ్చలవిడి వినియోగం కూడా ఉష్ణోగ్రతను కట్టడి చేసి శీతల వాయువులను సృష్టిస్తోందట. శాస్త్రజ్ఞులు చెప్పిన కారణాలు కొన్ని భాగవత కవికి అనుభవపూర్వకంగా తెలుసు. ఉత్తరపు గాలి విసురుతోందనీ, తామరలు తరిగి అంతటా మంచు నెలకొందనీ అంటాడు. సూర్యుడు శక్తిహీనుడు కావడం వల్ల హిమాలయాల నిండా మంచు పేరుకుని ఆ పేరును సార్థకం చేస్తోందని రామాయణ కవి అంటాడు. వందల కోట్ల సంవత్సరాల అస్తిత్వంలో పుడమితల్లి ఇలాంటి పురిటినొప్పులు ఎన్ని పడిందో! ఎన్ని మంచు యుగాలను చూసిందో! మన మేరకు మనం చేజేతులా వాతావరణ విధ్వంసానికి పాల్పడకుండా జాగ్రత్త పడటమే చేయవలసినదీ, చేయగలిగినదీ!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.నవమి ప.2.00 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** స్వాతి రా.10.33 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** తె.4.44 నుండి 6.30 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.33 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.46 నుండి 3.30 వరకు, **అమృత ఘడియలు:** ప.12.58 నుండి 2.44 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం: 5.39
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సోషల్ టాక్

పిల్లలు



బాల్యం అంటే సరళత. పిల్లల కన్నులతో ప్రపంచాన్ని చూడండి, చాలా అందంగా ఉంటుంది. బాల్యంలోని ప్రతి నిమిషం ముఖ్యం. వారి కలలను, హక్కులను తిరస్కరించకండి. లోకంలో అంతకంటే హింస మరొకటి లేదు.

– కైలాశ్ సత్యార్థి, నోబెల్ బహుమతి గ్రహీత

గౌరవం

జీవితంలో ఏదైనా సాధించటానికి ఐదు గుణాలను వదిలేయాలి. అవి: భయం, సోమరితనం, కోపం, దురాశ, తొందరపాటు. అలాగే, మంచి ఉద్దేశం ఉన్న వ్యక్తి ఎప్పుడూ గౌరవం కోసం ఆత్రంగా ఉండకూడదు. అతడి పనే అతడిని గౌరవానికి అర్హుడిని చేస్తుంది.

– అరుణ్ గోవిల్, ఎంపీ–నటుడు

స్వభావం

జాగ్రత్తగా ఉండటమన్నది నా స్వభావం. అది కొన్నిసార్లు నా ఆటలో కూడా కనిపిస్తుంది. కాబట్టి నేను రిస్క్ తీసుకున్నానూ అంటే... దాని వెనుక చాలా ఆలోచన ఉంటుంది. జాగ్రత్త నాకు కలిసొస్తుంది కూడా! జాగ్రత్తను భయం అని అనుకోనక్కర్లేదు.

– హారిక ద్రోణవల్లి, చెస్ గ్రాండ్‌మాస్టర్

ధైర్యం

నా గురించి తెలిసినవాళ్లు, "మొయిలీ ఎవర్నీ భయపడనివ్వరు" అంటారు. అవును. ఎవరూ నిస్సహాయులు కారు. కనుక ఏ పరిస్థితికీ భయపడనక్కర్లేదు. సమాజంలో మార్పు కోసం మనం ఇక్కడ ఉన్నప్పుడు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే ధైర్యం ఉండాలి.

– వీరప్ప మొయిలీ (86), రాజకీయ దిగ్గజం

ఒత్తిడి



మీరు 15 ఏళ్ల వయసులో విజయం సాధించినంత మాత్రాన మీ 19వ ఏట కూడా విజయం సాధిస్తారని కాదు. మీరు పెరిగే కొద్దీ ఒత్తిడిని తట్టుకోవటం నేర్చుకోవాలి. మీరు 30 మ్యాచ్‌లు ఆడి, వాటి నుండి నేర్చుకోకపోతే, అది ఒకే మ్యాచ్‌ని 30 సార్లు ఆడటమే!

– రాహుల్ ద్రావిడ్, క్రికెటర్

మౌనం

కొన్నిసార్లు మనుషుల్ని అపార్థం చేసుకోకుండా ఉండటానికి, వారిని లోతుగా అర్థం చేసుకోవటానికి, మౌనంగా ఉండటం అవసరం. నిశ్శబ్దం బలహీనత కాదు. పరిశీలనకు ఒక సాధనం. ఉద్రిక్తతలో మనశ్శాంతిగా ఉండటానికి కూడా మౌనం అవసరం.

– తిలోత్తమా మజుందార్, బెంగాలీ రచయిత్రి

వికసిత భారత నిర్మాణంలో 'జెన్‌–జీ'

సందర్భం

జి. కిషన్ రెడ్డి

ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన పదం 'జెన్‌–జీ'. 1995 నుంచి 2010 మధ్యలో జన్మించిన ఈ 'జెన్‌–జీ' గురించి 2025లో ప్రపంచమంతా మాట్లాడుకుంది. నగరాలు, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ప్రతి ఇంటా చర్చ జరిగింది. వీరి ఉద్యమాన్ని కొందరు సానుకూలమైన అంశంగా గమనించారు. స్వాతంత్ర్యం, స్పష్టత, మార్పు తదితర అంశాలపై యువత ఆలోచిస్తున్న తీరునూ, ఏకతాటిపైకి వచ్చి పోరాడిన తీరునూ అభినందించారు. మరికొందరు... యువతలో హఠాత్తుగా పెరుగుతున్న నిరాశ, నిస్పృహలకు కారణంగా నేపాల్, మడగాస్కర్ దేశాల ఘటనలను ఉదాహరణలుగా చెబుతున్నారు.

ఇలాంటి భిన్నమైన వాదనలను పక్కనపెడితే... ప్రపంచ వ్యాప్తంగా యువశక్తి ఆశలు, ఆకాంక్షలతో పాటుగా వారి సామర్థ్యం పెరుగుతోంది. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకోవాలన్న పట్టుదల, అంకితభావం పెరుగుతోందనేది నిర్వివాదాంశం. భారత దేశంలోనూ విపక్ష పార్టీ సభ్యులు కొందరు... ఇక్కడి 'జెన్‌–జీ'ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించినా తమ శక్తిసామర్థ్యాలను సమాజ పురోగతి కోసం, దేశాభివృద్ధి కోసం వినియోగిస్తూ... స్పష్టమైన ఆలోచనలతో 'వికసిత భారత నిర్మాణం'లో భాగస్వాములవుతున్నారు.

భారత యువత 'వివేకం'

నేటి ప్రపంచం 'జెన్‌–జీ' గురించి మాట్లాడుతోంది. కానీ, వందేళ్ల క్రితమే స్వామి వివేకానంద యువత సామర్థ్యం, వారికి సరైన మార్గదర్శనం చేయడం ద్వారా దేశ ప్రగతిలో యువత భాగస్వామ్యం ఎలా ఉండాలనేదానిపై ఆలోచించారు. భారతదేశంతో పాటుగా ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ యువత గురించి మాట్లాడినా... వివేకానందుడి బోధనల గురించి ప్రస్తావించకుండా ఆ సమావేశం సంపూర్ణం కాదు. అంతటి గొప్ప దీర్ఘదర్శి స్వామి వివేకానంద. ఇవాళ (జనవరి 12) వారి 164వ జయంతి. 'జెన్‌–జీ' సామర్థ్యానికి మరింత పదునుపెట్టి... వికసిత భారత నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే విషయంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన సందర్భమిది. వ్యక్తిత్వం, విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవడం, స్వీయ అవగాహన, సంస్కృతి–సంప్రదాయాలపై గౌరవం, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా దేశ నిర్మాణంలో మనం ఏం చేయాలనే అనేక అంశాలపై వివేకానందుని బోధనల ప్రభావం ఉంటుంది.

వివేకానందుడు వందేళ్ల క్రితం ఉద్బోధించిన ఆధునిక దృక్పథం, నాగరికత విలువల పునాదులు మొదలైన విషయాలన్నీ... నేటి భారత యువతలో కనిపిస్తున్నాయి. అందుకే ప్రపంచ దేశాల్లోని యువత ప్రధాన స్రవంతి (మెయిన్ స్ట్రీమ్) నుంచి దూరంగా వెళ్తున్నప్పటికీ, వీరంతా భావిభారత నిర్మాణంలో ఉత్సాహంగా పాలుపంచుకుంటున్నారు. స్వచ్ఛ భారత్, మేరీ మాటీ మేరా దేశ్ (మొక్కల పెంపకం), నషా ముక్త్ భారత్ (మాదక ద్రవ్యాల వినియోగ రహిత భారతం) వంటి ఎన్నో ప్రజాచైతన్య కార్యక్రమాలకు యువతే నేతృత్వం వహించి వాటిని విజయవంతం చేస్తోంది.

◆ ఓవైపు ఆధునిక సాంకేతికత పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే... మరోవైపు భారతీయ నాగరికత మూలాలను, మన విలువలతో కూడిన సంప్రదాయాల సారాన్ని గ్రహించి ఆచరణలో పెట్టే దిశగా యువత కృషి చేస్తోంది.

నవీన సాంస్కృతిక సారథులు

ఆధునిక సాంకేతికత వినియోగంలోనూ, స్టార్టప్‌ల రూపకల్పనలోనూ మన యువత సంపూర్ణ శక్తిసామర్థ్యాలను వినియోగిస్తోంది. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ఫేస్ (యూపీఐ), 'ఇండియా స్టాక్' వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) పరిజ్ఞానాన్ని కూడా యువత స్వీకరిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లకు అనుగుణంగా వినూత్న మార్కెట్ పరిష్కారాలకు బాటలు వేయడం, యూనికార్న్ (రూ.వందకోట్ల కన్నా ఎక్కువ పెట్టుబడులు పెట్టే స్టార్టప్)ల ఏర్పాటు వంటి వాటి ద్వారా ఉద్యోగాల సృష్టికర్తలుగా వారి పాత్రను మరింత బలోపేతం చేసుకుంటున్నారు.

యువత సంస్కృతికి దూరంగా వెళ్తోందనే దుష్ప్రచారం జరుగుతోంది. కానీ ఆధ్యాత్మిక మూలాలను తెలుసుకోవడంపై, మన వైభవోపేతమైన చరిత్రను అధ్యయనం చేయడంపై యువత మక్కువ చూపుతోంది. 2022 ఆగస్టు 15 నాడు... దేశ స్వాతంత్ర్యానికి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఎర్రకోట బురుజుల నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతూ.. పంచ్ ప్రాణ్ (5 తీర్మానాల) గురించి వివరించారు. ప్రతి భారతీయుడూ తన లోని బానిస మనస్తత్వపు ఆలోచనలను తొలగించుకుని... మన సంస్కృతీ సంప్రదాయాలు, ఘనమైన చరిత్ర పట్ల గర్వపడాలని సూచించారు. అందుకే యువత... ఓవైపు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూనే... మరోవైపు భారతీయ నాగరికత మూలాలను, మన విలువలతో కూడిన సంప్రదాయాల సారాన్ని గ్రహించి ఆచరణలో పెట్టే దిశగా కృషి చేస్తోంది.

ఇవాళ యువత ఆధ్యాత్మిక పర్యాటకం, భారతీయ తాత్వికతపై ఆసక్తిని కనబరుస్తోంది. యోగా, శాస్త్రీయ సంగీతం, ఇతర సాంస్కృతిక పద్ధతులను అలవర్చుకుంటోంది. 2025లో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరిగిన 'కుంభమేళా'లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం, ఈ ఏడాది కొత్త సంవత్సరాన్ని జరుపుకొనేందుకు వేలాదిమంది 'కాశీ విశ్వనాథ మందిరాన్ని' ఎంచుకోవడం... యువతలో వస్తున్న పరివర్తనకు ఉదాహరణలు.

రాజకీయాల్లో యువశక్తి

దీని కారణంగా యువత ఆలోచనల్లోనూ సానుకూలమైన మార్పు కనబడుతోంది. దేశ రాజకీయ, సంస్థాగత అంశాలపై దీని ప్రభావం స్పష్టంగా ఉంది. రాజకీయ పార్టీలు కూడా... యువత ఆకాంక్షలకు పెద్దపీట వేస్తున్నాయి. నాయకత్వంలోనూ యువ భారతానికి ప్రాధాన్యం కల్పిస్తున్నాయి. 2024లో దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని లక్ష మంది యువత... రాజకీయాల్లోకి వచ్చి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవాలని కోరారు. దీన్ని ఆచరణలో పెడుతూ, 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' కార్యక్రమం ప్రారంభమైంది. దేశ యువత ఏమనుకుంటోందో తెలుసుకునేందుకు ప్రధానమంత్రి స్వయంగా వారితో మాట్లాడుతున్నారు. వారి ఆకాంక్షలను, వారి ఆలోచనలను, వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నారు. ప్రధానమంత్రి సూచనల మేరకు భారతీయ జనతా పార్టీ కూడా... ఇటీవలి కాలంలో యువ నాయకులకు పార్టీలో కీలకమైన బాధ్యతలు అప్పజెబుతోంది. బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యువకుడిని నియమించింది. రాజకీయంలో పెద్దలకు ఉండే అనుభవాన్ని యువత జోరు, వారి ఆవిష్కరణల సామర్థ్యంతో సమతుల్యం చేయాలన్న ప్రధాని ఆలోచనలకు కార్యరూపం ఇది.

దేశ యువశక్తి బలం, క్రమశిక్షణ, నైతికతలోనే భారతదేశ పునరుజ్జీవనం ఉంటుందని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఇవాళ అక్షరసత్యాలుగా మనముందున్నాయి. ఈ 'జెన్‌–జీ'పై, యువశక్తిపై ప్రబలమైన విశ్వాసంతోనే... 2047 నాటికి వికసిత భారత నిర్మాణం జరగాలనే సంకల్పాన్ని ప్రధాని దేశం ముందుంచారు. ప్రాచీన విజ్ఞానానికి, ఆధునిక సాంకేతికతకు వారథులుగా అనుకున్న లక్ష్యాలను చేరుకోవడంలో 'జెన్‌–జీ' పాత్ర అత్యంత కీలకం. అందుకే స్వామి వివేకానందుడు చూపిన బాటలో నడుస్తూ, భారతదేశాన్ని మళ్లీ విశ్వగురువుగా నిలబెట్టుకునేందుకు... ఆధునిక, ఆధ్యాత్మిక భారతాన్ని తర్వాతి తరాలకు అందించేందుకు ప్రధానమంత్రి సంకల్పించిన మహాయజ్ఞంలో మనమంతా భాగస్వాములమవుదాం!

వ్యాసకర్త కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

(నేడు స్వామి వివేకానంద జయంతి; జాతీయ యువజన దినోత్సవం)

ఈ ద్వంద్వ ప్రమాణాలేమిటి?

మహిళల వస్త్రధారణపై నటుడు శివాజీ చేసిన అసభ్య వ్యాఖ్యలు, ఆ తదనంతరం తెలంగాణ మహిళా కమిషన్ జోక్యం చేసుకొని ఆయనతో క్షమాపణ చెప్పించడం ఎంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలో శివాజీ క్షమాపణ చెప్పిన తర్వాత కూడా విమర్శించడం అనవసరమని కొందరు అనడం విడ్డూరం. మనిషి నాగరికత నేర్చుకున్న తొలి దశలో శరీరాన్ని, ముఖ్యంగా సున్నిత భాగాలను రక్షించుకోవడానికి దుస్తులను వాడటం ప్రారంభించాడు. ఈ నియమం స్త్రీ పురుషులకు సమానంగా వర్తిస్తుంది. కాలక్రమంలో భారతదేశంలో పురుషులకు సౌకర్యవంతమైన దుస్తులు అందుబాటులోకి రాగా, మహిళల విషయానికి వస్తే 'సంప్రదాయం' పేరిట చీరకట్టుకే పరిమితం కావాలని సమాజం కోరుకుంటోంది. గతంలో చుడీదార్లపై, ఇప్పుడు బిగుతు జీన్స్ ప్యాంట్లపై వస్తున్న విమర్శలు పితృస్వామ్య ధోరణికి నిదర్శనం.

వ్యాపార వస్తువుగా స్త్రీ శరీరం

సృష్టి ధర్మం ప్రకారం మహిళలు బలహీనులనే వాదనను పదే పదే వినిపిస్తుంటారు. కానీ ఆదిమ సమాజంలో పురుషులతో సమానంగా వేటలో పాల్గొన్న చరిత్ర మహిళలకు ఉంది. నేడు ఆర్మీ, విమానయాన, అంతరిక్ష పరిశోధనల వంటి రంగాల్లో స్త్రీలు తమ సత్తా చాటుతున్నారు. అయినా, పితృస్వామ్య వ్యవస్థ మహిళల శరీరాలను కేవలం లాభాల కోసం సరుకుగా వినియోగిస్తోంది. 19వ శతాబ్దం నుంచి సినిమా రంగం, అందాల పోటీలు ఈ ధోరణిని పెంచి పోషించాయి. ఫ్యాషన్ మార్కెట్, కాస్మోటిక్స్ రంగం మహిళలను అందం అనే చట్రంలో బంధిస్తున్నాయి. మేకప్ లేని ఎయిర్ హోస్టెస్‌ను విమానయాన రంగం అంగీకరించగలదా అన్నది నేటి చేదు నిజం.

శరీర భాగాలను ప్రదర్శించడం తప్పన్నప్పుడు, అది పురుషులకు కూడా వర్తించాలి కదా? తెరపై హీరోలు ఛాతీ ప్రదర్శన చేసినప్పుడు అది 'మగతనం'గా కీర్తించబడుతుంది తప్ప, ఎవరూ విమర్శించరు. మన భూస్వామ్య సంస్కృతిలో పురుషుడు ఎలా ఉన్నా చెల్లుతుంది కానీ, స్త్రీలపై మాత్రం కట్టుబాట్లు విధిస్తారు. పాశ్చాత్య పెట్టుబడిదారీ దేశాల్లో స్త్రీ శ్రమకు, స్వేచ్ఛకు గౌరవం ఉంటుంది కాబట్టి వస్త్రధారణను సహజంగా తీసుకుంటారు. మన దేశంలో స్త్రీల ప్రత్యుత్పత్తి అంగాలను కేవలం పురుష వాంఛను రేపేవిగా చూడటం ఒక వెనుకబాటుతనం.

సినిమాల్లో విచ్చలవిడిగా ఉన్నా ఫరవాలేదు కానీ బయట హుందాగా ఉండాలనే లాజిక్ వెనుక పెట్టుబడిదారుల లాభాలు దాగి ఉన్నాయి. సినిమాల్లో కేవలం అందాల ప్రదర్శనే అర్హతగా మహిళా నటులను తీసుకోవడం వల్ల వారి పరిస్థితి దయనీయంగా మారు తోంది. సినిమాల ప్రీమియర్ షోలు, లేదా బహిరంగ సభల్లో జరుగు తున్న తొక్కిసలాటలు, యువత మరణాలకు బాధ్యత వహించేవారు లేరు. నిరుద్యోగం, సరైన విద్య లేకపోవడం వల్లే యువత హీరోల చుట్టూ తిరుగుతోంది. దీనికి బాధ్యులు పాలకులే తప్ప మహిళల వస్త్రధారణ కాదు. స్త్రీలపై గౌరవం పెంచే సంస్కృతిని పెంచకుండా మహిళలను నిందించడం వల్ల ప్రయోజనం లేదు.

హైదరాబాద్‌లో నిర్వహించే అందాల పోటీలను మహిళా సంఘాలు వ్యతిరేకించడం వెనుక శాస్త్రీయ దృక్పథం ఉంది. మహిళల స్వేచ్ఛను హరించేలా వ్యవహరించే ప్రభుత్వాలు, మేధావులు అనుకుంటున్నవారు అభ్యుదయ దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– అనిత । చైతన్య మహిళా సంఘం

యువశక్తికి స్ఫూర్తి

39 ఏళ్ళ అల్ప కాలంలోనే యావత్ ప్రపంచాన్ని తన జ్ఞానంతో ప్రభావితం చేసిన మేధావి స్వామి వివేకానంద. జనవరి 12న ఆయన జయంతిని 'జాతీయ యువజన దినోత్సవం'గా జరుపుకోవడం మన ఆనవాయితీ. బ్రిటిష్ బానిసత్వంలో మగ్గిపోతున్న జాతిని మేల్కొలిపి, సామాజిక అసమానతలపై శంఖం పూరించిన ఆయన, యువతను దేశ వెన్నెముకగా గుర్తించారు. నేటి క్లిష్ట పరిస్థితుల్లో యువతకు ఆయన చేసిన దిశానిర్దేశం ఎంతో అవసరం.

ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం. 2025 గణాంకాల ప్రకారం 15–29 ఏళ్ళ మధ్య వయస్సు వారు 37 కోట్లు ఉండగా, దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ళ లోపు వారే. ఈ భారీ మానవ వనరులు దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సి ఉంది. అయితే, చదువుకున్నా సరైన నైపుణ్యాలు లేక చాలా మంది 'అన్‌స్కిల్డ్ లేబర్'గా మిగిలిపోతున్నారు. దీనికి తోడు మత్తు పదార్థాలు, ధూమపానం, మద్యపాన వ్యసనాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయి. విద్యా వ్యవస్థ ప్రైవేటీకరణ, వ్యాపారీకరణల వల్ల నాణ్యమైన చదువు సామాన్యులకు భారమవుతోంది. ఐఐటీ పట్టభద్రుల్లో సైతం 38 శాతం మంది నిరుద్యోగంతో ఉండటం గమనార్హం. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం, ఒత్తిడి తాళలేక ప్రతి 42 నిమిషాలకు ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడు తున్నారు. 2023లోనే 13,982 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం దేశ భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు.

స్వామి వివేకానంద

మరోవైపు సామాజిక మాధ్యమాల మోజులో పడి యువత అత్యధిక సమయాన్ని వృథా చేస్తోంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్‌కు బానిసలై సృజనాత్మకతను కోల్పోతున్నారు. సైబర్ నేరాలు, అసాంఘిక కార్యకలాపాల్లో యువత పాల్గొనడం ఆందోళన కలిగించే అంశం. 'అరైజ్, అవేక్, స్టాప్ నాట్ అంటిల్ యు రీచ్ యువర్ గోల్' అన్న వివేకానందుడి నినాదాన్ని నేటి తరం ఒంటబట్టించుకోవాలి. తనలో ఏముందో గుర్తించి యువత ముందుకు సాగాలి.

పాలకులు పాత పథకాలకు పేర్లు మార్చి అభివృద్ధి భ్రమలు కల్పించడం మాని, వాస్తవ ప్రగతిపై దృష్టి పెట్టాలి. రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా, మత, రాజకీయ జోక్యం లేని విద్యను అందించాలి. పరిశోధనలకు ప్రాధాన్యమిస్తూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించాలి. వివేకానంద కోరుకున్న సమసమాజం, వికసిత భారత్ సిద్ధించాలంటే యువశక్తి ఉపాధి పొంది దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలి. వివేకానందుని ఆశయాల సాధనే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

– ఐ. ప్రసాదరావు । ఉపాధ్యాయుడు

డేటా పాయింట్

'రక్షణ'కే అగ్ర తాంబూలం

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు పరిశోధన, అభివృద్ధి (ఆర్‌&డి)పై చేసిన వ్యయం 2024–25లో 25.6 శాతం పెరిగింది. ఇందులో అత్యధిక శాతం వ్యయం రక్షణ ఉత్పత్తులపై జరిగింది.



ఆధారం: పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సర్వే 2024-25

ఇన్ బాక్స్

మందుల మాంత్రికుడు

వైద్య ప్రపంచంలో అద్భుతాలు సృష్టించిన మందుల మాంత్రికుడు డా।। యల్లాప్రగడ సుబ్బారావు. ఆయన 1895 జనవరి 12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించారు. ఆయన తండ్రి స్వల్ప వేతనంతో రిటైర్ కావడంతో ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టాయి. చదువు ఆగిపోయే దశలో తల్లి వెంకాయమ్మ తన బంగారు పుస్తెలు అమ్మి కొడుకును ప్రోత్సహించారు.

యల్లాప్రగడ సుబ్బారావు

మద్రాసు మెడికల్ కాలేజీలో ప్రవేశం పొందిన సుబ్బారావుపై చిలకమర్తి లక్ష్మీనరసింహం, రామకృష్ణ మిషన్ ప్రభావం మెండుగా ఉండేది. దేశ స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో ఆయన విదేశీ దుస్తులు విడనాడి ఖద్దరు ధరించి కాలేజీకి వెళ్ళేవారు. ఈ చర్య అధికారుల ఆగ్రహానికి కారణమైంది. సరిగ్గా అదే సమయంలో ఆయన జీవితాన్ని మలుపు తిప్పిన విషాదం చోటుచేసుకుంది. అతి సన్నిహితులైన ఇద్దరు సోదరులు పురుషోత్తం, కృష్ణమూర్తి వారం రోజుల వ్యవధిలోనే 'స్ప్రూ' వ్యాధితో కన్నుమూశారు. ఈ మనోవేదన ఒక బలమైన సంకల్పాన్ని రగిల్చింది.

ఆర్థిక వనరులు లేకపోయినా పట్టుదలతో చదువు కొనసాగించి, ఆయుర్వేద వైద్యుడిగా సేవలు అందించారు. తర్వాత హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో డిప్లొమా పూర్తి చేశారు. అక్కడ ఆచార్య పదవి నిరాకరించబడటంతో లెడర్లీ ప్రయోగశాలలో చేరి తన అన్వేషణ ప్రారంభించారు. సుబ్బారావు కృషి ఫలితంగానే ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిన బోదకాలు వ్యాధి నివారణ ఔషధం 'హెట్రజాన్' ఉద్భవించింది. ఆయన పర్యవేక్షణలో బెంజమిన్ డుగ్గర్ 1945లో ప్రపంచంలోనే తొలి టెట్రాసైక్లిన్ యాంటీ బయాటిక్ 'ఆరియోమైసిన్'ను కనుగొన్నారు. తన సోదరులను బలితీసుకున్న స్ప్రూ వ్యాధికి విరుగుడుగా రెండు దశాబ్దాల తర్వాత 'ఫోలిక్ యాసిడ్'ను ఆవిష్కరించారు. ఒక శిలీంధ్రానికి ఆయన గౌరవార్థం 'సుబ్బారోమైసిస్ స్ప్లెండెన్స్' అని పేరు పెట్టారు.

– ఎం. రామ్ ప్రదీప్ । జేవీవీ సభ్యుడు, తిరువూరు (నేడు యల్లాప్రగడ సుబ్బారావు జయంతి)

సంక్రాంతి రద్దీ

రాష్ట్రవ్యాప్తంగా సంక్రాంతి సందడి నెలకొంది. ఆదివారం అన్ని బస్టాండ్లు, రైల్వే స్టేషన్‌లు కిటకిటలాడాయి. పండగ షాపింగ్ కోసం వచ్చిన వారితో షాపింగ్ మాల్స్ కిక్కిరిసిపోయాయి. సొంత ఊళ్లకు వెళ్లే వారు బస్సుల కోసం నిరీక్షించడంతో బస్టాండ్ల బయట కూడా విపరీతమైన రద్దీ నెలకొంది. పట్టణమంతా ఒక్కసారిగా పల్లెకు తరలిపోతున్నట్టు హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చే దారిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద కారులు బారులు తీరాయి. అలాగే హైదరాబాద్ నుంచి కార్లు, బైక్‌లపై పలు కుటుంబాలు ఏపీకి బయల్దేరాయి. - సాక్షి నెట్‌వర్క్

విజయవాడ రైల్వేస్టేషన్‌లో రద్దీ

విజయవాడ బీసెంట్ రోడ్‌లో షాపింగ్ సందడి

హైదరాబాద్‌లోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

విజయవాడ బస్‌స్టాండ్‌లో..

కిటకిటలాడుతున్న విశాఖ జగదాంబ సెంటర్

సంక్రాంతి ఎఫెక్ట్‌తో విమాన చార్జీలకు రెక్కలు

రేణిగుంట: హైదరాబాద్ నుంచి తిరుపతికి వాయుమార్గాన 12, 13న రావాలంటే జేబుకు భారీగా చిల్లుపడుతోంది. తిరుపతి నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా, తిరుపతి రావాలన్నా విమాన టికెట్ ధరలు రూ.3 వేల నుంచి రూ.4 వేల లోపు ధర ఉంటోంది. అయితే సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరగడంతో విమానయాన సర్వీసులు ఈ నెల 12, 13న ధరలను అమాంతం పెంచేశాయి. రూ.12 వేల నుంచి రూ.13 వేలకు పైగా ఒక్క టికెట్ ధరను కంపెనీల అధికారిక టికెట్ బుకింగ్ సైట్‌లలో చూపుతున్నారు. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణ టికెట్ ధర కూడా రూ.8 వేలు ఉండడం గమనార్హం.

దుర్గమ్మ సేవలో జస్టిస్ మల్లికార్జునరావు

ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. పండితులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ద్వారకా బస్ స్టేషన్‌లో చెలరేగిన దొంగలు

అల్లిపురం(విశాఖ): విశాఖ ద్వారకా బస్ స్టేషన్‌లో దొంగలు చెలరేగిపోయారు. సంక్రాంతి నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని దొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఇద్దరు మహిళల నుంచి సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. వివరాలు.. హైదరాబాద్ నుంచి వచ్చిన ధనలక్ష్మి శ్రీకాకుళం వెళ్లేందుకు బస్ ప్లాట్‌ఫారం వద్ద వేచి ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి ఆమె బ్యాగులోని 8 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. బస్సు ఎక్కిన తర్వాత బ్యాగ్ జిప్పు తీసి ఉండటాన్ని గమనించిన ఆమె నగలు పోయాయని గుర్తించి పోలీసులను ఆశ్రయించింది.

- సీతంపేటకు చెందిన కళావతి టెక్కలి వెళ్లేందుకు బస్సు ఎక్కగా.. మద్దిలపాలెం చేరుకునే సరికి ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలతాడు మాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ క్రైం, సీసీఎస్ పోలీసులు బస్ స్టేషన్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు.

తెనాలిలో ఏపీ షార్ట్‌ఫిల్మ్స్ పండుగ

- రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా హాజరైన నటీనటులు
- చిన్న సినిమాలను బతికించండి: నటుడు సుమన్

విజేతలతో నటుడు సుమన్, నిర్మాత సదానందరావు, దిలీప్‌రాజా

తెనాలి టౌన్: చిన్న సినిమాలను బతికించాల్సిన అవసరం ఉందని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో జరిగిన ఏపీ షార్ట్ ఫిల్మ్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొత్తం 203 ఎంట్రీలు రాగా 65 ఎంట్రీలను షార్ట్ లిస్ట్ చేసినట్టు మా-ఏపీ వ్యవస్థాపకుడు, దర్శకుడు దిలీప్ రాజా దిలీప్ రాజా చెప్పారు. సూపర్ స్టార్ కృష్ణ స్మారక ప్రథమ బహుమతి రూ.50వేల నగదును విశాఖకు చెందిన 'మహా వృక్షం' టీమ్‌కు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు శ్రీకాకుళానికి చెందిన 'సింహాద్రి అప్పన్న' షార్ట్ ఫిల్మ్‌కు, తృతీయ బహుమతి రూ.20 వేలు 'అబద్ధం వర్సెస్ నిజం' లఘుచిత్రానికి నటుడు సుమన్, నిర్మాత రావు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి దోనెపూడి మధుబాబు అందజేశారు. అలాగే, రాచూరు సునీతకు స్పెషల్ కాన్సెప్ట్ బహుమతి, ఉత్తమ నటుడుగా మోహన్, ఉత్తమ నటిగా సుజిత, ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సాయి ప్రకర్ష, బాలనటులుగా హర్షతున్నీసా, శ్రీనివాస్, ఉత్తమ క్యారెక్టర్ నటులుగా పవన్ శర్మ, దర్శకులుగా ఈశ్వర్, త్రివిక్రమ్, నిర్మాతగా దినేష్ కదిరి అవార్డులు అందుకున్నారు. జ్యూరీ ప్రత్యేక బహుమతులను ఎన్.ఎస్.నాయుడు, గంగాధర్ అందుకొన్నారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ అచ్చన శ్రీనివాస యాదవ్, సహాయ దర్శకులు గాజులపల్లి రాముడు, నరేష్ దోనే, సత్యవర్ధన్, ప్రజలు, కళాకారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

నేటి నుంచి శ్రీశైలంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో సోమవారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పంచాహ్నిక దీక్షతో ఏడురోజుల పాటు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 9.15 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, ధ్వజపటావిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. 13న భృంగి వాహనసేవ, 14న కైలాస వాహనసేవ, 15న నంది వాహనసేవ, బ్రహ్మోత్సవ కల్యాణం, 16న రావణ వాహనసేవ, 17న పూర్ణాహుతి, ధ్వజావరోహణ, 18న అశ్వ వాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

సంక్రాంతి వేళ సంప్రదాయ సంబరాలు

- పెద్ద పండుగ... ప్రాంతానికో ప్రత్యేకం
- గోదావరి జిల్లాల్లో కోడి పందేలు
- కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఎడ్ల పోటీలు
- కోనసీమలో ప్రభల తీర్థం
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జల్లికట్టు సాహసం

సాక్షి, అమరావతి: 'ప్రకృతి ఒడిలో పసిడి కాంతుల పరవశం.. ముంగిట ముగ్గులు.. మురిపించే గొబ్బెమ్మలు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. ఆకాశంలో గాలిపటాల విన్యాసాలు.. అంబరాన్నంటే కేరింతలు.. కొత్త బియ్యం పాయసాలు.. కమ్మని నెయ్యి పరిమళాలు.. భోగి మంటల వెచ్చదనం.. ఆత్మీయ కలయికల మాధుర్యం.. రైతు కంట ఆనందం.. ఇంటింటా సంక్రాంతి వైభోగం..' అంతటితో సరిపెడితే ఎలా అనుకున్నారో ఏమో.. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకత చాటుకునేలా సంక్రాంతి కోలాహలాన్ని కొనసాగిస్తూ మరింత జోష్ నింపుతున్నారు. పెద్ద పండుగగా పిలుచుకునే సంక్రాంతి వేళ ప్రత్యేక సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. భోగి, మకర సంక్రాంతి, కనుమ మూడు రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలను ఉత్సాహంగా నిర్వహిస్తూనే మరింత సందడి నింపేలా చేస్తున్న కార్యక్రమాలు ఆ ప్రాంతాలకు దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిపెట్టాయి. అవి ఏమిటంటే..

కత్తులు దూసే పందెం కోళ్లు

ఉమ్మడి గోదావరి జిల్లాల్లో మూడు రోజులపాటు నిర్వహించే కోడి పందాలకు పెద్ద క్రేజ్ ఉంది. పల్నాటి బ్రహ్మనాయుడు, నాగమ్మ మధ్య పోరాటంలో కోడి పందేలు సైతం పౌరుషాన్ని చాటాయని చరిత్ర చెబుతుండగా.. ఉభయ గోదావరి జిల్లాల్లో మాత్రం కొత్త ఒరవడిని సృష్టిస్తున్నాయి. తొలినాళ్లలో కత్తులు కట్టకుండా సరదాగా నిర్వహించిన కోడి పందేలు రానురాను సంప్రదాయం ముసుగులో జూదాల జాతరను తలపించేలా సాగుతున్నాయి. తామేమీ తక్కువ తినలేదన్నట్టుగా కృష్ణా, గుంటూరు తదితర జిల్లాలనూ కోడి పందేలు తాకాయి. ప్రధానంగా భీమవరం, నరసాపురం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, అమలాపురం, రాజమహేంద్రవరం, దెందులూరు తదితర ప్రాంతాల్లో నిర్వహించే భారీ పందేలను తిలకించేందుకు వేల సంఖ్యలో జనం వస్తుంటారు. నెత్తురోడుతున్నా గెలుపు కోసం జూలు విదిల్చి కత్తులు దూసే కోడి పందాల్లో బెట్టింగ్‌లకు పలు రాష్ట్రాల నుంచి కూడా తరలివస్తుంటారు. విదేశాల్లో స్థిరపడిన వారు సంక్రాంతికి ఈ ప్రాంతానికి వ్యయ ప్రయాసలకోర్చి చేరుకుంటారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే అతిథులకు ఈ ప్రాంత వాసులు ప్రత్యేక బస ఏర్పాట్లు చేయడంతోపాటు విందు, వినోదాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తారు. ఇప్పుడు భారీ టెంట్లు, ఫ్లడ్‌లైట్లు కాంతులు, ప్రత్యేక గ్యాలరీలు, ఎల్ఈడీ స్క్రీన్లు, బౌన్సర్లు, అతిథులకు విందు, వినోదాలతో కోడి పందేలు నిర్వహించే తీరు అబ్బో అనిపిస్తుంది.

ప్రభల తీర్థం.. కోనసీమ ప్రత్యేకం

400 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ప్రభల తీర్థం కోనసీమ ప్రాంతానికి ప్రత్యేకం. కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలోని జగ్గన్నతోట ప్రభల తీర్థం భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. శైవ ఉత్సవంగా నిర్వహించే ప్రభల తీర్థంలో సమీపంలోని 11 గ్రామాల నుంచి 11 ప్రభలు (తడికెలు, కర్రలతో తయారు చేసినవి) తీసుకొస్తారు. ఏకాదశ రుద్రులుగా పరిగణించే ప్రభలను వరి పొలాలు, కాలువలు, కౌశిక నది (గోదావరి పాయ) దాటి తీసుకుని వచ్చి జగ్గన్నతోట ప్రాంతంలో కొబ్బరి తోటల్లో ఉంచుతారు.

ఎడ్ల పందేలు చూసి తీరాల్సిందే..

సంక్రాంతి వేళ ముఖ్యంగా కనుమ రోజున పశువులను పూజించి ఆ మరుసటి రోజు నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఎడ్ల అందాల పోటీలు, బండ లాగుడు పోటీలు, పరాక్రమ పోటీలు నిర్వహించడం ఆచారంగా మారింది. తొలినాళ్లలో రైతులు నిర్వహించిన ఈ పోటీలు రానురాను ప్రత్యేక ప్రదర్శన, ఆకర్షణగా మారాయి. రాష్ట్రంలో ప్రధానంగా ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎడ్ల పరుగు పందేలు, బరువైన బండ్లను లాగుతూ వేగంగా పరిగెత్తించడం, ఒంగోలు గిత్తల ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించడంతో వేల సంఖ్యలో తిలకించేందుకు వస్తారు.

జల్లికట్టు.. ప్రాణాలతో చెలగాటమే

తమిళనాడుకు చెందిన జల్లికట్టును ఏపీలోని చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అనేక గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా పశువుల పండగను పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తుంటారు. అదుపు తప్పి పరుగులు తీసే ఎద్దులకు ఎదురెళ్లి కట్టడి చేసేందుకు యువకులు ప్రాణాలతో చెలగాటం ఆడుతూ జల్లికట్టులో పాల్గొంటారు. ఎద్దులను, గిత్తల కొమ్ములకు కట్టిన జెండాలను చేజిక్కించుకునే క్రమంలో వాటి కొమ్ములు దిగి, కాళ్ల కింద నలిగి గాయాలపాలైనా వాటిని కట్టడి చేసేందుకు చేసేందుకు ప్రయత్నిస్తారు.

గుర్రపు పందేలు.. పందుల పందేలు..

సంక్రాంతి రోజుల్లో ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం జిల్లాలోని కొన్నిచోట్ల గుర్రపు పందేలు నిర్వహిస్తుంటారు. పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో వినోదం కోసం పందులు, పొట్టేళ్ల పందేలు నిర్వహించడం జరుగుతోంది.

రాయచోటి తొలగింపుపై మాయమాటలు

- నోటిఫికేషన్ ఇవ్వకుండానే నిర్ణయం తీసుకోవడం దుర్మార్గం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటి లేని లోటును మాయమాటలతో ఎవరూ తీర్చలేరని, కనీసం జిల్లా కేంద్రం మార్పు విషయంపై నోటిఫికేషన్ ఇవ్వకుండానే నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటిలో ఆయన మాట్లాడారు. ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఒక్క రోజులోనే నిర్ణయం తీసుకుని నిర్దాక్షిణ్యంగా లక్షలాది మంది ప్రజల మనోభావాలకు తూట్లు పొడిచారని, రాయచోటి ప్రాంతాన్ని విచ్ఛిన్నం చేశారని విమర్శించారు. రాయచోటిని జిల్లా కేంద్రంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

144 పేజీల పిల్...
ప్రభుత్వ తప్పిదాలపై బలమైన ఆధారాలు..

రాయచోటిని జిల్లాకేంద్రంగా కొనసాగించాలని డిమాండ్‌చేస్తూ హైకోర్టులో పిల్ వేశామని, ప్రభుత్వ తప్పిదాలపై 144 పేజీలలో ఆధారాలు సమర్పించి బలంగా వాదనలు వినిపించామని శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రభుత్వం నుంచి సమాధానాలు తెలుసుకుంటామని పేర్కొన్నారని వివరించారు. కోర్టులో రాయచోటికి న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాంతాల సరిహద్దులు మార్చకూడదన్న నిబంధనలను కూటమి సర్కారు తుంగలోతొక్కిందని విమర్శించారు. డిసెంబర్ 31వ తేదీనే ఇక్కడ ఉన్న ప్రభుత్వ కార్యాలయాలలోని రికార్డులను, ఫర్నిచర్‌ను ట్రక్కులలో తరలించడం చూసిన రాయచోటి వాసులు కన్నీరుపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు రాయచోటి ప్రజల ఉసురు తగులుతుందని హెచ్చరించారు. జిల్లా కేంద్రం తరలింపుతో ఈ ప్రాంతంలో భూముల ధరలు పడిపోయాయని, రైతులు, ప్రజలు నష్టపోయారని శ్రీకాంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయపోరాటం ద్వారా జిల్లాకేంద్రాన్ని తిరిగి సాధిస్తామని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

జగన్ హయాంలోనే గండికోట-కాలేటి వాగు ప్రాజెక్టు పనులు ప్రారంభం

రాయలసీమ లిఫ్ట్, గండికోట-కాలేటి వాగు ద్వారా రాయచోటి ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, ఆ ఉద్దేశంతో గండికోట-కాలేటివాగు ప్రాజెక్టు పనులను రూ.5వేల కోట్లతో వైఎస్ జగన్ హయాంలోనే ప్రారంభించామని శ్రీకాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ పనులను ఎందుకు ఆపేశారని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. జల జీవన్ మిషన్ ద్వారా రాయచోటి నియోజకవర్గంలోని 950 పల్లెలకు తాగునీరు అందించేందుకు రూ.6వేల కోట్ల నిధులు జగన్ హయాంలో మంజూరు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి చంద్రబాబు సర్కారు చేసిందేమీ లేదని ధ్వజమెత్తారు.

బ్లోఅవుట్ బావికి శాశ్వత మూత

మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో బ్లోఅవుట్ సంభవించిన మోరి-5 ఓఎన్‌జీసీ బావిని శాశ్వతంగా మూసివేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మూసివేసిన బ్లోఅవుట్ బావిని ఆదివారం ఆయన పరిశీలించారు. బ్లోఅవుట్ సంభవించిన తీరు, నియంత్రించిన విధానాన్ని ఓఎన్‌జీసీ ఈడీ, రాజమహేంద్రవరం అసెట్ మేనేజర్ శంతన్‌దాస్ కలెక్టర్‌కు వివరించారు. బావి పూర్తిగా అదుపులో ఉందని పేర్కొంటూ ఓఎన్‌జీసీ నుంచి బావి భద్రత ధ్రువీకరణ పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం లక్కవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. ఇకపై బ్లోఅవుట్ బావి తెరిచే అవకాశం లేకుండా శాశ్వతంగా మూసివేసినట్టు ప్రకటించారు. ప్రజలు భయపడాల్సిన పని లేదన్నారు. 1995లో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చమురు వెలికితీతలు జరుగుతున్నాయని, ఇకపై ప్రభుత్వానికి చెప్పే ఏ బావి వద్దనయినా కార్యకలాపాలు చేపట్టాలన్నారు. తద్వారా ముందుగానే అక్కడి ప్రజల రక్షణ, ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సన్నద్ధత ఉంటుందని వివరించారు. ఆ కార్యకలాపాలపై పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ, నిఘా ఉంటాయన్నారు. బ్లో అవుట్ బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని, పంట, ఇతర నష్టాలను త్వరలోనే అంచనా వేస్తామని చెప్పారు. అంతకుముందు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కూడా ఈ బావిని సందర్శించారు. బ్లోఅవుట్‌ను నియంత్రించిన అధికారులను, సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, ఆర్డీఓ మాధవి, ఓఎన్‌జీసీ క్రైసిస్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ జి.శ్రీహరి, ఓఎన్‌జీసీ ఉద్యోగ సంఘ కార్యదర్శి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

బ్లోఅవుట్ బావి వద్ద కలెక్టర్ మహేష్ కుమార్‌కు భద్రతా ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఓఎన్‌జీసీ ఈడీ

మన చుట్టూతా..

సోమనాథ్ పునర్‌నిర్మాణ వ్యతిరేక శక్తులు

- భారత్‌లో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన తరుణమిది
- మనందరం ఐకమత్యంతో ఆ దుష్టశక్తులను ఓడిద్దాం
- 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'లో ప్రధాని మోదీ పిలుపు
- ఆలయం కోసం పోరాడిన యోధులను స్మరిస్తూ కొనసాగిన శౌర్యయాత్ర
- ఢమరుక నాదాల నడుమ 108 అశ్వాలతో ఊరేగింపు

సోమనాథ్: వెయ్యేళ్ల సోమనాథ్ చరిత్ర విధ్వంసం, పరాజయానికి సంబంధించినది కాదని.. అది మహోన్నత పునర్‌నిర్మాణ, విజయం చరిత్ర అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. చరిత్రాత్మక సోమనాథ్ ఆలయం విధ్వంసానికి గురైన ప్రతిసారీ మరోసారి నిర్మితం అవుతూనే ఉందని తెలిపారు. ఖడ్గం మొనతో ప్రజల హృదయాలు గెలుచుకోలేమని స్పష్టంచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్‌నిర్మాణాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన శక్తులు ఇప్పటికీ మన మధ్యనే చురుగ్గా ఉన్నాయని చెప్పారు. ప్రజలంతా అప్రమత్తంగా, ఐక్యంగా ఉంటూ ఆయా శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు.

ప్రధాని మోదీ ఆదివారం గుజరాత్ రాష్ట్రం గిర్ సోమనాథ్ జిల్లాలోని ప్రఖ్యాత సోమనాథ్ ఆలయాన్ని దర్శించుకున్నారు. మహాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం సమీపంలోని సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అనంతరం 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్'లో పాల్గొన్నారు. తర్వాత అక్కడే ఏర్పాటుచేసిన భారీ బహిరంగ కార్యక్రమంలో వేలాది మంది భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ''సోమనాథ్ మందిరంపై లెక్కలేనన్ని దాడులు జరిగాయి. ఈ దాడులకు విద్వేషమే ప్రేరణగా నిలిచింది. మనకు నిజాలు తెలియకుండా కుట్రలు చేశారు'' అని గత ప్రభుత్వాలపై మోదీ మండిపడ్డారు.

బుజ్జగింపు రాజకీయాలను నమ్ముకున్నవారే..

''సోమనాథ్ ఆలయంపై దాడుల వెనుక మతపరమైన విద్వేషం ఉంది. సరిగ్గా వెయ్యేళ్ల క్రితం అతి పెద్ద దాడి జరిగింది. ఇది కేవలం సంపద కోసం జరిగిన దాడి కాదు. గర్భాలయంలో సోమనాథుడి విగ్రహాన్ని ముక్కలు చేశారు. ఇంత జరిగినా కొందరు మన కళ్లుగప్పాలని చూశారు. సంపద లూటీ కోసమే దాడులు అంటూ కట్టుకథలు అల్లారు. విద్వేషం, వేధింపులు, ఉగ్రవాద చరిత్రను దాచేయాలని కుట్రలు సాగించారు. నిజంగా సొంత మతం పట్ల నిబద్ధత కలిగినవారు ఉగ్రవాద భావజాలాన్ని సహించరు. బుజ్జగింపు రాజకీయాలను నమ్ముకున్నవారే మతపరమైన ఉగ్రవాదం ఎదుట మోకరిల్లుతారు'' అని అన్నారు.

శౌర్య యాత్రలో ఢమరుకం మోగిస్తున్న ప్రధాని మోదీ

మనం మరింత శక్తివంతంగా మారాలి

''మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ గొప్ప ప్రతిజ్ఞ చేశారు. సోమనాథ్ ఆలయాన్ని పునర్నిర్మిస్తామని చెప్పారు. కానీ, అప్పటి పాలకులు ఆయనకు ఎన్నో అడ్డంకులు సృష్టించారు. 1951లో ఆలయ ప్రారంభోత్సవానికి తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ హాజరుకాకుండా అభ్యంతరాలు వ్యక్తంచేశారు. వెళ్లొద్దని చెప్పారు. హెచ్చరికలను లెక్కచేయకుండా ఆలయాన్ని ఆయన ప్రారంభించారు. ఆలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిన అవే శక్తులు ఇప్పటికీ మనుగడలో ఉన్నాయి. కత్తులు, కుట్రలతో కాకుండా ఇతర మార్గాల్లో మన దేశాన్ని వ్యతిరేకిస్తున్నాయి. స్వలాభం కోసం మన మధ్య చిచ్చుపెట్టి, ముక్కలుగా విభజించాలని చూస్తున్న దుష్ట శక్తులను కచ్చితంగా ఓడించాలి'' అని అన్నారు. ''గజినీ మహమ్మద్ 1026లో సోమనాథ్‌పై దాడి చేశాడు. ఆ తర్వాత 18వ శతాబ్దంలో ఔరంగజేబ్ పాలన దాకా ఎన్నోసార్లు విధ్వంసాలు జరిగాయి. ఈ మందిరాన్ని మసీదుగా మార్చేందుకు ప్రయత్నించారు. కానీ, విధ్వంసం జరిగిన ప్రతిసారీ శివ భక్తులు ఆలయాన్ని మళ్లీ నిర్మించుకున్నారు. వీరిలో మాల్వా రాణి అహిల్యాభాయి హోల్కర్ సైతం ఉన్నారు. విదేశీ దురాక్రమణదారులు మన దేశాన్ని కూడా ధ్వంసం చేయడానికి శతాబ్దాలపాటు ప్రయత్నించారు. దేశం ఏనాడూ వారి ఎదుట తలవంచలేదు. ముష్కరుల నుంచి సోమనాథ్ మందిరాన్ని కాపాడుకోవడానికి వీర్ హమీర్‌జీ గోహిల్, వేగ్‌దాజీ భిల్ వంటి ఎందరో మహానుభావులు ఎన్నో త్యాగాలు చేశారు'' అని ప్రధాని మోదీ వెల్లడించారు.

శౌర్య యాత్రలో మోగిన ఢమరుకం

విదేశీయుల దాడుల నుంచి సోమనాథ్ ఆలయాన్ని రక్షించుకునే క్రమంలో వీరమరణం పొందిన అసంఖ్యాక యోధులను స్మరించుకుంటూ ఆదివారం సోమనాథ్ పట్టణంలో 108 అశ్వాలతో భారీ శౌర్యయాత్ర నిర్వహించారు. ర్యాలీని ప్రారంభిస్తూ ప్రధాని మోదీ సైతం ఢమరుకం మోగించి, ఢంకా బజాయించారు. వందలాది మంది భక్తులు ఢమరుకాలను మోగిస్తూ ముందు నడవగా 108 మేలుజాతి అశ్వాలు ఠీవీగా నడుస్తూ వాళ్లను అనుసరించాయి. వెనకాలే ఓపెన్‌టాప్ వాహనంలో ప్రధాని మోదీ వెంట రాగా రిషి కుమారులు ఆయన వెంట వచ్చారు. శంఖ్ సర్కిల్ నుంచి వీర్ హమీర్‌జీ గోహిల్ సర్కిల్ దాకా దాదాపు కిలోమీటర్‌పైగా ఈ శౌర్య యాత్ర కన్నులపండువగా కొనసాగింది. ఇరువైపులా బారులు తీరిన భక్తులపై జనం పూలవర్షం కురిపించారు. యాత్ర పొడవునా శివభక్తులు, కళాకారులు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. సోమనాథ్ ఆలయం దాకా యాత్ర జరిగింది. ఆలయ చరిత్రను వివరిస్తూ సాగిన డ్రోన్ల ప్రదర్శన ఆకట్టుకుంది. సోమనాథ్‌ను దర్శించుకోవడం దేవుని గొప్ప ఆశీర్వచనంగా భావిస్తున్నానంటూ ప్రధాని మోదీ తర్వాత 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు.

చలికి వణుకుతున్న ఢిల్లీ

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. 13 ఏళ్ల తర్వాత అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆయనగర్‌లో 2.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ శీతాకాలంలో ఢిల్లీలో చలిగాలులు వీచడం ఇదే తొలిసారని, 2013 తర్వాత ఇదే అత్యల్ప ఉష్ణోగ్రతని ఐఎండీ వెల్లడించింది. 2013 జనవరి 7న పాలెంలో 2.6 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. 1967 జనవరి 11న పాలెంలో 2.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇది ఆల్‌టైమ్ రికార్డ్. ఆదివారం నగరంలోని అనేక ప్రాంతాల్లో అత్యంత శీతల గాలులు వీచాయి. రిడ్జ్ స్టేషన్‌లో 3.7 డిగ్రీలు, లోధిరోడ్‌లో 4.6 డిగ్రీలు, ఢిల్లీ ప్రధాన వాతావరణ కేంద్రం ఉన్న సఫ్దర్‌గంజ్‌లో ఉష్ణోగ్రత 4.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాజధానిలో సోమవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 17 నుంచి 19 డిగ్రీలు ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

వేలాది మంది సూసైడ్ బాంబర్లున్నారు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఉగ్రవాది, జైషే మొహమ్మద్ ఉగ్రసంస్థ చీఫ్ మసూద్ అజార్ మాట్లాడిన ఆడియో ఒకటి సోషల్ మీడియాలో తెరపైకి వచ్చింది. తమ వద్ద వేలాది మంది ఆత్మాహుతి దళ సభ్యులున్నారని అజార్ పేర్కొన్నాడు. వారంతా దాడులకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశాడు. ఈ ఆడియోను జైషే మొహమ్మద్ సంస్థ విడుదల చేసినట్లు తెలుస్తోంది. అయితే, ఇది ఎప్పుడు రికార్డు చేశారన్నది నిర్ధారణ కాలేదు. ఇందులో నిజమెంత అనే దానిపై పలు సందేహాలున్నాయి. తమ వద్దనున్న సూసైడ్ బాంబర్లు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నారని అజార్ వెల్లడించారు. వీరంతా వ్యక్తిగత లాభాల కోసమే, వీసాల కోసమో, డబ్బు కోసమో తమవద్ద చేరలేదని తెలిపాడు. బలిదానం చేయడం కోసమే ముందుకొచ్చారని స్పష్టంచేశాడు. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో మసూద్ అజార్‌కు భారీ నష్టం వాటిల్లింది. అతడి ఉగ్రవాద స్థావరాలు నేలమట్టమయ్యాయి. కుటుంబ సభ్యులు మరణించారు. దాదాపు 10 మంది మృతిచెందినట్లు సమాచారం. అతడి అనుచరులు సైతం హతమయ్యారు. మసూద్ అజార్ ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నట్లు తెలుస్తోంది. 2019 తర్వాత బహిరంగంగా కనిపించలేదు. భారత్‌లో జరిగిన పలు ఉగ్రవాద దాడుల్లో అతడి హస్తం ఉన్నట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించారు.

ఆస్పత్రి నుంచి సోనియా డిశ్చార్జ్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ(79) ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని సర్ గంగారామ్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యారు. ఛాతీలో ఏర్పడిన ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వారం క్రితం ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. సోనియా గాంధీ పూర్తి స్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంటివద్దే వైద్య చికిత్సలు కొనసాగించాలని ఆమెకు సూచించామని ఓ అధికారి తెలిపారు.

ప్రమాదంలో కేరళ భద్రత

తిరువనంతపురం: కేరళలో శాంతి భద్రత పైకి సాధారణంగా కన్పిస్తున్నా లోపల అనేక ముప్పులు క్రమేపీ పెరుగుతున్నాయని హోం మంత్రి అమిత్ షా అన్నారు. భవిష్యత్తులో ఇవి ప్రమాదకరంగా మారనున్నాయని హెచ్చరించారు. మలయాళ పత్రిక కేరళ కౌముది ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ''పీఎఫ్‌ఐ, జమాతె ఇస్లామీ, ఎస్‌డీపీఐ వంటి రాజకీయ పార్టీలు కేరళను సురక్షితంగా ఉండనిస్తాయా? ఇటువంటి బెడదలను ముందుగానే గుర్తించి, తొలగించడం బాధ్యత కలిగిన ప్రభుత్వం చేయాల్సిన పని' అని అన్నారు. పీఎఫ్‌ఐ కేడర్ మొత్తాన్నీ కటకటాల్లోకి నెట్టేసి, దేశాన్ని తాము సురక్షితంగా ఉంచామని చెప్పారు. తెరవెనుక ఉన్న ముప్పులను తొలగించినప్పుడే కేరళ సురక్షితంగా ఉండగలదని అమిత్ షా అన్నారు. బీజేపీ వల్లనే అది సాధ్యమని చెప్పారు.

పద్మనాభుని సన్నిధిలో పూజలు

కేరళలో ఒక్క రోజు పర్యటనకు గాను శనివారం రాత్రి తిరువనంతపురం చేరుకున్న అమిత్ షా ఆదివారం ఉదయమే అనంత పద్మనాభుని ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ ధోవతి, సిల్కు శాలువాతో వచ్చిన అమిత్ షాకు ట్రావెన్‌కోర్ రాచ కుటుంబ సభ్యుడు ఆదిత్య వర్మ, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమిత్ షాకు ఆలయ అధికారులు పద్మనాభస్వామికి అంకితమిచ్చే సంప్రదాయ విల్లును బహూకరించారు. .

కేరళ, బెంగాల్‌లలో ఒకేసారి ఎన్నికలు

అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా నూతనంగా ఎన్నికైన తిరువనంతపురం బీజేపీ కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే కేరళలోనూ ఎన్నికలు జరుగుతాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శబరిమల ఆలయంలో బంగారు తరుగు కేసుపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని హోం మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. అసలైన దోషులను కాపాడేందుకు అధికార ఎల్డీఎఫ్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఆలయ ఆస్తులనే కాపాడలేని వారు ప్రజల విశ్వాసాలను ఎలా పరిరక్షించగలరంటూ ప్రశ్నించారు.

కేరళ సంప్రదాయ వస్త్రధారణలో అమిత్ షా

దాడి చేస్తే అంతు చూస్తాం

- అమెరికాకు ఇరాన్ హెచ్చరికలు
- ఇజ్రాయెల్‌నూ లక్ష్యం చేసుకుంటాం
- పార్లమెంటు స్పీకర్ ప్రకటన
- తీవ్రతరమవుతున్న ఉద్రిక్తతలు
- ఇరాన్‌లో నిరసనలు తీవ్రరూపు
- వందలాది మంది మృతి

టెహ్రాన్/దుబాయ్: నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకుతున్న ఇరాన్‌లో పరిస్థితి క్రమంగా చేయి దాటిపోతోంది. ప్రజల ఆక్రోశం తీవ్ర ఆవేశంగా రూపుదాలుస్తోంది. దేశవ్యాప్తంగా ఏ నగరం చూసినా ఉద్యమాలతో అట్టుడికిపోతోంది. మొత్తం 36 ప్రావిన్సుల్లోనూ జనాందోళన పెద్దపెట్టున కొనసాగుతోంది. 100కు పైగా నగరాలు అట్టుడుకుతున్నాయి. ముఖ్యంగా రాజధాని టెహ్రాన్‌లో ఆదివారం నిరసనకారులు వీధుల్లోకి పోటెత్తారు. ఖమేనీ నియంతృత్వ పాలన తమకొద్దంటూ నిరసనలతో హోరెత్తించారు. వాటిని ఇరాన్ ఉక్కుపాదంతో అణచివేస్తుండటం, దీన్ని చూస్తూ ఊరుకోబోమని, నేరుగా జోక్యం చేసుకోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే ఇరాన్‌ను హెచ్చరించడం తెలిసిందే. దాంతో ఆ రెండు దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రరూపు దాలుస్తున్నాయి. పరిస్థితి ఏ క్షణమైనా అదుపు తప్పేలా కనిపిస్తోంది. అయితే ఇంటర్నెట్ పడకేయడం, ఫోన్ లైన్లు కూడా మూగబోవడంతో అక్కడ తాజా పరిస్థితి అంచనాలకు అందడం లేదు. వాస్తవ మృతుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అంతేగాక వేలాది మందిని సైన్యం, పోలీసు బలగాలు నిర్బంధంలోకి తీసుకుంటున్నట్టు వార్తలందుతున్నాయి. నిరసనకారులపై ఉక్కుపాదం మోపుతున్నారంటూ ఆందోళన వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ తాజాగా ఘాటు హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడికి దిగే దుస్సాహసం చేస్తే అగ్ర రాజ్యం, దానితో పాటు ఇజ్రాయెల్ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ ఖలిబాఫ్ ఆదివారం పేర్కొన్నారు. నిండు పార్లమెంటులోనే ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు.

నిరసనల వెల్లువ!

ఇరాన్‌లో జనాగ్రహం, నిరసనల వెల్లువ కొనసాగుతూనే ఉన్నాయి. టెహ్రాన్‌తో పాటు రెండో అతి పెద్ద నగరం మషాద్‌లోనూ ప్రజలు వీధుల్లోకి పోటెత్తుతున్నారు. రాత్రుళ్లు సెల్‌ఫోన్ లైట్లు వెలిగించి మరీ నిరసన తెలుపుతున్నారు. నినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఇందుకు సంబంధించిన శాటిలైట్ ఫుటేజీ ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. వీధుల నిండా పోలీసు, సైనిక సిబ్బంది పహారా, డ్రోన్ల నిఘా పెరిగినట్టు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడిస్తున్నాయి. మషాద్‌లో పలుచోట్ల పోలీసులు, భద్రతా దళాలతో జనం ఘర్షణలకు దిగుతున్నారు. వీధుల నిండా తగలబడ్డ సామాన్లు తదితరాలు కనిపిస్తున్నాయి. కెర్మన్ తదితర నగరాలు నిరసనలతో అట్టుడుకుతున్నాయి. వాటిని మరింత తీవ్రతరం చేయాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ ప్రవాసంలో ఉన్న ఇరాన్ రాకుమారుడు రెజా పహ్లవీ ఒక వీడియో విడుదల చేశారు. ప్రభుత్వ టీవీలో మాత్రం ఖోమ్, ఖాజ్విన్ తదితర నగరాల్లో జరుగుతున్న ప్రభుత్వ అనుకూల నిరసనల దృశ్యాలను చూపిస్తున్నారు.

నిరసనలపై ఉక్కుపాదమే

ఇరాన్ పార్లమెంటు కార్యకలాపాలను ప్రభుత్వ టీవీ చానల్ ఆదివారం ప్రత్యక్ష ప్రసారం చేసింది. నిరసనలను అదుపు చేయడంలో అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారంటూ పోలీసులు, రివల్యూషనరీ గార్డ్ సిబ్బందిని స్పీకర్ ఖలిబాఫ్ ప్రస్తుతించారు. నిరసనల్లో అరెస్టయిన వారి విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. అమెరికా గనక ఇరాన్‌పై దాడికి దిగితే ఈ ప్రాంతంలోని ఆ దేశ సైనిక స్థావరాలు, యుద్ధ నౌకలు తదితరాలన్నింటినీ లక్ష్యంగా చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

538 మందికి పైగా బలి !

రెండు వారాలకు పైగా ఇరాన్‌లో సాగుతున్న ఆందోళనల్లో మరణించిన వారి సంఖ్య 538కు పెరిగినట్టు అమెరికాకు చెందిన మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ 'యాక్టివిటీ'పేర్కొంది. దేశవ్యాప్తంగా 10,670 మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. శవాలతో నిండిన పికప్ ట్రక్కు విజువల్స్ టీవీల్లో ప్రసారమయ్యాయి. ఇరాన్‌లో పలు నగరాల్లో ఆస్పత్రుల్లో శవాలు గుట్టలుగా పేరుకుంటున్నట్టు మానవ హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. ఉత్తర ఇరాన్‌లో రస్త్ పట్టణంలోని పోర్సినా ఆస్పత్రికి ఒక్క శుక్రవారం రాత్రే ఏకంగా 70కి పైగా శవాలు వచ్చినట్టు సమాచారం. టెహ్రాన్‌లో ఒక ఆస్పత్రికి తాజాగా 38 శవాలు వచ్చినట్టు అక్కడి మెడిక్ చెప్పారు. 'చాలావరకు నేరుగా తలలో ఛాతీలో కాల్చి చంపారు. అంతేకాదు, చాలామంది యువకులు తూటా గాయాలతో వచి ఆస్పత్రిలో చేరుతున్నారు' అని ఆయన వివరించారు. అయితే ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో 30 మందిని, కెర్మన్‌షాలో ఆరుగురు పోలీసులను నిరసనకారులు చంపారని ప్రభుత్వం పేర్కొంది. మషాద్‌లో మసీదుకు నిప్పు పెట్టారని ప్రభుత్వం పేర్కొంది. నిరసనకారులు క్రూరంగా వ్యవహరిస్తున్నారని పోలీసులు అన్నారు. ''ఐసిస్ తరహాలో పోలీసు, భద్రతా సిబ్బందిని హతమారుస్తున్నారు. సజీవంగా తగలబెడుతున్నారు'' అని మండిపడుతున్నారు.

బలహీనంగా ఇరాన్

అమెరికాకు హెచ్చరికలు జారీ చేస్తున్నా, ఇరాన్ ఇప్పటికిప్పుడు భారీ స్థాయిలో దాడులకు దిగే స్థితిలో ఉందా అని విశ్లేషకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత జూన్‌లో ఇజ్రాయెల్‌తో జరిగిన 12 రోజుల యుద్ధంలో ఆ దేశ వైమానిక సంపత్తి చాలావరకు ధ్వంసం కావడం తెలిసిందే. అంతేగాక ఇజ్రాయెల్‌కు మద్దతుగా రంగంలోకి దిగిన అమెరికా ఇరాన్ అణు స్థావరాలను భారీ బాంబులతో ధ్వంసం చేసేసింది. ఈ నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్‌పై దాడులకు దిగే దుస్సాహసం ఇరాన్ సుప్రీం లీడర్ 87 ఏళ్ల అయతొల్లా అలీ ఖమేనీ చేస్తారా అన్నది చూడాల్సిందే. ఈ నేపథ్యంలో ఇరాన్‌లో పరిణామాలను ఇజ్రాయెల్ అత్యంత నిశితంగా గమనిస్తోంది. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆదివారం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో పలు అంశాలపై ఫోన్లో సుదీర్ఘంగా మాట్లాడారు.

ఇరాన్ నిరసనలకు మద్దతుగా జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ర్యాలీ

యూఎస్, ఇజ్రాయెలే ఎగదోస్తున్నాయి: పెజెష్కియాన్

ఇరాన్‌ను అస్థిర పరిచేందుకు అమెరికా, ఇజ్రాయెల్ కుట్ర చేస్తున్నాయని అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆరోపించారు. తమ దేశంలో అవి పనిగట్టుకొని నిరసనలను ఎగదోస్తున్నాయని దుయ్యబట్టారు. అయితే నిరసనకారుల ఆవేదనను సహానుభూతితో ఆలకిస్తామని ప్రకటించారు. ''ప్రజలకు చాలా విషయంలో అనుమానాలు, ఆందోళనలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు వారితో చర్చించడం అవసరం''అని చెప్పుకొచ్చారు. కాకపోతే అల్లర్ల పట్ల అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. విధ్వంసకారులు మొత్తం సమాజాన్నే సర్వనాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారంటూ మండిపడ్డారు. ఈ మేరకు ఆయన చేసిన ప్రసంగాన్ని ప్రభుత్వ టీవీ ఆదివారం ప్రసారం చేసింది. అయితే ఇరాన్‌పై సైనిక దాడి విషయంలో ఉన్నతాధికారులు తాజాగా ట్రంప్‌కు పలు ఆప్షన్లు సూచించారని తెలుస్తోంది. వాటిపై ఆయన తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని వైట్‌హౌస్ వర్గాలు చెబుతుండటం విశేషం.

సిరియాపై అమెరికా భారీ దాడులు

వాషింగ్టన్: సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాద సంస్థపై అమెరికా తాజాగా మరోసారి భారీ దాడులకు దిగింది. దేశవ్యాప్తంగా పలుచోట్ల ఉన్న ఐసిస్ స్థావరాలపై ఆదివారం తెల్లవారుజామున బాంబులు, క్షిపణి దాడులతో విరుచుకుపడింది. జోర్డాన్‌తో పాటు పలు అమెరికా మిత్ర దేశాలు ఈ దాడుల్లో పాల్గొన్నాయి. గత నెలలో సిరియాలోని పామీరా వద్ద ఇద్దరు అమెరికా సైనికులు, ఒక పౌరున్ని ఐసిస్ పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా గత డిసెంబర్ 19న సిరియాపై అమెరికా భారీ ఎత్తున దాడులకు దిగింది. దేశవ్యాప్తంగా ఏకంగా 70 చోట్ల ఐసిస్ లక్ష్యాలను ధ్వంసం చేసింది. ఇప్పుడు ఆదివారం రెండో దఫా దాడులకు శ్రీకారం చుట్టింది. ''మా సందేశం సుస్పష్టం. మా సైనిక వీరుల జోలికి వస్తే ప్రపంచంలో మీరు ఏ మూలన దాక్కున్నా వెదికి పట్టుకుని మరీ మట్టుబెడతాం'' అని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్చరించింది.

ఆలస్యం కాకముందే మేల్కోండి

- చమురు కావాలంటే మాతో ఒప్పందం చేసుకోండి
- క్యూబాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: వెనెజువెలా నుంచి చమురు కానీ, నిధులు కానీ కావాలంటే తమతో త్వరగా ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ క్యూబాకు తేల్చిచెప్పారు. వెనెజువెలా చమురుకు అతిపెద్ద వినియోగదారు క్యూబా. వెనెజువెలాలో నికోలస్ మదురో ప్రభుత్వాన్ని ట్రంప్ సైన్యం కూలదోసిన సంగతి తెలిసిందే. డెల్సీ రోడ్రిగ్స్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం కొలువుదీరింది. వెనెజువెలాలోని అపారమైన చమురు నిల్వలపై ఆధిపత్యం అమెరికా చేతుల్లోకి వచ్చింది. ఇకపై తమతో ఒప్పందం చేసుకుంటే తప్ప చమురు దక్కదని క్యూబాకు ట్రంప్ స్పష్టంచేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఆలస్యం కాకముందే మేల్కోవాలని, ఒప్పందానికి సిద్ధం కావాలని పేర్కొన్నారు. వెనెజువెలా నుంచి వస్తున్న చమురు, డబ్బుతోనే క్యూబా మనుగడ సాగిస్తోందని పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం గనుక చేసుకోకపోతే అవన్నీ ఆగిపోతాయని క్యూబాను ట్రంప్ హెచ్చరించారు. అయితే, ట్రంప్ హెచ్చరికపై క్యూబా స్పందన ఏమిటన్నది ఇంకా తెలియరాలేదు. క్యూబా లొంగిపోయే అవకాశం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు క్యూబా ఆర్థిక పరిస్థితి నానాటికీ దిగజారుతోంది. వెనెజువెలా నుంచి చమురు, నిధులు రాకపోతే పూర్తిగా కుప్పకూలడం తథ్యం. ఈ నేపథ్యంలో అమెరికాతో డీల్‌కు సిద్ధపడుతుందా? లేదా? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా ట్రంప్ విదేశాంగ మంత్రి రూబియో సామర్థ్యాన్ని కొనియాడుతూనే.. ఆయన భవిష్యత్తులో క్యూబాకు అధ్యక్షుడయ్యే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు. రూబియో తల్లిదండ్రులు 1950వ దశకంలో క్యూబాలోని బాటిస్టా నియంతృత్వ పాలన నుంచి తప్పించుకుని అమెరికాకు వలస వచ్చిన వారు కావడం గమనార్హం. కాగా, ట్రంప్ వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీశాయి. ఒక పక్క సరదాగా చేసిన వ్యాఖ్యలని కొందరు అంటుంటే, క్యూబా పట్ల ట్రంప్ ప్రభుత్వ కఠిన వైఖరికి ఇది సంకేతమని మరికొందరు విశ్లేషిస్తున్నారు.

స్వార్థం కోసం మౌలిక వసతులను అడ్డుకోవద్దు

- గౌహతి బార్ అసోసియేషన్ వివాదంపై సీజేఐ వ్యాఖ్య
- ఇంటిగ్రేటెడ్ కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేసిన జస్టిస్ సూర్యకాంత్

గౌహతి: అస్సాంలోని గౌహతిలో ఏర్పాటు చేయ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ జ్యుడీషియల్ కోర్ట్ కాంప్లెక్స్‌ను గౌహతి హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు వ్యతిరేకించడం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) సూర్యకాంత్ విస్మయం వ్యక్తం చేశారు. ఈ కోర్ట్ కాంప్లెక్స్‌కు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ..మౌలిక సదుపాయాల కల్పనను వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నప్పుడు, అది అందరికీ మేలు చేస్తుందని, కేవలం కొందరి సౌలభ్యం కోసం ఆధునీకరణను ఆపకూడదని అభిప్రాయపడ్డారు. వాస్తవాలు తెలియకనే కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తాను భావిస్తున్నానన్నారు. గౌహతిలోని రంగమహల్‌లో రూపుదిద్దుకునే ఈ సముదాయం భవిష్యత్తు ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఇందులో అత్యాధునిక సాంకేతికత, ఈ–కోర్టులు, లాయర్లు, కక్షిదారుల కోసం మెరుగైన వసతులు ఉంటాయని తెలిపారు. దేశ అత్యున్నత న్యాయాధికారిగా, ఈ వృత్తిలోకి కొత్తగా వస్తున్న యువ న్యాయవాదుల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత తనపై ఉందని జస్టిస్ సూర్య కాంత్ నొక్కి చెప్పారు. యువ లాయర్లు సమర్థంగా పనిచేయడానికి మెరుగైన లైబ్రరీలు, ఇంటర్నెట్ సదుపాయం, అనుకూల వాతావరణం కల్పించడం ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతోపాటు సీఎం హిమంత బిశ్వ శర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. గౌహతి నగరం నడిబొడ్డున ఉన్న హైకోర్టును 25 కిలోమీటర్ల దూరంలోని మరో ప్రాంతానికి తరలించడాన్ని బార్ కౌన్సిల్ వ్యతిరేకిస్తోంది.

కోర్టు సముదాయం ప్లాన్‌ను సీజేఐకి వివరిస్తున్న సీఎం శర్మ

కాంప్లెక్స్ ప్రత్యేకతలు

అస్సాంలోని గౌహతి ఉత్తర ప్రాంత కామ్‌రూప్ జిల్లాలో 49 ఎకరాల విస్తీర్ణంలో మొదటి దశలో రూ.479 కోట్ల ఈ సముదాయం ఏర్పాటు కానుంది. ఇందులో, గౌహతి హైకోర్టుతోపాటు జిల్లా కోర్టు భవనాలు, హైకోర్టు కార్యాలయం, బార్ అసోసియేషన్ భవనం ఉంటాయి. గౌహతి హైకోర్టు అస్సాంతోపాటు అరుణాచల్ ప్రదేశ్, మిజోరం, నాగాల్యాండ్‌లకు కూడా హైకోర్టుగా పనిచేస్తుంది. ఈ సముదాయంలో 900 వరకు కార్లు, 400 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ వసతి ఉంది. సముదాయంలోని అన్ని భవనాలను కలుపుతూ వంతెనలు, అత్యాధునిక భద్రతా వ్యవస్థ, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ సురక్షితంగా ఉండేలా డిజైన్ చేశారు.

Red blood cells carry oxygen using haemoglobin

Life Processes - Transportation

Transportation is a vital life process that ensures the movement of essential materials within the body of plants and animals. In human beings, the circulatory system-consisting of the heart, blood, and blood vessels-transports oxygen, nutrients, hormones, and waste products. The heart works as a muscular pump, pushing blood through arteries, veins, and capillaries. Red blood cells carry oxygen using haemoglobin, while plasma transports nutrients and dissolved substances. White blood cells defend the body against infections, and platelets help in blood clotting.

In plants, transportation occurs through xylem and phloem. Xylem carries water and minerals from roots to leaves, while phloem transports prepared food from leaves to other parts of the plant through translocation. Processes like transpiration pull help in the upward movement of water.

Thus, transportation systems maintain balance, remove wastes, and supply all parts of the organism with required materials-making them essential for survival and proper functioning of life processes.

1 MARK QUESTIONS

1. **The xylem is responsible for .... in plants**
   a) transport of water
   b) transport of food
   c) transport of Amino Acids
   d) Transport of oxygen (a-transport of water)
2. **What is the instrument used by doctors for measuring B.P.?**
   Sphygmomanometer
3. **What is plasma.**
   Plasma: The liquid part of blood that carries cells and nutrients
4. **What will happen if the platelets are not present in the blood?**
   Blood cannot clot properly and bleeding continues
5. **Assess the importance of hemoglobin in respiration.**
   Binds oxygen in lungs and releases it in tissues; without it, cells would starve.
6. **Name the vein which brings blood to left atrium from lungs?**
   Pulmonary vein carries oxygenated blood from lungs to left atrium of heart
7. **Why is transport of materials essential in animals and plants?**
   To carry nutrients, gases, waste to/from cells for proper functioning
8. **What will happen, if the B.P. greater than normal B.P.?**
   People who have high B.P. during resting period are said to have hypertension

2 MARKS QUESTIONS

1. **What does 120/80 indicate?**
   The numbers 120/80 represent normal blood pressure.
   120 → Systolic pressure (Pressure in the arteries when the heart beats.)
   80 → Diastolic pressure (Pressure in the arteries when the heart rests between beats.)
2. **Diffusion is insufficient to meet the oxygen requirement of multicellular organisms like human. State reason.**
   1. Due to the higher metabolic rate of humans, the demand for oxygen is very high.
   2. Moreover, the human body is so large that oxygen cannot diffuse into all cells quickly, as it would have to travel long distances to reach each and every cell.
   3. So, diffusion is insufficient to meet the oxygen demand of multicellular organisms
3. **Blood circulation in fishes is different from the blood circulation in human beings". Justify the statement.**
   1. Fishes have only two chambers in their heart, the blood is pumped to the gills to get oxygenated blood and from there it passes directly to rest of the body.
   2. Thus, the blood goes only once through the heart during one cycle of passage through the body. This type of circulation is termed as single circulation.
4. **What are the differences between Lymph and blood?**

Blood	Lymph
It is red in colour.	It is colourless.
It has RBCs, WBCs, and platelets.	It has only WBCs (no RBCs).
It flows in a circle (to and from heart).	It flows in one direction (only toward heart).
It carries Oxygen and nutrients.	It fights germs and carries fats.

5. **What questions would you like to pose, if you get a chance to meet a cardiologist?**
   1. How can I keep my heart healthy?
   2. What are the early signs of heart disease?
   3. How much exercise is good for the heart?
   4. Which foods are best for heart health?
   5. How can I reduce high blood pressure?
6. **What are the differences between single and double circulatory system?**

Single Circulation	Double Circulation
1 If the blood flows through heart only once for completing one circulation it is called Single Circulation.	1 If the blood flows through the heart twice for completing one circulation it is called Double Circulation.
2 Ex. Fishes	2 Ex. Amphibians, Reptiles, Aves and Mammals.

7. **Valves are absent in arteries but present in veins, why?**
   Valves are the structures in veins which allow blood to flow only in one direction, i.e. from body parts to heart.
   If there are no valves in vein then the blood from body parts cannot flow to heart.
   Blood remains in lower regions of our body and cause swelling, inflammation and blood clotting.
   Blood clotting leads to varicose veins and spider veins
8. **How root pressure is useful to the plant?**
   1. As there are vast number of root hairs involved, a pressure in the xylem vessels develops. This pressure known as 'Root Pressure'.
   2. The Root Pressure forces the water upwards.
   3. Root Pressure is not the main cause of movement of water in xylem, but it is certainly one of the factor.
9. **What questions do you ask doctor about blood clotting?**
   1. How blood clotting occurs?
   2. What is blood clotting?
   3. Which are required for Blood Clotting?
   4. What happen if there is no clotting of Blood?
10. **What questions do you ask doctor about Hypertension?**
    1. What is hypertension?
    2. What are the reasons for hypertension?
    3. What precautions you follow to prevent the hypertension?
    4. How does hypertension occur?
11. **Suggest some precautions to keep our heart healthy?**
    1. Eating healthy diet. (Balance diet)
    2. Avoid smoking and usage of tobacco products.
    3. Maintaining a healthy weight.
    4. Getting enough quality sleep
12. **Explain the process of coagulation of blood?**
    1. In a normal person, blood clots within 3-6 minutes after an injury.
    2. Blood clotting involves a series of reactions.
    3. When the blood flows out, our blood platelets release an enzyme called 'Thrombokinase'.
    4. Thrombokinase acts on 'Prothrombin' and converts it into 'Thrombin'.
    5. Thrombin converts 'Fibrinogen' into 'Fibrin' and finally blood cells get entangled and blood gets clotted.

FOUR MARKS

1. **Read the paragraph carefully and answer the following questions?**
   Blood pressure is measured with an instrument called sphygmomanometer. High blood pressure is also called hypertension. The force that blood exerts against the wall of a vessel is called blood pressure. This pressure is much greater in arteries than in veins. The normal systolic pressure is about 120 mm of Hg and diastolic pressure is 80 mm of Hg.
   1. **Which blood vessels have more pressure?**
      Arteries
   2. **What is normal blood pressure in humans?**
      120/80 mm of Hg
   3. **Name the instrument that measures the blood pressure?**
      Sphygmomanometer
   4. **What is the cause of hypertension?**
      Due to constriction of arterioles
2. **Write three types of blood vessels. Give one important feature of each?**
   (i) The three types of blood vessels in human body are: (i) arteries, (ii) veins and (iii) capillaries.
   (ii) Arteries are the blood vessels which carry blood

Continued on next page..

from heart to various parts of the body. The walls of arteries are thick, elastic.

(iii) Veins are thin-walled blood vessels which bring blood from the body back to the heart. They are larger and hold more blood than the arteries.

(iv) Capillaries are thin walled and extremely narrow blood vessels which occur at the terminals of artery and vein.

3. What would be the consequences due to deficiency of Hemoglobin in our blood?

Consequences of Hemoglobin Deficiency

1.Less oxygen reaches body cells, because hemoglobin carries oxygen.

2.Tiredness and weakness, as cells do not get enough energy.

3.Shortness of breath, even during small activities.

4.Pale skin and pale lips, due to low red blood count.

5.Dizziness or fainting, because the brain gets less oxygen.

6. Faster heartbeat, as the heart tries to pump more blood to supply oxygen.

4. How is food transported in plants?

1. Food is prepared in the leaves by photosynthesis in the form of glucose.
2. This glucose is converted into sucrose, because sucrose is easier to transport through plant tissues.
3. The transport of food takes place through a special tissue called phloem, which contains sieve tubes, companion cells, phloem fibers, and phloem parenchyma.
4. Food is loaded into the phloem by using energy (ATP)supplied by the companion cells.
5. Once loaded, food moves through the sieve tubes from the leaves to other parts of the plant.
6. This movement of food in phloem is called translocation and it can occur in both directions upwards and downwards.

5. What forms the transport system in highly organized plants?

1. In highly organized plants, there are two different types of conducting tissues known as xylem and phloem.
2. These permanent complex tissues are made up of both living cells and non-living cells. They play a central role in the plant's transport system
3. Xylem conducts water and minerals obtained from the soil (via roots) to different parts of the plant body
4. Phloem transports food materials from the leaves to different parts of the plant body. They translocate food to various parts of the plant

6. Write the Differences Between Xylem and Phloem

Xylem	Phloem
It transports water and minerals from roots to leaves.	It transports prepared food (glucose) from leaves to other parts.
The flow is unidirectional (only upwards).	The flow is bidirectional (both upwards and downwards).
Most cells are dead (except xylem parenchyma).	Most cells are living (except phloem fibres).
It is located in the centre of the plant stem.	It is located on the outer side of the plant stem.

7. How are oxygen and CO_2 transported in Human beings?

Transport of Oxygen

1. Oxygen enters the blood in the lungs.
2. It combines with haemoglobin in RBCs.
3. Blood carries oxygen to all body cells.

Transport of Carbon dioxide

1. CO_2 from cells enters the blood.
2. Most of it is carried in the plasma.
3. Blood brings CO_2 back to the lungs to be exhaled

8. What is hypertension? What are the effect and precautions of Hypertension?

Ans. 1. The normal blood pressure of our body is 120/80 mm/Hg.

2. If the blood pressure increases more than 120/80 mm/Hg then it is called Hypertension (or) High B.P.

3. Effects of Hypertension: The person who suffering from hypertension easily gets angry, feel tired, worried and faint some time also.

4. Precautions for Hypertension:
   - Reduce salt in regular diet.
   - Eating a healthy balanced diet.
   - Avoid smoking.
   - Exercise regularly.

9. Explain how the plants absorb the water from soil?

1. Every living cell acts as an osmotic system, the cytoplasm lining of the cell wall acts the semipermeable membrane.

2 The water molecular concentration in the soil is less and it is more in root hair.

3 Therefore water will pass into the vacuole of the root hair by osmosis.

4 The entry of water dilutes the contents of the root hair vacuole.

5 So that it becomes more dilute than its neighboring cell.

6 Then water passes into the neighboring cell which in turn becomes diluted.

7 Finally water enters the xylem vessels.

EIGHT MARKS

1. Give reasons:

(a) Ventricles have thicker muscular walls than atria.

(b) Transport system in plants is slow.

(c) Circulation of blood in aquatic vertebrates differs from that in terrestrial vertebrates.

(d) During the daytime, water and minerals travel faster through xylem as compared to the night.

(e) Veins have valves whereas arteries do not.

(a) Since ventricles have to pump blood into various organs with high pressure, they have thicker walls than atria.

(b) Transport system in plants is less elaborate than in animals, as plants are less active, so their cells do not need to be supplied with materials so quickly.

(c) The aquatic vertebrates like fish have gills to oxygenate blood. The flow of blood in a fish is single circulation because the blood passes through the heart only once in one complete cycle of body. The terrestrial vertebrates like birds and humans have double circulation as the blood travels heart twice in one complete cycle of blood and they have lungs for oxygenation of blood.

(d) It is because during daytime rate of transpiration is higher.

(e) The lumen of veins have valves, which allow the blood in them to flow in only one direction. Thus prevent back flow of blood.

2. (a) Mention any two components of blood.

(b) Trace the movement of oxygenated blood in the body.

(c) Write the function of valves present in between atria and ventricles.

(d) Write one structural difference between the composition of artery and veins.

a) Two components of blood are blood plasma and blood corpuscles.

(b) Deoxygenated blood gets oxygenated in the lungs, from there it moves to heart and pumped to different parts of the body. Its path can be traced out as

Lungs → Pulmonary veins → Left atrium of heart → Aorta → Arteries → Body parts

(c) When blood is pumped, valves prevent back flow of blood between ventricles and atria. They open and allow the right amount of blood to flow from one chamber to the other.

(d) Structural difference between veins and arteries is as follows:

Veins: Veins have thin, less elastic and less muscular walls. They have valves to prevent back flow of blood.

Arteries: Arteries have thick, elastic and muscular walls with no valves

3. Write the differences between Arteries and Veins

Arteries	Veins
1. Walls of arteries are thick.	1. Walls of veins are thin.
2. Valves are absent.	2. Valves are present.
3. Carry blood from the heart to body organs.	3. Carry blood from body organs to the heart.
4. All arteries carry oxygenated blood except pulmonary artery.	4. All veins carry deoxygenated blood except pulmonary vein.
5. Arteries can retain shape when blood is absent.	5. Veins can't retain their shape when blood is absent.
6. Blood pressure is high in arteries.	6. Blood pressure is low in veins.
7. Arteries end with capillaries.	7. Veins start with blood capillaries.
8. Arteries are reddish in colour.	8. Veins are bluish in colour.
9. Arteries have small lumen.	9. Veins have large lumen.

P. Neelakantaiah
ZPHS Karakambadi,
Tirupati Dist.

Daily Quiz 12

సమాధానాలు రాయడానికి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. Which of the following components of blood is responsible for the transport of oxygen to the tissues?
A. Plasma B. Platelets
C. Red Blood Cells D. White Blood Cells

2. Which blood vessel carries deoxygenated blood from the heart to the lungs?
A. Pulmonary artery B. Pulmonary vein
C. Aorta D. Vena cava

3. The normal blood pressure of a healthy human being is generally measured as:
A. 140/90 mm Hg
B. 100/60 mm Hg
C. 120/80 mm Hg
D. 80/120 mm Hg

4. Which of the following helps in the clotting of blood at the site of an injury?
A. Hemoglobin B. Platelets
C. Lymph D. Serum

5. Plants transport water and minerals from the roots to the leaves through which specialized tissue?
A. Phloem B. Parenchyma
C. Xylem D. Collenchyma

పంత్‌కు గాయం... జురేల్‌కు స్థానం

వడోదర: డాషింగ్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ గాయపడటంతో అతని స్థానంలో ధ్రువ్ జురేల్‌ను తీసుకున్నారు. ప్రస్తుతం న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. తొలి వన్డేకు ముందు శనివారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా పంత్ పక్కటెముకలకు గాయమైంది. 'ఉన్నపళంగా అతను తీవ్రమైన నొప్పితో విలవిలలాడటంతో వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి ఎంఆర్ఐ స్కానింగ్ చేయించాం. పంత్ కుడివైపు పక్కటెముకలకు గాయమైనట్లు తేలింది. దీంతో సిరీస్ మొత్తానికి అతను దూరమయ్యాడు. బోర్డు వైద్య బృందం అతని ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తోంది' అని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. పంత్ స్థానాన్ని ఫామ్‌లో ఉన్న ధ్రువ్ జురేల్‌తో భర్తీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే వన్డే ట్రోఫీలో జురేల్ విశేషంగా రాణిస్తున్నాడు. ఏడు ఇన్నింగ్స్‌ల్లో 2 శతకాలు, 4 అర్ధసెంచరీలు బాదాడు. ఇప్పటికే జట్టుకు కేఎల్ రాహుల్ రూపంలో స్పెషలిస్టు వికెట్ కీపర్–బ్యాటర్ అందుబాటులో ఉండటంతో జురేల్‌ను రిజర్వ్‌గా తీసుకున్నారు. ఆదివారం మ్యాచ్‌కు ముందే అతను వడోదరలో జట్టుతో కలిశాడు.

సూపర్ సోఫీ

- 42 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 95
- చివరి ఓవర్లో 2 వికెట్లు
- గుజరాత్ జెయింట్స్‌ను గెలిపించిన కివీస్ క్రికెటర్
- నందిని శర్మ 'హ్యాట్రిక్' వృథా
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు రెండో ఓటమి

సోఫీ

ముంబై: ఆధిక్యం చేతులు మారుతూ సాగిన మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను విజయం వరించింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా ఆదివారం పరుగుల వరద పారిన పోరులో గుజరాత్ 4 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. మొదట గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 209 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', న్యూజిలాండ్ స్టార్ ప్లేయర్ సోఫీ డివైన్ (42 బంతుల్లో 95; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగి త్రుటిలో సెంచరీ చేజార్చుకోగా... కెప్టెన్ ఆష్లే గార్డ్‌నర్ (26 బంతుల్లో 49; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా దంచికొట్టింది. ఢిల్లీ బౌలర్లలో నందిని శర్మ (5/33) 'హ్యాట్రిక్'తో సహా 5 వికెట్లు పడగొట్టగా... తెలుగమ్మాయి నల్లపురెడ్డి శ్రీచరణి (2/42), చినెల్లి హెన్రీ (2/43) చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులకు పరిమితమై వరుసగా రెండో ఓటమి చవిచూసింది. లిజెల్లి లీ (54 బంతుల్లో 86; 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), లారా వోల్వార్ట్ (38 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆరంభంలో లిజెల్లి చెలరేగిపోగా... విజయానికి 24 బంతుల్లో 60 పరుగులు అవసరమైన దశలో వోల్వార్ట్ కదంతొక్కింది. వోల్వార్ట్ 17వ ఓవర్‌లో 2 ఫోర్లు... 18వ ఓవర్‌లో 4, 4, 4, 6 కొట్టింది. దీంతో సమీకరణం 12 బంతుల్లో 29కి చేరింది. 19వ ఓవర్‌లో వోల్వార్ట్ 6, 4, జెమీమా ఫోర్‌తో 22 పరుగులు వచ్చాయి. చివరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 7 పరుగులు అవసరం కాగా... 2 పరుగులే ఇచ్చిన సోఫీ డివైన్ 2 వికెట్లు తీసి గుజరాత్‌కు వరుసగా రెండో విజయం కట్టబెట్టింది.

ఒకే ఓవర్‌లో 4,4,6,6,6,6

గుజరాత్ ఇన్నింగ్స్ ఆరో ఓవర్‌లో సోఫీ డివైన్ విజృంభించింది. స్నేహ్ రాణా వేసిన ఆ ఓవర్ తొలి రెండు బంతులకు ఫోర్లు బాదిన డివైన్... ఆ తర్వాత వరుసగా నాలుగు సిక్స్‌లు కొట్టింది. దీంతో ఒక్క ఓవర్‌లోనే 32 పరుగులు వచ్చాయి. డబ్ల్యూపీఎల్ చరిత్రలో ఒకే ఓవర్‌లో లభించిన అత్యధిక పరుగులు ఇవే. క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన డివైన్... శ్రీచరణి ఓవర్‌లో సైతం మూడు సిక్స్‌లు బాదింది. మరో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో సెంచరీకి ఐదు పరుగుల దూరంలో అవుటైంది.

నందిని 'హ్యాట్రిక్'

నందిని

ఫుల్‌ఫామ్‌లో ఉన్న డివైన్‌ను అవుట్ చేసిన నందిని శర్మ... ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో 'హ్యాట్రిక్'తో సహా నాలుగు వికెట్లు పడగొట్టింది. రెండో బంతికి కాశ్వీ గౌతమ్ (14) అవుట్ కాగా... నాలుగో బంతికి కనిక (4) స్టంపౌటైంది. చివరి రెండు బంతులకు రాజేశ్వరి (0), రేణుక (0) క్లీన్‌బౌల్డ్ అయ్యారు. తద్వారా ఇసీ వాంగ్(2023), దీప్తి శర్మ (2024), గ్రేస్ హారిస్ (2025) తర్వాత డబ్ల్యూపీఎల్‌లో 'హ్యాట్రిక్' తీసిన నాలుగో బౌలర్‌గా నందిని నిలిచింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X యూపీ వారియర్స్
రాత్రి 7:30 గంటల నుంచి
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కోహ్లి పరుగుల బాటతో...

కోహ్లి

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ విజయం

రాణించిన గిల్, అయ్యర్ • మిచెల్, కాన్వే, నికోల్స్ అర్ధ సెంచరీలు వృథా • 14న రాజ్‌కోట్‌లో రెండో వన్డే

గిల్

అనుభవం లేని ఆటగాళ్లతో వచ్చిన న్యూజిలాండ్ అదరగొట్టింది. గెలిచేందుకు అవసరమైన లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది. కానీ ఛేదనలో మొనగాడు, 'కింగ్ కోహ్లి' కుదురుకొని ఆడటంతో పెద్ద లక్ష్యం కూడా దిగివచ్చింది. ఒకదశలో జేమీసన్ వణికించినా... 8 పరుగుల వ్యవధిలోనే కోహ్లి, జడేజా, అయ్యర్‌ల వికెట్లు కోల్పోయినా... కేఎల్ రాహుల్ చేసిన విలువైన పరుగులతో టీమిండియా తొలి వన్డేలో గెలిచింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది.

వడోదర: భారత బ్యాటింగ్ 'కింగ్' కోహ్లి మరోసారి ఛేజింగ్‌లో తన విలువ ఏంటో నిరూపించుకున్నాడు. కోహ్లి సాధికారిక ఆటతీరు కారణంగా... తొలి వన్డేలో న్యూజిలాండ్ 300 పరుగులు చేసినా ఓటమిని తప్పించుకోలేకపోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో శుబ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమిండియా నాలుగు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా, ముందుగా బ్యాటింగ్ చేపట్టిన కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 300 పరుగుల భారీస్కోరు చేసింది. డారిల్ మిచెల్ (71 బంతుల్లో 84; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవాన్ కాన్వే (67 బంతుల్లో 56; 6 ఫోర్లు, 1 సిక్స్), హెన్రీ నికోల్స్ (69 బంతుల్లో 62; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్, హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన భారత్ 49 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి (91 బంతుల్లో 93; 8 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీని చేజార్చుకోగా... గిల్ (71 బంతుల్లో 56; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), శ్రేయస్ అయ్యర్ (47 బంతుల్లో 49; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. జేమీసన్‌కు 4 వికెట్లు దక్కాయి. రెండో వన్డే 14న రాజ్‌కోట్‌లో జరుగుతుంది.

అదిరే ఆరంభం

ఓపెనర్లు కాన్వే, నికోల్స్ చూడచక్కని అర్ధసెంచరీలతో కివీస్‌కు శుభారంభమిచ్చారు. 21 ఓవర్ల వరకు భారత బౌలర్ల సహనానికి పరీక్ష పెట్టారు. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 117 పరుగులు జోడించారు. హర్షిత్ రెండో స్పెల్ 2–0–13–2తో విలువైన వికెట్లు పడగొట్టడంతో న్యూజిలాండ్ తడబడింది. 117/0 స్కోరుతో పటిష్టంగా ఉన్న న్యూజిలాండ్ 38వ ఓవర్ వచ్చేసరికి 198/5తో కష్టాల్లో పడింది. ఇలాంటి దశలో మిచెల్ మెరుపులతో కివీస్ ఇన్నింగ్స్‌ను మళ్లీ నిలబెట్టాడు.

కోహ్లి నడిపించడంతో...

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు ధాటిగా ఆడే క్రమంలో రోహిత్ శర్మ (26; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అవుటయ్యాడు. కెప్టెన్ గిల్‌కు జతయిన కోహ్లి చకచకా పరుగులు రాబట్టారు. రెండో వికెట్‌కు 118 పరుగులు జోడించాక గిల్ అవుటయ్యాడు. ఆ తర్వాత శ్రేయస్ అయ్యర్‌తో కలిసి విరాట్ జట్టు స్కోరును 200 దాటించాడు. సెంచరీకి చేరువవుతున్న దశలో కోహ్లిని జేమీసన్ అవుట్ చేశాడు. అప్పుడు భారత్ స్కోరు 234/3. ఇక చేయాల్సింది 67 పరుగులే కాగా చేతిలో 7 వికెట్లున్నాయి. కానీ జేమీసన్ ధాటికి అయ్యర్, జడేజా (4) పెవిలియన్ చేరారు. అయితే హర్షిత్ రాణా (23 బంతుల్లో 29; 2 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ (21 బంతుల్లో 29 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఒక ఓవర్ మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు.

స్కోరు వివరాలు

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (బి) రాణా 56; నికోల్స్ (సి) రాహుల్ (బి) రాణా 62; యంగ్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 12; మిచెల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) ప్రసిధ్ 84; ఫిలిప్స్ (సి) అయ్యర్ (బి) కుల్దీప్ 12; మిచెల్ హే (బి) ప్రసిధ్ 18; బ్రేస్‌వెల్ రనౌట్ 16; ఫోక్స్ (బి) సిరాజ్ 1; క్లార్క్ (నాటౌట్) 24; జేమీసన్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 300. వికెట్ల పతనం:** 1–117, 2–126, 3–146, 4–170, 5–198, 6–237, 7–239, 8–281. **బౌలింగ్:** సిరాజ్ 8–0–40–2, హర్షిత్ రాణా 10–0–65–2, సుందర్ 5–0–27–0, ప్రసిధ్ కృష్ణ 9–0–60–2, కుల్దీప్ 9–0–52–1, జడేజా 9–0–56–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 26; గిల్ (సి) ఫిలిప్స్ (బి) అశోక్ 56; కోహ్లి (సి) బ్రేస్‌వెల్ (బి) జేమీసన్ 93; శ్రేయస్ (బి) జేమీసన్ 49; జడేజా (సి) క్లార్క్ (బి) జేమీసన్ 4; రాహుల్ (నాటౌట్) 29; హర్షిత్ (సి) హే (బి) క్లార్క్ 29; సుందర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (49 ఓవర్లలో 6 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1–39, 2–157, 3–234, 4–239, 5–242, 6–279. **బౌలింగ్:** జేమీసన్ 10–1–41–4, ఫోక్స్ 10–0–49–0, ఆదిత్య అశోక్ 6–0–55–1, క్లార్క్ 10–0–73–1, బ్రేస్‌వెల్ 8–0–56–0, ఫిలిప్స్ 4–0–21–0, మిచెల్ 1–0–7–0.

2 మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లి రెండో స్థానానికి ఎగబాకాడు. 557 మ్యాచ్‌లు ఆడిన కోహ్లి 28,068 పరుగులు సాధించాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (664 మ్యాచ్‌ల్లో 34,357 పరుగులు) అగ్రస్థానంలో ఉన్నాడు. శ్రీలంక ప్లేయర్ కుమార సంగక్కర (594 మ్యాచ్‌ల్లో 28,016 పరుగులు) మూడో స్థానానికి పడిపోయాడు.

1 అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా 28 వేల పరుగులు పూర్తి చేసిన క్రికెటర్‌గా కోహ్లి ఘనత వహించాడు. సచిన్ టెండూల్కర్ (644 ఇన్నింగ్స్) పేరిట ఉన్న రికార్డును కోహ్లి (624 ఇన్నింగ్స్) బద్దలు కొట్టాడు.

45 వన్డేల్లో కోహ్లికి లభించిన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు. ఈ జాబితాలో సచిన్ (62), సనత్ జయసూర్య (48) ముందున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించాలి

రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వైవీడీ ప్రసాదరావు

మాట్లాడుతున్న వైవీడీ ప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించడంలో నెలకొన్న న్యాయపరమైన వివాదాలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వైవీడీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరు జెడ్పీ సమావేశ మందిరంలో జరిగిన సంఘ జోన్–3 విస్తృత స్థాయి సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో గ్రేడ్–3 నుంచి గ్రేడ్–2కు 153 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించారని చెప్పారు. కొంతమంది దీనిని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లడంతో పెండింగ్‌లో ఉండిపోయిందన్నారు. అప్పటి నుంచి న్యాయ వివాదాలను పరిష్కరిస్తూ వచ్చామని, కోర్టులో కేవలం నలుగురికి సంబంధించిన వివాదం పెండింగ్‌లో ఉందని, వారిని పక్కనపెట్టి మిగిలిన వారికి పదోన్నతులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రేడ్–2 నుంచి గ్రేడ్–6 వరకు 1,400 మంది ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అలాగే, జోన్–3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల్లో అన్యాయం జరిగిందని తెలిపారు. కోర్టు ఆదేశాలకు లోబడి నడుచుకుంటామని ప్రభుత్వం అఫిడవిట్ దాఖలుచేసి, పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు జాన్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు

ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

సాక్షి, అమరావతి/గాంధీనగర్(విజయవాడసెంట్రల్) : ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం మొండికేస్తే ఆందోళనలు చేపడతామని ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ స్పష్టం చేశారు. విజయవాడలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల హక్కులను సాధించడమే తమ అంతిమ లక్ష్యమని తెలిపారు. ఏడున్నర దశాబ్దాలుగా సమైక్య, విభజిత రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల సాధనే లక్ష్యంగా ఏపీ ఎన్జీఓ పనిచేస్తోందన్నారు. పీఆర్సీ, హెల్త్ కార్డుల అంశంలో తమ సంఘం లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుందన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఇతర సమస్యలను కూడా వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర కమిటీ మూడు సంవత్సరాల కాలపరిమితి ఈ నెలాఖరుకు ముగియనుండడంతో రాష్ట్ర స్థాయి ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ సంఘ ఉద్యోగులు సైతం ఏపీ ఎన్జీఓలో మమేకమయ్యారన్నారు. ఫిబ్రవరిలో రాష్ట్ర స్థాయి కార్యవర్గ ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. సంఘం ఏర్పాటు చేసి 75 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు త్వరలో వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సహాధ్యక్షుడు వి.దస్తగిరి రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ, కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వబడిని బలహీన పరుస్తున్న పాలకులు

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఆగ్రహం

ఎన్. వెంకటేశ్వర్లు

కేఎస్ఎస్ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: పాలకులు ప్రపంచ బ్యాంకు మాట విని ప్రభుత్వబడిని బలహీనపరుస్తున్నారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్.ప్రసాద్ ధ్వజమెత్తారు. ప్రజలు, తల్లిదండ్రులతో కలిసి ప్రభుత్వబడిని రక్షించుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. గుంటూరులో రెండురోజులు జరిగిన యూటీఎఫ్ రాష్ట్ర 51వ కౌన్సిల్ సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్చుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కోరారు. అదనంగా గంట పనిచేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. బోధనేతర పనులన్నీ రద్దుచేయాలని, ఉపాధ్యాయులపై మానసిక వేధింపులను ఆపాలని, పాఠశాల విద్యాశాఖ కేంద్రీకృత విధానాలను రద్దుచేయాలని, పాఠశాల విద్యాశాఖను వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు దీనికి భిన్నంగా వ్యవహరిస్తే విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడికి వెనకాడబోమని హెచ్చరించారు. సంక్రాంతిలోపు 12వ పీఆర్సీ చైర్మన్‌ను నియమించకపోతే పండుగ తరువాత ఉద్యమ కార్యాచరణ ప్రకటించటంతో పాటు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో విజయవాడకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వబడిని రక్షించుకోవడం ద్వారా సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేసుకోవడం, నైతిక విలువల్ని అభివృద్ధి చేయడం, రాజ్యాంగాన్ని రక్షించుకోవడం కర్తవ్యంగా యూటీఎఫ్ కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని ఈ కౌన్సిల్ సమావేశం తీర్మానించింది.

కార్యవర్గం ఎన్నిక: ఈ సమావేశాల్లో యూటీఎఫ్ రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నక్కా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కె.ఎస్.ఎస్.ప్రసాద్, గౌరవాధ్యక్షుడిగా కె.శ్రీనివాస్‌రావు, సహాధ్యక్షులుగా కె.సురేష్‌కుమార్, ఎ.ఎన్.కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావుతోపాటు మొత్తం 25 మంది ఆఫీస్ బేరర్స్‌ని, 120 మంది కార్యవర్గ సభ్యుల్ని, ఆడిట్ కమిటీ, ఐక్య ఉపాధ్యాయ పత్రిక, ప్రచురణల విభాగం చైర్మన్, సంక్షేమసంఘం సభ్యుల్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పురపాలక స్కూళ్లల్లో సమస్యలు పరిష్కరించాలి

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: పురపాలక పాఠశాలలు, పురపాలక ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కమిషనర్ల ఖాతాలో ఉండిపోయిన పీఎఫ్ మొత్తాన్ని కొత్త పీఎఫ్ ఖాతాలకు బదిలీ చేయాలన్నారు. పురపాలక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో స్పెషల్ టీచర్లుగా పనిచేసిన వారిని ప్రభుత్వం 2019 మార్చిలో క్రమబద్ధీకరించి, పెన్షన్ కోసం నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. అలాగే, పురపాలక పాఠశాలల్లో వీరితో పాటే స్పెషల్ టీచర్లుగా పనిచేసిన 358 మందిని క్రమబద్ధీకరించలేదని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో.. మున్సిపల్ స్పెషల్ టీచర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీఎస్పీడీసీఎల్‌కు ఐదు జాతీయ అవార్డులు

జాతీయ స్థాయి సదస్సులో అవార్డును తీసుకుంటున్న ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ అయూబ్‌ఖాన్

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)కు జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు లభించాయి. కర్ణాటకలోని బెల్గాంలో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐపీపీఏఐ) ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు, విధాన రూపకర్తల జాతీయ సదస్సు జరిగింది. ఇందులో భాగంగా థర్మల్ పవర్ జనరేషన్, గ్రీన్ హైడ్రోజన్‌కు ప్రోత్సాహం, స్మార్ట్ మీటరింగ్ అమలు, రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రోత్సాహం, ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు ప్రోత్సాహం అంశాల్లో జాతీయ స్థాయిలో ఏపీఎస్పీడీసీఎల్ అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆ సదస్సులోని పెద్దలు ఏకాభిప్రాయంతో తీర్మానించారు. ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ తరఫున సంస్థ డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్ ఈ అవార్డులను అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఏపీఎస్పీడీసీఎల్ 5 అవార్డులను సొంతం చేసుకోవడంపై సంస్థ ఉద్యోగులు సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

పలు సంస్థలకు భూముల కేటాయింపు

ఎంఎస్ఎంఈల కోసం ఏపీసీడీపీ పాలసీని విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి : షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కు కొప్పర్తిలో ఎకరం రూ.8 లక్షలు చొప్పున 466.35 ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి కాకుండా టైలర్‌మేడ్ ప్రోత్సాహకాల రూపంలో రూ.4,914 కోట్ల పెట్టుబడికి రూ.2,630.42 కోట్ల ప్రోత్సాహకాలను ఇస్తూ పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా నాయుడుపేట సెజ్‌లో రూ.6,675 కోట్లతో టాటా పవర్ ఏర్పాటు చేయనున్న 10 గిగావాట్ల ఇంగాట్, వేఫర్ తయారీ యూనిట్‌కు ఏకంగా రూ.4,002 కోట్ల విలువైన ప్రోత్సాహకాలను ఇస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఫిక్స్‌డ్ కాస్ట్ క్యాపిటల్ సబ్సిడీ కింద రూ.2,225.8 కోట్లు, రూ.830 కోట్ల విద్యుత్ సబ్సిడీ వంటి ప్రోత్సాహకాలతో పాటు అనేక మౌలిక వసతులను ప్రభుత్వమే కల్పించి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇవి కాకుండా మరికొన్ని కంపెనీలకు భూ కేటాయింపులు, ప్రోత్సాహకాలను ప్రకటిస్తూ పలు ఉత్తర్వులు జారీ చేశారు.

- విజయనగరం జిల్లా కొట్టక్కి గ్రామంలో ఎకరం రూ.12 లక్షలు చొప్పున 64.67 ఎకరాలు రాధికా వెజిటబుల్ ఆయిల్ లిమిటెడ్‌కు కేటాయింపు. రూ.240 కోట్లతో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటు.
- నాయుడు పేట సెజ్‌లో వెబ్‌సోల్‌కు ఎకరా రూ.60 లక్షలు చొప్పున 123 ఎకరాలు కేటాయింపు. రూ.3,538 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్‌కు పెట్టుబడిలో 69.09 శాతం ప్రోత్సాహకాలు ప్రకటన.
- అనకాపల్లి రాంబిల్లి సెజ్‌లో రిలయన్స్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌కు అదనంగా 10 ఎకరాలు కేటాయింపు.
- వీఎస్ఆర్ సార్కాన్ ఇండస్ట్రీస్‌కు కేటాయించిన 22.45 ఎకరాల ధరను సకాలంలో చెల్లించలేకపోయినా తొమ్మిది శాతం వడ్డీతో ఆలస్యంగా చెల్లించడానికి అనుమతి.
- స్టార్టప్ కంపెనీ ఎథేరియల్‌కు రౌతు సురమాల వద్ద ఎకరం రూ.5 లక్షలు చొప్పున 149.29 ఎకరాలు కేటాయింపు.
- డోక్సో ఇండియా విస్తరణ కోసం మార్కెట్ సేకరణ ధరకు 50 ఎకరాలు కేటాయించడానికి అనుమతి.
- రామ్‌కో సిమెంట్స్ నంద్యాల జిల్లాలో రూ.1,500 కోట్లతో ఏర్పాటు చేయనున్న సిమెంట్, క్లింకర్ యూనిట్‌కు పెట్టుబడిలో 43.40 శాతం (రూ.651 కోట్లు) రాయితీలు ఇస్తూ ఉత్తర్వులు.
- రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ క్లస్టర్స్ అభివృద్ధి కోసం ఏపీ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పాలసీ విడుదల.

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే భూసేకరణ

- రెండో దశ భూసేకరణ రాజధాని కోసం కాదు..
- అంతా వ్యాపారం... రియల్ ఎస్టేట్ బూమ్ కోసమే..
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

సాక్షి, అమరావతి: రాజధాని అభివృద్ధి పేరుతో చంద్రబాబు రెండో దశలో చేస్తున్న భూసేకరణ అంతా వ్యాపారం, రియల్ ఎస్టేట్ బూమ్ కోసమేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఆయన ఆదివారం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. రాజధానిలో పరిపాలనా కేంద్రం నిర్మాణానికి అవసరమైన భూమిని తీసుకుంటే అభ్యంతరం ఉండదని, అందుకు విరుద్ధంగా భూసేకరణ పేరుతో వ్యాపారం చేయడం సరికాదని రాఘవులు అన్నారు. రెండో దశలో భూసేకరణ చేస్తున్నది రాజధాని అవసరాల కోసం కాదని, అంతా రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని పెంచడం కోసమేనని చెప్పారు. రెండో దశ భూసేకరణను తాము వ్యతిరేకిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజల ఉపాధికి తీవ్ర నష్టం కలిగించే వీజీ జీ రాంజీ పథకాన్ని ప్రధాని మోదీ మెప్పు కోసం చంద్రబాబు ఆమోదించడం, ఇది గొప్పచట్టమని చెప్పడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. తమిళనాడులో పార్టీ పెట్టిన హీరో విజయ్‌ను సెన్సార్ బోర్డు సభ్యుడిని అడ్డం పెట్టుకుని బీజేపీ బెదిరిస్తోందని ఆరోపించారు. విజయ్ రాజకీయ ఒత్తిళ్లకు లొంగి బీజేపీకి సహాయపడకుండా లౌకిక పార్టీలతో కలిసి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే వ్యాఖ్యలు చేస్తున్నా... ప్రధాని మోదీ నోరెత్తకపోవడం సిగ్గుచేటని అన్నారు. ట్రంప్ శాంతికి ప్రతినిధి కాదని, ఆయనకు నోబెల్ కాదని, 'బిగ్ బుల్లీ ప్రైజ్' ఉంటే ఇవ్వాలని రాఘవులు ఎద్దేవా చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హక్కులు, పోరాటాలు అంటూ నీతులు చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు పౌరహక్కులను హరిస్తున్నారని, ప్రశ్నించినవారిపై పీడీ యాక్ట్ కింద అక్రమ కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారని విమర్శించారు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

గతవారం (5-1-26 నుంచి 9-1-26 వరకు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
2,186	645
83,576	25,683

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,671	▲	191
డోజోన్స్	49,504	▲	238
ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,125	▲	80
డాక్స్	25,262	▲	134
షాంఘై	4,120	▲	37
నికాయ్	51,940	▲	823

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.60	117.56
€	యూరో	ఎస్‌బీఐ	96.38	99.09
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.43	59.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.84	57.06
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.11	68.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.86

ఐపీఓలంటే అద్భుతాలు కావు!

స్టాక్ మార్కెట్లలోని కంపెనీలన్నీ ఎప్పుడో ఒకప్పుడు పబ్లిక్ ఇష్యూకు వచ్చినవే. కాకపోతే వాటిలో అగ్రశ్రేణి కంపెనీలుగా (లార్జ్‌క్యాప్) మారినవి కొన్నే. దీన్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే చాలు. ఐపీఓల్లో ఇన్వెస్ట్ చేయాలో.. వద్దో తెలిసిపోతుంది. ఎందుకంటే ఐపీఓలంటే అద్భుతాలు కావు. ఆటోమేటిగ్గా సంపదను సృష్టించే సాధనాలూ కావు. అవి అవకాశాలతో పాటే రిస్కులనూ మన ముందుంచుతాయి. అలాగని ఐపీఓలకు దూరంగా ఉండమని కాదు. ఐపీఓ అంటే... మార్కెట్లు పంపే ఆహ్వాన పత్రికలు. దేన్ని స్వీకరించాలో... దేన్ని తిరస్కరించాలో మనమే నిర్ణయించుకోవాలి. అది ఎలాగో.. 2025లో ఐపీఓకు వచ్చిన కంపెనీల పరిస్థితేంటో... 2026లో ఎలా వ్యవహరించాలో సమగ్రంగా వివరించేదే ఈ 'వెల్త్' స్టోరీ...

- 2025లో ఏకంగా 373 కంపెనీల లిస్టింగ్
- తొలిరోజు 40–50 శాతం లాభాలతో కొన్ని అదుర్స్
- కొన్నిటికి లిస్టింగ్‌నాడే నష్టాలు... సగటు లాభం 8 శాతమే
- ఈ ఏడాది 200కు పైగా కంపెనీలు ఐపీఓకు సంసిద్ధం
- లిస్టింగ్ లాభాలకోసం కాక వ్యాపారం చూశాకే దరఖాస్తు
- వ్యాపారం బాగుంటే దీర్ఘకాలంలోనూ మంచి రిటర్నులు

ప్రస్తుతం ప్రైమరీ (ఐపీఓ) మార్కెట్ మంచి దూకుడు మీదుంది. దాదాపు 200కు పైగా కంపెనీలు లిస్టింగ్‌లకు సన్నద్ధమవుతున్నాయి. వీటిలో ఫిన్‌టెక్ యూనికార్న్‌లు, గ్రీన్ ఎనర్జీ వెంచర్ల నుంచి కన్జూమర్ బ్రాండ్లు, ఇన్‌ఫ్రా రంగ దిగ్గజాల వరకు చాలా ఉన్నాయి. జీడీపీ ఏడు శాతానికి పైగా కొనసాగుతుందనే సానుకూల అంచనాలు, డీమ్యాట్ ఖాతాలు 15 కోట్ల స్థాయిని దాటిపోవడం, ప్రతి నెలా సిప్‌ల ద్వారా రూ. 25 వేల కోట్లకు పైగా పెట్టుబడులు మార్కెట్లలోకి వస్తుండటం వంటి పరిణామాలు కంపెనీలకు మంచి ఊపునిస్తున్నాయి.

ఐపీవోలు ఎందుకు..

కంపెనీలు వివిధ కారణాలరీత్యా పబ్లిక్ ఇష్యూల ద్వారా నిధులను సమీకరిస్తుంటాయి. అవేంటంటే..

- కార్యకలాపాలను విస్తరించడానికి, కొత్త టెక్నాలజీల ద్వారా వ్యాపారాన్ని పెంచుకోవటానికి
- రుణాలుంటే తీర్చెయ్యడానికి...
- ప్రారంభ దశలో పెట్టుబడులు పెట్టిన ఇన్వెస్టర్లు, అలాగే ప్రమోటర్లు తమ వాటాలను విక్రయించుకోవటానికి
- బ్రాండ్‌ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారం చేసుకునేందుకు

ఇలాంటి అవసరాలకు సంబంధించి ఐపీవోలనేవి కంపెనీకి సహాయకరంగానే ఉంటాయి. అయితే, షేరు ధర అదే పనిగా పెరుగుతూనే ఉంటుందనే గ్యారంటీ ఏమీ ఉండదు. మార్కెట్లు ర్యాలీ చేస్తున్నప్పుడు కొన్ని కంపెనీలు లిస్టింగ్‌లో మంచి లాభాలే ఇవ్వొచ్చు. మరికొన్ని కంపెనీలు లిస్టింగ్ వేళ నిరాశపర్చినా, ఆ తర్వాత కొన్నాళ్లకు మళ్లీ పుంజుకుని మెరుగైన రాబడులు అందించే అవకాశం ఉంది. అదే సమయంలో చాలా మటుకు కంపెనీలు తీవ్రమైన పోటీ ఎదుర్కొనలేక చతికిలబడి, షేర్లు కనుమరుగైపోతుంటాయి కూడా.

రిటైల్ ఇన్వెస్టర్ల తప్పులివీ...

ఆ ఐపీవో బాగా లిస్టయ్యింది.. ఈ ఇష్యూ బాగా లాభాలు తెచ్చిందనే అత్యుత్సాహంతో చాలా మంది రిటైల్ ఇన్వెస్టర్లు తప్పులో కాలేస్తుంటారు. చేతులు కాల్చుకుంటూ ఉంటారు. కొందరు గ్రే మార్కెట్లను ఫాలో అవుతూ అక్కడ ప్రీమియం రేటు పలికే వాటి వెంటబడుతుంటారు. ఇంకొందరు భారీగా ఓవర్‌సబ్‌స్క్రయిబ్ అయ్యింది కదా కచ్చితంగా లాభాలొచ్చేస్తాయనుకుని ఇన్వెస్ట్ చేస్తుంటారు. మరికొందరు లిస్టింగ్ రోజున భలే ఎగ్జైటింగ్‌గా ఉంటుందని పెట్టుబడులు పెడుతుంటారు. కానీ, ఈ అత్యుత్సాహంలో కొన్ని విషయాలు విస్మరిస్తుంటారు. వ్యాపారం మోడల్ నిజంగా బలమైనదేనా? దీర్ఘకాలికంగా నిలబడేదేనా? ప్రమోటర్ల ట్రాక్ రికార్డు బాగుందా లేదా? ఐపీవో ద్వారా తీసుకున్న డబ్బును కంపెనీ ఏ అవసరాల కోసం వాడుకుంటోంది? ఇలాంటివి పెద్దగా పట్టించుకోరు.

2025లో ఏం జరిగిందంటే...

గతేడాది ఐపీవోలు తీపి, చేదు జ్ఞాపకాలు రెండింటినీ ఇచ్చాయి. దాదాపు 373 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.1.95 లక్షల కోట్లు సమీకరించాయి. వీటిలో 103 మెయిన్ బోర్డ్ ఇష్యూలు కాగా 270 కంపెనీలు ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై లిస్టయ్యాయి. టాటా క్యాపిటల్ (రూ.15,512 కోట్లు), హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ (రూ.12,500 కోట్లు) వంటి దిగ్గజాలు భారీగా నిధులు సమీకరించాయి. కొత్త తరం సంస్థలు మీషో రూ. 5,421 కోట్లు సమీకరించగా, గ్రో క్యాపిటల్ రూ.6,632 కోట్లు రాబట్టుకుంది. వీటిలో లిస్టింగ్ నాడు ఏకంగా 136 శాతం లాభాన్నిచ్చిన స్టాలియన్ ఇండియా ఫ్లోరోకెమికల్స్ లాంటి కంపెనీలతో పాటు తొలి రోజే 56 శాతం నష్టాన్నిచ్చిన గ్లోటిస్ లిమిటెడ్ వంటి కంపెనీలూ ఉన్నాయి. ఇక పెద్ద పెద్ద ఇష్యూల్లో మీషోనే తీసుకుంటే ఇష్యూ ధర రూ.111 అయితే దాదాపు 46 శాతం అధికంగా రూ.162.50 వద్ద లిస్టయ్యింది. అలాగని అన్నీ ఇదే రీతిలో లిస్టింగ్ లాభాలిచ్చాయనుకోవడానికి లేదు. గతేడాది సగటున లిస్టింగ్ లాభాలు చూస్తే 8 శాతం స్థాయికే (అంతకు ముందటి సంవత్సరాలకన్నా తక్కువగా) పరిమితమయ్యాయి. వీటిలో దాదాపు సగ భాగం లిస్టింగ్‌లో ఏడాది చివరి నాటికి లాభాల్లోనే ఉండగా, మిగతావి ఇష్యూ రేటు కన్నా కిందికి పడిపోయాయి. ఇక ఎస్ఎంఈ ఐపీవోలైతే మరీ తీవ్రమైన హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. కొన్ని మల్టీబ్యాగర్లుగా మారినప్పటికీ మిగతావి భారీగా పడిపోయాయి. హైప్ అనేది ఎల్లకాలం ఉండదని, వాస్తవంగా వ్యాపారానికి ఉండే బలమే కీలకమనే పాఠాన్ని 2025 మరోసారి నేర్పింది.

2026 ప్రత్యేకత ఏంటి..

ఈసారి 200 పైగా కంపెనీలు ఐపీవోలకు సిద్ధమవుతున్నాయి. ఇవి రూ. 2.5 లక్షల కోట్లకు మించి సమీకరించవచ్చనే అంచనాలున్నాయి. వీటిలో పలు కంపెనీలు భారీ వేల్యుయేషన్లతో రాబోతున్నాయి. ఉదాహరణకు రూ. 11– 12 లక్షల కోట్ల వేల్యుయేషన్‌తో రిలయన్స్ జియో ఐపీవో దేశంలోనే అతి పెద్ద ఇష్యూగా ఉంటుందనేది నిపుణుల అంచనా. ఇది 2026 ప్రథమార్ధంలోనే రావచ్చు. అలాగే ఎన్ఎస్ఈ, ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్, ఓయో, జెప్టో, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్... ఇలా బోలెడు పెద్ద కంపెనీలు రాబోతున్నాయి. ఈ ఇష్యూల ద్వారా పలు కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు తమ వాటాలను విక్రయించుకుని నిష్క్రమించనున్నాయి. డీమ్యాట్ ఖాతాలు పెరుగుతుండటం, సిప్ పెట్టుబడుల వెల్లువతో వీటికి రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి భారీగానే డిమాండ్ ఉంటుందనే అంచనాలున్నాయి. వెరసి ఈసారి కూడా స్టాక్ మార్కెట్లు సందడిగానే ఉండనున్నాయి.

ఏం చేయాలంటే...

ఇదంతా చూసిన తర్వాత ఇంతకీ ఐపీవోల్లో ఇన్వెస్ట్ చేయాలా వద్దా అంటే... ఇవి మీ పోర్ట్‌ఫోలియోలో స్మార్ట్ భాగంగా ఉండొచ్చు. సముచిత రేటులో లభిస్తున్న బలమైన కంపెనీల ఐపీవోల్లో ఇన్వెస్ట్ చేయండి. కానీ పెట్టుబడులకు సంబంధించి అదొక్కటే వ్యూహంగా మాత్రం పెట్టుకోవద్దు.

- మంచి అవకాశాల కోసం కాస్త వేచి చూడండి. ఇలాంటివి ఏడాదిలో 4– 6 వరకు వస్తుంటాయి.
- బాగుందనిపించగానే ఇన్వెస్ట్ చేసేయొద్దు. వ్యాపార ప్రాథమిక విషయాలను తెలుసుకునేందుకు ప్రాస్పెక్టస్‌ని కూడా కాస్త తిరగేస్తే కొన్ని విషయాలు తెలుస్తాయి.
- పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులను మీ దీర్ఘకాలిక మ్యూచువల్ ఫండ్స్ లేదా బ్లూ-చిప్ స్టాక్స్‌కి అనుబంధంగానే ఉంచుకోవడం మంచిది.

చివరిగా చెప్పేదేమిటంటే పబ్లిక్ ఇష్యూలంటే లాటరీలు కావు! యుఫోరియాకి లోను కాకుండా జాగ్రత్త వహించాలి. లిస్టింగ్‌కి వచ్చిన కంపెనీ ఫండమెంటల్స్ పటిష్టంగా ఉంటే కేవలం లిస్టింగ్ రోజునే కాదు దీర్ఘకాలికంగా కూడా మంచి రాబడులను అందుకోవచ్చని గుర్తుంచుకోవాలి.

ఐటీ దిగ్గజాలు బలాన్నిస్తాయా?

పలు అంశాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లకు దిక్సూచిగా పనిచేయనున్నాయి. కార్పొరేట్ క్యూ3(అక్టోబర్-డిసెంబర్) ఫలితాలతోపాటు.. డిసెంబర్ ద్రవ్యోల్బణ గణాంకాలు వెలువడనున్నాయి. వీటికి జతగా విభిన్న యూఎస్ గణాంకాలు సైతం వెల్లడికానున్నాయి. ఇవన్నీ సెంటిమెంటును ప్రభావితం చేయగలవని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

- క్యూ3 ఫలితాల సీజన్ షురూ
- టీసీఎస్, హెచ్‌సీఎల్, ఇన్ఫోసిస్ రెడీ
- రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం
- రిటైల్, హోల్‌సేల్ ధరల ఎఫెక్ట్

ఇటీవల దేశీ స్టాక్ మార్కెట్లలో వెల్లువెత్తుతున్న అమ్మకాలకు ఈ వారం చెక్ పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు 2025–26 మూడో త్రైమాసిక కార్పొరేట్ ఫలితాల సీజన్ ప్రారంభంకావడం సహకరించవచ్చని పేర్కొన్నారు. ముందుగా ఐటీ దిగ్గజాలు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా క్యూ3 పనితీరును ప్రకటించనున్నాయి. డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ సైతం ఫలితాలు వెల్లడించనున్నాయి.

ధరల తీరెలా?

నేడు(సోమవారం) గత నెల వినియోగ ధరల ద్రవ్యోల్బణ(సీపీఐ) వివరాలు తెలియనున్నాయి. 14న టోకు ధరల ద్రవ్యోల్బణం(డబ్ల్యూపీఐ) గణాంకాలు వెల్లడికానున్నాయి. 15న డిసెంబర్ వాణిజ్య గణాంకాలు విడుదలకానున్నాయి. నవంబర్‌లో వాణిజ్య లోటు 24.53 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

విదేశీ అంశాలిలా..

రేపు(13న) యూఎస్ డిసెంబర్ ప్రధాన, సీపీఐ ద్రవ్యోల్బణ గణాంకాలు, 14న నవంబర్ రిటైల్ సేల్స్, డిసెంబర్ గృహ విక్రయ వివరాలు వెలువడనున్నాయి. 14న చైనా డిసెంబర్ నెల వాణిజ్య గణాంకాలు విడుదలకానున్నాయి.

ఏం జరిగిందంటే?

అంతర్జాతీయ ప్రతికూలతల కారణంగా దేశీ స్టాక్ మార్కెట్లు ఇటీవల నేలచూపులతో కదులుతున్నాయి. వెరసి గత వారం(5–9) ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ నికరంగా 2,186 పాయింట్లు(2.6 శాతం) పతనమై 83,576 వద్ద ముగిసింది. నిఫ్టీ 645 పాయింట్లు(2.5 శాతం) క్షీణించి 25,683 వద్ద స్థిరపడింది. ఇక బీఎస్ఈ మిడ్ క్యాప్ 2.6 శాతం, స్మాల్ క్యాప్ 3.9 శాతం చొప్పున పడిపోయాయి.

సాంకేతికంగా చూస్తే.. బుల్స్ VS బేర్స్

రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు, ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపు, వాణిజ్య చర్చలు ముందుకెళ్లకపోవడం వంటి ప్రతికూల అంశాలు గత వారం దేశీ స్టాక్ మార్కెట్లను దెబ్బతీశాయి. ఇవికాకుండా విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర అమ్మకాలు సెంటిమెంటును బలహీనపరిచాయి.

- ఈ వారం నిఫ్టీకి 25,600 పాయింట్ల వద్ద తొలి మద్దతు లభించవచ్చు. ఈ స్థాయిని కోల్పోతే 25,200వరకూ క్షీణించవచ్చు. ఇంతకంటే పతనమయ్యే అవకాశాలు తక్కువే. ఇక్కడినుంచి పుంజుకుంటే 26,000–26,300 పాయింట్ల వరకూ బలపడవచ్చు. ఇంతకంటే ముందు 25,900–26,100 పాయింట్లవద్ద రెసిస్టెన్స్ ఎదురయ్యే వీలుంది.
- 84,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్ చేరడం ప్రతికూల సంకేతమే. అయితే 83,400 వద్ద వెనువెంటనే సపోర్ట్ కనిపించవచ్చు. ఆపై 82,900–82,200 వద్ద మద్దతుకు వీలుంది. ఈస్థాయిల నుంచి ఊపందుకుంటే తిరిగి 85,000–86,000 పాయింట్లకు పురోగమించే అవకాశముంది.

స్టాక్స్ వ్యూ

అరవింద్ ఫ్యాషన్స్ | **బ్రోకరేజ్:** మోతీలాల్ ఓస్వాల్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 474 **టార్గెట్:** రూ. 725

ఎందుకంటే: పలు సుప్రసిద్ధ దుస్తుల బ్రాండ్లను విక్రయించే అరవింద్ ఫ్యాషన్స్ ప్రస్తుతం మార్పుల బాటలో సాగుతోంది. బ్రాండ్ల కన్సాలిడేషన్ నుంచి లాభదాయకతను పెంచుకునే మార్గంలో ప్రయాణించనుంది. ఇందుకు ఐదు ప్రధాన బ్రాండ్లపై మరింత దృష్టి పెట్టి ముందుకు సాగనుంది. కీలక బ్రాండ్లను పటిష్టపరచడంపై భవిష్యత్ వృద్ధి ఆధారపడగా.. సంబంధిత విభాగాల విస్తరణ ద్వారా లాభదాయకతను పెంచుకుంటోంది. దీంతో నిర్వహణ ఆదాయం బలపడుతోంది. యూఎస్‌పీఏ పూర్తి లైఫ్‌స్టైల్ బ్రాండుగా అవతరిస్తోంది. దుస్తులుకాకుండా ఇతర విభాగాల నుంచి ఆదాయంలో మూడోవంతు సమకూరుతోంది. మరోపక్క టామీ హిల్‌ఫైగర్, కాల్విన్ క్లేన్(సీకే) ప్రీమియం పొజిషన్‌లో పటిష్ట పడుతున్నాయి. ఫలితంగా సగటున 16 శాతం నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు సాధిస్తున్నాయి. ఆధునిక రిటైల్ తరహా స్టోర్లు, ప్రత్యేక బ్రాండ్ పొజిషనింగ్ కారణంగా యారో, ఫ్లయింగ్ మెషీన్ పురోభివృద్ధి బాటలో సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మూడేళ్ల(2026–28) కాలానికి కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 13 శాతం, మార్జిన్లు 1.9 శాతం చొప్పున బలపడనున్నట్లు అంచనా. మెరుగుపడనున్న ఆర్జన, మార్జిన్ల వృద్ధిలో నిలకడ, పుంజుకుంటున్న రిటర్న్ రేషియోలు దేశీ బ్రాండెడ్ ఫ్యాషన్ విభాగంలో అరవింద్ ఫ్యాషన్స్‌ను అత్యున్నత నాణ్యమైన కంపెనీగా నిలబెడుతున్నాయి. బ్యాలన్స్‌డ్ పోర్ట్‌ఫోలియో, ఫైనాన్షియల్ గణాంకాలను పటిష్టపరచుకోవడం, డిమాండుకు అనుగుణమైన వృద్ధిని సాధించగల నేర్పు కంపెనీ షేరుకి ఆకర్షణను తీసుకువస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పునర్వ్యవస్థీకరణ తదుపరి యారో, ఫ్లయింగ్ మెషీన్ బ్రాండ్ల అమ్మకాలు జోరందుకోనున్నట్లు భావిస్తున్నాం.

సీమెన్స్ ఎనర్జీ | **బ్రోకరేజ్:** హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 2,413 **టార్గెట్:** రూ. 3,482

ఎందుకంటే: ఇంధనం, విద్యుత్ పరికరాల దిగ్గజం సీమెన్స్ ఎనర్జీ ఇండియా యాజమాన్యం కంపెనీ పురోభివృద్ధిపట్ల ఆశావహంగా స్పందిస్తోంది. ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులు, దేశీయంగా కనిపిస్తున్న ఇంధన రంగ అభివృద్ధిని అందుకోవడంలో కంపెనీ ప్రత్యేకతను చాటుకోనున్నట్లు యాజమాన్యం ఇటీవల విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. ఇందుకు అనుగుణమైన వ్యూహాలకు తెరతీసినట్లు విశ్లేషకులతో నిర్వహించిన సమావేశంలో తెలియజేసింది. అత్యధిక వృద్ధిలో ఉన్న విద్యుత్ ప్రసారం, పంపిణీ(టీఅండ్‌డీ) బిజినెస్‌తో పాటు, నిలకడైన విద్యుదుత్పత్తి, సర్వీసుల విభాగంలో పట్టును ప్రదర్శించనుంది. గతేడాది(2025) ఆదాయంలో ఎగుమతులు 23 శాతం ఆక్రమించగా.. టీఅండ్‌టీ ప్రొడక్టులు(ట్రాన్స్‌ఫార్మర్లు, సంబంధిత సర్వీసులు) ఇందుకు సహకరించాయి. దేశీయంగా గ్యాస్, స్టీమ్ టర్బయిన్ల ఇన్‌స్టలేషన్ అమ్మకాల్లో వృద్ధికి దోహదపడింది. సగటున 25 మెగావాట్ల పరిమాణంలో ఇండస్ట్రియల్ స్టీమ్ టర్బయిన్లకు ఏర్పడిన డిమాండ్ కారణంగా విద్యుదుత్పత్తి తయారీ జోరు చూపుతోంది. భారీ స్టీమ్ టర్బయిన్లతోపాటు.. గ్యాస్ టర్బయిన్ల పరికరాలను మాతృ సంస్థ నుంచి దిగుమతి చేసుకుంటోంది. తద్వారా దేశీయంగా ఏర్పాటు చేసిన టర్బయిన్లు, తదితరాలకు సర్వీసులు సమకూర్చుతోంది. హెచ్‌వీడీసీ, ఐజీబీటీ పరికరాలు, సెమీకండక్టర్లు మినహా పవర్ ట్రాన్స్‌మిషన్ పరికరాలను స్థానికంగానే సమకూర్చుకుంటోంది. మాతృ సంస్థ నుంచి డిమాండ్ నేపథ్యంలో ఎగుమతులకే అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో వీఎస్‌సీ ప్రాజెక్టులకు మాత్రమే పోటీ పడుతోంది. మరోపక్క స్టీమ్ టర్బయిన్లను సరఫరా చేయగలగడంతో న్యూక్లియన్ పవర్ రంగంలో కంపెనీకి భారీ అవకాశాలున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పాఠకుల ప్రశ్నలు.. నిపుణుల సమాధానాలు

మీ సందేహాలకు నిపుణుల ద్వారా సమాధానాలు కావాలంటే business@sakshi.comకు మెయిల్ చేయండి.

రియల్టీ..

ఇల్లు కొనటానికి డౌన్‌పేమెంట్ ఎంతవరకూ ఉండాలి?

సాధారణంగా ఇంటి విలువలో 10–20 శాతాన్ని డౌన్‌పేమెంట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 80–90 శాతం మొత్తాన్ని బ్యాంకులు లేదా ఎన్‌బీఎఫ్‌సీలు రుణంగా అందిస్తుంటాయి. ప్రాపర్టీ విలువ రూ.30 లక్షల లోపు ఉంటే 90 శాతం వరకూ మొత్తాన్ని రుణంగా ఇస్తారు. 10 శాతం డౌన్‌పేమెంట్ చెల్లించాలి. ప్రాపర్టీ విలువ రూ.30 నుంచి 75 లక్షల వరకూ ఉంటే 80 శాతం వరకూ రుణాన్ని ఇస్తారు. మిగిలిన 20 శాతం డౌన్‌పేమెంట్‌గా చెల్లించాలి. రూ.75 లక్షలు దాటిన ఇళ్లకయితే 25 శాతం వరకూ డౌన్‌పేమెంట్ అవసరం. మిగిలిన 75 శాతాన్నే రుణంగా ఇస్తారు. ఇక 5–8 శాతం ఉండే స్టాంప్ డ్యూటీ, జీఎస్టీ, ఇంటీరియర్ ఖర్చులు, లీగల్ ఖర్చులు అన్నీ కొనుగోలుదారే భరించాలి.

బ్యాంకింగ్..

స్వల్ప కాలంపాటు సొమ్ము దాచుకోవటానికి సేవింగ్స్ ఖాతా లేక లిక్విడ్ ఫండ్సా?

లిక్విడ్ ఫండ్స్‌లో సేవింగ్స్ ఖాతా కన్నా ఎక్కువ వడ్డీ వస్తుంది. సేవింగ్స్ ఖాతాపై 2–3 శాతం వడ్డీ వస్తే... లిక్విడ్ ఫండ్స్‌లో 5–6 శాతం వరకూ ఉంటుంది. కాకపోతే ఎప్పుడు కావాలంటే అప్పుడు విత్‌డ్రా చేసుకోవటమన్నది సేవింగ్స్ ఖాతాలోనే సాధ్యపడుతుంది. లిక్విడ్ ఫండ్స్‌లో కనీసం ఒక్కరోజైనా పూర్తిగా ఉంచాలి. ఎక్కువ శాతం ట్యాక్స్ రేటు చెల్లించేవారికి సేవింగ్స్ ఖాతాకన్నా లిక్విడ్ ఫండ్సే బెటర్. పూర్తిస్థాయి భద్రతను కోరుకునేవారికి సేవింగ్స్ ఖాతా నయం. ఇలా దేని ప్రత్యేకతలు దానికున్నాయి. కనీసం నెల రోజుల ఖర్చులకు సరిపడా మొత్తాన్ని సేవింగ్స్ ఖాతాలో ఉంచుకుని, అంతకు మించిన మొత్తాన్ని లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయటం మంచిది.

బంగారం

బంగారానికి హాల్ మార్కింగ్ తప్పనిసరా?

దేశంలో అన్ని నోటిఫైడ్ జిల్లాల్లోనూ హాల్‌మార్కింగ్‌ను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీనిప్రకారం బంగారాన్ని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' (బీఐఎస్) హాల్‌మార్కింగ్ చేయాలి. అంటే ప్రతి బంగారు ఆభరణంపై బీఐఎస్ లోగో, దాని స్వచ్ఛత (24– 22– 18 క్యారెట్లు..), హాల్‌మార్కింగ్ ఐడెంటిఫికేషన్ నంబర్, సదరు జ్యూయలర్ ఐడెంటిఫికేషన్ నంబర్ వంటివన్నీ ఉండాలి. స్వల్ప నాన్‌–నోటిఫైడ్ జిల్లాలకు మాత్రం ఈ హాల్‌మార్కింగ్ నిబంధనలు వర్తించవు. ఇక బ్యాంకులు, ఎంఎంటీసీ విక్రయించే బంగారం కాయిన్లు, బార్లకు అవే హాల్‌మార్కింగ్ చేస్తాయి. హాల్‌మార్కింగ్ వల్ల బంగారం స్వచ్ఛత ఎంతో స్పష్టంగా తెలుస్తుంది. ఆ స్వచ్ఛతకు గ్యారంటీ కూడా ఉంటుంది.

స్టాక్ మార్కెట్...

రిటైరైన వారికి స్టాక్ మార్కెట్లు సురక్షితమేనా?

సురక్షితమే. కాకపోతే మిగతా వారితో పోల్చినపుడు రిటైరీలు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే వారికి అదనపు ఆదాయం ఉండదు. కాబట్టి ఎక్కువ రాబడులకన్నా తమ అసలు భద్రంగా ఉండటం ముఖ్యం. మార్కెట్లలో ఒడుదుడుకులు సహజం కనక అవి వారి మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీయకుండా ఉండాలి. అందుకని తమ రిటైర్మెంట్ నిధిలో 15–20 శాతం మాత్రమే స్టాక్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయటం మంచిది. నెలవారీ ఖర్చుల కోసం కాకుండా దీర్ఘకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డివిడెండ్లు ఇచ్చే షేర్లు, లేదా లార్జ్‌క్యాప్ షేర్లు లేదా వీటిల్లో ఇన్వెస్ట్ చేసే ఈక్విటీ మ్యూచ్‌వల్ ఫండ్లను ఎంచుకోవాలి. ఎక్కువ డబ్బును ఎఫ్‌డీలు, ఆర్‌బీఐ బాండ్లలో పెట్టుకోవాలి.

మ్యూచువల్ ఫండ్స్...

సిప్‌లో రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేయటం మంచిదా.. ఒకేసారి పెద్ద మొత్తం పెడితే మంచిదా?

సిప్ అనేది అందరికీ వర్తిస్తుంది. ఇక ఏకమొత్తంలో ఒకేసారి పెట్టుబడి పెట్టడమనేది కొందరికే. మార్కెట్ టైమింగ్‌ను చూసుకుని, బాగా రిస్క్‌ను తట్టుకోగలిగే వారికే! సిప్ వల్ల మార్కెట్ టైమింగ్ రిస్కు ఉండదు. క్రమశిక్షణ అలవాటు కావటంతో పాటు రుపీ కాస్ట్ కూడా యావరేజ్ అవుతుంది. కాకపోతే మీ దగ్గర పెద్ద మొత్తం ఉన్నపుడు సిప్ చేయటం మొదలుపెడితే ఆ డబ్బును ఇన్వెస్ట్ చేయడానికి చాలా సమయం పడుతుంది. అలాకాకుండా ఏకమొత్తంగా ఒకేసారి ఇన్వెస్ట్ చేస్తే మార్కెట్లు కలిసి వస్తే రాబడులు కూడా బాగానే ఉంటాయి. కాకపోతే మార్కెట్లు బాగా చౌకగా ఉన్నాయని భావించినపుడు, రిస్కును తట్టుకోగలమని భావించినపుడు మాత్రమే దీనికి సిద్ధపడాలి.

ఇన్సూరెన్స్

ప్రెగ్నెన్సీ, డెలివరీ ఖర్చులు ఇన్సూరెన్స్‌లో కవరవుతాయా?

మెటర్నిటీ ఖర్చులకు చాలా బీమా కంపెనీలు ఇపుడు కవరేజీ ఇస్తున్నాయి. పాలసీ తీసుకున్నాక కొంత వెయిటింగ్ పీరియడ్ తరవాతే ఇవి వర్తిస్తాయి. నార్మల్ లేదా సి–సక్షన్ డెలివరీ ఖర్చులతో పాటు ప్రీ–పోస్ట్ నాటల్ వ్యయాలు, కొంతకాలం వరకూ పుట్టిన బిడ్డకు అయ్యే ఖర్చు ఇవన్నీ కవర్ అవుతున్నాయి. మెటర్నిటీ కవర్ పాలసీ తీసుకున్న 2–4 ఏళ్ల తరువాతే మొదలవుతుంది. ఈ వెయిటింగ్ పీరియడ్‌లోపల అయ్యే ఖర్చులకు కవరేజీ ఉండదు. ప్రత్యేకంగా పేర్కొంటే తప్ప ఐవీఎఫ్, ఐయూఐ వంటి గర్భధారణ ఖర్చులకు బీమా కవరేజీ ఉండదు. అయితే కొన్ని యాజమాన్యాలిచ్చే పాలసీలు, గ్రూప్ పాలసీల్లో మాత్రం వెయిటింగ్ పీరియడ్ లేకుండానే డెలివరీ కవరేజీ అందిస్తున్నారు.

వ్యాపారంలో గతం స్పష్టంగా కనిపిస్తుంది. భవిష్యత్తు నిర్ణయాలే అసలు పరీక్ష

- వారెన్ బఫెట్, అమెరికన్ ఇన్వెస్టర్, రచయిత

మీ ఇల్లు బంగారంగానూ!

గోల్డ్ లోన్-హోమ్‌లోన్‌కు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల ఆఫర్లు

- చాలామందిలో ఏ రుణం ఎక్కడ తీసుకోవాలన్నదే సందేహం
- మన అవసరం, ప్రొఫైల్‌ను బట్టి ఏ సంస్థయినా మంచిదే
- బ్యాంకులతో పోలిస్తే ఎన్‌బీఎఫ్‌సీల్లో వేగంగా ప్రాసెసింగ్
- వడ్డీ రేటుమాత్రం ఎన్‌బీఎఫ్‌సీలకన్నా బ్యాంకుల్లోనే తక్కువ
- నిబంధనలు పాటించటంలో ఒక్కొక్కరిదీ ఒక్కో తీరు

తాకట్టు... రుణం!. ఈ రెండూ భవిష్యత్తుని నిర్ణయించేవే. అది ఎదగటమైనా... పాతాళానికి పడిపోవటమైనా!. దానికి దిక్సూచులు ఏ అవసరానికి తీసుకుంటున్నాం? ఎంత క్రమశిక్షణతో తిరిగి తీరుస్తున్నామనేవే. ఇక రుణ ప్రపంచానికి హృదయం లాంటివి హోమ్‌లోన్... గోల్డ్ లోన్. ఒకటి ఆశలు నెరవేర్చేదైతే మరొకటి అవసరాన్ని తీర్చేది. మరి బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో రెండూ ఈ రుణాలిస్తున్నాయి కదా... ఏది మంచిది? ఏ రుణం ఎక్కడ తీసుకుంటే మంచిది? వీటికి సమాధానమే ఈ వెల్త్ స్టోరీ...

సరైన రుణాన్ని, సరైన సంస్థను ఎంచుకోకక పోవటం వల్ల లక్షల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందంటే ఆశ్చర్యంగా ఉండదూ? గృహరుణంలో ఒక్క 0.5 శాతం తేడా వల్ల మనం చెల్లించే సొమ్ము కొన్ని లక్షల రూపాయలు పెరిగిపోతుందంటే ఇబ్బందికరంగా లేదూ? అందుకే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల్లో ఎక్కడ రుణం తీసుకున్నా... మన అవసరమేంటన్నది ముఖ్యం. ఆ అవసరానికి మనకు ఎంత త్వరగా రుణం వస్తోంది? ఎంత వడ్డీకి వస్తోంది? మన దగ్గర అన్ని డాక్యుమెంట్లూ ఉన్నాయా? మనకు కొన్ని వెసులుబాట్లు అవసరమా? ఇలాంటివన్నీ చూసుకుని, దానికి తగ్గ సంస్థను ఎంపిక చేసుకుని ముందుకు వెళ్లాలి. అదెలాగో చూద్దాం...

గృహ రుణానికి బ్యాంకే మంచిదా?

గృహ రుణం తీసుకునే వారు ఒక్క వడ్డీ రేటే కాకుండా చాలా అంశాలు చూడాలి. అదేమిటంటే గృహ రుణాలపై వడ్డీ రేట్లు సాధారణంగా బ్యాంకుల్లోనే తక్కువ. ఎందుకంటే ఇవి ఆర్‌బీఐ రెపో రేటు మాదిరి ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రేట్‌తో అనుసంధానమై ఉంటాయి. కాబట్టి ఆర్‌బీఐ రేట్లకు అనుగుణంగా తక్షణం మార్పుచేర్పులుంటాయి. ఉదాహరణకు 0.5 శాతం గనక వడ్డీ రేటు తగ్గితే... 20 ఏళ్ల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణంపై ఏకంగా రూ.3 లక్షలు మిగుల్చుకోవచ్చు. పైపెచ్చు బ్యాంకుల్లో గృహ రుణాలను గరిష్టంగా 30 ఏళ్ల కాలానికీ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తక్కువ వడ్డీ రేట్లు, దీర్ఘకాలం కారణంగా ఈఎంఐ భారం తగ్గించుకోవచ్చు. కాకపోతే బ్యాంకుల్లో గృహ రుణ దరఖాస్తుల పరిశీలన చాలా కఠినంగా ఉంటుంది. ప్రాపర్టీకి క్లియర్ టైటిల్‌తో పాటు, రుణ గ్రహీత క్రెడిట్ స్కోర్ (రుణ పరపతి/రుణ చరిత్ర) 700కు పైన ఉండాలి. చెల్లింపుల సామర్థ్యాలనూ బ్యాంక్‌లు చూస్తాయి. దీనికితోడు న్యాయపరమైన క్లియరెన్స్ కూడా తీసుకుంటాయి. కనుక ఈ ప్రక్రియకు కొంత సమయం పడుతుంది.

ఎన్‌బీఎఫ్‌సీలు ఎవరికంటే...

నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) గృహ రుణాల విషయంలో బ్యాంకుల మాదిరి అంత కఠినంగా వ్యవహరించవు. 700కు దిగువన క్రెడిట్‌స్కోరు ఉన్న వారికి సైతం, ఇతర అర్హతల ఆధారంగా ఇవి రుణాలను అందిస్తుంటాయి. ఆదాయ ధ్రువీకరణల్లేని స్వయం ఉపాధిపై ఉన్న వారికి, తక్కువ ఆదాయ వర్గాలకు సైతం ఎన్‌బీఎఫ్‌సీల్లో రుణాలు లభిస్తాయి. పైపెచ్చు ఎన్‌బీఎఫ్‌సీల్లో గృహ రుణం కేవలం రోజుల వ్యవధిలో మంజూరవుతుంది. సాధారణంగా రెండు నుంచి మూడు రోజుల్లోనే రుణం పొందొచ్చు. అంటే బ్యాంకులతో పోల్చినపుడు ఎన్‌బీఎఫ్‌సీల్లో వేగవంతమైన, ప్రత్యేకమైన సేవలను ఆశించొచ్చు. కాకపోతే ఎన్‌బీఎఫ్‌సీల్లో వడ్డీ రేట్లు ఎక్కువ. కనుక వడ్డీ రూపంలో కాస్త ఎక్కువ చెల్లించాలి. బ్యాంకుల్లో మాదిరి అధిక రుణం మొత్తం అన్ని ఎన్‌బీఎఫ్‌సీల్లో సాధ్యపడదు.

వీరికి బ్యాంక్ బెటర్..

- మంచి క్రెడిట్ స్కోరు ఉండి, ఆదాయ ధ్రువీకరణలున్న వారికి.
- ఆర్‌బీఐ నియంత్రణల కింద మరింత పారదర్శకత కోరుకునే వారికి.
- సమయం పట్టినా తక్కువ వడ్డీకి రుణం కావాలనుకునేవారికి.

బ్యాంక్‌లు-ఎన్‌బీఎఫ్‌సీల్లో ఏది బెస్ట్?

	బ్యాంక్	ఎన్‌బీఎఫ్‌సీ
వడ్డీ రేట్లు	తక్కువ	ఎక్కువ
అర్హత	కఠినం	సౌకర్యం
ప్రాసెసింగ్ టైమ్	ఎక్కువ	సత్వరం
ఉత్పత్తులు	విస్తృతం	పరిమితం
పారదర్శకత	ఎక్కువ	మధ్యస్థం

వీరికి ఎన్‌బీఎఫ్‌సీలు..

- తక్కువ ఆదాయం లేదా ఫ్రీలాన్స్, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాల ద్వారా ఆదాయం వచ్చేవారికి
- వేగంగా రుణం మంజూరు కోరుకునే వారికి.
- వడ్డీ రేటు కాస్త ఎక్కువైనా.. తమ అవసరాలకు వీలుగా సౌకర్యవంతమైన షరతులపై రుణం కోరుకునే వారికి

బంగారంపై రుణం ఎక్కడ నయం?

గృహ రుణం మాదిరే బంగారాన్ని తనఖా పెట్టి తీసుకునే రుణమూ సెక్యూర్డ్ కిందికే వస్తుంది. కనుక వీటిపైనా రేట్లు తక్కువగానే ఉంటాయి. అయినప్పటికీ రుణం మొత్తం, వడ్డీ రేటు, కాల వ్యవధి, చెల్లింపుల్లో సౌలభ్యం పరంగా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య ఎన్నో వ్యత్యాసాలు కనిపిస్తాయి.

బ్యాంక్‌లు ఎక్కడ బెటరంటే...

- బంగారంపై వడ్డీ రేటు బ్యాంకుల్లో తక్కువ. ఇవి 8 శాతం రేటుకే రుణాలిస్తుంటాయి. కొన్ని బ్యాంకుల్లో ఈ రేటు గరిష్టంగా 12 శాతం వరకు ఉంటుంది.
- బంగారంపై బ్యాంకుల్లో దీర్ఘకాలిక రుణాలు తీసుకునే సౌలభ్యం ఉంది. రుణం తీసుకుని, ప్రతి నెలా చెల్లింపులు చేయకుండా.. ఒకేసారి తిరిగి చెల్లించేట్టయితే ఏడాది కాలానికి మంజూరు చేస్తారు.
- రుణం తీసుకుని నెలవారీ వాయిదాల్లో (ఈఎంఐ) చెల్లించేట్టు అయితే రెండు నుంచి మూడేళ్ల కాలానికి రుణాలిస్తారు.
- ఇక బ్యాంకుల్లో కూడా ప్రభుత్వ రంగ బ్యాంకులైతే బంగారంపై తక్కువ రేటుకు రుణాలిస్తుంటాయి.
- ఆర్‌బీఐ మార్గదర్శకాలను బ్యాంకులు కచ్చితంగా అనుసరిస్తుంటాయి. కనుక భద్రత, పారదర్శకత ఎక్కువ.
- బ్యాంకుల్లో బంగారంపై రుణం అదే రోజు, గంటల్లోనే మంజూరవుతుంది.
- కాకపోతే బ్యాంకుల్లో బంగారం విలువపై తక్కువ రుణం లభిస్తుంది. అంటే ఎక్కువ బ్యాంకులు బంగారం విలువలో 65–70 శాతానికి మించి రుణాన్ని ఇవ్వవు.

ఎన్‌బీఎఫ్‌సీలు ఎక్కడ బెటరంటే...

- ఎన్‌బీఎఫ్‌సీల్లో బంగారం రుణాలపై అధిక వడ్డీ రేటు అమలవుతుంది. వీటిల్లో 12 శాతం నుంచి 30 శాతం మధ్య రేటు ఉంటుంది.
- కేవైసీ పరంగా ఆధార్, పాన్ ఇస్తే చాలు... బ్యాంకుల్లో మాదిరే బంగారంపై రుణం అదే రోజు వేగంగానే మంజూరవుతుంది.
- ముఖ్యంగా బంగారంపై అధిక రుణాన్ని ఎన్‌బీఎఫ్‌సీలు ఆఫర్ చేస్తుంటాయి. కానీ, ఇందుకోసం అధిక వడ్డీ రేటు చెల్లించుకోవాల్సిందే.
- వడ్డీని ఏ నెలకానెల కట్టేసి.. అసలును చివర్లో కట్టేస్తే సరిపోతుంది.
- కాకపోతే వీటిల్లో రుణ కాలవ్యవధి బ్యాంకుల్లో మాదిరి సుదీర్ఘంగా ఉండదు. ఆరు నెలలు, ఏడాదికే ఆఫర్ చేస్తాయి. ఆ తర్వాత రెన్యువల్ చేసుకోవాలి.
- రుణాన్ని సకాలంలో చెల్లించడంలో విఫలమైతే కఠినంగా వ్యవహరిస్తాయి.

రుణ వ్యయాలు తగ్గించుకోవడమెలా?

- రుణం తీసుకోవడానికి ముందు తమ క్రెడిట్ స్కోరు ఎంతో తెలుసుకోవాలి. ఏడాదిలో ఒక్కసారి క్రెడిట్ స్కోరును ఆయా సంస్థలు ఉచితంగా ఇస్తాయి.
- 760కు పైన క్రెడిట్ స్కోరు ఉన్న వారు తక్కువ వడ్డీ రేటుతోపాటు, ప్రాసెసింగ్ ఫీజు మినహాయింపు కోసం డిమాండ్ చేయొచ్చు.
- గృహ రుణం అయితే ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ (ఆర్‌బీఐ రెపో/ఈబీఎల్ఆర్) రేటు ఆధారితంగా ఎంపిక చేసుకోవాలి.
- రుణం తీసుకునే సమయంలో అధిక రేటు ఉండి, ఆ తర్వాత రేట్లు దిగొస్తే.. మిగిలిన బకాయిని తక్కువ రేటు ఉన్న సంస్థకు బదిలీ చేసుకోవడాన్ని పరిశీలించాలి.

అంగీకారానికి ముందు..

- రుణం తీసుకునే ముందు ఒప్పంద నియమ నిబంధనలు, షరతులు, చార్జీల గురించి సమగ్రంగా తెలుసుకోవాలి.
- తిరిగి చెల్లింపుల పరంగా ఉన్న ఆప్షన్లను తెలుసుకోవాలి.
- రుణాన్ని నిర్ణీత కాల వ్యవధికి ముందే తీర్చివేస్తే పెనాల్టీ మాదిరి ఏవైనా చార్జీలు చెల్లించాల్సి ఉంటుందా? అడగాలి.
- వివిధ బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీల మధ్య రుణ రేట్లు, చార్జీలను పోల్చి చూసుకోవాలి.
- సాధారణంగా దీర్ఘకాల రుణాలకు బ్యాంక్‌లు అనుకూలం, సౌకర్యం.
- అత్యవసరంగా, అధిక రుణం కోరుకునే వారికి ఎన్‌బీఎఫ్‌సీలు అనుకూలం.

విద్యార్థులకూ రూ.2 కోట్ల టర్మ్ ప్లాన్

యాక్సిస్ మ్యాక్స్ సరికొత్త ఆఫర్

యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్.. తన స్మార్ట్ టర్మ్ ప్లాన్‌ను విద్యార్థులకూ ఆఫర్ చేస్తున్నట్టు ప్రకటించింది. ఉన్నత విద్యనభ్యసిస్తున్న వారు రూ.2 కోట్ల వరకు జీవిత బీమా రక్షణను దీనికింద పొందొచ్చని తెలిపింది. సంపాదన లేని వారికి సాధారణంగా టర్మ్ ప్లాన్‌లో ఇంత రక్షణను బీమా సంస్థలు అందించవు. కానీ, పరిశ్రమలో తొలిసారి ఈ తరహా కవరేజీని విద్యార్థులకు యాక్సిస్ మ్యాక్స్ అందించేందుకు ముందుకు వచ్చింది. టర్మ్ ప్లాన్ తీసుకునే వారి సగటు వయసు 35 ఏళ్లుగా ఉండగా, 18 ఏళ్ల వయసు నుంచే ఈ రక్షణ పొందే దిశగా ఈ చర్య చేపట్టినట్టు సంస్థ తెలిపింది. ఉద్యోగం ఆరంభించడానికి ముందే ఆర్థిక క్రమశిక్షణకు ఈ ప్లాన్ మార్గం చూపిస్తుందని యాక్సిస్ మ్యాక్స్ లైఫ్ పేర్కొంది.

న్యూ ఫండ్ ఆఫర్స్

ఇన్నోవేషన్ ఆపర్చ్యూనిటీస్ ఫండ్

మహీంద్రా మాన్యులైఫ్ మ్యూచువల్ ఫండ్ తాజాగా ఇన్నోవేషన్ ఆపర్చ్యూనిటీస్ ఫండ్‌ని ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జనవరి 23 వరకు అందుబాటులో ఉంటుంది. ఇది దీర్ఘకాలంలో మూలధన వృద్ధికి తోడ్పడేలా పెట్టుబడులు పెడుతుంది. ప్రధానంగా ఉత్పత్తులు, సర్వీసులు, ప్రాసెస్‌లపరంగా కొత్త ఆవిష్కరణల థీమ్‌తో వివిధ రంగాలకు చెందిన సంస్థల షేర్లు, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో 80–100 శాతం వరకు ఇన్వెస్ట్ చేస్తుంది. అలాగే, రీట్స్, ఇన్విట్స్, మనీ మార్కెట్ సాధనాల్లో కూడా కొంత ఇన్వెస్ట్ చేయొచ్చు. సరికొత్త టెక్నాలజీ, కొత్త బిజినెస్ మోడల్స్‌తో భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన రాబడులు అందుకునేందుకు ఈ ఫండ్ అవకాశం కల్పిస్తుందని సంస్థ ఎండీ ఆంథోని హెరిడియా తెలిపారు.

గ్రో నుంచి స్మాల్ క్యాప్ ఫండ్

గ్రో మ్యూచువల్ ఫండ్ ప్రవేశపెట్టిన స్మాల్ క్యాప్ ఫండ్ జనవరి 22తో ముగియనుంది. అత్యంత నాణ్యమైన, కార్యకలాపాలను పెద్ద స్థాయిలో విస్తరించగలిగే సామర్థ్యం గల స్మాల్ క్యాప్ కంపెనీల్లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది. ఇందుకు బాటమ్-అప్ ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని ఉపయోగిస్తుంది. మౌలిక సదుపాయాల కల్పనపై పెట్టుబడులు పెరుగుతుండటం, క్యాపిటల్ మార్కెట్లు విస్తరిస్తుండటం, బ్యాంకుల నుంచి రుణాల లభ్యత పెరుగుతుండటంలాంటి అంశాల దన్నుతో చాలా మటుకు చిన్న సంస్థలు, దీటుగా పోటీపడుతూ, కొత్త మార్కెట్లలోకి కూడా విస్తరిస్తున్నాయని గ్రో తెలిపింది. ఈ నేపథ్యంలో వీటిలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందుకునేందుకు అవకాశం ఉందని వివరించింది.

రిటైర్మెంటుతో.. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్..?

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు

ఇప్పుడు దేశవ్యాప్తంగా రిటైర్మెంటు తీసుకున్న ఉద్యోగస్తులు ఆలోచిస్తున్న అంశం.. తమ చేతికొచ్చిన లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ మొత్తం, అందులో మినహాయింపు రూ. 3,00,000 పోగా, పన్నుకి గురైన మిగతా భాగం గురించే. దీనిపై సమాచారాన్ని ఈ వారం తెలుసుకుందాం.

లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌పై కొన్ని రూల్స్‌కి లోబడి రూ. 3,00,000 వరకు మినహాయింపు ఉండేది. 24-03-2023 నాడు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఈ మొత్తాన్ని రూ. 25,00,000కు పెంచారు. ఈ డేటు తర్వాత వచ్చిన వాటికి ఇది వర్తిస్తుంది. ఈలోగా ఏడో వేతన సంఘం సిఫార్సుల ప్రకారం 01-01-2016 నుంటి రిటైర్ అయిన ఉద్యోగస్తులకు జీతాలు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంటు భారీగా పెరిగాయి. 01-01-2016 తర్వాత రిటైర్ అయిన ఉద్యోగస్తులు తమ తమ ఆదాయ పన్ను రిటర్నులలో రూ. 3,00,000 వరకు మినహాయింపు పొంది, మిగతా మొత్తాల మీద 30 శాతం పన్ను, విద్యా సుంకం 4 శాతం.. వెరసి 31.2 శాతం పన్ను చెల్లించి సరిపెట్టుకున్నారు. ఇది సంతోషాన్ని కలిగించినప్పటికీ ఒక అలజడి మొదలైంది.

కొంత మంది ఉద్యోగస్తులు నోటిఫికేషన్ అంశాన్ని లేవదీసి, ఆ మేరకు అదనంగా కట్టిన ట్యాక్స్ రిఫండు కోసం దరఖాస్తు చేశారు. అధికారులు యధావిధిగా అన్నింటినీ తోసిపుచ్చారు. విషయం ట్రిబ్యునల్ వరకు వెళ్లింది. అక్కడ ఉపశమనం లభించింది. వడ్డీతో సహా రిఫండ్ వచ్చింది. ఈ విషయం ఉద్యోగ సంఘాల ద్వారా ఊరు, వాడా చేరింది. ఒకే ప్రశ్న మరి ఇప్పుడు ఏం చేయాలి? ఏముంది.. మీరూ రిఫండు కోసం క్లెయిమ్ చేయొచ్చు. క్లెయిమ్ చేయడం తప్పు కాదు. ఎటువంటి రిస్కు కాదు. ఖర్చేమీ కాదు. ఫైల్ చేయండి.

ఎలా చేయాలి..

- కాగితాలన్నీ సమకూర్చుకోండి. మీ గత చరిత్ర ఒక పద్ధతిలో పెట్టండి. ఏ సంవత్సరంలో దాఖలు చేశారు, అక్నాలెడ్జ్‌మెంటు, రిటర్ను కాపీ, అసెస్‌మెంట్ ఆర్డరు, ట్యాక్స్ చెల్లించిన చలాన్లు, వాటికి సంబంధించిన అన్ని కాగితాలు.
- కాలదోషం పట్టిన కేసుల్లో రిటర్ను వేయకూడదు. అలా వేయాలంటే డిపార్టుమెంటు నోటీసులు ఇవ్వాలి. ఈ విషయంలో అలాంటివి జరగవు. ఆటోమేటిక్‌గా వాళ్లు రిఫండు ఇవ్వరు. మీరు రివైజ్ రిటర్ను వేయాలి.
- రివైజ్ రిటర్ను వేయాలంటే మీకు అనుమతి కావాలి. ఆ అనుమతి కేంద్ర పన్నుల బోర్డు ఇవ్వాలి. బోర్డు అంటే.. మీరు ఢిల్లీ పరుగెత్తనక్కర్లేదు. మీకు సంబంధించిన ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ వారికి దరఖాస్తు చేసుకోవాలి.
- ఇలా దరఖాస్తు చేయడాన్ని కండోనేషన్ అప్లికేషన్ (condonationapplication) వేయడం అంటారు. తెలుగు రాష్ట్రాల వారికి హైదరాబాద్‌లో వీరి కార్యాలయం ఉంది. ప్రత్యక్షంగా ఫైల్ చేయొచ్చు లేదా ఐటీ పోర్టల్‌లోనైనా చేయొచ్చు. లాగిన్ తర్వాత సర్వీసెస్ బోర్డుకి వెళ్లాక, కండోనేషన్ రిక్వెస్ట్ కనిపిస్తుంది. కంటిన్యూ చేయండి. క్రియేట్ రిక్వెస్ట్ అని ఉంటుంది. అందులో అన్ని వివరాలు ఉంటాయి. నింపండి.
- ఏ వివరాలు ఇవ్వాలంటే.. మీ వివరాలు, కేసు వివరాలు, గతంలో రిటర్న్ వేసిన వివరాలు, నిజాలన్నీ పొందుపరుస్తూ, నా తప్పేమీ లేదు, ఉద్దేశపూర్వకంగా ఏమీ చేయలేదు అని రివైజ్ రిటర్ను వేయడానికి అనుమతి వేడుకోండి.
- సాధారణంగా అనుమతి ఇస్తారు. రోజూ వెబ్‌సైట్ వాచ్ చేయండి. అనుమతి రాగానే రివైజ్ రిటర్ను వేయండి.
- అన్ని కాగితాలు/వివరాలు ఇచ్చి రిటర్ను వేస్తే రిఫండు వచ్చే అవకాశం ఉంది.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రాబడులకు మెరుగైన దారి

వైట్‌ఓక్ క్యాపిటల్ మిడ్‌క్యాప్ ఫండ్



న్యూఢిల్లీ: పెట్టుబడి ద్వారా సంపద సృష్టించుకోవాలని భావించే వారు రిస్క్ తీసుకునేందుకు సైతం సిద్ధం కావాల్సిందే. ముఖ్యంగా ఈక్విటీ ఫండ్స్‌లో రాబడులు ఇన్వెస్టర్ రిస్క్ సామర్థ్యంపైనే ఆధారపడి ఉంటాయి. ముఖ్యంగా 10–15–20 ఏళ్ల అంతకు మించిన దీర్ఘకాల లక్ష్యాలకు సంబంధించి పెద్ద మొత్తంలో సమకూర్చుకోవాలని భావించే వారికి ఈక్విటీ ఫండ్స్ ఎంతో అనుకూలం. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం దిశగా కేంద్ర సర్కారు పనిచేస్తోంది. కనుక రానున్న ఒకటి రెండు దశాబ్దాల పాటు భారత ఆర్థిక వ్యవస్థ మరింత విస్తరిస్తుందని విశ్లేషకులు సైతం అంచనా వేస్తున్నారు. కనుక ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసం ఈక్విటీల్లో.. అందులోనూ లార్జ్‌క్యాప్‌తోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌కు తప్పక చోటు కల్పించుకోవాలి. మిడ్‌క్యాప్ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న వైట్‌ఓక్ క్యాపిటల్ మిడ్‌క్యాప్ ఫండ్ గురించి విశ్లేషణ ఇది.

రాబడులు

ఈ పథకం ప్రారంభమై మూడేళ్లు అయింది. 2022 సెప్టెంబర్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. కానీ, మొదటి మూడేళ్లలో మిడ్‌క్యాప్ విభాగంలో దిగ్గజ ఫండ్స్ పథకాల మించి బలమైన పనితీరు నమోదు చేసింది. ఏడాది కాలంలో పెట్టుబడులపై 5.28 శాతం రాబడిని ఇవ్వగా.. మూడేళ్లలో చూసుకుంటే వార్షిక రాబడి 28 శాతం వరకు ఉంది. కానీ, బీఎస్ఈ మిడ్ క్యాప్ 150 టీఆర్ఐ మూడేళ్లలో ఏటా ఇచ్చిన రాబడి 23.51 శాతంగానే ఉంది. ఇక మిడ్‌క్యాప్ ఫండ్స్ విభాగం సగటు రాబడి 22.97 శాతంతో పోల్చినా వైట్‌ఓక్ క్యాపిటల్ మిడ్‌క్యాప్ ఫండ్ అదనపు రాబడిని తెచ్చిపెట్టు తెలుస్తోంది. మిడ్‌క్యాప్ విభాగంలో హెచ్‌డీఎఫ్‌సీ మిడ్‌క్యాప్ ఫండ్, కోటక్ మిడ్‌క్యాప్ ఫండ్, నిప్పన్ ఇండియా మిడ్‌క్యాప్ ఫండ్, మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్‌ను రాబడి పరంగా అధిగమించింది. బలమైన రాబడులు ఒక్కటే ప్రామాణికం కాదు. స్థిరమైన పనితీరు, అస్థిరతల్లో స్థిరత్వాన్ని చూడాల్సి ఉంటుంది. ఆ విధంగానూ ఈ పథకానికి మంచి మార్కులే పడతాయి. 110 వారాల్లో ఈ పథకం రాబడులు నికర సానుకూలంగా ఉన్నట్టు డేటా తెలియజేస్తోంది.

పెట్టుబడుల విధానం

భవిష్యత్తులో దిగ్గజాలు కాగల కంపెనీలను గుర్తించి ఈ పథకం పెట్టుబడులు పెడుతుంటుంది. ఇప్పటికే ఈ పథకం ఇన్వెస్ట్ చేసిన కొన్ని స్మాల్‌క్యాప్ స్టాక్స్ మిడ్‌క్యాప్‌గా, మిడ్‌క్యాప్ స్టాక్స్ లార్జ్‌క్యాప్‌గా అవతరించాయి. పెట్టుబడుల్లో మిడ్‌క్యాప్ స్టాక్స్‌కు ఎక్కువ కేటాయింపులు చేస్తుంటుంది. ఆ తర్వాత లార్జ్‌క్యాప్ స్టాక్స్‌కు ప్రాధాన్యం ఇస్తుంది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
పర్సిస్టెంట్ సిస్టమ్స్	3.83
మ్యాక్స్ ఫైనాన్షియల్	3.48
ముత్తూట్ ఫైనాన్స్	3.38
భారతీ హెక్సాకామ్	3.36
ఫోనిక్స్ మిల్స్	3.21
కోఫోర్జ్	2.79
ఫోర్టిస్ హెల్త్‌కేర్	2.58
పీబీ ఫిన్‌టెక్	2.36
మోతీలాల్ ఓస్వాల్	2.15
లారస్ ల్యాబ్స్	2.12

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.4,346 కోట్ల పెట్టుబడులున్నాయి. ఇందులో 97 శాతం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. వీటిని పరిశీలిస్తే మిడ్ క్యాప్ స్టాక్స్‌లో 56.36 శాతం ఎక్స్‌పోజర్ కలిగి ఉంది. లార్జ్‌క్యాప్ కంపెనీలకు 32.61 శాతం కేటాయించింది. స్మాల్‌క్యాప్స్‌లో 9.53 శాతం ఇన్వెస్ట్ చేసింది. పోర్ట్‌ఫోలియోలో ఏకంగా 120 స్టాక్స్‌ను కలిగి ఉంది. పైగా టాప్ 10 స్టాక్స్‌లో పెట్టుబడులు 29 శాతం మించి లేవు. అంటే పెట్టుబడుల్లో ఏకీకృత రిస్క్‌ను తగ్గించే విధంగా పెట్టుబడులున్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ స్టాక్స్‌లో 25.4 శాతం ఇన్వెస్ట్ చేసింది. హెల్త్‌కేర్ కంపెనీలకు 15.48 శాతం, టెక్నాలజీ కంపెనీలకు 15.24 శాతం, ఇండస్ట్రియల్స్ కంపెనీలకు 13.45 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషినరీ కంపెనీలకు 12 శాతం చొప్పున కేటాయించింది.

బాలికపై సామూహిక లైంగిక దాడి

కిడ్నాప్ చేసి మరీ ఘాతుకం

తిరువొత్తియూరు: ఓ పాఠశాల విద్యార్థినిపై నలుగురు మైనర్లు సామూహిక అత్యాచారం చేసిన ఘటన పుదుచ్చేరిలోని బాగూరులో జరిగింది. పుదుచ్చేరికి చెందిన 14 ఏళ్ల బాలిక అక్కడి ఓ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కొద్ది రోజుల క్రితం పాఠశాలకు వెళ్లిన బాలిక ఇంటికి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు పలుచోట్ల గాలించినప్పటికీ ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో బాలిక బాగూరు ప్రాంతంలో ఉన్నట్లు తల్లిదండ్రులకు సమాచారం అందింది. దాని ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టారు. 'ప్రేమిస్తున్నానంటూ ఓ బాలుడు విద్యార్థినిని కిడ్నాప్ చేసి, ఓ ఇంట్లో బంధించాడని, అక్కడ మరో ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు. విద్యార్థినిని రక్షించి, నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉడుము జననాంగాలతో ప్రేమ మంత్రం

సాక్షి బెంగళూరు: బెంగళూరులో ఓ మాంత్రికుడు ఉడుము జననాంగాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తూ పట్టుబట్టాడు. ప్రేమ కోసం వశీకరణం, ప్రేమ వివాహాలు, ప్రేమ కలహాలకు ఈ ఉడుము జననాంగాలు పరిష్కారం చూపిస్తాయని, ఇందులో మాంత్రిక శక్తి ఉందని ప్రజలను నమ్మిస్తూ పెద్ద మొత్తానికి అమ్ముతున్నాడు. నిందితుణ్ని దక్షిణామూర్తి(45)గా గుర్తించారు. ఇతడు తమిళనాడు, ఇతర ప్రాంతాల నుంచి ఉడుములను సేకరించి విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇతని అక్రమ వ్యాపారం గురించి ఓ జీవకారుణ్య సంస్థకు తెలియడంతో వారు డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), పోలీసులకు సమాచారమివ్వగా విషయం వెలుగుచూసింది. రహస్య ఆపరేషన్‌లో భాగంగా ఓ జీవకారుణ్య సభ్యుడు సాధారణ వ్యక్తిలా నాగశెట్టి హళ్లిలోని మూర్తి ఇంటికి వెళ్లి తన సమస్యకు పరిష్కారం చూపాలని విన్నవించారు. రూ.10 వేలు ఇస్తే ఉడుము మర్మాంగాలను అందజేస్తానని, వాటితో సమస్య తీరిపోతుందని మాంత్రికుడు చెప్పాడు. ఆ సమయంలో డీఆర్ఐ సిబ్బంది, పోలీసులు మాంత్రికుడిని అదుపులోకి తీసుకుని, 206 ఉడుము జననాంగాలను, 1.5 కేజీల సముద్ర కోరల్స్, పులి చర్మం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. మూర్తిపై వన్యజీవి రక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు.

డ్రైవర్ రహిత మెట్రో రైలు ట్రయల్ రన్ విజయవంతం

వడపళని-పోరూర్ మార్గంలో దూసుకుపోతున్న మెట్రో రైలు

సాక్షి, చెన్నై: డ్రైవర్ రహిత మెట్రో రైలు చెన్నైలో పట్టాలెక్కింది. వడపళని నుంచి పోరూర్ వరకు తొలిరోజు ట్రయల్ రన్‌ను అధికారులు విజయవంతం చేశారు. మరో వారం రోజులపాటు ఈ ట్రయల్ రన్‌ను నిర్వహిస్తారు. పూందమల్లి నుంచి వడపళని వరకు మెట్రో డబుల్ డెక్కర్ వంతెన రూపు దిద్దుకుంటున్న విషయం తెలిసిందే. ఈ మార్గంలో పూందమల్లి నుంచి పోరూర్ వరకు ఇప్పటికే తొమ్మిది కి.మీ మేర పనులు పూర్తిచేశారు. దీంతో.. మరికొద్ది రోజుల్లో డ్రైవర్ రహిత మెట్రో సేవలు పూర్తిస్థాయిలో ప్రారంభం కానున్నాయి. అదే సమయంలో పోరూర్ నుంచి వడపళని వరకు డబుల్ డెక్కర్ వంతెన పనులు కూడా ఐదు కి.మీ మేర పనులు పూర్తయ్యాయి. ట్రాక్ ఏర్పాటు, సిగ్నలింగ్ తదితర పనులన్నీ ముగించారు. అధికారులు శని, ఆదివారాల్లో విస్తృతంగా పరిశీలించారు. డ్రైవర్ రహిత మెట్రో రైలును పోరూర్ నుంచి వడపళని వరకు, వడపళని నుంచి పోరూర్ వరకు పట్టాలెక్కించారు.

కన్వర్షన్ చేయరు.. పదోన్నతులు ఇవ్వరు..

- ఏవో, డిప్యూటీ డీవీఈవో పోస్టుల కన్వర్షన్‌పై ఎటూ తేల్చని ప్రభుత్వం
- డీఐఈవోలుగా జూనియర్ ప్రిన్సిపాళ్లు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ బోర్డులో పోస్టుల మార్పుపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పోస్టుల విభజన చేసిన ప్రభుత్వం కొన్ని పోస్టుల కన్వర్షన్‌పై ఎటూ తేల్చడం లేదు. దీంతో కమిషనరేట్ అధికారులు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లకు ఎఫ్ఏసీ (పూర్తి అదనపు బాధ్యతలు) అప్పగిస్తున్నారు. అయితే ఈ విధానంలో తమకు అన్యాయం జరుగుతోందని సీనియర్లు ఆరోపిస్తున్నారు. పైరవీలు చేసుకున్న వారికే అధికారులు అవకాశం కల్పిస్తున్నారని సీనియర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో జిల్లాల విభజన తర్వాత ఇంటర్మీడియట్ బోర్డులో జిల్లా స్థాయి పోస్టులతో సహా ఉద్యోగులను జిల్లాలకు సర్దుబాటు చేశారు. ఈ క్రమంలో ఏవో/ డిప్యూటీ జిల్లా వొకేషనల్ ఎడ్యుకేషనల్ (డీఐఈవో) అధికారి పోస్టులను కొత్త జిల్లాలకు కేటాయించారు. దీంతో పాటు ఆ పోస్టులను జిల్లా వొకేషన్ ఎడ్యుకేషనల్ అధికారిగా మార్చాలని (కన్వర్షన్)

జిల్లాకు ఒక్క అధికారే ఉండేలా..

ఉమ్మడి జిల్లాల్లో జిల్లా వొకేషన్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీవీఈవో), డిప్యూటీ వొకేషన్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్/ ఏవో, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి (ఆర్ఐవో) పోస్టులు ఉండేవి. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత పోస్టుల రీ ఆర్గనైజేషన్ చేస్తూ జిల్లాకు ఒక్కరే అధికారి ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో డీవీఈవో పోస్టును జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈవో)గా మార్చారు. ప్రస్తుతం పాత జిల్లాలకు డీఈవోలు ఉండగా, కొత్తగా ఏర్పడిన జిల్లాలకు ఇన్‌చార్జిలే దిక్కుగా ఉన్నారు.

ఇదీ పరిస్థితి

అధికారులు ప్రభుత్వానికి, ఆర్థిక శాఖకు ఫైల్ పంపారు. దీనిపై ఇప్పటివరకూ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అలాగే, జిల్లా వొకేషన్ ఎడ్యుకేషనల్ అధికారి పోస్టు పేరు ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్‌గా మార్పుచేశారు. దీంతో పాత జిల్లాల్లోని డీవీఈవోలు డీఐఈవోలుగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, కొత్త జిల్లాలకు మాత్రం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లకు డీఐఈవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వీరు తమ కాలేజీ నిర్వహణతో పాటు జిల్లా బాధ్యతలు కూడా చూస్తూ ఒత్తిడికి గురవుతున్నారు.

నేడు పీఎస్ఎల్‌వీ సీ-62 ప్రయోగం

ఉదయం 10.17 గంటలకు నింగిలోకి దూసుకెళ్లనున్న రాకెట్

- అనంతరం 17.54 నిమిషాలకు కక్ష్యలోకి ఈఓఎస్-ఎన్1తో పాటు మరో 15 బుల్లి ఉపగ్రహాలు
- ఆదివారం మధ్యాహ్నం 12.17 గంటలకు ప్రారంభమైన కౌంట్‌డౌన్

ఈఓఎస్-ఎన్1 ఉపగ్రహం..

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగవేదిక నుంచి సోమవారం ఉదయం 10.17 గంటలకు పీఎస్‌ఎల్‌వీ సీ-62 ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించనుంది. ఈ ప్రయోగానికి 22 గంటల ముందు.. ఆదివారం మధ్యాహ్నం 12.17 గంటలకు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ కౌంట్‌డౌన్ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆదివారం సాయంత్రం నాలుగో దశలో 2.5 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపారు. రాత్రి 12 గంటల తరువాత రెండోదశలో 41.8 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియ చేపట్టారు. ఆ తరువాత రాకెట్‌లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలను అప్రమత్తం చేసే ప్రక్రియను చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రయోగం ద్వారా 1,485 కిలోల బరువు కలిగిన ఈఓఎస్-ఎన్1 (అన్వేష్) ఉపగ్రహాన్ని, మరో 15 చిన్న ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశపెట్టనున్నారు. ఈ చిన్న ఉపగ్రహాల్లో మనదేశంలోని మూడు స్టార్టప్ కంపెనీలకు చెందిన ఏడు, విదేశాలకు చెందిన ఎనిమిది ఉన్నాయి. వీటిని న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ పర్యవేక్షణలో వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నారు. రాకెట్ ప్రయోగించిన తరువాత 17.54 నిమిషాలకు స్పెయిన్ దేశానికి చెందిన బుల్లి ఉపగ్రహం మినహా మిగిలిన ఉపగ్రహాలను భూమికి 600 కిలోమీటర్ల ఎత్తులోని సన్ సింక్రనస్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెడతారు. ఈ దఫా రాకెట్‌లోని నాలుగోదశ (పీఎస్-4)తో కొత్త ప్రయోగం చేస్తున్నారు. ఉపగ్రహాలను కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తరువాత రాకెట్‌లోని నాలుగోదశను క్రమేణ కిందకు దించుతూ రెండుసార్లు రీస్టార్ట్ చేస్తారు. ఆ తరువాత స్పెయిన్‌లోని స్పానిష్ స్టార్టప్ సంస్థకు చెందిన కెస్ట్రెల్ ఇనిషియల్ టెక్నాలజీ, డిమాన్‌స్ట్రేటర్ (కిడ్) అనే పేలోడ్‌ను అంతరిక్షంలోకి ప్రవేశపెడతారు. అనంతరం అది భూ వాతావరణంలోకి ప్రవేశించి దక్షిణ ఫసిఫిక్ మహాసముద్రంలో పడిపోయే విధంగా ప్రణాళిక రూపొందించారు.

షార్ రోడ్డులో ముమ్మర తనిఖీలు

సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌కి పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. షార్‌కి వెళ్లే మార్గంలోని అటకానితిప్ప వద్ద భద్రతాదళాలు తనిఖీ చేస్తున్నాయి. ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా వస్తున్న పర్యాటకుల ముసుగులో ఎవరైనా వచ్చే అవకాశం ఉండడంతో తనిఖీలను ముమ్మరం చేశారు. షార్ ప్రధాన గేటు వద్ద కూలంకషంగా పరిశీలిస్తున్నారు. ప్రయోగం అయ్యే వరకు బంగాళాఖాతంలో, పులికాట్ సరస్సులో ఎవరూ చేపలవేటకు వెళ్లరాదని షార్ అధికారవర్గాలు ప్రకటించాయి. సముద్రం వైపు కోస్ట్‌గార్డ్స్ గస్తీ చేపట్టారు. షార్, అటవీప్రాంతంలో షార్‌లో భద్రతా దళాలు కూంబింగ్ నిర్వహించాయి.

డీఆర్‌డీవో రూపొందించిన ఈఓఎస్-ఎన్1

పీఎస్ఎల్‌వీ సీ-62 ద్వారా ప్రయోగించనున్న ఈఓఎస్-ఎన్1 (అన్వేష్) ఉపగ్రహాన్ని భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో రూపొందించింది. దీన్ని ప్రధానంగా దేశ రక్షణ కోసం ఉపయోగించనున్నారు. గూఢచారి ఉపగ్రహాల కుటుంబంలో ఇది అత్యంత సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉన్న ఉపగ్రహం.

షేర్ మార్కెట్‌లో లాభాల పేరుతో రూ.1.23 కోట్లు స్వాహా

తిరువొత్తియూరు: ఆన్‌లైన్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి చెన్నై విల్లివాక్కం ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.23 కోట్లు స్వాహా చేసిన కేసులో తమిళనాడులోని ఈరోడ్‌కు చెందిన నిందితుడిని చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్(సైబర్ క్రైమ్) పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై విల్లివాక్కం ఏరియాకు చెందిన మహేంద్రన్ వాట్సాప్‌నకు ఇటీవల ఆన్‌లైన్ షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు పొందవచ్చని ఓ మెసేజ్ వచ్చింది. దానిని నమ్మిన మహేంద్రన్ ఆ మెసేజ్‌లో వచ్చిన లింక్ ద్వారా ఒక యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రూ.లక్ష పెట్టుబడి పెట్టాడు. ఆ యాప్‌లో లాభం వస్తున్నట్లు చూపించడంతో డబ్బును అతను తిరిగి తీసుకోవడానికి ప్రయత్నించాడు. అప్పుడు డబ్బులు తీసుకోవడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయని, మరింత డబ్బు చెల్లించాలని గుర్తు తెలియని వ్యక్తులు అతనిని నమ్మించారు. దీంతో వారు చెప్పిన విధంగా వివిధ బ్యాంకు ఖాతాల్లో రూ.1.23 కోట్లు జమ చేశాడు. ఆ తర్వాత కూడా డబ్బులు తీసుకునే అవకాశం కల్పించకపోవడంతో మోసపోయానని గ్రహించిన మహేంద్రన్... చెన్నై నగర పోలీస్ కమిషర్‌కు ఫిర్యాదు చేశాడు. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్(సైబర్ క్రైమ్) పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ మోసంతో సంబంధం ఉన్న ఈరోడ్ మూలపాళయం ప్రాంతానికి చెందిన సెంథిల్ కుమార్(41)ను శనివారం అరెస్ట్ చేశారు.

కేంద్రంపై ఆరోపణలు ఆపాలి

సినీనటి, బీజేపీ నేత కుష్బు

తమిళసినిమా: ప్రతి విషయానికి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం మానుకోవాలని సినీనటి, బీజేపీ తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుష్బు పేర్కొన్నారు. నటుడు విజయ్ నటించిన జననాయకన్ చిత్రం సెన్సార్ సమస్యలను ఎదుర్కొనడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుపట్టే విధంగా శనివారం సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. ఈ నేపథ్యంలో ఆదివారం చెన్నై విమానాశ్రయంలో కుష్బు మీడియాతో మాట్లాడుతూ జననాయకన్ చిత్రం సెన్సార్ సమస్యకు కేంద్ర ప్రభుత్వం కారణమని ఆరోపించేవారు ఆలోచించి మాట్లాడాలన్నారు. సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసే ముందు విధివిధానాలను పాటించాలని చెప్పారు.

*Best-in-class power in Air/Oil cooled 160cc class | ^Ex-showroom price of Apache RTR 160 Black Edition | **Applicable on 5.99% ROI scheme | #Schemes are at the sole discretion of the financier – T&C Apply; Bonus up to ₹ 4000 with TVSCS.

TVS CREDIT SHRIRAM Finance HINDUJA LEYLAND FINANCE L&T Finance IDFC FIRST Bank HDFC BANK

FOR ALL INSTITUTIONAL/BULK REQUIREMENTS PLEASE MAIL corporatecustomersupport@tvsmotor.com. **Authorised Main Dealer: Vijayawada:** Casa TVS Vijayawada: 9100759111, CMR TVS Vijayawada 8345999999, Garapati TVS Vijayawada: 9160493366, CMR TVS Bhavanipuram: 9154164863,CMR TVS Nuzividu: 8019596622, CASA TVS Gudiwada: 9100759444, CASA TVS Kanuru: 9100759333, CASA TVS Machilipatnam: 7995512444, CASA TVS Ganavaram: 9100759555, Pratap TVS Jaggaipeta: 9133563222, Pratap TVS Kanchikacherla: 9133565222, Pratap TVS Nandigama: 9133564222, Rana Vehicles Pvt. Ltd., Avanigadda: 9397123457, Vamsi Automobiles Kankipadu: 9985125999, Rana Vehicles Pvt. Ltd. Challapalli: 9397123457, Sai Ram Automobiles Vuyyuru: 9848173749, CMR Automotives Pvt. Ltd. Ibrahimpatnam: 9154170739, CMR Automotives Pvt. Ltd. One Town: 9154170743, Sri Jagadabhi Rama Automotives Hanuman Junction: 9885226828, Balaji Enterprises Tiruvuru: 9885122614, Teja Motors Mylavaram: 8897524339. **Authorised Main Dealer: Guntur:** Pioneer TVS Guntur 7997970011, Pioneer TVS Amaravathi Road 7997970012, Pioneer TVS Autonagar 7997970014, Pioneer TVS Tenali 7997970016, Pioneer TVS Vidhyanagar 7997970013, Pioneer TVS Mangalgiri 7997970015, Unity TVS Narasaraopet 8712650849, Unity TVS Chilakaluripet 8712650855, Unity TVS Vinukonda 8712650825, Pawan Sai Motors Ponnur: 9959039097, Sayed Motors Bapatla: 9701309789, Pavan Automotives Repalle: 9885709107, Vijaya Lakshmi Enteprises Cherukupalli: 9642922808, Pavan Motors Kolluru: 9885709107, Sai Balaji Automotives LLP Tadikonda: 9505607786, Kartikeya Motors Prathipadu: 9290331115, Nagendra Motors Krosuru: 8099725155, Uma Automobiles Peddanandipadu: 9908235999, Lakshmi Ganapathi Automotives Amaravathi: 7095924466, Maheswari Automobiles Satenapalli: 9394192329, Chinmaye Automotives Tadepalli: 7799958588, Gayathri Motors Phirangipuram: 9866373866, Hanuman Motors Dachepalli: 9704861423, Sainath Automotives Piduguralla: 9849652039, Ayodhya Motors Gurazala: 9182096480, Sri Vatsasa Stores Macherla: 9966755557. **Authorised Main Dealer: West Godavari (Tadepaligudem):** Gnapika TVS Satrampadu Eluru 7095706969, Gnapika TVS Old Bus Stand 7095701818, Eswara TVS Bhimavaram 7997993277, Eswara TVS Palakolu 7997998266, Sri Krishna TVS Tanuku: 7702511992, Sri Durga Automobiles, Narasapur: 7997998256, Gnapika Automobiles Private Li , Kandrikagudem: 7095706969, Pavithra Motors , Koyyalagudem: 9059906703, Eswara Automotives LLP, Mogaltur: 7997993268, Venkat Sri Automotives, Jangareddygudem: 9492733338, Sun Automotives, Chintalapudi: 9908958794. **Authorised Main Dealer: Prakasham (Ongole):** Elite TVS Ongole 7095559009: Vishnupriya TVS Ongole 7799121619, Vishnu Priya TVS Chirala 6281023626, Suguna Automotives, Darsi: 9536225588, Siva Priya Automotives, Addanki: 9985130799, Sri Sai Srinivasa Automobiles, Giddalur : 9394893246, Susmitha Motors, Medarametla: 9632301264, Pavithra Sai Automobiles, Markapur: 9440355913, Gayathri Motors, Inkollu: 9573272099, A & A Automotives, Marturu: 9704663217, Rani Motors, Singarayakonda: 8341785467, JRR Automotives, Cumbum: 7330996544, Tirumala Sai Automotives, Dornala: 9010800500, Sri Balaji Motors, 9966643264, Vasavi Auto Enterprises Kanigiri: 9059723608, Sri Varahi Automotives Kandukur: 9010402532. **Authorised Main Dealer: Nellore:** Vishnupriya TVS Nellore: 9392746689, Ahmad Automotives, Podalakur: 9052255031, Sri Venkateswara Motors, Naidupeta: 8978142655, Srirama Automobiles, Kota: 9440745747, Nandi Motors, Atmakur: 9663868616, Sri Poojitha Automobiles, Udayagiri: 8790807905, Sri Ganesh Motors, Kavali: 9849442133, Varun Motors, Buchi Reddypalem: 9491923143.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)..
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం మహంకాళి ఆలయానికి నరసరావుపేటకు చెందిన కొవూరు శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు ఆదివారం రూ.1.00.116లు విరాళంగా అందజేశారు.

నిత్యసహాయమాతకు ప్రార్థనలు

మాచర్ల: స్థానిక నిత్యసహాయమాత (ఆర్‌సీఎం) చర్చిలో ఫాదర్ బాలస్వామి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జర్మనీకి చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

కూడారై ఉత్సవం

దుగ్గిరాల: స్థానిక రైలుపేటలోని పసుపు యార్డు సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కల్యాణం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కూడారై ఉత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

కనుల పండువగా నగర సంకీర్తన

తెనాలిటౌన్: ఆధ్యాత్మిక భావనతోనే మానవ జన్మ చరితార్థమవుతుందని, ధనుర్మాసం దేవతలకు బ్రహ్మ ముహూర్త కాలమని సంగీత విద్వాంసురాలు నేరెళ్ల వరలక్ష్మి కళ్యాణి అన్నారు. ధనుర్మాసం సందర్భంగా తెనాలిలో ఆదివారం నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. మహిళలు వీధులలో భజనలు, నృత్యం చేస్తూ భక్తిని, ఆధ్యాత్మిక భావనను పెంపొందించే దిశగా కృషి చేశారు. ధనుర్మాసం అనగా దేవతలకు బ్రహ్మ ముహూర్త కాలం వంటిదని, ఈ రోజుల్లో దేవతలు అత్యంత ప్రీతి చెందుతారని చెప్పారు. పూజా, గానం, యజ్ఞం, ఇత్యాది విషయాలు సంపూర్ణంగా స్వీకరిస్తారని వివరించారు. కార్యక్రమంలో చిన్నమయి సంగీత శిక్షకులు ఆంజనేయశాస్త్రి, నృత్య గురువు నిర్మల రమేష్, ఎన్‌సీసీ అధికారి బెల్లం కొండ వెంకట్, గాయని వరుఖుల సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

కొల్లూరు: గంధ మహోత్సవ వేడుకలు బాపట్ల జిల్లా కొల్లూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్‌లో వెలసిన హజరత్ ఖాజ్వా గరీబ్ నవాజ్ రహమతుల్లా అలైహి పేరిట ముస్లింలు భక్తి శ్రద్ధలతో గంధ మహోత్సవం జరిపారు. తొలుత స్థానిక జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం, ప్రత్యేకంగా అలంకరించిన జెండాను కొల్లూరు వీధుల్లో ఊరేగింపుగా తరలించారు. గంధ మహోత్సవ వేడుకలలో హిందువులు పాల్గొని మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయకీలాద్రిపై కూడారై మహోత్సవం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణం సీతానగరంలో ఉన్న విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఆదివారం కూడారై మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన జీయర్‌స్వామి మంగళ శాసనాలతో 108 గంగాళాలతో కూడారై ప్రసాదం (పాయసం) పాత్రలను గోద రంగనాథులకు సమర్పించామని, అనంతరం పాసుర విన్నపాన్ని గావించామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించి గోదా అమ్మవారి అనుగ్రహాన్ని పొందారని పేర్కొన్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయంలో ధనుర్మాసం సందర్భంగా కూడారై మహోత్సవాన్ని ఎంతో విశేషంగా జరుపుకుంటారని తెలిపారు.

581 ఇత్తడి గంగాళాలతో స్వామివారికి పాయస నివేదన

తెనాలిటౌన్: శ్రీ శరణాగతి గోష్ఠి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ నరేంద్ర రామానుజ దాస స్వామి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ సమీపంలోని వీఎస్సార్ కళాశాల రోడ్డులో జరుగుతున్న 12వ ధనుర్మాస వ్రత మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా 27వ రోజు ఆదివారం వేలాది మంది భక్తులు పాల్గొని 581 ఇత్తడి గంగాళాలతో స్వామివారికి పాయస నివేదన చేశారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి నిష్ఠగా భక్తి ప్రపత్తులతో పూజలు నిర్వహించారు. అనంతరం పాయస నివేదన చేశారు.

భక్తిప్రపత్తులతో ధనుర్మాస పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం కూడారై ఉత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి, శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు, ఆంజనేయస్వామిలకు ప్రత్యేక అలంకరణ చేశారు.

పశ్చిమ నియోజకవర్గం ముగ్గుల పోటీలు ఫైనల్స్‌లో పాల్గొన్న మహిళలు

కోడిపుంజులతో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, ఆర్‌కె రోజా, చిత్రంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు నూరిఫాతిమా, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

• సందడిగా ముగ్గుల పోటీలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి ముగ్గులు పోటీలు జరిగాయి. పశ్చిమ నియోజకవర్గంలోని వెంకటరమణ కాలనీలోని మెట్టు అంజిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఆర్కే రోజా హాజరయ్యారు. పోటీలలో 676 మంది మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అంబటి, రోజాలు కోడి పందేలు వేసి జోష్ నింపారు.

- పట్నం బజారు(గుంటూరు ఈస్ట్)

హరిలోరంగ హరి..

- సంక్రాంతికి ప్రతీకలుగా హరిదాసులు
- ధనుర్మాసంలో గ్రామాల్లో హరిదాసులకు విశేష ఆదరణ
- రాముడి రాజ్యం నుంచి హరిదాసులు ఉన్నారని నానుడి
- కొన్ని ప్రాంతాల్లో కనిపించని, వినిపించని హరిదాసు గానం

ప్రత్తిపాడు: ధనుర్మాసం.. ప్రభాత వేళ.. 'హరిలో రంగ హరి' అంటూ పల్లె ముంగిట వినిపించే హరిదాసుని గానం సంక్రాంతికి ప్రతీక. రామరాజ్యం నుంచి వస్తున్న సంప్రదాయం, పాశ్చాత్య పోకడల ధాటికి కాస్తంత మసకబారుతున్నప్పటికీ సంక్రాంతికి హరిదాసు పాత్ర ప్రత్యేకం. వీధుల్లో వినిపించే హరిగానం సంక్రాంతి శోభను కళ్లకు కడుతుంది. ధనుర్మాసంలో గ్రామగ్రామాన కనిపించే హరిదాసులపై ప్రత్యేక కథనం..

సంక్రాంతి నెలలో మనకు కనిపించే గొప్ప సంప్రదాయాల్లో ఒకటి హరిదాసుని గానం. పూర్వం పల్లె, పట్టణం తేడా లేకుండా తెల్లవారుజామునే, ఇంటి ముంగిట ముగ్గులేసే సమయానికే పురవీధుల్లో హరినామ గానం చేస్తూ కీర్తనలతో అలరిస్తూ హరిదాసులు ప్రజలు ఇచ్చే ధన, ధాన్యాలను స్వీకరించేవారు. వీరి రాక సంక్రాంతి నెలకు శోభను తెస్తుంది. ధనుర్మాసాన్ని గుర్తు చేస్తుంది.

రాముడి రాజ్యంలో

శ్రీరాముడి రాజ్యంలో చింతలు లేవు. కరువు కాటకాలు రావు. దాన ధర్మాలు చేద్దామన్నా పుచ్చుకునే వారే కరువయ్యారని ప్రజలు ధర్మదేవతను ఆడిపోసుకునేవారట. అది విన్న వేగులు రాముడితో విషయాన్ని చెప్పగా వారి దాన ధర్మాలను పుచ్చుకునేందుకు హరినామాన్ని గానం చేసే గాయకులను రాజ్యంలో తిరిగేలా చేశారని, వారే నేడు కనిపించే హరిదాసులని పండితులు, పెద్దలు, పూర్వీకులు చెబుతుంటారు.

పరమ పవిత్రం అక్షయపాత్ర..

అక్షయ అనగా ఎప్పుడూ నిండుగా ఉండేదని అర్థం. పంచలోహంతో తయారు చేసిన అక్షయపాత్రను శిరస్సుపై ధరిస్తారు. అక్షయపాత్రకు ఎంతో చరిత్ర ఉంది. ఈ పాత్ర శిరస్సుపై ఉన్నంత వరకు అకుంఠిత దీక్షతో నారాయణుడే గ్రామాల్లో సంచరిస్తున్నాడనేంత పవిత్రంగా ఉంటారు. అక్షయపాత్ర నిండిన సమయంలో బిక్షను సమీప ఇంటిలో భద్రపరుస్తారు. ఈ పాత్రలో బిక్షవేయడం స్వయంగా నారాయణుడికి నైవేద్యం సమర్పించినట్లేనని పెద్దలు చెబుతుంటారు.

సంప్రదాయం 'హరీ'

కల్చర్ మారుతోంది. పాశ్చాత్య పోకడలు శృతిమించిపోతున్నాయి. సంప్రదాయాలు ఒక్కొక్కటిగా కనుమరుగవుతున్నాయి. అందులో భాగంగా హరిదాసుల రాకడ కూడా తగ్గిపోతుంది. ఒకప్పుడు ప్రతి గ్రామంలో ధనుర్మాసంలో దర్శనమిచ్చే హరిదాసులు.. ఇప్పుడు అక్కడక్కడా మాత్రమే కనిపిస్తున్నారు. కారణం వారికి గ్రామాల్లో ఆశించినంతగా ఆదరణ లేకపోవడం, నేటి తరం వీరి పట్ల పూర్వపు ఆదరణను చూపకపోతుండటమేనని తెలుస్తోంది.

హరిదాసుడంటే..

హరిదాసు అనగా పరమాత్మకు ప్రతిరూపం అని చెబుతుంటారు. హరిదాసుల రాక సంక్రాంతికి సంకేతం. ఆకర్షణీయమైన తెల్లని పంచె, ఒక చేతిలో చిడతలు, మరో చేతిలో తంబుర, దేహంపై హరినామాలు, తలపై అక్షయ పాత్ర, మెడలో పూలదండ, కాళ్లకు గజ్జెలతో హరిదాసులు గ్రామాల్లో కనిపిస్తారు. ప్రజలు ఇచ్చే దాన ధర్మాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు కలగాలని దీవించే వారే హరిదాసులు. ధనుర్మాసం ఆరంభమైన నాటి నుంచి సరిగ్గా నెల రోజుల పాటు వీధివీధినా హరి నామాన్ని గానం చేస్తూ పండుగ నాడు ధన, ధాన్య, స్వయంపాకాలను స్వీకరిస్తారు.

ఇళ్లల్లో చోరీలకు పాల్పడే పాత నేరస్తుడు అరెస్ట్

- 28 ఏళ్లల్లోనే పది కేసులు, రౌడీషీట్ నమోదు
- రూ.9.11 లక్షల విలువైన సొత్తు సీజ్ చేసిన పోలీసులు

నగరంపాలెం: ఇళ్లల్లో చోరీలకు పాల్పడే పాత నేరస్తుడ్ని తాడేపల్లి పీఎస్ పోలీసులు అరెస్ట్ చేయగా, సుమారు రూ.9.11 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. తాడేపల్లి నులకపేటలో ఉంటున్న గోలి శౌరీఆనంద్‌కుమార్ కుటుంబ సభ్యులు క్రిస్మస్ పండుగ సందర్భంగా గతనెల 24 రాత్రి చర్చికి వెళ్లారు. ప్రార్థనలు ముగించుకుని అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. మొదటి అంతస్తులోని గది వెనుక తలుపు గడియ విరిగి ఉండడాన్ని బాధితుడు గమనించాడు. బీరువాలో దాచిన రూ.2.10 లక్షలు కనిపించకపోవడంతో తాడేపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ వీరేంద్రబాబు, ఎస్‌ఐ వెంకటసాయికుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదే తరహాలో వరుసగా చోరీలు జరగ్గా, ప్రత్యేక బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో పలు చోరీ కేసుల్లో పాత నేరస్తుడు, రౌడీషీటర్ ప్రస్తుతం తాడేపల్లి నులకపేటలో ఉంటున్న కృష్ణలంక రణధీర్‌నగర్ వాసి షేక్ హుస్సేన్ అలియాస్ బెగ్గర్‌ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం రుజువై, గతంలో తొమ్మిది చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. పది దొంగతనాల కేసుల్లో రూ.4.79 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.4.32 లక్షలు సీజ్ చేశారు.

సీజ్ చేసిన బంగారం, వెండి వస్తువులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

తాళాలు తీయడంలో దిట్ట..

28 ఏళ్ల హుస్సేన్‌పై రౌడీషీట్ ఉందని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పగలు, రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడని తెలిపారు. కేవలం చేతులతోనే తాళాలను తొలగించి లోనికెళ్లేవాడని తెలిపారు. ఇంట్లోకి చేరిన క్షణాల్లో అందిన వరకు దోచేసేవాడని విచారణలో వెల్లడైందన్నారు. వరుస చోరీల కేసులను ఛేదించిన ఉత్తర డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి పీఎస్ సీఐ వీరేంద్రబాబు, ఎస్‌ఐలు ప్రదీప్, వెంకటసాయికుమార్, అపర్ణ, హెచ్‌సీలు రవి, కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు వి.ప్రసాదరావు, అనిల్, రవి, జోసెఫ్‌లను అభినందించి, ప్రశంసాపత్రాలను జిల్లా ఎస్పీ అందించారు. జిల్లాలో తరుచూ చోరీలకు పాల్పడే వారిపై పీడీ చట్టం ప్రయోగిస్తామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు.

కారును తప్పించబోయి చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరు యువకులు మృతి
- మరో ఇద్దరికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- తిరుగు ప్రయాణంలో లాం వద్ద ఘటన
- జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- పరామర్శించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు

తాడికొండ: ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి మరో కారు చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం లాం గ్రామం వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తుళ్లూరు గ్రామానికి చెందిన యువకులు గుంటూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ కార్యాలయానికి కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా లాం గ్రామ సమీపంలో వెటర్నరీ డాక్టర్స్ క్వార్టర్స్ వద్దకు వచ్చే సమయానికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి చింతచెట్టును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు వెనుక సీటులో ఉన్న కంతేటి తరుణ్(17), బాకి అఖిల్(18)లకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. మేరుగ కిరణ్, పేరం ఇంద్రలకు గాయాలు కాగా జీజీహెచ్‌కి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో పేరం ఇంద్ర పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ప్రమాదంలో చెట్టుకు తగిలి నుజ్జునుజ్జయిన కారు

కంతేటి తరుణ్

బాకి అఖిల్

హుటాహుటిన జీజీహెచ్‌కి బాల వజ్రబాబు

ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు హుటాహుటిన జీజీహెచ్‌కి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని క్షతగాత్రులను పరామర్శించారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి జీజీహెచ్ సూపరింటెండెంట్ ఇతర ఉన్నతాధికారులు, వైద్యులతో సంప్రదించి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి వారికి అంగా ఉంటానని హామీ ఇచ్చారు.

కమ్యూనిటీ.. ఉగ్గబట్టుకోవాల్సిందేనా..!

ప్రత్తిపాడు-2 సచివాలయం వద్ద తాళాలు వేసి ఉన్న మహిళల కమ్యూనిటీ టాయిలెట్

ప్రత్తిపాడులో టాయిలెట్లుకు తాళాలు

ప్రత్తిపాడు: అధికారుల నిర్వాకంతో కమ్యూనిటీ టాయిలెట్లుకు తాళాలు పడ్డాయి. కమ్యూనిటీ టాయిలెట్లుకు తాళాలు ఏమిటి.. అని ఆశ్చర్యపోతున్నారా.. అవును మరి అధికారులా మజాకా.. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గ్రామ సచివాలయం-2 వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరుగా కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మించారు. అయితే వీటిని అందరూ ఎందుకు వినియోగించుకోవాలనుకున్నారో లేక మరేదైనా కారణమో తెలియదు గానీ తాళాలు వేసేస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయం ఊరి చివర ఉండటం, అందులోనే వెలుగు, ఉపాధి, హౌసింగ్, వ్యవసాయశాఖ కార్యాలయాలు కూడా ఉండటంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు నిత్యం మహిళలు వస్తుంటారు. వీరు అత్యవసరంగా మల, మూత్ర విసర్జనలకు వెళ్లాలంటే కమ్యూనిటీ టాయిలెట్లుకు తాళాలు వేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తిరిగి వారి గ్రామాలకు వెళ్లే వరకు ఉగ్గబట్టుకుని ఉండాల్సిన దుర్గతి చోటుచేసుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కమ్యూనిటీ టాయిలెట్లుకు వేసిన తాళాలు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.

పురుషుల కమ్యూనిటీ టాయిలెట్‌కు వేసి ఉన్న తాళాలు

నాటకం ద్వారా విజ్ఞానం, వికాసం

ముగిసిన గుంటూరు కళాపరిషత్ వార్షిక నాటకోత్సవాలు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : మనిషికి విజ్ఞానం, వికాసం నాటకం ద్వారా వస్తుందని విద్యావేత్త పీవీ.శంకరరావు అన్నారు. గుంటూరు మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తోన్న గుంటూరు కళా పరిషత్ 28వ వార్షిక నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. సభకు అధ్యక్షత వహించిన పరిషత్ గౌరవ సలహాదారులు ఆలోకం పెద్దబ్బాయి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కళాపరిషత్‌ను ఆదరిస్తున్నారని అన్నారు. ఏపీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్ మాట్లాడుతూ ఎన్నో కళాపరిషత్‌లకు ఆదర్శంగా గుంటూరు కళాపరిషత్ ముందుకు వెళ్తుందని అన్నారు. టిక్కెట్ కొని నాటకం వీక్షించే ప్రేక్షకులు గుంటూరులోనే ఉన్నారని పరిషత్ ప్రధాన కార్యదర్శి బి.పూర్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ ఆడిటర్ ముప్పాళ్ళ సుబ్బారావు, సిటీ వాకర్స్ కార్యదర్శి నారదాసు కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు షేక్.సైదా పాల్గొన్నారు.

ఒక రాక్షసుడి కథ...

ఏపీ ప్రజానాట్యమండలి (విశాఖపట్నం) ఆధ్వర్యంలో ఒక రాక్షసుడి కథ నాటిక ప్రదర్శించారు. రచన, దర్శకత్వం కేకేఎల్.స్వామి చేయగా, సిటీ వాకర్స్ అసోసియేషన్ గుంటూరు వారు సమర్పించారు. మనిషి నాగరిక సమాజం ముసుగులో నేటికి అనాగరికంగా అజ్ఞానంగానే ఉన్నాడనే విమర్శనాస్త్రం ఈ నాటిక ద్వారా సంధించారు.

• ఎండమావుల్లాంటి బిడ్డల వల్ల ప్రయోజనం శూన్యం అంటూ పేరు రాసిన శాసనం అనే నాటికను ప్రదర్శించారు. గంగోత్రి పెదకాకాని ఆధ్వర్యంలో ప్రదర్శించగా, చింతకింది శ్రీనివాసరావు రచించగా, నాయుడు గోపీ దర్శకత్వం వహించగా, ఆకట్టుకుంది.

ఒక రాక్షసుడి కథ నాటికలో ఓ సన్నివేశం

వడ్డే ఓబన్న గొప్ప స్వాతంత్య్ర పోరాట యోధుడు

జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు వెస్ట్: వడ్డే ఓబన్న గొప్ప స్వాతంత్య్ర పోరాట యోధుడని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా కొనియాడారు. ఆయన జయంతి కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యే గళ్లా మాధవి, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న జీవిత చరిత్ర గొప్ప స్ఫూర్తిదాయకమన్నారు. జీవిత చరిత్రను భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. పాఠ్యాంశంగా పెట్టాలనే సూచనను జిల్లా యంత్రాంగం తరపున ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ దేశం కోసం, బడుగు వర్గాల కోసం వడ్డే ఓబన్న పని చేశారన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి స్నేహితునిగా, ప్రాణ రక్షకునిగా నిలిచారని తెలిపారు. ఒక కులానికే ఆపాదించకుండా ఓబన్న ఆశయాలను అమలు చేయడంలో సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ గౌడ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, దేవుల మల్లికార్జున, వెనుకొండ శ్రీనివాస్, జె.నాగేశ్వరరావు, చల్లా లీలా భానుప్రసాద్, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫోన్ పే చేస్తామని బంక్‌లో దోపిడీ యత్నం

రొంపిచర్ల: 'ఫోన్ పే చేస్తాం.. పెట్రోల్ కొట్టండి' అంటూ బంక్‌లోని ఆపరేటర్ వెంకట కృష్ణపై దుండగులు దౌర్జన్యం చేసిన సంఘటన మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలోని ఓ బంక్‌లో చోటుచేసుకుంది. అతడిని కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో బాధితుడి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు... శనివారం రాత్రి కారులో ముగ్గురు వ్యక్తులు పెట్రోల్ బంక్‌లోకి వచ్చారు. వారిలో ఒకడు వచ్చి ఆపరేటర్‌తో రూ.5 వేలు ఫోన్ పే చేస్తామని చెప్పాడు. రూ. 2 వేలకు పెట్రోల్ కొట్టి, రూ.3 వేలు నగదు ఇవ్వాలని అడిగాడు. ఫేక్ మెసేజ్ చూపాడు. పెట్రోల్ పోయించుకున్నాక, రూ.3 వేలు నగదు అడిగాడు. తనకు మెసేజ్ రాలేదని, స్కానర్‌తో డబ్బు పంపాలని ఆపరేటర్ చెప్పారు. ఇంతలో కారులోని మరో ఇద్దరు వచ్చి ఆపరేటర్ మెడలో ఉన్న డబ్బు సంచి లాక్కున్నారు. ఆపరేటర్ సంచి పట్టుకొని వదలకుండా వారితో పెనుగులాడాడు. కారులో వెంకట కృష్ణను బలవంతంగా ఎక్కించి తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. ఇంతలో వేరేవారు అటుగా రావడంతో దుండగులు అతడిని కారులో నుంచి బయటకు నెట్టి పరారయ్యారు. ఈ పెనుగులాటలో వెంకటకృష్ణ ఫోన్ కారులో పడిపోయింది. అతడి తలకు గాయాలు అయ్యాయి. నరసరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇదే తరహాలో నకరికల్లులో కూడా ఓ బంక్‌లో ఇదే ముఠా రూ.5 వేలను కాజేసినట్లు సమాచారం.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

కారంపూడి: మండలంలోని గంటావారిపాలెం గ్రామం ఎన్ఎస్పీ కెనాల్ పరిధిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోళ్లతోపాటు రూ. 6 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరమన్నారు.

ప్రతిభావంతులు సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలి

- సీసీఎల్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాజేంద్రప్రసాద్
- 442 మంది విద్యార్థులకు రూ.61.82 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.బసవపున్నయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: దాతల సహకారంతో ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకున్నాక సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించాలని సీసీఎల్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సీహెచ్ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 23వ ఉపకార వేతన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాజేంద్రప్రసాద్, సొసైటీ ప్రతినిధులు రూ.442 మంది ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, నర్సింగ్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రూ.61.82 లక్షల ఉపకార వేతన చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా సొసైటీ వ్యవస్థాపకులు జాస్తి వెంకటేశ్వర్లు, పుట్టగుంట వేణుగోపాల్‌రావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

- సొసైటీ ప్రెసిడెంట్ పాలడుగు లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించే లక్ష్యంతో సొసైటీ పని చేస్తోందన్నారు. సొసైటీ ప్రతినిధి నామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీ కాకతీయ స్టూడెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గత 23ఏళ్లలో 6,923 మంది విద్యార్థులకు రూ.7.50 కోట్ల మేరకు ఉపకార వేతనాలు పంపిణీ చేశామని, దీనిని ప్రతి యేటా కొనసాగిస్తామని చెప్పారు. సొసైటి చైర్మన్ డాక్టర్ కె. బసవ పున్నయ్య మాట్లాడుతూ ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని సత్ప్రవర్తన, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు.
- సొసైటీ ముఖ్యదాత పుట్టగుంట వేణుగోపాలరావు కుమార్తె డాక్టర్ పుట్టగుంట లక్ష్మీ మాట్లాడుతూ తన తల్లిదండ్రులకు చదువు అన్నా, ప్రకతి అన్నా ప్రాణమని, తన తండ్రి సొసైటీకి రూ.కోటి విరాళం ఇవ్వడం వెనుక అంతరార్థం అదేనని చెప్పారు. సొసైటీ కార్యదర్శి డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కోశాధికారి వి.గోవర్ధనరావు,సొసైటీ యూఎస్ఏ ప్రతినిధి బొప్పన ద్వారకా ప్రసాద్‌లు మాట్లడారు. కార్యక్రమంలో నాట్కో ఫార్మా ప్రతినిధి ఎన్.సదాశివరావు, కొర్రపాటి రామారావు, కావూరి ప్రసాదరావు, కొల్లా శ్రీనివాసరావు, బుచ్చయ్యచౌదరి, చుక్కపల్లి రమేష్, కొత్తా ఛాయ, యడ్లపల్లి అశోక్ కుమార్, పంచుమర్తి నాగసుశీల, దండా బ్రహ్మానందం, నరేంద్రనాథ్ చౌదరి, హరేంద్రనాథ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మనిషినే సరుకుగా మార్చిన నేటి ఆర్థిక వ్యవస్థ

ఏపీటీఎఫ్ సదస్సులో ఆర్థిక రంగ విశ్లేషకులు డి.పాపారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్థిక అసమానతలతో సమాజంలో తీవ్ర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని, సరుకులకే విలువున్న నేటి సమాజంలో మనిషి సరుకుగా మారి విలువ కోల్పోయాడని ప్రముఖ ఆర్థిక రంగ విశ్లేషకులు డి.పాపారావు అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ సారథి నూతలపాటి పరమేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏసీ కళాశాలలో విద్యాసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాపారావు 'విద్య ప్రైవేటీకరణ – ఆర్థిక అసమానతలు' అనే అంశంపై మాట్లాడుతూ పెట్టుబడి దారీ వ్యవస్థలో యజమాని కార్మిక శ్రమ దోపిడీతో లాభాలు గడిస్తూ, కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించలేని స్థితిలో ఉన్నారని అన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేస్తున్నప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ప్రతి ఏటా తగ్గుతున్నారన్నారు.

– ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి మాట్లాడుతూ 12వ పీఆర్సీ, డీఏ విడుదల, పెండింగ్ బకాయిలు, సీపీఎస్ రద్దు తదితర అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలతో ముందుకు వెళుతూ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నాయని ఆరోపించారు.కామ్రేడ్ నూతలపాటి పరమేశ్వరావు అమరుడై నాలుగేళ్ళు గడిచాయని ఆయన ఆలోచన అవగాహనతో పనిచేసినప్పుడే అతనికిచ్చే ఘన నివాళి అని వక్తలు కొనియాడారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ పాకాలపాటి రఘు వర్మ, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు, ఓపీడీఆర్ రాష్ట్ర కార్యదర్శి వి.హనుమంతరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.బసవలింగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల:విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి 2,423 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 11.6 అడుగుల నీటి మట్టం స్థిరంగా ఉంది. బ్యాంక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు,, తూర్పు కాలువకు 323, పశ్చిమ కాలువకు 130, నిజాంపట్నం కాలువకు 220, కొమ్మూరు కాలువకు 1,593 క్యూసెక్కులు బ్యారేజీ నుంచి విడుదల చేశారు.

ఓబన్న పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం

మంగళగిరి టౌన్: వడ్డే ఓబన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, సినీ నటుడు సుమన్ అన్నారు. మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం వడ్డే ఓబన్న జయంతి నిర్వహించారు. సినీ నటుడు సుమన్, పలువురు బీసీ నాయకులతో కలసి ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు, సుమన్‌లు మాట్లాడుతూ బీసీ వడ్డేర కులానికి చెందిన ఓబన్న భయం ఎరుగని వడ్డెరలు, బోయలు, చెంచులు, ఇతర వెనుకబడిన తరగతుల వారిని సైన్యంలో చేర్చి ఆనాడే బీసీల ఐక్యతను చాటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుమ్మర క్రాంతి కుమార్, నాయకులు విజయకుమార్, మూర్తి, మేకా వెంకటేశ్వరరావు, కాగితాల స్వాతి, శారద, పద్మావతి, డోగిపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తి.. వడ్డే ఓబన్న

పట్నంబజారు: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న పేరు చెబితినే గుర్తుకు వచ్చేది ఉద్యమ స్ఫూర్తి అని.. అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో ఆయన సాగించిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం కీర్తించారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో ఆదివారం వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన నిరంతర కృషి నేటి తరానికి మార్గదర్శకమన్నారు. విద్య, ఉపాధి, ఆత్మగౌరవం అనే మూడు మూల స్తంభాలపై సమాజం నిలబడాలన్నది ఆయన ధృఢ నమ్మకమన్నారు. దమకాండకు ఎదురొడ్డి నిలబడే ధైర్యాన్ని ప్రజల్లో నాటిన నేతగా ఓబన్నను గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు పఠాన్ సైదాఖాన్, జి.ప్రభు, కొండా రవి, వేలాద్రి, తురాకా రమేష్, నాగరాజు, బొల్లెద్దుల వెంకటేష్, వెంకటేశ్వరరెడ్డి, సత్యన్నారాయణరెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సినీ నటుడు సుమన్, కేశన శంకరరావు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అసెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ.
4వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్,
ఆర్.ఆర్.అప్పారావు వీధి, విజయవాడ, ఏపి - 520001.
E-mail: arb.vijayawada@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్ / కార్పొరేషన్ బ్యాంక్ ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇప్పుడు ఈ ఖాతాలు అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ కు బదిలాయించబడినవి, అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలు, కో-ఆబ్లిగెంట్స్, తనఖాదారులు మరియు హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునది ఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తము కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ వారిచే ఇ-వేలం అమ్మకం ద్వారా ది.28-01-2026న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేదీ, రిజర్వు ధర, ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.

ఇ-వేలం తేది & సమయం: 28-01-2026, మ॥ 12.00 గం. నుండి సా॥ 05.00 గం. వరకు
(10 ని॥ల అపరిమిత స్వీయ పొడిగింపులతో)

1 ఋణగ్రహీతలు / కోఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు యొక్క పేరులు మరియు చిరునామా:
ఋణగ్రహీతలు: 1) M/s వంశధార జిన్నింగ్ & ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్, దీని మేనేజింగ్ పార్టనర్ మరియు హామీదారు శ్రీ సొంతినేని వెంకటేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు, సర్వే నెం. 665/1B, 668/1, అద్దంకి – నార్కెట్‌పల్లి అంతర్రాష్ట్ర రహదారి పక్కన, కామేపల్లి (గ్రామం), పిడుగురాళ్ల (మండలం), గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522413. 2) శ్రీ సొంతినేని వెంకటేశ్వరరావు, తండ్రి పేరయ్య, డోర్ నెం. 7-213/A, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522413. 3) శ్రీ చింతలపూడి పూర్ణచంద్రరావు (భాగస్వామి & హామీదారు), తండ్రి పేరయ్య, డోర్ నెం. 7-294, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522413. 4) శ్రీ సొంతినేని నవీన్ చౌదరి (భాగస్వామి & హామీదారు), తండ్రి వెంకటేశ్వరరావు, డోర్ నెం. 7-213/A, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522413. 5) శ్రీమతి సొంతినేని లక్ష్మి (భాగస్వామి & హామీదారు), భార్య వెంకటేశ్వరరావు, డోర్ నెం. 7-213/A, పిడుగురాళ్ల, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522413. 6) శ్రీమతి గుదే రాజేశ్వరి (భాగస్వామి & హామీదారు), భార్య సాంబశివరావు, డోర్ నెం. 7-294, పిడుగురాళ్ల, గుంటూరు ...

రిజర్వుధర: రూ.82,30,000/- ధరావత్తు (10%): రూ.8,23,000/- బిడ్ పెంపుదల: రూ.83,000/-

రిజర్వుధర: రూ.18,65,000/- ధరావత్తు (10%): రూ.1,86,500/- బిడ్ పెంపుదల: రూ.19,000/-

రిజర్వుధర: రూ.18,33,000/- ధరావత్తు (10%): రూ.1,83,300/- బిడ్ పెంపుదల: రూ.19,000/-

రిజర్వుధర: రూ.13,81,000/- ధరావత్తు (10%): రూ.1,38,100/- బిడ్ పెంపుదల: రూ.14,000/-

రిజర్వుధర: రూ.13,83,000/- ధరావత్తు (10%): రూ.1,38,300/- బిడ్ పెంపుదల: రూ.14,000/-

రిజర్వుధర: రూ.13,81,000/- ధరావత్తు (10%): రూ.1,38,100/- బిడ్ పెంపుదల: రూ.14,000/-

రిజర్వుధర: రూ.13,83,000/- ధరావత్తు (10%): రూ.1,38,300/- బిడ్ పెంపుదల: రూ.14,000/-

రిజర్వుధర: రూ.19,06,000/- ధరావత్తు (10%): రూ.1,90,600/- బిడ్ పెంపుదల: రూ.20,000/-

రిజర్వుధర: రూ.14,20,000/- ధరావత్తు (10%): రూ.1,42,000/- బిడ్ పెంపుదల: రూ.15,000/-

రిజర్వుధర: రూ.66,96,000/- ధరావత్తు (10%): రూ.6,69,600/- బిడ్ పెంపుదల: రూ.70,900/-

రిజర్వుధర: రూ.1,12,32,000/- ధరావత్తు (10%): రూ.11,23,200/- బిడ్ పెంపుదల: రూ.1,20,000/-

రిజర్వుధర: రూ.24,22,000/- ధరావత్తు (10%): రూ.2,42,200/- బిడ్ పెంపుదల: రూ.24,220/-

ఆస్తి–04: గుంటూరు జిల్లా, గుంటూరు శివారు జిల్లా పరిషత్ ఏరియా, డి.నెం.1206/4, పట్టా నెం.1247 వద్ద ఉన్న ఖాళీ స్థలం. విస్తీర్ణం: 311.11 చ॥ గ॥. సరిహద్దులు: తూర్పు: ఉసిక్ల కోటమ్మ ఆస్తి, దక్షిణం: నాగేశ్వరరావు ఆస్తి, పడమర: నాదెండ్ల కమలమ్మ ఆస్తి, ఉత్తరం: రోడ్డు. డీలింగ్ ఆఫీసర్ కాంటాక్ట్ నెం.: 8106596598

రిజర్వుధర: రూ.15,41,700/- ధరావత్తు (10%): రూ.1,54,170/- బిడ్ పెంపుదల: రూ.15,417/-

వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://baanknet.com మరియు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్: https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx నందు చూడగలరు. అధీకృత అధికారి / చీఫ్ మేనేజర్ గారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు. ఆసక్తిగల బిడ్డర్లు ఆస్తి పరిశీలన కోసం Mail ID: arb.vijayawada@unionbankofindia.bank లలో సంప్రదించవచ్చు. సంప్రదించవలసిన నెం: 8197549630, 8074946928

తేది: 09-01-2026
ప్రదేశము: విజయవాడ

సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,
అసెట్ రికవరీ బ్రాంచి, విజయవాడ

ఆరు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు బియ్యం అక్రమ రవాణాను అడ్డుకునే కార్యక్రమంలో భాగంగా చేపట్టిన తనిఖీలలో భాగంగా రెండు వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న ఆరు టన్నుల బియ్యాన్ని, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏటుకూరు గ్రామంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద నెంబర్ లేని టాటా ఏస్ వాహనంలో పీడీఎస్ రైస్ బ్యాగులు నింపి పార్క్ చేసి ఉన్నట్లు సమాచారం మేరకు దాడిచేసి అందులోని మొత్తం 2.5 టన్నులు (50 కేజీలవి, 50 బస్తాలు) బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం విచారణ నిమిత్తం వాహనాన్ని నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. అదేవిధంగా పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట 5/18 లైన్ వద్ద పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరుగుతుందని టాస్క్‌ఫోర్స్ బృందానికి అందిన సమాచారం మేరకు దాడిచేసి అక్రమంగా బియ్యాన్ని రవాణా చేస్తున్న వాహనాన్ని, వాహన డ్రైవర్ పాలేటి నాగరాజును అదుపులోకి తీసుకుని, వాహనంలో ఉన్న మొత్తం 3.5 టన్నులు(50 కేజీలవి, 70 బస్తాలు) స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం వాహనాన్ని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్ ప్రయాణికుల సౌకర్యార్థం సంక్రాంతి పండుగ సందర్భంగా అనాకాపల్లి–చర్లపల్లి–అనకాపల్లి ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిందని పీఆర్ఓ వినయ్‌కాంత్ ఆదివారం తెలిపారు. అనకాపల్లి–చర్లపల్లి రైలు (07479) ఈనెల 18వ తేదీన కేటాయించడం జరిగిందని రాత్రి 10.30 గంటలకు అనకాపల్లి స్టేషన్ నుంచి బయలు దేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. చర్లపల్లి–అనకాపల్లి రైలు (07477) ఈనెల 19న మధ్యాహ్నం 12.40 గంటలకు బయలు దేరి అదే రోజు రాత్రి 9 గంటలకు అనకాపల్లి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. అనకాపల్లి – చర్లపల్లి రైలు (07478) ఈనెల 19వ తేదీన రాత్రి 10.30 గంటలకు బయలు దేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ గుంటూరులో గాని గుంటూరు పరిసర ప్రాంతాలలో మీ స్థలము, పొలము, అపార్ట్‌మెంట్‌కి హైరేంజ్ అపార్ట్‌మెంట్స్ గాని విల్లాస్ ప్రాజెక్ట్ గాని, ఓపెన్ ప్లాట్స్, వెంచర్స్ గానీ డెవలప్ మెంట్‌కి అనువైనది అని మీరు అనుకుంటే మమ్మల్ని సంప్రదించండి. ఓనర్స్ మాత్రమే. Madhu infrasructure pvt limited gachibowli, hyderabad. parkvilte.in. cell: 9121286882

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ Best Money Gold బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థల్లో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. Nlr Dt. 9150011538, 9750497504

WANTED

■ ఏరిస్ ఆగ్రో లిమిటెడ్. చెన్నకేశవ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేయుటకు మార్కెటింగ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. (Exp/Fresher) అర్హత ఏదీ డిగ్రీ / BSC Agri/ అగ్రి డిప్లొమా. ప్రదేశం : తెనాలి, మంగళగిరి, బాపట్ల, పొన్నూరు, రేపల్లె ఈ గ్రామాల వారికి ప్రాధాన్యత. 9963111817, 9908288391

■ ప్రముఖ కంపెనీకి సంబంధించి జోనల్ ఎగ్జిక్యూటివ్‌లు మరియు కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేయుటకు కావలెను. జీతం: ఎగ్జిక్యూటివ్‌లకు రూ.25,000/- ఆపరేటర్లకు రూ.17,000/- ఇవ్వబడును. సంప్రదించండి: 8520001558

■ 7Hills ఆఫీసులో వర్క్ చేయుటకు లేడీ కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. మంచి జీతం 35సం॥లోపు, గుంటూరు. సంప్ర॥ 7288877785

■ శ్రీ శాంతి హోమ్ కేర్ తెనాలి, గుంటూరు, రేపల్లె పనిచేయుటకు కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు (M/F) కావలెను. జీతం: 18వేలు. 7995123705, 7898145549

■ Jayabharat Solar Guntur Wanted Sales staff solar advisors, Attractive Salary / Commissions & incentives. Real Estate/ insurance Agents, House wives preferred Contact : 9392227337, 8977781651

■ ప్రముఖ సిటీలో పెద్దవారిదగ్గర కేర్‌టేకర్స్ ఆడ, మగ వెంటనే కావలెను. వంట చేయడానికి ఆడమనిషి కావలెను. రూమ్+ భోజనం ఫ్రీ. ఆకర్షణీయమైన జీతం. ఫోన్: 78931 20480

■ ప్రముఖ సంస్థలో Warehouse Manager, Accountant పనిచేయుటకు Stock (in-out), అకౌంట్స్ మెయింటెనెన్స్ చేయగల XL, Tally లో 2 సం॥ అనుభవం గల B.Com/ MBA అభ్యర్థులు కావలెను. ఫోన్ : 78937 32377

■ Wanted Marketing Managers Those Who Are Serious Can Only. Please Call: Salary-32,000/- At NGO Benj Circle,Vijayawada.Ph:6304328479

సాక్షి క్లాసిఫైడ్స్
రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు
గుంటూరు
7075167663
7075167541

గమనిక

క్లుప్తంగా

దుగ్గిరాలలో ఉచిత వైద్య శిబిరం

దుగ్గిరాల: దోస్త్ వన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో తాడేపల్లి మణిపాల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో ఆదివారం దుగ్గిరాలలోని జంపాల కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మిక్కిలినేని గాంధీ, మాజీ ఎంపీపీ వెనిగళ్ల కృష్ణ ప్రసాద్, గ్రామ సర్పంచ్ బాజావత్ కుషీ బాయి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శిబిరంలో బీపీ, షుగర్, క్యాన్సర్, గుండె, మూత్రనాళ, క్యాన్సర్ సంబంధిత పరీక్షలను ఉచితంగా చేశారు. గుండె, జనరల్ మెడిసిన్, క్యాన్సర్‌కు సంబంధించిన డాక్టర్లు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య సలహాలు, సూచనలు అందించారు. స్త్రీలకు సంబంధించి రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కి ప్రత్యేక అత్యాధునిక నిర్ధారణ పరీక్షలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు హరిప్రసాద్, శివకోటేష్, ఇమ్మాయేలు, దోస్త్ సభ్యులు వాసు, శ్రీనివాస్, రామస్వామి యాదవ్, సుబ్బారావు, నాయకులు వెంకట్రావు, కె.శ్రీనిత, జోగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ముగ్గుల పోటీలు రేపు

మంగళగిరి టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళగిరి పట్టణంలోని శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లో మంగళవారం ముగ్గుల పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గోపి ఆదివారం తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ పేర్లను ఆలయం వద్ద నమోదు చేసుకోవాలన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నామని.. పోటీలకు ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నామని, ముగ్గు, రంగులు పోటీదారులే తెచ్చుకోవాలని, సాంప్రదాయ దుస్తుల్లో పోటీల్లో పాల్గొనాలని ఆయన వివరించారు.

మరుగుదొడ్డిలో జారిపడి వ్యక్తి మృతి

రామారావు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి పెనుమాక గ్రామంలో ఓ వ్యక్తి బాత్‌రూమ్‌లో జారిపడి తీవ్ర గాయాలై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనుమాక గ్రామానికి చెందిన నెమలికంటి రామారావు అలియాస్ నానీ(37) సెంట్రింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం అర్ధరాత్రి బాత్‌రూమ్‌కు వెళ్లి అకస్మాత్తుగా కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమవగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ఖాజావలి తెలిపారు.

శ్మశాన వాటికలో మోటారు పంపు చోరీ

దుగ్గిరాల: హిందూ శ్మశాన వాటికలోని మోటారు పంపు, మార్చురీ బాక్స్‌లో ఉండే కొన్ని పరికరాలను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. సేకరించిన వివరాల ప్రకారం.. దుగ్గిరాల హిందూ శ్మశాన వాటికలో పలు వస్తువులను గుర్తుతెలియని వారు దొంగిలించారు. వాటిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని దోస్త్ అధ్యక్షుడు మిక్కిలినేని గాంధీ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతామని ఎస్‌ఐ వెంకటరవి పేర్కొన్నారు.

ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలి

దుగ్గిరాల: సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో రాజకీయ, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటరవి అన్నారు. ఆదివారం దుగ్గిరాల పోలీస్‌స్టేషన్‌లో ఆయన శాంతి భద్రతలను ఉద్దేశించి మాట్లాడారు. చట్ట ప్రకారం గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ముందస్తు అనుమతులు లేకుండా రోడ్ల పక్కన, పబ్లిక్ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని పేర్కొన్నారు. ముఖ్యంగా ఫ్లెక్సీలలో వివాదాస్పద వ్యాఖ్యలు ఉండరాదని.. వర్గాలను రెచ్చగొట్టే విధంగా రాతలు చేయరాదని హెచ్చరించారు. జూదం, కోడి పందేలు, పేకాట నిషేధమని వివరించారు. అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణ కెనాల్ జంక్షన్ సమీపంలో ఇప్పటం గేటు వద్ద ఆదివారం జరిగింది. నీలం రంగు స్వెట్టర్ వేసుకున్న సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని తెనాలి వైద్యశాలకు తరలించారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ ఎల్.సరస్వతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

కేక్ కట్ చేస్తున్న నాయకులు

మాట్లాడుతున్న కమాండెంట్ నగేష్‌బాబు

తాడేపల్లి రూరల్: తాడేపల్లిలోని ప్రకాష్‌నగర్‌లో కృష్ణనగర్ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వడ్డే ఓబన్న 219 జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర అధ్యక్షులు కుంచనాల కృష్ణకిషోర్, వ్యవస్థాపకులు తురక రామారావు, గౌరవ అధ్యక్షులు తురక లవ్ కుమార్‌లు వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఓబన్న చేసిన పోరాటం దేశ స్వాతంత్య్ర ఉద్యమ చరిత్రలో మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన చూపిన ధైర్య సాహసాలు, త్యాగాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. మంగళగిరిలో స్వాతంత్య్ర సమరయోధులు వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయడానికి ఖాళీ స్థలం లేని పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం పాత బస్టాండ్ సెంటర్ లేదా ఎన్నారై జంక్షన్ లేదా నేతన్న సర్కిల్ వద్ద ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ నాయకులు పరసా రంగనాథ్, ఆంజనేయులు, నాయకులు రామారావు, కొమ్మర వెంకట్, నాగరాజు, మహేష్, గోపి, కుంచాల శ్రీనివాస్, కృష్ణనగర్ వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు రాజు, నాగరాజు, శ్రీను, సాంబయ్య, పిచ్చయ్య, కొండ, సాయి, మోహన్, శివ, రాంబాబు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం

మంగళగిరి టౌన్: మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో ఆదివారం స్వాతంత్య్ర సమరయోధులు ఓబన్న జయంతిని నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ కె.నగేష్‌బాబు ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ వారిపై వీరోచితంగా పోరాడి అమరుడైన వడ్డే ఓబన్న పోరాటం యావత్ తెలుగుజాతి గర్వించతగ్గదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, అసిస్టెంట్ కమాండెంట్లు హనుమంతు, వెంకటేశ్వరరావు, కృష్ణమూర్తి, బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ఆటల పోటీలు

స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

తాడేపల్లి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తాడేపల్లి సుందరయ్య నగర్, మహానాడు ప్రాంతాల్లో ఆదివారం ఆటల పోటీలను నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బాలబాలికలు, పురుషులు, మహిళల ఆటల పోటీల్లో స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. బాటిల్ ఫిల్లింగ్, కలర్స్, స్కిప్పింగ్, కబడ్డీ, ఉట్టి కొట్టుట, షాట్‌పుట్, టగ్గాఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నార్ని నాగేశ్వరరావు, సీహెచ్ భుజంగరావు, శేఖర్, కరాటే కోచ్ సంఘవి, ఐద్వా పట్టణ కార్యదర్శి గిరిజ, గోవిందమ్మ, దేవిక, రేణుక, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కూడార్రై పూజలు

ఫిరంగిపురం: స్థానిక గీతా మందిరంలోని గోదా రంగనాథ స్వామికి ఆదివారం ధనుర్మాస పూజల్లో భాగంగా కూడార్రై పూజలు అర్చకులు వి.రాజేంద్రశర్మ నిర్వహించారు. ఉదయం ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేసి నూతన వస్త్రాలతో అలంకరించారు. గోదా అష్టోత్తర, సహస్రనామ పూజలు, కుంకుమార్చనలు చేశారు. పాశురాలు గానం చేశారు. 108 గంగాళాల్లో పాయసం చేసి స్వామివారికి విశేషనివేదన గావించారు. గీతా భజన మండలి ఆధ్వర్యంలో లలితా సహస్ర నామాలు గానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ డి.నరేంద్ర కుమార్, గుగ్గిళం మధు, కె.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

సీపీఎం ఆధ్వర్యంలో రామారావుకు నివాళులు

నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాడికొండ: అమరావతి రైతు దొండపాటి రామారావు రోడ్డు నిర్మాణంలో ఇళ్లు తొలగిస్తున్నారన్న తన ఆవేదనను వ్యక్తం చేస్తూ ప్రభుత్వ సభలో మృతి చెంది 17 రోజులైనా ప్రభుత్వం ఇంతవరకు ఆ కుటుంబాన్ని పట్టించుకోలేదని సీపీఎం నేత బాబురావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తుళ్లూరు మండలం మందడం గ్రామంలోని రైతు ఇంటి వద్ద నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన రామారావు చిత్రపటానికి పలువురు నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ప్రభుత్వం స్పందించి రామారావు కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆయా రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటి గ్రామసభలో రామారావు మంత్రి నారాయణ ముందే తన ఆవేదనను వ్యక్తం చేసి కుప్పకూలిపోయి గుండెపోటుతో మరణించారని అన్నారు. రైతు కుటుంబానికి కనీసం రూ.50 లక్షలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం అమరావతి కార్యదర్శి ఎం.రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి రంగురంగుల పతంగులు

మంగళగిరి టౌన్: తెలుగింటి సాంప్రదాయ పండుగ సంక్రాంతి వస్తోందంటే పిల్లలకు పతంగులు గుర్తుకువస్తాయి. సంక్రాంతి పండుగలో పతంగులది ముఖ్యపాత్ర. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లోని పలు దుకాణాల్లో వివిధ రంగురంగుల కాగితాల గాలిపటాలు దర్శనమిస్తున్నాయి. ఆయా మండలాల మెయిన్ బజారులోని షాపుల్లో చిన్నారులు పోటీ పడుతూ గాలిపటాలు కొంటున్నారు. విభిన్న ఆకారాలు, రంగుల్లో గాలిపటాలు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.300 వరకు ఖరీదు చేసే గాలిపటాలు మార్కెట్‌లో లభిస్తున్నాయి. మంగళగిరి మెయిన్‌బజారులోని షాపులన్నీ పతంగులతో కళకళలాడుతున్నాయి. ముఖ్యంగా కనుమ రోజు పతంగులు ఎగురవేసేందుకు దుకాణాల చుట్టూ చిన్నారులు తిరుగుతున్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే ఉపేక్షించం

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ హరిబాబు

మంగళగిరి టౌన్: మైనర్లకు తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వవద్దని.. ఈ విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని మంగళగిరి పట్టణ ఎస్‌ఐ హరిబాబు సూచించారు. మంగళగిరి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం ఆయన వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, హెల్మెట్, వాహన పత్రాలు కలిగి ఉండాలని, లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహన దారులకు అవగాహన కల్పించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న పలువురు వాహనదారులపై 10 కేసులు నమోదు చేసి, సుమారు రూ.4 వేల అపరాధ రుసుము విధించినట్లు ఎస్‌ఐ హరిబాబు పేర్కొన్నారు.

విద్యాపీఠంలో ఘనంగా కూడార్రై వేడుక

కూడార్రై వేడుకల్లో పాల్గొన్న శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ

కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

తెనాలిటౌన్: స్థానిక గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో గోదాదేవికి కూడార్రై వేడుకలు ఆదివారం 27వ రోజున అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజ్యశ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ స్వయపర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొండ క్షేత్రపీఠాధిపతి బాలస్వామిజీ మాట్లాడుతూ ధనుర్మాసం సందర్భంగా 27వ రోజున నిర్వహించిన కూడార్రై విశిష్టతను భక్తులకు వివరించారు. 108 గంగాళాలతో పాయసం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గడ్డిపాటి శ్రీనివాసరావు, పెనుగొండ వెంకటేశ్వరరావు, ఎం.రమణయ్య, గోపు రామకృష్ణ, రావూరి సుబ్బారావు, రాజేశ్వరరావు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు..

తెనాలిరూరల్: పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో విష్ణుమూర్తి గోదాదేవి పూజ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 108 గంగాళాల్లో ప్రసాదాన్ని నివేదించి పూజాది క్రతువులను నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు పర్యవేక్షించారు.

108 గంగాళాలతో గోదా పద్మావతికి ప్రసాద నివేదన

తెనాలిటౌన్: స్థానిక చెంచుపేట అమరావతి కాలనీలో వేంచేసియున్న శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 108 గంగాళాలతో ఆదివారం అమ్మవారికి ప్రసాద నివేదన చేశారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పూజాధి కార్యక్రమాలను దేవాలయ నిర్వాహణ కమిటీ సభ్యులు తుమ్మల సత్యనారాయణ వివరించారు. 14వ తేదీ అమ్మవారికి ఉదయం సారె సమర్మణ, 10 సంవత్సరాల లోపు బాలబాలికలకు భోగి పళ్ళు సమర్పించుట, సాయంత్రం 7 గంటలకు వేద మంత్రాలతో గోదారంగనాథ కల్యాణం జరుగుతుందని వివరించారు. దేవభక్తుని ఉమామహేశ్వరరావు, కె.కృష్ణారెడ్డి, గడ్డిపాటి పుష్పకుమారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కేంద్రం

తెనాలిటౌన్: అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో జరగనున్న సెమినార్లలో రైతులు పాల్గొన వలసినదిగా ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. రూరల్ మండలం నేలపాడు గ్రామంలో ఆదివారం గ్రామ సర్పంచి సోమవరపు నాగమల్లేశ్వరరావుతో కలిసి సమావేశాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. జనవరి 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సమావేశాలు జరుగుతాయని తెలిపారు. 2022 నాటికి రైతులు ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రైతాంగాన్ని మోదీ ప్రభుత్వం మోసగించిందని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కబంధ హస్తాలకు అప్పగించడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రమాదకరమైన చట్టాలు చేస్తుందని మన రైతాంగానికి నష్టకరమైన రీతిలో అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకుంటున్నదని విమర్శించారు. ఇది అమల్లోకి వస్తే ధాన్యం మొక్కజొన్న ఆక్వా, పౌల్ట్రీ, పాడి, ఆహార వాణిజ్య ఉద్యాన పంటలు పండించే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన చెందారు. వ్యవసాయాన్ని కాపాడుకోవడం కోసం రైతాంగాన్ని రక్షించుకునేందుకు జరిగే అఖిల భారత జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయప్రదం చేయాలని కోరారు. అత్తలూరి రమేష్ బాబు, సంకూరి బలరాం, సంకూరి సందీప్ లు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

తెనాలిరూరల్: సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి త్రీ టౌన్ సీఐ ఎస్.సాంబశివరావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన వీడియో సందేశం ద్వారా వివరాలను వెల్లడించారు. పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎటువంటి అసాంఘిక చర్యలకు పాల్పడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పండుగ సందర్భంగా పోలీసుల నుంచి అనుమతులు వచ్చినట్టేనని ఎవరూ భావించొద్దన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా అసాంఘిక శక్తులపై నిఘా ఉంటుందని చెప్పారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అసాంఘిక చర్యలు గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. కోడిపందేలు, పేకాట, ఇతర జూదం నిర్వహిస్తూ పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తామని స్పష్టం చేశారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో నిలిచిన విద్యుత్ సరఫరా

నులకపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మరమ్మతులు నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

తాడేపల్లి రూరల్: రాజధాని నుంచి అధికారికంగా, అనధికారికంగా నల్లమట్టి తవ్వకాలు నిర్వహించి వాటిని అధికారికంగా, అనధికారికంగా తరలించే టిప్పర్ లారీల వల్ల అవస్థలు తప్పడంలేదు. ఆదివారం తెల్లవారుజామున నులకపేటలో ఇదే తరహాలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల విద్యుత్ తీగలు తెగి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. నులకపేట తహసీల్దార్ కార్యాలయం వెనుక గల చెరువు వద్ద వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. మట్టి తోలే టిప్పర్ లారీల్లో కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా లారీను నడపడంతో తరచుగా వ్యాపారులు, విద్యుత్‌శాఖ సిబ్బందికి తిప్పలు తప్పడంలేదు. తెల్లవారుజామున ఓ లారీ డ్రైవర్ మట్టి అన్‌లోడ్ చేసి టిప్పర్ లిఫ్ట్‌ను కిందకు దించకుండా లారీని ప్రధాన రహదారి మీదకు వచ్చాడు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఉన్న 11 కేవీ 33 కేవీ విద్యుత తీగలు, ఎమ్మార్వో, ఎంఈవో కార్యాలయానికి వెళ్లే సర్వీస్ వైర్లు తెగిపోయాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌ను నిలిపివేశారు. అనంతరం మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరా పునరావృతం చేశారు.

వివేకానందుని బోధనలు ఆదర్శం

సర్వమతాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యోగా గురువు శ్రీనివాసకుమార్

మంగళగిరి టౌన్: స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి పట్టణంలోని మంగళగిరి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి ముందస్తు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని అన్నారు. వివేకానందను ఆదర్శంగా తీసుకుని అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. మానవ సేవయే మాధవ సేవ అని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆయన సూక్తులను ఆదర్శంగా తీసుకుని ప్రపంచం గుర్తించేలా ఎదగాలని పేర్కొన్నారు. సర్వ మానవాళి అస్పృశ్యతకు వ్యతిరేకంగా మానవతా విలువలను అనుసరించాలని సూచించిన స్వామి వివేకానంద బోధనలను ఆచరించాలన్నారు. అనంతరం సర్వమతాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంగళగిరి సాహితీ కళావేదిక అధ్యక్షులు గుత్తికొండ ధనుంజయరావు, శ్రీ గురు దత్తాత్రేయ ఆశ్రమం పీఠాధిపతి శ్రీ స్వామి శుభోదానంద, శ్రీ వెంకటేశ్వర యోగా సేవాకేంద్రం యోగాచార్యులు మంద్రు శ్రీనివాసకుమార్, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, ఆంధ్రప్రదేశ్ పర్యాట మండలి గాయకుడు కంచర్ల కాశయ్య, విశ్వశాంతి కళాపరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యపై స్పందించాలి

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యపై మంత్రి నారా లోకేష్ స్పందించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. ఆదివారం దీక్షా శిబిరాన్ని కార్మిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 404వ రోజుకు చేరుకున్నాయని, ఇప్పటికైనా కార్మిక వర్గ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులను ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, నాగేశ్వరరావు, సాంబశివరావు, శంషాద్దీన్, యహోషువా, అంకయ్య, బాషా, సాంబశివరావు, మాణిక్యరావు, విజయశ్రీ, దావీదు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లే మొదటి సైకాలజిస్ట్

మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సుగంధరావు

ఫిరంగిపురం: బిడ్డకు తల్లే మొదటి సైకాలజిస్ట్ అని సైకాలజిస్ట్ డాక్టర్ పి.సుగంధరావు అన్నారు. మండల కేంద్రంలోని షైన్ కోచింగ్ సెంటర్లో డీఎస్సీ అభ్యర్థుల కోచింగ్‌లో భాగంగా శిశు వికాసం, పెరుగుదల, పరిపక్వత అనే అంశంపై సుగంధరావు మాట్లాడారు. కార్యసాధకులై జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలన్నారు. శారీరక అభివృద్ధితో పాటు మానసికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. బిడ్డ పుట్టినది మొదలు వయస్సుతో పాటు వచ్చే గుణాత్మక మార్పులే మానవ పరిపక్వతకు నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో కోచింగ్ సెంటర్ డైరెక్టర్ టి.ప్రసాద్, కె.రామారావు, ఆర్.ప్రసాద్, కె.సుదర్శన్‌రాజు పాల్గొన్నారు.

మారీసుపేటలో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్

మారీసుపేట దేవాలయంలో పాల్గొన్న బీజేపీ నాయకులు, భక్తులు

తెనాలిటౌన్: పట్టణ మారీసుపేటలోని చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో జేపీ మండల అధ్యక్షుడు (వెస్ట్) యర్రంరాజు సందీప్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ 2026 ఘనంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. విశేష సంఖ్యలో భారతీయ జనతాపార్టీ నాయకులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త గ్రంధి సేతు మాధవరావు పాల్గొని మాట్లాడారు. హిందూ సమాజం ఐక్యతను చాటి చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణం రాజగోపాలచార్యులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కె.వాసుదేవనాయుడు, సిహెచ్ విజయభాస్కర్‌రెడ్డి, అన్నవరపు వేణు, బి.హనుమంతరావు, పి.ప్రసాద్, శాఖమూరి శంకరరావు, పలువురు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెనాలిటౌన్: గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయం యావత్తు హిందూ జాతికి స్ఫూర్తి కేంద్రమని, దేశం గర్వించదగ నాగరికత, సాహసాలకు చిహ్నమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి టి.అనంతాచార్యులు అన్నారు. ప్రధాని మోదీ పిలుపులో భాగంగా దేశంలోని శివాలయాల్లో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా ఆదివారం గంగానమ్మపేటలోని పాత శివాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పవిత్ర సోమనాథ్ దేవాలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో గోళ్ళ దేవరాజ్, కె.వాసుదేవ నాయుడు, అడుసుమల్లి సుధాకర్ పాల్గొన్నారు.

సన్నిధి



“సంతోషాన్ని పరిపాలించే దేశం
శాంతిని అలవాటు చేసుకున్న దేశం
సంపద కంటే సంతృప్తి ముఖ్యమనుకునే ప్రజలు
పర్వతాలే గోడలు.. శాంతే సరిహద్దుగా
వింటర్ పర్యాటకంలో ప్రధానంగా నిలుస్తోంది భూటాన్.”

భూటాన్ పర్యాటకంపై ప్రత్యేక కథనం సాక్షి ట్రావెల్ ఈపేపర్‌లో..

అదే పండగ.
కాని తీరు మారింది.
గతంలో నలుగురూ కూడి
ఆస్వాదన చేసేవారు.
ఇప్పుడు ఎంజాయ్ చేస్తున్నారు.
ఆస్వాదనలో జ్ఞాపకం మిగులుతుంది.
ఎంజాయ్‌మెంట్ క్షణికం.
పండుగ చేసుకోవడం సులభమైంది.
పెరట్లో పూచే బంతిపూల చెట్ల వరుస
నేడు కుండీలు చేరాయి.
గ్లోబల్ మార్పుల్లో
సంక్రాంతిని కొత్తగా చూడాలి...
అంటున్నారు ప్రసిద్ధ రచయిత్రి
వాడ్రేవు వీరలక్ష్మీ దేవి.

పండుగను ఆస్వాదిద్దాం

నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వచ్చిన ప్రతి సంక్రాంతి పండగ నాకు బాగా గుర్తుంది. నా చిన్నప్పుడు మా గిరిజన ప్రాంతపు పల్లెల్లో సంక్రాంతి రోజుల్లో పంటతో పాటు తోటల నుంచి తాజా చిక్కుడు కాయలు, ఏజన్సీ ముళ్ళ వంకాయలూ, పచ్చి మిరపకాయలు ఇళ్ళకు గుట్టగా వచ్చి పడేవి. తియ్య గుమ్మడి పళ్ల సరే సరి.

‘కొసరి నూరిన పచ్చి పసుపు పూత మొగాన గుమ్మడి పూ దుమారమ్ము నద్ది పండ రేగడి బండి నార కస్పండువై పొలుచు మిర్యపు పండు బొట్టు పెట్టి వచ్చె సంక్రాంతి లక్ష్మి మా ఇంటి వీధి’ అని రాసేడు ఆనాడెప్పుడో కవి.

దేశంలో ఇప్పుడు పంట ఉత్పత్తి పెరిగింది. ఎరువులు, పురుగుల మందులు మనవి కాదను కుంటే దిగుబడి పెరిగింది. బజార్ల నిండా బంతి పూలు, చేమంతి పూలు విరగబడి ఉంటున్నాయి. ఈ ఏడాది చలి కూడా బావుంది. పుష్యమాసానికి తగినట్టు ఉంది. పాత, పాత సంక్రాంతి రోజులను గుర్తుకు తెచ్చింది. మా గోదావరి జిల్లాల్లో ఇప్పటికీ ఇంత గ్లోబల్ నాగరికత వల్ల కమ్ముకొన్న పొగ అంతటిలోనూ ధనుర్మాసమంతా వీధి వీధినా వాకిళ్లలో ముగ్గులు పెడుతూనే ఉన్నారు.

మధ్యలో కొన్ని సంవత్సరాల పాటు ప్రజలు సంక్రాంతి సంప్రదాయ వేడుకలకు గ్లోబల్ మెరుపుల మధ్య పరాకు పడినట్టయేరు. ఎనభయిల్లో మా రాజవొమ్మంగికి టూరింగ్ టాకీస్ వచ్చినప్పుడు జనం సంక్రాంతి పండగని పక్కన పెట్టి విగబడి సినిమాకి పోయేవారు. ఆ రోజుల్లో పండగ తాలూకు అన్ని సంబరాలూ తగ్గేయి.

వాడ్రేవు వీరలక్ష్మీ దేవి
రచయిత్రి, సాహితీ విమర్శకులు

గ్లోబల్ నాగరికత అలా పండుగను వెనక్కు నెట్టింది. కానీ తిరిగి దేశమంతా మళ్లీ కొత్తదారుల్లో పండుగను వెతుక్కుంటోంది.



నా చిన్నప్పుడు మా పెరట్లో పశువుల శాల ఉండేది. అక్కడి ఆవు పేడ తీసుకెళ్లి మా వెదురు కంచె అవతల ఉన్న చింత చెట్టు మాను మీద గిరిజన పిల్లలతో కలిసి పిడకలు వేసేదాన్ని. ఆ చింత చెట్టు మాను దాని చుట్టూ ముగ్గురు చేతులు చాపి కౌగిలించుకుంటే పట్టే అంత పెద్దగా ఉండేది. బహుశా ఒక 300 ఏళ్ల వయసు అయి ఉంటుంది దానిది. భోగి పండగ నాటికి ఆ పిడకలన్నీ గుచ్చి భోగిమంటలో వేయటానికి. ఇది ఒక వారం రోజుల కార్యక్రమం. ఇప్పుడు అమెజాన్ నుంచి డైరెక్ట్‌గా ఆవుపేడ, పిడకలు కూడా వచ్చేస్తున్నాయి.

ప్రజలకి ఆ సంప్రదాయం కావాలి, ఎలా దొరికినా సరే. దాంట్లో ఉన్నది అందమా, పుణ్యమా, పురుషార్థమా అన్నది వేరే విషయం. మేము చదువులకి పట్టణానికి వచ్చినప్పుడు సంక్రాంతి పండక్కి మా పల్లెటూళ్ళకి తరలి వెళ్లే వాళ్ళం. ఎక్కడెక్కడ చుట్టాలూ, బంధువులూ ఇళ్లలో కలిసి పండగ చేసుకునేవారు. ఇవాళ మనిషి రోజులో ఎక్కువ గంటలు సెల్‌ఫోన్‌తో జీవిస్తున్నాడు. కానీ సెల్‌ఫోన్ ద్వారా కూడా చేస్తున్నది సమూహానికి దగ్గర అయ్యే ప్రయత్నమే నేమో. అందులో ఉన్న వాట్సాప్ నిండా ఎన్ని గ్రూపులు ఉంటాయో చెప్పలేం.

బయట గ్రూపులే కాక కుటుంబాల గ్రూపులని, కుటుంబాల్లో కజిన్స్ గ్రూపులని, ఒక ఊరి బంధువుల గ్రూపులని రకరకాలు. ఇలా ఒకరినొకరు కలుపుకుంటూ మళ్లీ తిరిగి ఈ పండగలకి ఎక్కడో చోట అందరూ కలవడానికి ప్రణాళికలు వేసుకుంటున్నారు. కలుస్తూ ఉంటున్నారు. పల్లటూర్లు, రిసార్ట్‌లు నిండిపోతున్నాయి.

తిరిగి అవే అరిసెలు, అవే బొబ్బట్లు, అవే చక్రాలు, అవే పిండి వంటలు. పూర్వం వండుకుని తినేవారు. ఇప్పుడు చేయించుకుని తింటున్నారు. సాంకేతికంగా వస్తున్నటు వంటి పెనుమార్పులు చూసినప్పుడు, ఇవి మానవ జీవితంలో తీసుకొస్తున్న సౌకర్యాలను గాని, అలజడులను గాని గమనిస్తున్నప్పుడు మన పాత సరదాలన్నీ వెనక్కి పోయాయా అనే విచారం కలుగుతుంది.

కానీ కాస్త జాగ్రత్తగా చూస్తే మనుషులు మళ్ళీ తిరిగి కష్టపడకుండా ఇంకా సులువుగా పండగలను ఎంజాయ్ చేయడానికి సర్వవిధాలా సంసిద్ధులవుతూనే ఉన్నారు. ఇది నగరాలకు కూడా మినహాయింపు కాదు. అసలు జీవితంలో తిండి నేనా, అనుబంధాన్నేనా పూర్వం ఆస్వాదించేవారు. ఇప్పుడు ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. ఆస్వాదన వేరు ఎంజాయ్ వేరు. నేను ఎప్పుడో చెప్పాను– ఈ ఎంజాయ్మెంట్ అన్నది కూడా గ్లోబలైజేషన్ తాలూకు జార్గాన్ అని. ఎంజాయ్‌మెంట్ క్షణికం. ఆస్వాదనలో జ్ఞాపకం, కొనసాగింపు ఉంటాయి.

సంక్రాంతి పండుగ అంటే మూడు నెలల ముందు నుంచి రైలు టికెట్లు దొరక్కపోవడం, బస్సులు కిటకిటలాడుతూ ఉండటం ఇప్పటికీ ఆ పండగ తాలూకు అట్టహాసాన్ని చెప్తూనే ఉన్నాయి. పల్లెటూర్ల నుంచి, పొలాల నుంచి తోటల నుంచి దూరంగా వచ్చేసిన నేను కూడా సంక్రాంతి పండగ ముందు నాలుగు బంతిపూల కుండీలు, నాలుగు చామంతి పూల కుండీలు కొనుక్కుని ప్రతి ఏడాది బాల్కనీలో పెట్టుకుని కవులను తలుచుకుంటూ ఉంటాను.

‘బంతి పువ్వులకు చామంతులకు నెయ్యమును గూర్చి కబరీభరమ్ము చక్కన కుదిర్చి వచ్చె సంక్రాంతి లక్ష్మి మా ఇంటి వైపు’

వివేక స్ఫూర్తి

నేడు స్వామి వివేకానంద జయంతి. ఈ సందర్భంగా ఆయన చెప్పిన కొన్ని స్ఫూర్తి మంత్రాలు

- నీపై నీకు నమ్మకం లేనంత వరకు నువ్వు దేవుడిని నమ్మలేవు.
- ఒక ఆలోచనను తీసుకోండి. ఆ ఆలోచననే మీ జీవితంగా మార్చుకోండి. దాని గురించే ఆలోచించండి, దాని గురించే కలలు కనండి, ఆ ఆలోచనతోనే బతకండి.
- ప్రపంచంలో ఉన్న పాపాలన్నింటిలోకి పెద్ద పాపం ‘మేము బలహీనులం’ అని అనుకోవడం. భయాన్ని వీడండి.
- డబ్బు పోతే తిరిగి సంపాదించుకోవచ్చు, కానీ శీలం పోతే అంతా కోల్పోయినట్టే.
- సత్యం కోసం దేన్నైనా వదులుకోవచ్చు, కానీ దేని కోసమూ సత్యాన్ని వదులుకోకూడదు.



ముగ్గు ముచ్చట

21 చుక్కలు
21 వరుసలు

జి. సుహాసిని
సర్కిల్‌పేట, మచిలీపట్నం





19 చుక్కలు
సమాంతరంగా
1 వచ్చే వరకు

జి. ఆండాలమ్మ
మల్కాజిగిరి
సికింద్రాబాద్

9 చుక్కలు
1 వచ్చే వరకు

కల్పనా శ్రీనివాస్
ఉమ్మాపూర్
సిద్దిపేట

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

- నిరంతరం వెలిగే సూర్యుడిని చూసి చీకటి ఎలా భయపడుతుందో, నిరంతరం శ్రమించేవాడిని చూసి ఓటమి కూడా అలాగే భయపడుతుంది‘.
- సముద్రం మీద వచ్చే అలల మాదిరిగా కాకుండా, సముద్రమంత లోతుగా ఆలోచించడం నేర్చుకో
- పవిత్రత, ఓర్పు, పట్టుదల – ఈ మూడూ విజయానికి అత్యవసరమైనవి. అయితే వీటన్నింటికీ మించి ప్రేమ ఉండాలి.

సాక్షి సినిమా

కార్తీ

పొంగల్‌కి..

కార్తీ హీరోగా నటించిన తమిళ చిత్రం ‘వా వాతియార్’. కృతీశెట్టి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. నలన్ కుమారస్వామి దర్శకత్వంలో స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు. ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు కార్తీ. ఈ సినిమాను 2025 డిసెంబరు 12న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ, కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా ఈ సినిమాను పొంగల్ సందర్భంగా ఈ నెల 14న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ‘వా వాతియార్’కి తెలుగులో ‘అన్నగారు వస్తారు’ అనే టైటిల్ ఖరారు చేశారు. మరి.. ఈ సినిమా తెలుగు వెర్షన్ రిలీజ్‌పై స్పష్టత రావాల్సి ఉంది.

ఏ కుర్రాడూ ఆన్సర్ చెప్పలేదు?

సాక్షీ వైద్య, శర్వానంద్, సంయుక్త

శర్వానంద్ హీరోగా నటించిన చిత్రం ‘నారి నారి నడుమ మురారి’. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంయుక్త, సాక్షీ వైద్య కథానాయికలుగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న సాయంత్రం 5:49 గంటలకు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ మూవీ ట్రైలర్‌ని ఆదివారం విడుదల చేశారు మేకర్స్. ‘అవును గౌతమ్ ఎవరమ్మా..’, ‘గౌతమ్ నేను లవ్‌లో ఉన్నాం’.. ‘ఏం చేస్తుంటావ్?’.. ‘ఇంజినీరింగ్ చదివి ఆర్కెటెక్‌గా జాబ్ చేస్తున్నా సర్’.. ‘మరి ఇంజినీరింగ్ ఎందుకు చేశావ్’.. ‘ఆ కొశ్చన్‌కి నేనే కాదు సర్.. బీటెక్ చదివిన ఏ కుర్రాడూ ఆన్సర్ చెప్పలేదు’, ‘నై వైఫ్ నా లైఫ్ నీ చేతుల్లో ఉంది’, ‘నాదగ్గర నిజం ఎందుకు దాచావ్?’, ‘నీ తమ్ముడు, నీ కొడుకు ఆడుకుంటుంటే చూడాలని చిన్న ఆశ’ వంటి పలు డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమేరా: జ్ఞానశేఖర్, యువరాజ్.

ఆ స్ఫూర్తి ఏమైంది?
- విజయ్ దేవరకొండ

‘‘ఒక సినిమాకు మూవీ టీమ్ పెట్టే హార్డ్ వర్క్, డబ్బు, వారి కలలను కోర్టు ఆర్డర్ ద్వారా రక్షించుకోవడం సంతోషంగా ఉంది. అయితే మన వాళ్లే ఇలా మన సినిమాలకు పని గట్టుకుని చెడు చేయాలని చూడటం బాధగా అనిపిస్తోంది’’ అని హీరో విజయ్ దేవరకొండ తెలిపారు. చిరంజీవి హీరోగా నటించిన చిత్రం ‘మన శంకరవర ప్రసాద్‌గారు’. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో హీరో వెంకటేశ్ ముఖ్య పాత్ర పోషించారు. సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మించారు. ఈ చిత్రం నేడు ప్రేక్షకులముందుకొస్తోంది. ఈ సినిమాకు ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో రివ్యూస్, రేటింగ్స్ ఇవ్వకుండా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంపై విజయ్ దేవరకొండ స్పందిస్తూ.. సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ చేశారు. ‘‘మనమంతా కలిసి ఎదగాలని, ఒకరికొకరు మంచి చేస్తూ జీవించాలనే స్ఫూర్తి ఏమైపోయింది? మన వాళ్లే మన సినిమాలకు చెడు చేయడం బాధగా ఉంది. చిరంజీవిగారి లాంటి పెద్ద హీరో సినిమా కూడా ఇలాంటి వాళ్ల వల్ల ప్రమాదంలో పడుతుందని కోర్టు వారు అర్థం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల ద్వారా అయినా మూవీ టీమ్ కలలు, డబ్బు, హార్డ్ వర్క్‌ని కాపాడబడటం సంతోషంగా ఉంది. నా ‘డియర్ కామ్రేడ్’ సినిమా టైమ్ నుంచి నా సినిమాలను దెబ్బ తీయాలనే కొందరు చేసే రాజకీయాలు, కుట్రలను తెలుసుకున్నాను. కొన్నేళ్లుగా నేను మాట్లాడింది ఎవరూ గ్రహించలేకపోయారు. మంచి సినిమాను ఏ కుట్ర ఆపలేదని నేను చెబుతూ ఉండేవాడిని. నాతో సినిమాలు చేసే దర్శక, నిర్మాతలకు ఈ సమస్యలు ఎంత ప్రమాదకరం అయినవో తెలుస్తూ వచ్చింది. వీళ్లంతా ఎవరు? ఎందుకు సినిమాలపై కుట్ర చేస్తున్నారు? వీళ్ల నుంచి సినిమాలను ఎలా రక్షించుకోవాలి? అనే ఆలోచనలతో చాలా రాత్రులు నిద్రపోలేదు. నేనే కాదు.. నా తర్వాత వచ్చే హీరోలు కూడా ఇలాంటివే ఎదుర్కొంటారని అనిపించేది. ఈ సంక్రాంతికి రిలీజ్ అవుతున్న ‘మన శంకర వరప్రసాద్‌గారు’ సినిమాతో పాటు మిగతా చిత్రాలన్నీ మంచి విజయాలు సాధించాలి’’ అని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు.

ప్రేమపై నాకు నమ్మకం ఉంది!

మలైకా అరోరా.. పరిచయం అక్కర్లేని పేరు. ప్రత్యేక పాటల్లో తనదైన హుషారైన స్టెప్పులతో ప్రేక్షకులను అలరించారామె. మహేశ్‌బాబు ‘అతిథి’ చిత్రంలో ‘రాత్రైనా నాకు ఓకే..’, పవన్ కల్యాణ్ ‘గబ్బర్ సింగ్’ సినిమాలో ‘కెవ్వు కేక...’ పాటలతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు మలైకా అరోరా. నటుడు సల్మాన్ ఖాన్ సోదరుడు అర్బాజ్ ఖాన్‌తో 1998లో వివాహ బంధంలోకి అడుగు పెట్టారు మలైకా. వ్యక్తిగత కారణాల వల్ల 2017లో విడాకులు తీసుకున్నారు. అర్జున్ కపూర్‌తో ప్రేమలో ఉండటం వల్లే అర్బాజ్ ఖాన్‌కి మలైకా విడాకులిచ్చారనే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అర్జున్ కపూర్– మలైకా అరోరా కూడా రిలేషన్ షిప్‌కి బ్రేకప్ చెప్పారు. తాజాగా తన విడాకులు, రిలేషన్ షిప్ గురించి మాట్లాడారు మలైకా అరోరా. ‘‘నేను వివాహ బంధంలోకి అడుగు పెట్టాను. ఆ తర్వాత విడిపోయాను. అనంతరం రిలేషన్ షిప్‌లో ఉన్నాను. బ్రేకప్ అయ్యింది. అంత మాత్రాన ప్రేమ అనేది తప్పు అని నేను అనుకోవడం లేదు. అవి నా విషయంలో సెట్ కాలేదు అంతే. అయినప్పటికీ ప్రేమ మీద నాకు ఇప్పటికీ నమ్మకం ఉంది. ప్రేమను పంచడం, పొందడం అనేది నాకు చాలా ఇష్టం. అది దక్కాలంటే అదృష్టం ఉండాలి’’ అని పేర్కొన్నారు మలైకా ఆరోరా.

మలైకా అరోరా

యాక్టింగ్ వదిలేద్దామనుకున్నాను
- మీనాక్షీ చౌదరి

‘‘మన జీవితాల్లో మహిళలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. నా జీవితాన్ని మా అమ్మ, మా టీచర్స్ ఎంతో ప్రభావితం చేశారు. ఇప్పుడు హీరోయిన్లకు బలమైన పాత్రలు లభిస్తుండటం సంతోషంగా ఉంది. నేను కూడా బలమైన పాత్రలే చేయాలనుకుంటున్నాను. హీరోయిన్ల మధ్య పోటీ గురించి ఆలోచించను. పోటీ అనేది ప్రతిచోటా ఉంటుంది. నా వరకు క్రమశిక్షణతో కష్టపడుతుంటాను. నా స్కూల్, కాలేజీ, మిస్ ఇండియా కాంపిటీషన్.. ఇలా ప్రతిచోట నేను పోటీ చూశాను’’ అని చెప్పారు హీరోయిన్ మీనాక్షీ చౌదరి. నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి జోడీగా నటించిన సినిమా ‘అనగనగా ఒకరాజు’. మారి దర్శకత్వంలో నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా మీనాక్షీ చౌదరి మాట్లాడుతూ –‘‘2024 సంక్రాంతికి ‘గుంటూరు కారం’, 2025 సంక్రాంతికి ‘సంక్రాంతికి వస్తున్నాం’ మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చాను. ఈ ఏడాది సంక్రాంతికి ‘అనగనగా ఒకరాజు’తో ఆడియన్స్ ముందుకు వస్తున్నాను. అయితే నేను ఏదీ ప్లాన్ చేయలేదు. ‘అనగనగా ఒకరాజు’ చిత్రంలో సంపన్న కుటుంబంలో పుట్టిన చారులత అనే పాత్రలో నటించాను. నవీన్‌గారితో వర్క్ చేయడం అనేది సినిమా టీచింగ్ స్కూల్‌లా ఉంది. ‘గుంటూరు కారం, లక్కీ భాస్కర్’ తర్వాత ఇప్పుడు ‘అనగనగా ఒకరాజు’ సినిమాలు సితార బ్యానర్‌లో చేశాను. మారి మంచి ప్రతిభ గల దర్శకుడు. ఇండస్ట్రీలో నటిగా సెటిల్ అవ్వడం అంటూ ఏమీ ఉండదు. ఎప్పటికప్పుడు నూతన నటీనటులు వస్తూనే ఉంటారు. దీంతో ప్రతి రోజూ పరుగే. నటిగా ‘ఔట్ ఆఫ్ లవ్’ అనేది నా తొలి సిరీస్ (టీవీ సిరీస్). ఈ షూట్‌లో పాల్గొన్న తొలిరోజే నాకు ఇబ్బందిగా అనిపించి, నా మేనేజర్‌కి కాల్ చేసి, ‘యాక్టింగ్ వద్దు. సినిమాలు వదిలేద్దామనుకున్నాను’ అని చెప్పాను. మనం కాంట్రాక్ట్ సైన్ చేశామని చెప్పి నన్ను కన్విన్స్ చేశారు. ఆ తర్వాత యాక్టర్‌గా నేను మెరుగై రాణిస్తున్నాను. ఇక సోషల్ మీడియా ట్రోల్స్ నన్ను బాధ పెట్టాయి. నాకు పుస్తకాలు రాయడం ఇష్టం. నాగచైతన్య గారితో ‘వృషకర్మ’ సినిమా చేస్తున్నాను’’ అన్నారు.

నెల ముందుగానే..

రాణీ ముఖర్జీ

బాలీవుడ్ సీనియర్ నటి రాణీ ముఖర్జీ నటించిన తాజా హిందీ చిత్రం ‘మర్దానీ 3’. ఈ చిత్రంలో శివానీ శివాజీ రాయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రాణీ ముఖర్జీ నటించారు. అభినవ్ మినావాల దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్ నిర్మించిన ఈ సినిమాని తొలుత ఫిబ్రవరి 27న రిలీజ్ చేయాలనుకున్నారు. అయితే షూటింగ్ శరవేగంగా జరగడం, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా తుది దశకు చేరుకుంటున్న క్రమంలో ‘మర్దానీ 3’ని ఈ నెల 30నే రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఇలా దాదాపు నెల రోజులు ముందుగానే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘మర్దానీ’ చిత్రం ప్రధానంగా చిన్నారుల మిస్సింగ్, వారిని రక్షించే రెస్క్యూ మిషన్ వంటి అంశాల నేపథ్యంతో సాగుతుందని తెలుస్తోంది. కాగా రాణీ ముఖర్జీ మెయిన్ లీడ్ రోల్ చేసిన ‘మర్దానీ, మర్దానీ 2’ చిత్రాలు మంచి విజయాలు సాధించాయి.

ప్రియుడితో వివాహ బంధంలోకి...

స్టెబిన్, నుపూర్

హీరోయిన్ నుపూర్ సనన్ వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. ఐదేళ్ల ప్రేమ తర్వాత తన ప్రియుడు, ప్రముఖ గాయకుడు స్టెబిన్ బెన్‌తో ఆమె ఏడడుగులు వేశారు. బాలీవుడ్ హీరోయిన్ కృతీ సనన్‌కి స్వయానా చెల్లెలు అయిన నుపూర్ సనన్.. రవితేజ హీరోగా నటించిన ‘టైగర్ నాగేశ్వరరావు’(2023) సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో ఎంట్రీ ఇచ్చారు. వారం క్రితమే నిశ్చితార్థం జరుపుకున్న నుపూర్–స్టెబిన్ ఈ నెల 10న పెళ్లి పీటలెక్కారు. ఇరు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల నడుమ వీరి వివాహం ఉదయపూర్‌లో జరిగింది. బాలీవుడ్ సినీ ప్రముఖులు దిశా పటానీ, కబీర్ బాహియా, మౌనీ రాయ్, నిర్మాత దినేష్ విజన్, దర్శకుడు అమర్ కౌశిక్, స్టైలిస్ట్ సుకృతి గ్రోవర్ హాజరయ్యారు. వీరి పెళ్లి వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నుపూర్ సనన్ ప్రస్తుతం ‘నూరని చెహ్రా’ అనే తొలి హిందీ సినిమా చేస్తున్నారు.

కళాశాల ప్రేమకథ

మణికుమార్, రజిత షాండే జంటగా నటించిన సినిమా ‘ఒకే ఒక లోకం’. వై. విష్ణు నారాయణ దర్శకత్వంలో కోరిటాల రోహిణి సమర్పణలో కోరిటాల సాయిచౌదరి నిర్మించారు. ఈ మూవీ పోస్టర్, ట్రైలర్‌ను తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ వైస్ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్, నిర్మాత సాయి వెంకట్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ‘‘కాలేజీ నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రం ‘ఒకే ఒక లోకం’. ఈ సినిమా పెద్ద మ్యూజికల్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. ఫిబ్రవరిలో మూవీ రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం’’ అని విష్ణు నారాయణ తెలిపారు.

రజిత, మణి

హిమగిరుల్లో అందమైన దేశం

సంతోషాన్ని పరిపాలించే దేశం
శాంతిని అలవాటు చేసుకున్న దేశం
సంపద కంటే సంతృప్తి ముఖ్యమనుకునే ప్రజలు
పర్వతాలే గోడలు.. శాంతే సరిహద్దుగా
వింటర్ పర్యాటకంలో ప్రధానంగా నిలుస్తోంది భూటాన్.

హిమగిరుల మధ్య భూటాన్ రాజధాని థింపూ

జనవరి అనగానే ఆసియాలో కొన్ని దేశాలు వింటర్ టూరిజం డెస్టినేషన్స్‌గా మారిపోతాయి. అందులో భూటాన్ ఒక ప్రత్యేకమైన పర్యాటక దేశంగా నిలుస్తుంది. ఇక్కడ మంచు మాత్రమే కాదు మంచి కూడా ఉంటుంది. ప్రజలు నిరాడంబరమైన దుస్తులు ధరిస్తారు. సంప్రదాయాలను గౌరవిస్తారు. ఈ దేశానికి వచ్చే పర్యాటకులకు సస్టైనబులిటీపైన అవగాహన అవసరం. చలికాలంలో భూటాన్ ఒక ప్రశాంతమైన, అందమైన మంచు ప్రపంచంగా మారిపోతుంది. అద్భుతమైన హిమాలయ దృశ్యాలను తనివి తీరా వీక్షించడానికి టూర్ ఆపరేటర్ ద్వారా బుక్ చేసుకోవడం మేలు.

సందడి తక్కువ..

వాణిజ్య ప్రపంచానికి, వివాదాలకు దూరంగా సంతోషమే సగం బలం అని నమ్మి ఆచరణలో పెట్టిన దేశం భూటాన్. ఇక్కడ పర్యాటకుల సందడి తక్కువగా ఉండటమే కాదు, ప్రజల జీవితాల్లో సంతోషం ఎక్కువగా కనిపిస్తుంది. భూటాన్‌కు వెళ్లే ప్రయాణికులకు అక్కడ లగ్జరీ రిసార్టులు, నైట్ లైఫ్ ఉండవని ముందే తెలుసు. కానీ హిమాలయాల మధ్య సాధారణ జీవితం ఎలా ఉంటుందో చూడాలనే ఆసక్తే వారిని అక్కడికి తీసుకెళ్తుంది. ఆలయాలు, శుభ్రమైన రహదారులు, సిగ్నల్స్ లేని కూడళ్లు, ట్రాఫిక్ లేని వీధులు అక్కడి ప్రజల ముఖాల్లో కనిపించే చిరునవ్వులే భూటాన్ అసలు ఆకర్షణ. వింటర్‌లో ప్రకృతి కూడా ప్రయాణికులను ప్రత్యేకమైన అందంతో ఆహ్వానిస్తుంది.

హిమగిరుల మధ్యన

భారతదేశానికి ఉత్తరాన ఉన్న హిమదేశమే భూటాన్. ఎత్తైన హిమగిరులు, అందమైన లోయలు, ఎటు చూసినా కనిపించే బౌద్ధ మఠాలు ఇవన్నీ భారతీయ పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయి. భూటాన్ రాజధాని థింపూ నుంచి పారోకు వెళ్లే దారిలో కనిపించే దృశ్యాలు కెమెరాల్లో కాకుండా మనసులో బంధించే చిత్రాలుగా మిగిలిపోతాయి.

చలికాలం.. ఇంద్రజాలం

ప్రపంచ టాప్ వింటర్ డెస్టినేషన్స్ జాబితాలో భూటాన్ ఎక్కడో ఒక చోట తప్పకుండా కనిపిస్తుంది. జనవరిలో ఇక్కడ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గతాయి. పారో, భుంతాంగ్, దోచలా పాస్ వంటి ప్రాంతాల్లో స్నోఫాల్ అవకాశం ఉంటుంది. కానీ దేశమంతా మంచు పడదు.

హృదయాన్ని మీటే ఉదయం

భూటాన్‌లో ప్రతీ ఉదయం హృదయాన్ని తాకే అనుభవాన్ని ఇస్తుంది. పొగమంచు తొలిగిన తర్వాత క్లియర్ స్కై, సూర్య కాంతిని తాకే పర్వత అంచులు స్పష్టంగా కనిపిస్తాయి. ఫోటోగ్రఫీకి ఇష్టపడేవారికి ఇది గోల్డెన్ టైమ్. అయితే ఫొటోలు తీసుకోవడానికి అనుమతి తీసుకోవడంతో పాటు గౌరవ మర్యాదలతో నడుచుకోవడం ఉత్తమం. ఉదయం వేళ ఆలయాల గంటల శబ్దం, బౌద్ధ మఠాల్లో సాధువుల మంత్రోచ్ఛరణలు వినిపిస్తాయి. హిమగాలులకు ఊగే దేశ జెండాలు, అక్కడి ప్రజల ముఖాల్లో చిరునవ్వులు ఇవన్నీ ప్రయాణికులకు గుడ్ మార్నింగ్ చెబుతాయి.

వేడి వేడి వంటకాలు..

ప్రశాంతత కోసం భూటాన్‌కు వెళ్లే వారు ఎక్కువ. జనవరిలో వాతావరణం చక్కగా ఉండడంతో పాటు టూరిస్టుల రద్దీ తక్కువగా ఉంటుంది. ఆలయాలు, గ్రామాలు, కేఫ్‌లు అన్నీ కూడా ప్రశాంతంగా, సంతోషానికి చిరునామాలుగా కనిపిస్తాయి. వేడి వేడి చిల్లీ సాస్‌లు, చీజ్‌తో తయారైన మష్రూమ్స్, బంగాళదుంపల వంటకాలు, చికెన్, డ్రైడ్ మటన్, పోర్క్.. ఇతర మాంసాహార రుచులు లభిస్తాయి. ప్రకృతిని ప్రేమిస్తూ ప్రయాణించే వారికి ఇది ఒక ఆదర్శ గమ్యం.

సంతోషమే సంపద

ప్రపంచంలో ఎన్నో దేశాలు ఉన్నా భూటాన్ ప్రత్యేకమైనదిగా చెప్పచ్చు. ఇక్కడ ఆదాయం, ఆస్తులు కాదు సంతోషమే సంపద. దేశ అభివృద్ధిని ఆదాయంతో కాదు, ప్రజల ఆనందంతో కొలుస్తారు. పారిశ్రామిక అభివృద్ధి కన్నా పర్యావరణ హితానికే ఇక్కడ ప్రాధాన్యం. భూటాన్ ప్రపంచంలో కార్బన్ నెగటి



వ్‌గా ఉన్న అరుదైన దేశాల్లో ఒకటి. వదిలే కాలుష్యంకంటే ఎక్కువ కార్బన్‌ను అడవులే గ్రహిస్తాయి. భూటాన్ రాజ్యాంగం ప్రకారం కనీసం 60 శాతం భూమి ఎప్పటికీ అడవిగానే ఉండాలి.

బాధ్యతాయుతమైన పర్యాటకం

భూటాన్ ఎంత అందంగా ఉంటుందో, అక్కడి పర్యాటక ప్రమాణాలు అంత కఠినంగా ఉంటాయి. బాధ్యతాయుతమైన పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఈ దేశం సస్టైనబుల్ టూరిజం విధానాన్ని పాటిస్తోంది. ఎక్కువ మంది కాదు, బాధ్యతాయుతమైన ప్రయాణికులే తమకు కావాలని కోరకుంటోంది. జపాన్, కొరియా వంటి దేశాలు అధిక పర్యాటకులతో ఇబ్బంది పడుతుంటే భూటాన్ మాత్రం తన ప్రమాణాలతో దేశాన్ని నిత్యం అందంగా, తన విలువలతో ముందుకు తీసుకెళ్తోంది.

– ఎం.జి. కిశోర్, ప్రయాణికుడు.కామ్

సందర్శించాల్సిన ప్రదేశాలు

టైగర్స్ నెస్ట్, పునాఖా జోంగో, బుద్ధ డోర్డెన్మా విగ్రహం, రిన్‌పుంగ్ జోంగ్. ఇక చలికాంలో ప్రకృతితో సాహసం చేయాలనుకుంటే హైకింగ్, సైక్లింగ్, వైట్–వాటర్ రాఫ్టింగ్, బ్లాక్ నెక్డ్ క్రేన్ చేయచ్చు. పారో, థింపు, పునఖాషెచుస్ .. వంటి సాంస్కృతిక పండగలు జరుపుకుంటారు. వివిధ రకాల ఆకృతులతో ఉండే ముసుగులను ధరించే చేసే నృత్యాలు హైలైట్‌గా కనిపిస్తాయి.

భారతీయులకు వీసా అవసరం లేదు

చాలా మంది విదేశీయులకు టూర్ ఆపరేటర్ ద్వారా ఏర్పాటు చేయబడిన వీసా అవసరం. భారతీయులకు భూటాన్ వెళ్లేందుకు వీసా అవసరం లేదు. పాస్‌పోర్ట్ లేదా ఓటర్ ఐడీ చూపిస్తే సరిపోతుంది. పారో విమానాశ్రయం ప్రధాన ద్వారం భారత సరిహద్దు భూభాగ ప్రవేశం ఉంటుంది. ఇమిగ్రేషన్ వద్ద ఎంట్రీ పర్మిట్ ఇస్తారు. కానీ ప్రతీ రోజూ టూరిస్టు ఫీజు ఉంటుంది. పర్యాటకులు స్థానిక నియమాలను పాటించాలి. ట్రావెల్ గైడ్‌ను తప్పనిసరిగా నియమించుకోవాలి. ఈ కారణాలతోనే కొందరు భూటాన్ ప్రయాణాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారు. ఇక్కడ వాడుకలో ఉన్న కరెన్సీ గుల్ట్రమ్. కానీ, భారతీయ రూపాయలను ఆమోదిస్తారు.

పర్యటనకు సరైన సమయం

భూటాన్ వెళ్లేందుకు అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఉత్తమ సమయం. ఈ సమయంలో చలి దుస్తులు తప్పనిసరి.

ఎలా వెళ్లాలంటే...

- భారతదేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాల నుంచి భూటాన్‌లోని పారోకు విమానమార్గం ద్వారా చేరుకోవచ్చు.
- రోడ్డు మార్గం ద్వారా కూడా భూటాన్‌కు చేరుకోవచ్చు.
- థింపూ, పారో నగరాల్లో హోటల్ వసతి సదుపాయాలు లభిస్తాయి.
- భూటాన్‌ను ఒక హాట్ ట్రావెల్ డెస్టినేషన్‌గా కాకుండా జీవిత సారాన్ని అనుభవించే ఒక ప్రయాణంగా భావించాలి.







ఈ సీక్రెట్ తెలిస్తే ఫ్లైట్ టికెట్లు తక్కువ ధరకే!

చలికాలం పర్యాటక రంగానికి అత్యంత ప్రధానమైన సమయం. ఈ సమయంలో విమాన టికెట్ల ధరను ఆకాశాన్ని తాకుతాయి. ఎందుకంటే ఈ సమయంలో డైనామిక్ ప్రైసింగ్ సిస్టమ్‌లో ఈ టికెట్ ధరలు అప్డేట్ అవుతాయి.

ఏరోజు బుక్ చేయాలి ?

వీకెండ్ అంటే శుక్రవారం 7 గంటల నుంచి శని, ఆదివారాల్లో టికెట్ ధరలు చాలా ఎక్కువగా ఉంటాయి. మీరు తక్కువ ధరకు టికెట్ బుక్ చేసుకోవాలి అనుకుంటే మంగళ, బుధవారం ప్రయత్నించవచ్చు. ఈ సమయంలో ధరలు తక్కువగా ఉంటాయి.

ఈ సీక్రెట్ టిప్ ట్రై చేయండి!

- మీరు టికెట్ ధరలు తెలుసుకోవాలి అనుకున్నా లేదా ఫ్లైట్ టికెట్ బుక్ చేసుకోవాలి అనుకున్నా ఇంకాగ్నిటో లేదా ప్రైవేట్ విండోలో సెర్చ్ చేయండి. సెర్చ్ చేయగా వచ్చిన ఫలితాల్లో మీకు ఏదైనా ఎయిర్‌లైన్ టికెట్ బుక్ చేయాలి అనిపిస్తే, అప్పుడు అదే ఇంకాగ్నిటో మోడ్ బ్రౌజర్ నుంచి లాగిన్ అయ్యి బుక్ చేసుకోండి.
- జనవరి నెలలో ఉదయం వేళలో లేదా అర్థరాత్రి సమయంలో తక్కువ ధరకు టికెట్లు లభించే అవకాశం ఉంది. దీంతో పాటు ట్రావెల్ యాప్స్‌లో వివిధ తేదీల్లో ధరలను పోల్చి బుక్ చేసుకున్నా డబ్బు ఆదా అయ్యే అవకాశం ఉంది.

తెలుగు వారు ఏడాది మొత్తం వేచి చూసే పండగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండగ వస్తోంది అంటే చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు అందరి కళ్లల్లో ఒక మెరుపు కనిపిస్తుంది. అతివలు ముంగిట్లో అందమైన రంగవల్లికలను తీర్చిదిద్దుతారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ గాలిపటాలు ఎగురవేయడానికి ఇష్టపడుతుంటారు.

ఈ సమయంలో గాలిపటాలు ఎగురవేయడం అనేది కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం అయిన విషయం కాదు. జాతీయ స్థాయిలో అనేక రాష్ట్రాల్లో గాలిపటం ఎగురేయడం ఒక ఆనవాయితీగా వస్తోంది. గుజరాత్‌లో ఉత్తరాయణ సమయంలో ఆకాశంలో రంగు రంగుల గాలిపటాలు సందడి చేస్తాయి.

- తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు ఎలా మేడలపై, మైదానంలో, పొలాల్లోంచి పతంగులు ఎగుర వేస్తారు. మహారాష్ట్ర ప్రజలు కూడా సముద్ర తీరాల్లో ఎగిసే కెరటాల మధ్య గాలిపటాల పోటీలు పెట్టుకుంటారు.
- రాజస్థాన్ ఓల్డ్ సిటీలో ఉన్న మేడలపై యువతీ యువకులు అక్కడి ఘేవర్ పేనీలు, నువ్వుల లడ్డూలను ఆస్వాదిస్తూ గాలిపటాలు ఎగురవేస్తుంటారు.
- ఉత్తర ప్రదేశ్‌లో ప్రతీ గల్లీలో పతంగుల పోటీ జరుగుతుంది.
- కలకత్తాలో గ్రూపులుగా ఏర్పడి గాలిపటాలు ఎగరేయడానికి ఇష్టపడగా, కర్ణాటక, తమిళనాడులో బీచుల్లో గాలిపటాలను ఎగరేయడానికి ఇష్టపడతారు.

అన్ని రాష్ట్రాల్లో పండగ స్ఫూర్తి గాలిపటాలు ఎగరవేయడంలోనే కనిపిస్తోంది. ఆనందాన్ని నలుగురితో పంచుకోవాలనే ఆశయానికి సంక్రాంతి ఒక వేదికగా నిలుస్తుంది. ఈ సందేశాన్ని ఆకాశం సాక్షిగా చాటే మార్గంగా గాలిపటం నిలుస్తోంది.

ఆకాశమంతా సంక్రాంతి

రాన్ ఆఫ్ కచ్

ఉప్పు ఎడారి అద్భుతం

తెల్లని నేలపై ...చల్లని విహారం

జనవరిలో రాన్ ఆఫ్ కచ్ అందం పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. అంతులేని తెల్లని ఎడారి, వినీలాకాశం, చల్లని గాలి... ఈ మూడు కలిసిన అనుభూతి భారతదేశంలో మరెక్కడా దొరకదు. ఈ కాలంలో జరిగే రన్ ఉత్సవం కారణంగా సంప్రదాయ సంస్కృతి, కళలు, వేడుకలతో ఈ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా మారుతుంది.

గుజరాత్‌లోని కచ్ జిల్లాలో ఉన్న ఉప్పు ఎడారి, పగటి పూట సూర్యకాంతిలో మెరిసిపోతుంది. నేలంతా తెల్లగా ప్రకాశించడంతో అక్కడ నడవడమే ఒక విశేష అనుభవంగా మారుతుంది. ఇక రాత్రి సమయంలో ఆకాశాన్ని నిండా అలంకరించే నక్షత్రాలను వీక్షించడం పర్యాటకులకు మరపురాని జ్ఞాపకంగా మిగులుతుంది.

సాధారణంగా ఈ ప్రాంతంలో నడవడం కష్టమైనప్పటికీ, చలికాలంలో.. ముఖ్యంగా జనవరిలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో పర్యాటకులు ఈ తెల్లని నేలపై నడిచే ప్రత్యేక అనుభవాన్ని ఆస్వాదిస్తారు.

ప్రశాంతమైన అనుభూతి

రాన్ ఆఫ్ కచ్‌కు సమీప గ్రామాల్లో స్థానికుల జీవనశైలిని ప్రతిబింబించే హస్తకళలు, ఎంబ్రాయిడరీ పనులు, స్థానిక వంటకాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. దేశీయులే కాక విదేశీ సందర్శకులు కూడా ఈ అనుభవాన్ని ఎంతో ఇష్టపడతారు. అందుకే రాన్ ఆఫ్ కచ్ ప్రయాణం అంటే ప్రశాంతతతో కూడిన, పూర్తిగా భిన్నమైన అనుభవంగా పర్యాటకులు అభివర్ణిస్తుంటారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి రాన్ ఆఫ్ కచ్‌కు రైలు, బస్సు, విమాన మార్గాల ద్వారా చేరుకోవచ్చు.

జపాన్‌లో చలికాలం స్నో టైర్లు వాడాల్సిందే!

చలికాలం కొత్త దేశాలకు వెళ్లే భారతీయులు ఆ దేశాల్లో వింటర్ రూల్స్ ఏమైనా ఉన్నాయా అని తెలుసుకోవాలి. ఎందుకంటే దేశాన్ని బట్టి రూల్స్ మారుతాయి. అసలు వింటర్ రూల్స్ అంటే ఏంటి అనే డౌట్ కూడా రావచ్చు. ఉదాహరణకు జపాన్‌లో చలికాలం రోడ్లపై వెహికల్స్ వెళ్లాలి అంటే స్నో టైర్లు ఉండటం తప్పనిసరి. అలాగే స్విట్జర్లాండ్‌లో అయితే మంచులో స్నో టైర్ లేకుండా వెళితే ఫైన్ ఎలాగూ పడుతుంది. ఏమైనా ప్రమాదం జరిగితే ఇన్సురెన్స్ కూడా కవర్ అవదు. దాంతో పాటు పోలీసులు ఫైన్ కూడా వేయవచ్చు.

చలికాలంలో గ్రీన్‌లాండ్‌కు చేరువలో ఉన్న ఐస్లాండ్‌లో రహదారులను పూర్తిగా మూసివేస్తారు. నార్వేలో చలికాలం పగలు కూడా లైట్లు వెలిగించాల్సి ఉంటుంది. అంతెందుకు మన దేశంలో కూడా హిల్ స్టేషన్లో చలికాలం లైటింగ్ విషయంలో పక్కా రూల్స్ ఉన్నాయి.

దేశం ఏదైనా అక్కడి స్థానిక ప్రభుత్వం అమలు చేసే నియమాలను తెలుసుకుంటే అనవసరమైన పెనాల్టీలు, రిస్కుల నుంచి తప్పించుకోవచ్చు. ఎందుకంటే ప్రయాణం అంటే మనం ఒక ప్రదేశాన్ని కవర్ చేయడం మాత్రమే కాదు. ఆ ప్రదేశాన్ని, అక్కడి రూల్స్‌ను గౌరవించడం కూడా.

టైటిల్‌తో సబలెంకా బోణీ

బ్రిస్బేన్ ఓపెన్‌లో విజేతగా నిలిచిన బెలారస్ టెన్నిస్ స్టార్



బ్రిస్బేన్: కొత్త ఏడాదిని, కొత్త సీజన్‌ను బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా టైటిల్‌తో ప్రారంభించింది. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ డబ్ల్యూటీఏ–500 టోర్నీలో టాప్ సీడ్ సబలెంకా విజేతగా నిలిచింది. ఏకపక్షంగా జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా 6–4, 6–3తో మార్టా కొస్టుక్ (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ఒక ఏస్ సంధించింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వీస్‌లో 32 పాయింట్లకుగాను 26... రెండో సర్వీస్‌లో 20 పాయింట్లకుగాను 12 పాయింట్లు సంపాదించింది. సబలెంకా కెరీర్‌లో ఇది 22వ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం. విజేతగా నిలిచిన బెలారస్ స్టార్‌కు 2,14,530 డాలర్ల (రూ. 1 కోటీ 93 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సెమీస్‌లో స్నేహిత్ పరాజయం

వడోదర: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) ఫీడర్ లెవెల్ టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ ప్లేయర్ స్నేహిత్ సూరావజ్జులకు కాంస్య పతకం లభించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో స్నేహిత్ 11–6, 9–11, 12–14, 5–11తో టాప్ సీడ్ మనుశ్ షా (భారత్) చేతిలో ఓడిపోయాడు. రెండో సెమీఫైనల్లో పాయస్ జైన్ (భారత్) 11–5, 12–10, 11–9తో ఆకాశ్ పాల్ (భారత్)పై గెలిచాడు. ఫైనల్లో మనుశ్ షా 7–11, 10–12, 11–6, 11–6, 11–8తో పాయస్ జైన్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. పురుషుల డబుల్స్ విభాగంలో అంకుర్ భట్టాచార్య–పాయస్ జైన్ (భారత్) జోడీకి టైటిల్ లభించింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో పాయస్ జైన్–సిండ్రెల్లా దాస్ (భారత్) జంటకు టైటిల్ దక్కింది.

మూడేళ్ల తర్వాత...

డబ్ల్యూటీఏ సింగిల్స్ టైటిల్ గెలిచిన స్విటోలినా

ఆక్లాండ్ (న్యూజిలాండ్): టాప్ సీడ్ హోదాకు తగ్గట్టు ఆడిన ఉక్రెయిన్ టెన్నిస్ స్టార్ ఎలీనా స్విటోలినా టైటిల్ నిరీక్షణకు తెర దించింది. మూడేళ్ల తర్వాత తన కెరీర్‌లో మరో టైటిల్‌ను జమ చేసుకుంది. ఆదివారం ముగిసిన ఏఎస్‌బీ క్లాసిక్ డబ్ల్యూటీఏ–250 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ 13వ ర్యాంకర్ స్విటోలినా చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో స్విటోలినా 6–3, 7–6 (10/8)తో ఏడో సీడ్ వాంగ్ జినియు (చైనా)పై గెలిచింది. ఓవరాల్‌గా స్విటోలినా కెరీర్‌లో ఇది 19వ సింగిల్స్ టైటిల్. ఈ ఉక్రెయిన్ ప్లేయర్ చివరిసారి 2023లో స్ట్రాస్‌బర్గ్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. 2024లో ఏఎస్‌బీ క్లాసిక్ టోర్నీలో స్విటోలినా ఫైనల్ చేరినా తుది పోరులో కోకో గాఫ్ (అమెరికా) చేతిలో ఓడిపోయింది. గత ఏడాది సెప్టెంబర్‌లో మానసిక సమస్యలతో ఇబ్బందిపడిన స్విటోలినా ఆటకు విరామం ఇచ్చింది. మూడు నెలల తర్వాత మళ్లీ రాకెట్ పట్టిన ఆమె ట్రోఫీని కూడా ముద్దాడింది. టైటిల్ నెగ్గిన స్విటోలినాకు 37,390 డాలర్ల (రూ. 33 లక్షల 74 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

అర్జున్‌కు మూడో స్థానం

కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన ఇరిగేశి అర్జున్ మూడో స్థానాన్ని సంపాదించాడు. ఆదివారం ముగిసిన 18 రౌండ్ల ఈ టోర్నీలో అర్జున్ 11 పాయింట్లతో భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్‌తో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... నిహాల్‌కు రెండో స్థానం ఖరారైంది. అర్జున్‌కు మూడో స్థానం దక్కింది. అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 12 పాయింట్లతో విజేతగా అవతరించాడు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో బ్లిట్జ్ ఈవెంట్ జరిగింది. అర్జున్ 9 గేముల్లో గెలిచి, 5 గేముల్లో ఓడి, 4 గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్లు విదిత్ ఐదో స్థానంలో, ప్రజ్ఞానంద ఆరో స్థానంలో, విశ్వనాథన్ ఆనంద్ ఎనిమిదో స్థానంలో, అరవింద్ చిదంబరం పదో స్థానంలో నిలిచారు.

రన్నరప్ వంతిక

ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత ప్లేయర్ వంతిక అగర్వాల్ రన్నరప్‌గా నిలిచింది. 10 మంది ప్లేయర్ల మధ్య 18 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో వంతిక, కరిస్సా యిప్ (అమెరికా) 10.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే విజేతను నిర్ణయించేందుకు వీరిద్దరి మధ్య టైబ్రేక్‌ను నిర్వహించారు. రెండు గేమ్‌ల ఈ టైబ్రేక్‌లో కరిస్సా యిప్ 1.5–0.5తో వంతికను ఓడించి విజేతగా అవతరించింది. తొలి గేమ్‌లో 52 ఎత్తుల్లో గెలిచిన కరిస్సా... రెండో గేమ్‌ను 120 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించి టైటిల్‌ను ఖరారు చేసుకుంది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలి 9.5 పాయింట్లతో ఐదో స్థానాన్ని సంపాదించగా... భారత మరో గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్ 8.5 పాయింట్లతో ఏడో స్థానంలో, హైదరాబాద్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 8 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో, రక్షిత 6.5 పాయింట్లతో పదో స్థానంలో నిలిచారు. ఇదే టోర్నీ ర్యాపిడ్ ఫార్మాట్‌లో పురుషుల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరీన్... మహిళల విభాగంలో కాటరీనా లాగ్నో (రష్యా) టైటిల్స్ సాధించారు.

విన్నర్స్ ట్రోఫీలతో వెస్లీ సో (బ్లిట్జ్), నిహాల్ సరీన్ (ర్యాపిడ్), కాటరీనా లాగ్నో (ర్యాపిడ్), కరిస్సా (బ్లిట్జ్)

గెలుపు తలుపు తీసే క్రికెటర్లకు...

వడోదర: ప్రస్తుత టీమిండియా దిగ్గజ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు బరోడా క్రికెట్ అసోసియేషన్ (బీసీఏ) వినూత్నంగా ఆత్మీయ సత్కారాన్ని ఏర్పాటు చేసింది. ఏళ్ల తరబడి 'టన్'లకొద్దీ పరుగులతో భారత క్రికెట్ జట్టు గెలుపు తలుపుల్ని తీస్తున్న 'హిట్‌మ్యాన్' రోహిత్, 'కింగ్' కోహ్లిలను తొలి వన్డే సందర్భంగా అదే రీతిన గౌరవించింది. రెండు తలుపులతో ప్రత్యేక క్యాబిన్ ఏర్పాటు చేసిన బీసీఏ ఇద్దరినీ అందులో ఉంచింది. ఇద్దరి క్రికెటర్ల నిలువెత్తు పోస్టర్లు అంటించిన చెరో తలుపు తీయగానే కోహ్లి, రోహిత్‌లు బయటికి వచ్చారు. వారి పోస్టర్లపై ఆటోగ్రాఫ్‌లు చేశారు. ఈ వేడుక మైదానంలోని వేలమంది క్రికెట్ అభిమానుల్ని విశేషంగా అలరించింది. వాళ్లు రావడం, పోస్టర్లపై సంతకాలు చేయడంతో ప్రేక్షకులంతా కరతాళధ్వనులతో జేజేలు పలికారు. ఇందులో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చైర్మన్ జై షా, బీసీఏ అధ్యక్షుడు ప్రణవ్ అమీన్, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తదితరులు పాల్గొన్నారు.

హసరంగ మాయాజాలం

- మూడో టి20లో శ్రీలంక విజయం
- 14 పరుగుల తేడాతో పాకిస్తాన్ ఓటమి
- సిరీస్ 1-1తో సమం

దంబుల్లా: టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా సొంతగడ్డపై పాకిస్తాన్‌తో జరిగిన చివరిదైన మూడో మ్యాచ్‌లో శ్రీలంక 14 పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్ విజయం సాధించగా... రెండో మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. దీంతో సిరీస్ 1–1తో ముగిసింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 12 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్ చేసిన లంక నిర్ణీత 12 ఓవర్లలో 6 వికెట్లకు 160 పరుగులు చేసింది. క్రీజులో అడుగుపెట్టిన ప్రతి బ్యాటర్ భారీ షాట్లు ఆడేందుకు ప్రయత్నించారు. కెప్టెన్ దసున్ షనక (9 బంతుల్లో 34; 5 సిక్స్‌లు), కుశాల్ మెండిస్ (16 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచికొట్టగా... జనిత్ లియనాగే (22 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వా (22; 4 ఫోర్లు), అసలంక (21; 1 ఫోర్, 1 సిక్స్), కమిల్ మిశ్రా (20; 3 ఫోర్లు, 1 సిక్స్) తలా కొన్ని పరుగులు చేశారు. పాకిస్తాన్ బౌలర్లలో మొహమ్మద్ వసీమ్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్తాన్ 12 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (12 బంతుల్లో 45; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) విజృంభించగా... మొహమ్మద్ నవాజ్ (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఖ్వాజా నఫే (26; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. సాహిబ్‌జాదా ఫర్హాన్ (9), సయీమ్ అయూబ్ (6), ఉస్మాన్ ఖాన్ (1), షాదాబ్ ఖాన్ (6), ఫహీమ్ అష్రఫ్ (9) విఫలమయ్యారు. లంక బౌలర్లలో హసరంగ 3 ఓవర్లలో 35 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. హసరంగకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు దక్కాయి.

మెరిసిన హైదరాబాద్ ఈక్వెస్ట్రియన్ సెంటర్ క్రీడాకారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర, జాతీయస్థాయి ఈక్వెస్ట్రియన్ (అశ్విక క్రీడలు) పోటీల్లో ద హైదరాబాద్ ఈక్వెస్ట్రియన్ సెంటర్ (టీహెచ్‌ఈసీ) క్రీడాకారులు సత్తా చాటాడు. ఈ సందర్భంగా ఆదివారం అజీజ్‌నగర్‌లోని టీహెచ్‌ఈసీ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ నరసింహారెడ్డి, ప్రముఖ సినీ గేయ రచయిత అనంత్ శ్రీరామ్ పతక విజేతలకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు లెఫ్టినెంట్ కల్నల్ వివేక్ సుంకారి, చైతన్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ హాక్స్ ఈవెంట్‌లో శ్రీ తారకకు కాంస్యం లభించింది. డ్రెస్సాజ్ ఈవెంట్‌లో మైత్రి ప్రసన్న కాంస్యం కై వసం చేసుకుంది. షో జంపింగ్ 80 సెం.మీ ఓపెన్ కేటగిరీలో పిల్లి సూర్య ప్రకాశ్ కాంస్య పతకం గెల్చుకున్నాడు. టాప్ స్కోర్ షో జంపింగ్ ఓపెన్ విభాగంలో లెఫ్టినెంట్ కల్నల్ వివేక్ సుంకారికి కాంస్యం లభించింది. టెంట్ పెగ్గింగ్‌లో వివేక్ సుంకారికి రజతం, జాతీయ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ (ప్రిలిమినరీ) షో జంపింగ్‌లో హైదర్ అలీ స్వర్ణం, టీమ్ జూనియర్ జాతీయ ఈక్వెస్ట్రియన్ పోటీ షో జంపింగ్‌లో హైదర్ అలీ కాంస్యం, సౌత్‌జోన్ జూనియర్ జాతీయ ఈక్వెస్ట్రియన్ షో జంపింగ్‌లో అలీషా రజత పతకం సొంతం చేసుకున్నారు.

మెద్వెదెవ్ టైటిల్ నంబర్ 22

బ్రిస్బేన్: గత ఏడాది ఒక్క టైటిల్‌తో సరిపెట్టుకున్న రష్యా టెన్నిస్ స్టార్ డానిల్ మెద్వెదెవ్ ఈ సీజన్‌లో మాత్రం ఆరంభంలోనే టైటిల్‌ను గెల్చుకున్నాడు. ఆదివారం ముగిసిన బ్రిస్బేన్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో ప్రపంచ 13వ ర్యాంకర్ మెద్వెదెవ్ విజేతగా నిలిచాడు. బ్రాండన్ నకషిమా (అమెరికా)తో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ మెద్వెదెవ్ 6–2, 7–6 (7/1)తో విజయం సాధించాడు. 95 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 10 ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. మెద్వెదెవ్ కెరీర్‌లో ఇది 22వ సింగిల్స్ టైటిల్‌కాగా... 22 టైటిల్స్ వేర్వేరు కావడం విశేషం. ఒకసారి గెలిచిన టైటిల్‌ను అతను రెండోసారి సాధించలేదు. బ్రిస్బేన్ ఓపెన్ విజేత హోదాలో మెద్వెదెవ్‌కు 1,14,060 డాలర్ల (రూ. 1 కోటీ 3 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భళా బుబ్లిక్...

హాంకాంగ్: గత ఏడాది నాలుగు టైటిల్స్‌తో అదరగొట్టిన కజకిస్తాన్ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ బుబ్లిక్ ఈ ఏడాదిలో కూడా శుభారంభం చేశాడు. ఆదివారం ముగిసిన హాంకాంగ్ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో బుబ్లిక్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో బుబ్లిక్ 7–6 (7/2), 6–3తో టాప్ సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ)పై గెలుపొందాడు. బుబ్లిక్ కెరీర్‌లో ఇది తొమ్మిదో ఏటీపీ సింగిల్స్ టైటిల్ కావడం విశేషం.

'సండేస్ ఆన్ సైకిల్'లో గోపీచంద్, లియాండర్ పేస్

న్యూఢిల్లీ: 'ఫిట్ ఇండియా'లో భాగంగా ప్రతి ఆదివారం నిర్వహించే 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతోపాటు జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ పాల్గొన్నారు. దేశ రాజధానిలో జరిగిన 56వ 'సండేస్ ఆన్ సైకిల్' కార్యక్రమంలో 500 మంది యంగ్ లీడర్స్ సైతం పాల్గొన్నారు. ఎముకలు కొరికే చలిలో వీరంతా సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. దేశంలోని 15 వేలకు పైగా ప్రాంతాల్లో ఏకకాలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 'ఆరోగ్యకరమైన శరీరం బలమైన నాయకత్వానికి పునాది. సైక్లింగ్ మనకు ఎన్నో పాఠాలు నేర్పుతుంది. ఎప్పుడు వేగం పెంచాలి... ఎప్పుడు తగ్గించాలి... జీవితాన్ని ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలి వంటివి సైక్లింగ్ ద్వారా నేర్చుకోవచ్చు. వాటిని నిత్యజీవితంలో పాటిస్తే సమతుల్యత వస్తుంది' అని కేంద్ర మంత్రి మాండవీయ అన్నారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ... 'ఒక మంత్రి ఫిట్‌నెస్ ప్రాధాన్యతను గుర్తించడమే కాకుండా... ముందుండి 'సండేస్ ఆన్ సైకిల్' ఉద్యమాన్ని నడిపించడం ప్రేరణనిస్తోంది. ప్రతి నిత్యం ఎన్నో పనులతో బిజీగా ఉండే కేంద్ర మంత్రి... ఆదివారం ఉదయాన్నే ఈ కార్యక్రమంలో పాల్గొనడం దేశాన్ని 'ఫిట్'గా మార్చడంలో ఆయన నిబద్ధతను తెలియజేస్తోంది. మారిన సమాజంలో అరచేతిలో కాలక్షేపం అలవాటైపోయింది. కానీ ఎలక్ట్రానిక్ పరికరాలు పక్కన పెట్టి ప్రకృతితో మమేకం కావడం ఇలాంటి కార్యక్రమాలతోనే సాధ్యం' అని అన్నాడు. లియాండర్ పేస్ మాట్లాడుతూ... 'ఇలా సమష్టిగా కలిసి వర్కవుట్ చేయడంలో వచ్చే ఆనందమే వేరు. ఒకరిని ఒకరు ప్రేరేపించుకుంటూ... ఒకరికి ఒకరు స్ఫూర్తిగా నిలుస్తూ ముందుకు సాగవచ్చు. ఫిట్‌నెస్ అనేది కేవలం శరీరానికి సంబంధించింది మాత్రమే కాదు. దానివల్ల మనోబలం కూడా పెరుగుతుంది' అని పేర్కొన్నాడు. దేశవ్యాప్తంగా పండుగ వాతావరణంలో సాగుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరాడు.

నాటి సౌర తుఫాను... భూమిని వణికించింది!

అల్లాడిన భూ అయస్కాంత క్షేత్రం



భూ ధృవాల వద్ద అయస్కాంత క్షేత్రంపై ప్రభావం

2024 అక్టోబర్‌లో సంభవించిన భారీ సౌర తుఫాను భూమిని గట్టిగా వణికించిందని సైంటిస్టులు తాజాగా తేల్చారు. ముఖ్యంగా భూ అయస్కాంత క్షేత్రంపై అది పెను ప్రభావమే చూపిందట. భారత్ ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన ఆదిత్య ఎల్1 సౌర అబ్జర్వేటరీయే ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకురావడం విశేషం!

నాటి సౌర తుఫాను భూ అయస్కాంత క్షేత్రంతో పాటు దాని తాలూకు రక్షణ వ్యవస్థలను కూడా పునాదులతో సహా కంపింపజేసింది! ఆదిత్య ఎల్1 అందించిన డేటాను విశ్లేషించిన మీదట సైంటిస్టులు ఈ మేరకు నిర్ధారించారు. ఆ తుఫానర తాలూకు పెను ప్రభావాన్ని పరిశీలించేందుకు ఆదిత్య ఎల్1 అందించిన డేటాను అప్పటికే అందుబాటులో ఉన్న ఇతర అంతర్జాతీయ డేటాతో కలగలిపి నాసా లోతుగా విశ్లేషించింది. 2024 అక్టోబర్‌లో సూర్యునిపై అతి శక్తిమంతమైన ప్లాస్మా పేలుళ్లు సంభవించాయి. ఫలితంగా చెలరేగిన అపార శక్తి కణాలు అతి భారీ పరిమాణంలో భూమికేసిదూసుకొచ్చాయి. భూమిని సూర్యుని తాలూకు పరారుణ, రేడియో ధార్మిక కిరణాలు తదితరాల బారినుంచి అనునిత్యం కాపాడే అయస్కాంతావరణాన్ని అపార శక్తితో ఢీకొట్టాయి. వాటి ధాటికి అది కిందమీదులైనట్టు సైంటిస్టులు చెబుతున్నారు. అంతేకాదు, ఆ ఆఘాతం దెబ్బకు అయస్కాంతావరణం స్వల్పకాలం పాటు చెప్పుకోదగ్గ స్థాయిలో కుంచించుకు పోయిందట కూడా! అంతేగాక భూ ఎగువ వాతావరణ పొరల్లో అరోరా ప్రవాహాలు విపరీత స్థాయికి పెరిగాయి. ఫలితంగా పలు కృత్రిమ ఉపగ్రహాలు కూడా ప్రభావితం కావడం, పలు దేశాల్లో కమ్యూనికేషన్ల వ్యవస్థ తాత్కాలికంగా దెబ్బతినడం, పవర్ గ్రిడ్లు, మౌలిక వ్యవస్థలు పడకేయడం, జీపీఎస్ వ్యవస్థలు మొరాయించడం తెలిసిందే. ఈ భీకర సౌర తుఫానుకు సంబంధించిన రియల్ టైమ్ నిర్మాణాత్మక విశ్లేషణను ఆదిత్య ఎల్1 అందించింది. అంతరిక్షంలో జరుగుతున్న కీలక పరిణామాలకు సంబంధించి రియల్ టైమ్ డేటా ఆవశ్యకతను ఈ ఉదంతం మరోసారి కళ్లకు కట్టిందని సైంటిస్టులు చెబుతున్నారు. ముఖ్యంగా 2026లో సూర్యప్రతాపం పరాకాష్టకు చేరవచ్చన్న అంచనాల నేపథ్యంలో ఇది మరీ ముఖ్యమని వారంటున్నారు. ఈ పరిశోధన ఫలితాలను ఆస్ట్రోఫిజికల్ జర్నల్‌లో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

డిజిటల్ అరెస్ట్ పేరుతో ఘరానా మోసం

వృద్ధ దంపతుల నుంచి రూ.14.85 కోట్ల దోపిడీ

బాధిత దంపతులు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వృద్ధ దంపతులు భారీ సైబర్ మోసానికి గురయ్యారు. డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు రూ.14.85 కోట్లు దోచేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘరానా మోసం బయటకు వచ్చింది. 81 ఏళ్ల ఓం తనేజా, ఆయన భార్య, డాక్టర్ అయిన 77 ఏళ్ల ఇందిర దశాబ్దాల పాటు అమెరికాలో పనిచేశారు. భారత్‌కు తిరిగి వచ్చి 2016 నుంచి దక్షిణ ఢిల్లీలో నివసిస్తున్నారు. వారి పిల్లలు విదేశాల్లోనే స్థిరపడ్డారు. దంపతుల పరిస్థితిని, ఒంటరితనం, వయస్సు, ఆరోగ్య సమస్యలను ముందే తెలుసుకున్న నిందితులు వారిని బెదిరించి పెద్ద ఎత్తున డబ్బు దోచుకోవాలని పథకం పన్నారు. డిసెంబర్ 24న మధ్యాహ్నం 12 గంటలకు, టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారినంటూ ఒక వ్యక్తి తనేజాకు కాల్ చేశాడు. వారి ఇంటినుంచి అశ్లీల కాల్స్ వెళ్లాయని, 26 మంది తనకు ఫిర్యాదు చేశారని చెప్పాడు. దంపతులు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని, మహారాష్ట్రలో ఎఫ్ఐఆర్ నమోదైందని బెదిరించాడు. కేసును ముంబై పోలీసులకు బదిలీ చేస్తున్నామని చెప్పి.. అనంతరం కాల్‌ను వీడియో కాల్ మోడ్‌లోకి మార్చాడు. పోలీసు యూనిఫాంలో ఉన్న విక్రాంత్‌సింగ్ రాజ్‌పుత్ అనే వ్యక్తి లైవ్‌లోకి వచ్చాడు. వృద్ధులు రూ.500 కోట్ల మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని బెదిరించాడు. వెంటనే ముంబైకి రావాలని హెచ్చరించాడు. తన భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, తాము రాలేమని చెప్పడంతో.. డిజిటల్ అరెస్టు చేస్తున్నామని చెప్పాడు. డిసెంబర్ 24 నుంచి జనవరి 9 వరకు వీడియో కాల్ ఆన్‌లోనే ఉంది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని, చివరికి అమెరికాలో ఉన్న వారి పిల్లలకు కూడా చెప్పవద్దని హెచ్చరించాడు. డబ్బులు బదిలీ చేయాలని తనేజా దంపతులను డిమాండ్ చేశాడు. మొత్తం మీద, వారినుంచి రూ.14.85 కోట్లు తీసుకున్నారు. ఇదంతా ఆర్‌బీఐ నుంచి వాపస్ వస్తుందని నమ్మబలికారు. వారి వెరిఫికేషన్ 97 శాతం పూర్తయిందని చెప్పి జనవరి 8న మరో రూ.50 లక్షలు డిమాండ్ చేశారు. జనవరి 9న కాల్స్ ఆగిపోవడంతో దంపతులు పోలీసులను ఆశ్రయించారు.

అక్షరాలా ఊచకోతే!

- వచ్చింది 20 మంది, చంపింది వందల మందిని
- ఒక్కొక్కరూ నిమిషానికి 300 రౌండ్లు కాల్చారు
- మాపై అత్యాధునిక సోనిక్ ఆయుధ ప్రయోగం
- తల బరువెక్కి, ముక్కుల్లోంచి రక్తం, వాంతులు
- అమెరికా సైన్యం దాడిపై వెనెజువెలా పదవీచ్యుత అధ్యక్షుడు మదురో గార్డు కథనం

మదురో అరెస్ట్ (ఫైల్)

వాషింగ్టన్: అమెరికా ఇటీవల వెనెజువెలా రాజధాని కారకస్‌పై మెరుపు దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడు నికొలస్ మదురోను సతీసమేతంగా నిర్బంధించడం, న్యూయార్క్‌కు మెరుపువేగంతో తరలించిన ఘటనకు సంబంధించి విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇంత పెద్ద కిడ్నాప్, తరలింపు ఆపరేషన్‌ను అగ్రరాజ్యం కేవలం అరగంటలో ముగించిన తీరు చూసి ప్రపంచమంతా నోరెళ్లబెట్టింది. అయితే అమెరికా స్పెషల్ ఫోర్సెస్ ఆ సందర్భంగా మదురో అంగరక్షకులను, ఇతర సెక్యూరిటీ సిబ్బందిని అక్షరాలా ఊచకోతే కోశాయట! రంగంలోకి దిగింది కేవలం 20 మందే అయినా వందలాది మంది రక్షణ సిబ్బందిని పిట్టల్లా కాల్చి చంపారట. ఆ సమయంలో విధుల్లో ఉన్న మదురో సెక్యూరిటీ సిబ్బందిని ఉటంకిస్తూ అమెరికా అధికార భవనం వైట్‌హౌస్ ప్రెస్ మహిళా సెక్రెటరీ కరోలిన్ లెవిట్ శనివారం ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. 'మీరు ఏం చేస్తున్నా సరే, అర్జెంటుగా ఆపేసి ఇదోసారి చదవండి...' అంటూ క్యాప్షన్ కూడా జోడించారు. అప్పుడేం జరిగిందో సదరు సెక్యూరిటీ గార్డు ఇంటర్వ్యూ తరహాలో చెప్పుకొచ్చారు. ''అంతా హఠాత్తుగా మొదలైంది. ఉన్నట్టుండి మా రాడార్ వ్యవస్థలన్నీ మూగబోయాయి. ఏమైందా అని చూస్తుండగానే మా మీదుగా అసంఖ్యాకంగా డ్రోన్లు ఎగరసాగాయి. ఇదంతా రెప్పపాటులో జరిగిపోయింది. ఎలా స్పందించాలో తెలియక మేం తికమక పడుతుండగానే హెలికాప్టర్లు ప్రత్యక్షమయ్యాయి. వాటినుంచి దాదాపు 20 మంది సైనికులు దిగారు. మేం చాలామందిమి ఉన్నా వారి దగ్గరున్న అత్యాధునిక ఆయుధాల ముందు మా సంఖ్యా బలం ఎందుకూ కొరగాకుండా పోయింది. మా జీవితంలో అలాంటి వారితో అప్పటిదాకా ఎప్పుడూ పోరాడలేదు. నేలపై కాలు పెట్టిన క్షణం నుంచీ వారు అక్షరాలా ఊచకోతకు దిగారు. అత్యంత వేగంగా, అంతకుమించిన కచ్చితత్వంతో కాల్పులు సాగించారు. ఒక్కొక్కరూ నిమిషానికి కనీసం ఏకంగా 300 రౌండ్లకు పైగా కాల్చారు'' అని చెప్పుకొచ్చాడు.

జీవాయుధమా?

దాడి సందర్భంగా అమెరికా సైనికులు తామెన్నడూ చూడని ఒక అత్యాధునిక ఆయుధాన్ని సైతం ఉపయోగించినట్లు మదురోకు రక్షణ విధుల్లో ఉన్న భద్రతాసిబ్బందిలో ఒకరు చెప్పడం విశేషం. '' ఆ అత్యాధునిక ఆయుధం నుంచి అత్యంత తీవ్రతతో కూడిన శబ్ద తరంగాలు వెలువడ్డాయి. వాటి తీవ్రతకు నా తల బద్దలవుతుందా అనిపించింది. మా ముక్కులోంచి రక్తం కారసాగింది. కొందరైతే రక్తం కక్కుకున్నారు. ఆ శబ్దం దెబ్బకు కదల్లేని పరిస్థితిలోకి జారుకున్నాం. వాళ్లలో కనీసం ఒక్కరంటే ఒక్కరిని కూడా కనీసం గాయపరచలేకపోయాం. మాలో వందల మందిని పొట్టన పెట్టుకున్నారు'' అని వివరించారు. ''అమెరికాతో పోరాడగలమని ఇప్పటికీ నమ్ముతున్న లాటిన్ అమెరికా దేశాలన్నింటికీ ఒకటే చెబుతున్నా. అమెరికా సైనిక సామర్థ్యం గురించి మీకసలు ఏమీ తెలియదు'' అంటూ సదరు గార్డు హెచ్చరికలు కూడా చేయడం విశేషం.

నేడు మోదీ, మెర్జ్ కీలక భేటీ

ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతమే లక్ష్యంగా చర్చలు

- ఇరుదేశాల బంధం 75 వసంతాలు పూర్తిచేసుకుంటున్న వేళ కీలక పరిణామం
- రూ.1.5 లక్షల కోట్లు దాటిన ఇరుదేశాల ద్వైపాక్షిక వాణిజ్యం
- గాంధీనగర్‌లో విస్తృతస్థాయిలో చర్చలు
- కైట్ ఫెస్టివల్‌లో పతంగులు ఎగరేయనున్న అగ్రనేతలు!

మోదీతో మెర్జ్(ఫైల్)

సాక్షి, న్యూఢిల్లీ: ఇరుదేశాల ద్వైపాక్షిక బంధాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, జర్మనీ చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్‌లు సోమవారం గుజరాత్‌లో భేటీకానున్నారు. ఇందుకు గాంధీనగర్‌లోని మహాత్మాగాంధీ మందిర్ వేదికకానుంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు మోదీ, మెర్జ్‌లు తొలుత అహ్మదాబాద్‌లోని సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శిస్తారు. అక్కడ మహాత్మునికి నివాళులర్పిస్తారు. తర్వాత 10 గంటల సమయంలో సబర్మతీ నదీతీరంలో జరుగుతున్న ప్రఖ్యాత ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. ఇరు నేతలు స్వయంగా పతంగులను ఎగరేసే అవకాశముంది. తర్వాత నేరుగా గాంధీనగర్‌కు చేరుకుంటారు. అక్కడి మహాత్మామందిర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. కీలక అంశాలపై విస్తృతస్థాయి చర్చించనున్నారు. వ్యూహాత్మక భాగస్వామ్యంలో పురోగతిపై సమీక్ష జరపనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, విద్య, నైపుణ్య శిక్షణ, రవాణా రంగాల్లో పరస్పర సహకారంపై ప్రధానంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. రక్షణ, భద్రత, శాస్త్ర సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, పరిశోధన, హరిత ఇంధనం, సుస్థిరాభివృద్ధి, ఇరుదేశాల ప్రజల మధ్య సంబంధ బాంధవ్యాల వంటి కీలక అంశాలపైనా విస్తృతస్థాయిల చర్చ జరగనుంది.

అత్యంత నమ్మకమైన నేస్తంగా జర్మనీ..

ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో వేగంగా మారుతున్న సమీకరణాల నేపథ్యంలో భారత్‌కు యూరప్‌లో అత్యంత నమ్మకమైన నేస్తంగా జర్మనీ అవతరించింది. కేవలం వాణిజ్యానికే పరిమితమైన సంబంధాలు నేడు రక్షణ, అంతరిక్షం, హరిత ఇంధనం, సాంకేతికత వంటి కీలక రంగాలకు విస్తరించి, ఇరు దేశాల మైత్రిని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. 1951లో భారత్‌తో దౌత్య సంబంధాలు ఏర్పరుచుకున్న తొలి దేశాల్లో జర్మనీ ఒకటి. 2026 నాటికి ఈ బంధం 75 ఏళ్లు పూర్తి చేసుకోబోతున్న తరుణంలో భారత్‌కు జర్మనీ అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. దీనికి నిదర్శనమే జర్మనీ నూతన ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ తన తొలి ఆసియా పర్యటన కోసం భారత్‌ను ఎంచుకోవడం. ఇరు దేశాల మధ్య 2000వ సంవత్సరంలో కుదిరిన 'వ్యూహాత్మక భాగస్వామ్యం' 2025 నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుని రజతోత్సవాలు జరుపుకోవడం ఈ బంధంలోని దృఢత్వాన్ని చాటిచెబుతోంది.

రక్షణ రంగంలో 'రెడ్ కార్పెట్'..

ఒకప్పుడు రక్షణ పరికరాల ఎగుమతులపై కఠిన ఆంక్షలు విధించిన జర్మనీ నేడు తన వైఖరిని పూర్తిగా మార్చుకుని భారత్‌కు ఈ రంగంలో ఎర్రతివాచీ పరిచి మరీ ఆహ్వానిస్తోంది. రక్షణ ఎగుమతుల నియంత్రణలను సడలించి, భారత్‌కు అత్యాధునిక సాంకేతికతను అందించేందుకు సిద్ధమైంది. హిందూ మహాసముద్రంలో చైనా ప్రాబల్యం పెరుగుతున్న వేళ ఇండో-పసిఫిక్ ప్రాంత భద్రతలో జర్మనీ తన భాగస్వామ్యాన్ని పెంచుకుంది. ఇటీవల జరిగిన 'మలబార్-2025' నావికా విన్యాసాల్లో జర్మనీ పాల్గొనడం, భారత వాయుసేన నిర్వహించిన ప్రతిష్టాత్మక 'తరంగ్ శక్తి-1' విన్యాసాల్లో జర్మన్ ఎయిర్ ఫోర్స్ పాలుపంచుకుంది.

రికార్డు స్థాయిలో వాణిజ్యం..

యూరోపియన్ యూనియన్‌లో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా జర్మనీ తన స్థానాన్ని పదిలపరుచుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రికార్డు స్థాయిలో రూ.1.51 లక్షల కోట్ల(16.65 బిలియన్ డాలర్ల)కు చేరింది. భారత్‌లో ఇప్పటికే సీమెన్స్, ఫోక్స్ వ్యాగన్, డీహెచ్ఎల్ వంటి 2,000కు పైగా జర్మనీ కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టాయి. జర్మనీలో 215కు పైగా భారతీయ కంపెనీలు ఐటీ, ఆటోమొబైల్, ఫార్మా రంగాల్లో భారీ స్థాయిలో పెట్టుబడులు పెట్టాయి.

గ్రీన్ ఎనర్జీకి జర్మనీ భరోసా..

పర్యావరణ పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో జర్మనీ భారత్‌కు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 2030 నాటికి భారత్‌లో హరిత ఇంధన ప్రాజెక్టుల కోసం 10 బిలియన్ యూరోల ఆర్థిక సాయం అందించేందుకు జర్మనీ కట్టుబడి ఉంది. అహ్మదాబాద్, సూరత్ మెట్రో రైల్ ప్రాజెక్టులతో పాటు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లోని గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, కొచ్చిలో వాటర్ మెట్రో ప్రాజెక్టుకు జర్మనీ ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తోంది.

ఉన్నత విద్య కోసం జర్మనీకి ఛలో..

విద్య, పరిశోధన, ఉపాధి రంగాల్లోనూ ద్వైపాక్షిక బంధం కొత్త పుంతలు తొక్కుతోంది. ఒకప్పుడు విదేశీ విద్య అంటే అమెరికా, బ్రిటన్‌లవైపే చూసే భారతీయ విద్యార్థులు ఇప్పుడు జర్మనీకి సైతం పెద్ద సంఖ్యలో వెళ్తున్నారు. ప్రస్తుతం జర్మనీలో 60 వేల మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. జర్మనీలోని విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికం. ఇరు దేశాల మధ్య కుదిరిన 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' ఒప్పందం ద్వారా భారతీయ నిపుణులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు మరింత సులభతరమయ్యాయి. ఇస్రో, జర్మన్ స్పేస్ సెంటర్ (డీఎల్ఆర్) మధ్య 1974 నుంచి కొనసాగుతున్న అంతరిక్ష పరిశోధనల సహకారం నేడు మరింత విస్తృతమైంది. ఐఐటీ మద్రాస్ వంటి భారతీయ విద్యాసంస్థలు జర్మన్ వర్సిటీలతో కలిసి డ్యూయల్ డిగ్రీలను ఆఫర్ చేస్తున్నాయి. ఇలా.. సంస్కృతి నుంచి సాంకేతికత వరకు, రక్షణ నుంచి వాణిజ్యం వరకు అన్ని రంగాల్లోనూ భారత్-జర్మనీ బంధం 'డబుల్ ఇంజిన్' వేగంతో దూసుకెళ్తోంది.

బీజేపీ అధ్యక్షుడిగా నబీన్?

అతి త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ అగ్రనాయకత్వంలో కీలక మార్పునకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వ్యవహరిస్తున్న నితిన్ నబీన్‌ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టబో తున్న ట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఈ నెల 19 లేదా 20వ తేదీన ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు బీజేపీ అగ్రనాయకత్వం, ఆర్ఎస్ఎస్ మధ్య జరుగుతున్న అంతర్గత చర్చలు తుది దశకు చేరుకున్నాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే నూతన జాతీయ అధ్యక్షుడి పేరును అధికారికంగా ప్రకటించేందుకు బీజేపీ అధిష్టానం సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

సంఘ్ గ్రీన్ సిగ్నల్

జాతీయ అధ్యక్ష పదవికి నితిన్ నబీన్ పేరును ఖరారు చేయడంలో ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన సమన్వయ సమావేశాల్లో నబీన్ నాయకత్వ సామర్థ్యాలపై సంఘ్ సానుకూల అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాలన్న లక్ష్య సాధనకు నబీన్ సరైన ఎంపికగా ఆర్ఎస్ఎస్ పెద్దలు భావిస్తున్నారు.

ఎంపిక వెనుక వ్యూహం...

నితిన్ నబీన్ గత నెలలో బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ హోదాలో తీసుకున్న నిర్ణయాలు, రాష్ట్రాల నేతలతో సమన్వయం, యువతలో పెరుగుతున్న ఆదరణే ఆయనకు సానుకూల అంశాలుగా మారినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. త్వరలో ఐదు రాష్ట్రాల ఎన్నికలున్నాయి. ఇంకా కొన్ని రాష్ట్రాలకు బీజేపీ అధ్యక్షులను ఎంపిక చేయాల్సి ఉంది. అలాగే వివిధ రాష్ట్రాల ఎన్నికల ఇన్‌చార్జీల నియామకాలకు మార్గం సుగమం చేయడం, 2029 లోక్‌సభ ఎన్నికల దిశగా పార్టీని సన్నద్ధం చేయాలన్నదే అధిష్టానం వ్యూహంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందే పార్టీకి స్పష్టమైన దిశను నిర్దేశించబోతున్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డాకు పార్టీలో లేదా ప్రభుత్వంలో మరిన్ని కీలక బాధ్యతలు అప్పగిస్తారని బీజేపీ నేతలు చెబుతున్నారు.

ప్రపంచంలో అస్థిరత్వం.. భారత్‌లో స్థిరత్వం

- దేశ అభివృద్ధి ప్రయాణంలో పాలుపంచుకోండి
- పారిశ్రామికవేత్తలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

రాజ్‌కోట్: ప్రపంచమంతటా అస్థిర పరిస్థితులు, ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, భారత్‌లో మాత్రం గతంలో ఎన్నడూ లేనంత రాజకీయ స్థిరత్వం ఉన్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. దేశంలో వ్యాపార ప్రగతికి అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలని, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. భారత్‌లో పెట్టుబడులకు పూర్తి సానుకూల వాతావరణం ఉందన్నారు. ఆదివారం గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో వైబ్రాంట్ గుజరాత్ ప్రాంతీయ సదస్సును ప్రధాని మోదీ ప్రారంభించారు. భారత ఆర్థిక వ్యవస్థ నేడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని వివరించారు. త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. దేశ ప్రగతిలో గుజరాత్ కీలక పాత్ర పోషిస్తోందని గుర్తుచేశారు. భారత్ పట్ల ప్రపంచ దేశాలు ఆకాంక్షలు నానాటికీ పెరుగుతున్నాయని, తాజా గణాంకాలు ఇదే విషయం స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. దేశంలో మధ్య తరగతి వర్గం వేగంగా విస్తరిస్తోందని, వారి కొనుగోలు శక్తి పెరుగుతోందని చెప్పారు. తద్వారా వ్యాపార అభివృద్ధికి అవకాశాలు సైతం అదే స్థాయిలో పెరుగుతు న్నాయని వెల్లడించారు. మొబైల్ డేటా వినియోగంలో భారత్ అగ్రస్థానంలో ఉందన్నారు. వైబ్రాంట్ గుజరాత్ సదస్సుకు దేశ విదేశీ పెట్టుబడిదారులు హాజరయ్యారు.

చైనా మాంజా కాటుకు ద్విచక్ర వాహనదారుడు మృతి

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో ఘోరం జరిగింది. చైనా మాంజా మెడకు చుట్టుకోవడంతో 45 ఏళ్ల రఘుబీర్ ధఖడ్ ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, హఠాత్తుగా చైనా మాంజా మెడకు బిగుసుకుంది. మెడ కోసుకుపోవడంతో తీవ్రంగా రక్తస్రావం జరిగింది. దాంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చైనా మాంజాపై నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా అమ్మకాలు సాగుతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బాధితుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇండోర్‌లో గత ఏడాది నవంబర్ 30న 16 ఏళ్ల బాలుడు చైనా మాంజా కారణంగా బలైపోయాడు. మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా మాంజా ప్రాణం తీసింది.

ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణాలతో కాలుష్యాన్ని చెక్

మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్య

ముంబై: నగరంలో భవన నిర్మాణకార్యకలాపాల సమయంలో ఉత్పన్నమయ్యే దుమ్ము కాలుష్యాన్ని అరి కట్టడానికి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. భవన నిర్మాణాల్లో ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇది కొంత ఖరీదైనదని, అయినప్పటికీ రాయితీలు, ప్రోత్సాహకాల విషయమై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చిస్తానని తెలిపారు. కాలుష్యానికి కారణమయ్యే పద్ధతులను ఉపయోగించకూడదనే షరతులు విధించడానికి బదులుగా.. ప్రీకాస్ట్, స్టీల్ నిర్మాణ పద్ధతులు అవలంబించేలా బిల్డర్ల మధ్య ఏకాభిప్రాయం తీసుకురావడానికి ప్రయత్నాలు జరగాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా కాంక్రీట్ మిక్సర్ల వాడకం తగ్గుతోందని, భవిష్యత్‌లో వాటిని చూడలేరన్నారు. ముంబైలోనూ ఈ మిక్సర్లను నగరం వెలుపలకు మార్చాలని బిల్డర్లకు పిలుపునిచ్చారు. జనవరి 15న జరగనున్న ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈస్ట్ ముంబైలోని మలాడ్ వెస్ట్ శివారులో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తన నియోజకవర్గమైన ఉత్తర ముంబైలోనూ నాలుగైదు మిక్సర్లను తొలగించానని చెప్పారు. అంతేకాదు.. మత, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రత్యేకంగా ప్రజల కోసం మైదానాలను కేటాయించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు.

600 ఖాతాలు, 3500 పోస్టులు తొలగింపు

న్యూఢిల్లీ: ఎలాన్ మస్క్ సొంత సామాజిక మాధ్యమం ఎక్స్ ప్లాట్‌ఫామ్ ఏఐ అసిస్టెంట్ ' గ్రోక్'తన తప్పును అంగీకరించింది. భారతీయ చట్టాలకు లోబడి పనిచేస్తామని హామీ ఇవ్వడమే కాదు.. సుమారు 3,500 పోస్టులను, 600కు పైగా ఖాతాలను తొలగించింది. గ్రోక్‌ను దుర్వినియోగం చేస్తున్న ఆకతాయిలు మహిళల నగ్న చిత్రాలను సృష్టిస్తున్నారు. దీనిపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెలువెత్తాయి. ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా మార్చడంపై విమర్శలు వచ్చాయి. దీనిపై ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి కంటెంట్ సమాచార సాంకేతిక చట్టం-2000 నియమ నిబంధనలను ఉల్లంఘిస్తుందని పేర్కొంది. సోషల్ మీడియా సంస్థలన్నీ తమ ఐటీ నిబంధనలను పాటించాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అలాంటి పోస్టులను వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ఎక్స్ స్పందించింది. 3500 పోస్టులను తొలగించడమే కాదు.. 600 అకౌంట్లను తొలగించింది. ఇక ఎక్స్ వేదికపై అశ్లీలం, అసభ్య చిత్రాలకు చోటు ఇవ్వబోమని స్పష్టం చేసింది. భారతీయ చట్టాలను లోబడి పని చేస్తామని హామీ ఇచ్చింది. గ్రోక్‌తో ఎవరైనా చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను సృష్టించినా, అప్‌లోడ్ చేసినా.. వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించింది. గ్రోక్‌తో ఇమేజ్ జనరేట్ చేసే ఫీచర్‌పై పరిమితులు విధించింది.

పరిపాలనలో డీఎంకే ప్రభుత్వం విఫలం

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ ధ్వజం

కోయంబత్తూరు: తమిళనాడు ప్రజలకు సుపరిపాలన అందించడంలో డీఎంకే ప్రభుత్వ ఘోరంగా విఫలమైందని బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నబీన్ విమర్శించారు. డీఎంకే పట్ల ప్రజలు ఏమాత్రం సంతృప్తిగా లేరని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలు వెక్కిరిస్తున్నాయని తెలిపారు. ఆయన ఆదివారం తమిళనాడులోని కోయంబత్తూరులో బీజేపీ ఆఫీసు బేరర్లు, బూత్ కమిటీల కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అవినీతి రహిత, సౌభాగ్యవంతమైన తమిళనాడుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి తమ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. మోదీ సర్కార్ దార్శనికతను ప్రతి ఇంటికీ, ప్రతి పోలింగ్ బూత్‌కు చేర్చాలని చెప్పారు. పేరూర్ పతీశ్వరార్ ఆలయం, మరుదమలై మురుగన్ ఆలయాన్ని నితిన్ నబీన్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

పార్కింగ్ ఫీజు అడిగినందుకు.. కారుతో తొక్కించారు..!

హరిద్వార్: వాహన పార్కింగ్ ఫీజుపై తలెత్తిన వివాదం ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఆదివారం చోటుచేసుకుంది. హరియాణాలోని సోనిపట్‌కు చెందిన విశాల్(22), సూరజ్(34) హర్ కీ పౌడీలోని దీన్‌దయాళ్ పార్కింగ్ ప్రాంతంలో తమ కారును ఉంచారు. ఫీజు విషయంలో పార్కింగ్ మేనేజర్ సహదేవ్ కుమార్(55)తో వారికి వివాదం తలెత్తింది. ఆగ్రహంతో వారు కారును అతి వేగంగా సహదేవ్ కుమార్‌పైకి పోనిచ్చారు. అనంతరం, కారు పార్కింగ్ గేటును ఢీకొట్టి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే తీవ్రంగా గాయపడిన సహదేవ్‌ను ఆస్పత్రికి తరలించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన విశాల్, సూరజ్‌లను అనంతరం కారుతో సహా పట్టుకున్నారు. ఘటన సమయంలో విశాల్ కారు నడుపుతుండగా, సూరజ్ పక్కన కూర్చున్నట్లు పోలీసులు తెలిపారు. పార్కింగ్ ఫీజు ఎగ్గొట్టి వెళ్లేందుకు వారు యత్నించగా సహదేవ్ అడ్డుకోవడంతో గొడవ మొదలైందని చెప్పారు.

మయన్మార్‌లో రెండో దశ పోలింగ్

యాంగూన్: మయన్మార్‌లో ఆదివారం రెండో దశ పోలింగ్ జరిగింది. అయిదేళ్ల క్రితం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసి సైనిక జుంటా అధికారపగ్గాలను చేపట్టాక మొదటి ఎన్నికలివి. డిసెంబర్ 28వ తేదీన మొదటి దశలో దేశంలోని 102 పట్టణాల్లో పోలింగ్ జరిగింది. ఆదివారం మరో 100 పట్టణాల్లో పోలింగ్ చేపట్టారు. ఇటీవలి కాలంలో ఘర్షణలు ఎక్కువగా చోటుచేసుకున్న ప్రాంతాల్లోనే ఈ పట్టణాలున్నాయి. దీంతో, భారీగా భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. ఈ నెల 25వ తేదీన తుది విడతలో 65 పట్టణాల్లో పోలింగ్ జరగనుంది. రాజ్యాంగం ప్రకారం పార్లమెంట్ ఉభయ సభల్లోని 664 సీట్లకుగాను ఆర్మీకి 25 శాతం సీట్లను ప్రత్యేకించాల్సి ఉంది. ఉభయ సభల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. ఈ ఎన్నికల్లో సైనిక జుంటా మద్దతున్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ(యూఎస్‌డీపీ)దే విజయమని విశ్లేషకులు అంటున్నారు. నోబెల్ గ్రహీత అంగ్‌సాన్ సూకీని వివిధ నేరారోపణలతో జైలు పాలు చేసిన సైనిక జుంటా..ఆమె సారథ్యంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ పార్టీని రద్దు చేసింది.

షిండేను హ్యాండిల్ చేయడం చాలా ఈజీ

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కీలక వ్యాఖ్యలు

ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో పనిచేయడం చాలా కష్టమని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. శివసేన(షిండే) అధినేత ఏక్‌నాథ్ షిండేను హ్యాండిల్ చేయడం చాలా సులభమని చెప్పారు. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఆదివారం ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడారు. ఉద్ధవ్ ఠాక్రే, ఏక్‌నాథ్ షిండేలతో కలిసి పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. రాష్ట్రంలో అధికార కూటమిలో కలహాలపై వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. ''షిండేను హ్యాండిల్ చేయడం చాలా సులభం. ఎందుకంటే ఆయన కూడా నాలాగే భావోద్వేగాలకు లోనయ్యే వ్యక్తి. కానీ, ఉద్ధవ్ ఠాక్రేను అస్సలు అంచనా వేయలేం. ఆయనను అర్థం చేసుకోవడానికి ఒక పరిశోధకుడిని నియమించాల్సి ఉంటుంది'' అని ఫడ్నవీస్ వ్యాఖ్యానించారు.

గ్రామ ప్రథమ పౌరుడిగా ఎవరిని పేర్కొంటారు?

73వ రాజ్యాంగ సవరణ చట్టం

స్థానిక ప్రభుత్వాల బలోపేతం ద్వారా గ్రామీణ వికాసాన్ని సాధించడానికి స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని 1986లో నియమించిన ఎల్.ఎం. సింఘ్వి కమిటీ సిఫార్సు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు రాజీవ్‌గాంధీ ప్రభుత్వం 1989లో 64వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. ఈ బిల్లు లోక్‌సభ ఆమోదం పొందగా రాజ్యసభలో తిరస్కరించారు. అనంతరం పి.వి.నరసింహారావు ప్రభుత్వం 1991లో 73వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టింది. పార్లమెంట్ దీన్ని 1992లో ఆమోదించగా, రాష్ట్రపతి 1993 ఏప్రిల్ 20న ఆమోదించారు. ఇది 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం గురించి ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. అధికరణలు 243(ఎ) నుంచి 243(ఒ) వరకు దీని గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా 9వ భాగంలో చేర్చారు. ఈ చట్టంలో చేర్చిన మొత్తం అంశాలు 29.

243వ అధికరణ నిర్వచనాలు

జిల్లా, గ్రామసభ, మాధ్యమిక స్థాయి (మండల పరిషత్), పంచాయతీ ఏరియా, జనాభా మొదలైన అంశాలపై గవర్నర్ నోటిఫికేషన్ ద్వారా నిర్వచనాలు తెలియజేస్తారు.

అధికరణ 243(ఎ) – గ్రామసభ: పంచాయతీ రాజ్ చట్టం ద్వారా గ్రామసభకు అత్యంత ప్రాముఖ్యం కల్పించారు. దీంట్లో గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. గ్రామసభ కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి. సమావేశాల కోరం 1/10వ వంతు. గ్రామ సర్పంచ్ ఈ సమావేశాలను ఏర్పాటు చేసి, నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీ దీనికి సమష్టి బాధ్యత వహిస్తుంది. ఈ సమావేశాల్లో గ్రామ పంచాయతీ ఎజెండాను రూపొందిస్తారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్యానికి దీన్ని ప్రాతిపదికగా భావించవచ్చు.

అధికరణ 243 (బి)– పంచాయతీల వ్యవస్థాపన: ప్రతి రాష్ట్రంలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. 20 లక్షల లోపు జనాభా ఉన్న రాష్ట్రాల్లో మాధ్యమిక వ్యవస్థ తప్పనిసరి కాదు.

1. **గ్రామ పంచాయతీ:** 500ల మందికి మించి జనాభా ఉన్న గ్రామాన్ని గ్రామ పంచాయతీగా గుర్తించవచ్చు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వీటి సంఖ్య సుమారుగా 21,590. తెలంగాణలో గ్రామాల సంఖ్య సుమారుగా 8872. వార్షిక ఆదాయం 60 వేలు దాటితే మేజర్ పంచాయతీగా, అంత కంటే తక్కువగా ఉంటే మైనర్ పంచాయతీగా పేర్కొంటారు.
2. **మండల పరిషత్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మండల వ్యవస్థను 1986లో ప్రవేశపెట్టారు. సుమారుగా 40 వేల జనాభాకు 20 నుంచి 30 గ్రామాలను కలుపుతూ మండలాన్ని ఏర్పాటు చేశారు.
3. **జిల్లా పరిషత్:** పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో

భారతదేశ అభివృద్ధిలో గ్రామాల పాత్ర అత్యంత కీలకం. గ్రామీణ అభివృద్ధి, సమాజ వికాస సాధనలో స్థానిక ప్రభుత్వాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గ్రామీణ స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగ హోదా కల్పించారు. అందువల్ల దీన్ని 'పంచాయతీరాజ్ చట్టం' అని కూడా అంటారు.

ఉంచుకొని జిల్లాను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

అధికరణ 243 (సి) – పంచాయతీల నిర్మాణం: రాష్ట్ర శాసన సభ నిర్ణయించిన చట్టాల మేరకు పంచాయతీల నిర్మాణం ఉంటుంది.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌లో ప్రధానంగా ఆరు విభాగాలుంటాయి.

జిల్లా పరిషత్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1) ప్రత్యక్షంగా ఎన్నికైన జడ్పీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యులు

వీరితోపాటు జిల్లా గ్రంథాలయ, సహకార బ్యాంక్, డెయిరీ, మార్కెట్ కమిటీ చైర్మన్ శాశ్వత ఆహ్వానిత సభ్యులుగా కొనసాగుతారు.

జిల్లా పరిషత్ చైర్మన్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించవచ్చు.

జిల్లా మహాసభ: జిల్లా పరిషత్ మండల పరిషత్‌కు మధ్య వారధిగా పనిచేస్తుంది. జడ్పీటీసీ, ఎంపీపీలు సభ్యులుగా కొనసాగుతారు.

స్థాయీ సంఘం: జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘాల పాత్ర కీలకమైంది. అందువల్ల వీటిని 'స్థానిక ప్రభుత్వాల కళ్లు, చెవులు'గా పేర్కొంటారు. ప్రతి జిల్లా పరిషత్‌లో ఏడు స్థాయీ సంఘాలు ఉంటాయి.

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో): సీఈవోగా సీనియర్ గ్రూప్–1 అధికారిని నియమిస్తారు. ఈయన జిల్లా సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

కలెక్టర్: జిల్లా పరిపాలనలో ఈయనే ముఖ్యులు. జిల్లాకు ఈయన ప్రధాన న్యాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎన్నికలు, శాంతి భద్రతలు, పౌరసరఫరా, కరవు కాటకాల అధికారిగా వ్యవహరిస్తారు.

మండల పరిషత్

మండల పరిషత్‌లో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

మండల పరిషత్ కౌన్సిల్: దీంట్లో మూడు రకాలు సభ్యులుంటారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

1) పార్టీ ప్రాతిపదికన ప్రత్యక్షంగా ఎన్నికైన ఎంపీటీసీలు
2) పదవి రీత్యా సభ్యులు
3) సహకార సభ్యుడు

మండల పరిషత్ ప్రెసిడెంట్: ఈయనను పరోక్ష పద్ధతిలో అయిదేళ్ల కాలానికి ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మండల మహాసభ: మండల పరిషత్‌కు గ్రామ పంచాయతీకి మధ్య వారధిగా పనిచేస్తుంది. దీంట్లో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సభ్యులుగా ఉంటారు. మండల పరిషత్ ప్రెసిడెంట్ దీని సమావేశాలను ఏర్పాటు చేసి నిర్వహిస్తారు.

ఎంపీడీవో: గ్రూప్–1 అధికారిని ఎంపీడీవోగా నియమిస్తారు. ఈయన మండల సమాచారాన్ని జిల్లా పరిషత్‌కు అందజేస్తారు.

గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయతీలో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి.

పంచాయతీ బోర్డు: వార్డు మెంబర్లు సభ్యులుగా ఉంటారు. వీరి సంఖ్య కనిష్ఠంగా 5, గరిష్ఠంగా 21 ఉండాలి. పంచాయతీ బోర్డు కనీసం నెలకు ఒకసారి సమావేశం కావాలి.

సర్పంచ్: గ్రామ ఓటర్లు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకుంటారు. గ్రామ ప్రథమ పౌరుడు ఈయనే. ఈయనను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగించే అవకాశం లేదు.

గ్రామసభ: గ్రామ ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. కనీసం ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాలి.

పంచాయతీ కార్యదర్శి: ఈయన ప్రభుత్వ ఉద్యోగి. గ్రామ పంచాయతీ సమాచారాన్ని మండల పరిషత్‌కు అందజేస్తారు.

అధికరణ 243(డి)–రిజర్వేషన్లు: ఎస్సీ,ఎస్టీలకు జనాభా ప్రాతిపదికన, మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించారు. బీసీ రిజర్వేషన్లను రాష్ట్రాలే నిర్ణయిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీలకు 18.25 శాతం, ఎస్టీలకు 8.25 శాతం, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మహిళా రిజర్వేషన్‌ను ఇటీ

వల కొన్ని రాష్ట్రాలు 50 శాతానికి పెంచాయి. దీన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం బీహార్.

అధికరణ 243 (ఇ) – పంచాయతీల పదవీ కాలం: స్థానిక ప్రభుత్వాల సాధారణ కాల పరిమితి అయిదేళ్లు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే రద్దుచేయవచ్చు. ఒకవేళ ముందుగా రద్దు చేస్తే తిరిగి ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలి.

అధికరణ 243 (ఎఫ్) – పంచాయతీ సభ్యుల అనర్హతలు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా ఈ అనర్హతలను నిర్ణయిస్తుంది. 21 ఏళ్ల లోపు ఉన్న వారు పోటీ చేసేందుకు అనర్హులు. 1995 తర్వాత ఇద్దరికి మించి సంతానం ఉన్నవారు అనర్హులు.

అధికరణ 243 (జి) – పంచాయతీల విధులు, అధికారాలు: పంచాయతీలకు 29 అంశాలకు సంబంధించిన విధులు, అధికారాలను కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 11వ షెడ్యూల్‌లో చేర్చారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు బదలాయించాలి.

ఉదాహరణలు:

1) వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ
2) భూ సంస్కరణలు, భూ పరిరక్షణ
3) తాగునీరు, సాగునీటి సరఫరా
4) పశు సంరక్షణ, కోళ్ల పరిశ్రమ
5) చేపలు
6) వనసంరక్షణ, సామాజిక అడవులు

అధికరణ 243(హెచ్)– పంచాయతీల ఆదాయ వనరులు: రాష్ట్ర శాసనసభ ప్రత్యేక చట్టం ద్వారా పంచాయతీలకు కొన్ని పన్నులను విధించే అధికారం కల్పిస్తుంది. కొన్ని పన్నుల్లో వాటా, సహాయ నిధులను కూడా ఇస్తుంది.

అధికరణ 243 (ఐ) – రాష్ట్ర ఆర్థిక సంఘం: రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని గవర్నర్ ఏర్పాటు చేస్తారు. దీని పదవీ కాలం 5 ఏళ్లు. ఇందులో చైర్మన్, సభ్యులు ఉంటారు. వీరిని నియమించే, తొలగించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఆర్థిక సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. దీని చైర్మన్ లక్ష్మణస్వామి. రాష్ట్ర ఆర్థిక సంఘం పంచాయతీలకు కేటాయించాల్సిన నిధులు, పన్నుల విభజన, ఇతర సహాయ గ్రాంట్ల గురించి సిఫార్సులు చేస్తుంది. సంబంధిత నివేదికను గవర్నర్‌కు సమర్పిస్తుంది. గవర్నర్ శాసనసభకు అందజేస్తారు.

అధికరణ 243 (జె) – పంచాయతీ ఖాతాల ఆడిటింగ్: పంచాయతీల ఆడిటింగ్ నిర్వహణకు శాసన చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో దీన్ని ఇప్పటి వరకూ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ఈ విధులను రాష్ట్ర ఆడిట్ సంచాలకులు నిర్వహిస్తున్నారు.

అధికరణ 243 (కె) – రాష్ట్ర ఎన్నికల కమిషన్: పంచాయతీలకు సకాలంలో సక్రమంగా ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితా రూపొందించడం తదితర విధులను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుంది. ఎన్నికల కమిషనర్‌ను గవర్నర్ నియమిస్తారు. ఈయన పదవీ కాలం అయిదేళ్లు. చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తే తొలగించే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘాన్ని 1994లో ఏర్పాటు చేశారు. మొదటి కమిషనర్ కాశీ పాండ్యన్. 2014లో తెలంగాణకు ప్రత్యేక ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీని కమిషనర్ నాగిరెడ్డి.

అధికరణ 243(ఎల్) – కేంద్ర పాలిత ప్రాంతాలకు అనువర్తన: పంచాయతీరాజ్ చట్టాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలకు కూడా వర్తింపజేయవచ్చు. శాసనసభ ఉంటే శాసనసభ ప్రత్యేక తీర్మానం ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. శాసనసభ లేకుంటే రాష్ట్రపతి నోటిఫికేషన్ ద్వారా వర్తింపజేయవచ్చు.

అధికరణ 243 (ఎం) – మినహాయింపులు: పంచాయతీరాజ్ చట్టం నుంచి కొన్ని ప్రాంతాలకు మినహాయింపులు ఇచ్చారు. ముఖ్యంగా జమ్ము–కశ్మీర్, మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం, షెడ్యూల్ ప్రాంతాలు, మణిపూర్‌లోని కొండ ప్రాంతాలు, పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి మినహాయింపులు ఉన్నాయి.

అధికరణ 243 (ఎన్) – పాత చట్టాల కొనసాగింపు: ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఏడాది వరకు పాత చట్టాలు అమల్లో ఉండవచ్చు. అంతకు ముందు రాష్ట్ర శాసనసభ 73వ సవరణ చట్టం మౌలిక స్వరూపానికి భంగం వాటిల్లకుండా సొంత చట్టాలను రూపొందించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో నూతన చట్టం 1994 నుంచి అమల్లోకి వచ్చింది.

అధికరణ 243 (ఒ)– న్యాయస్థానాల జోక్యం: పంచాయతీల్లో నియోజకవర్గాల ఏర్పాటు, వాటిలో సీట్ల కేటాయింపు గురించి న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. వీటి వివాదాల పరిష్కారానికి శాసనసభ తీర్మానం ద్వారా లీగల్ అథారిటీలను ఏర్పాటు చేయాలి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. జిల్లాపరిషత్ చైర్మన్‌ను ఎవరు ఎన్నుకుంటారు?
   ఎ) ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఓటర్లు
   బి) మండల పరిషత్ అధ్యక్షులు
   సి) జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యులు
   డి) జిల్లాలోని సర్పంచ్‌లు
2. పంచాయతీరాజ్ వ్యవస్థను మొదటగా1959 అక్టోబరులో ఏ రాష్ట్రం అమలు చేసింది?
   ఎ) రాజస్థాన్ బి) తమిళనాడు
   సి) కర్ణాటక డి) కేరళ
3. న్యాయ పంచాయతీల ఉద్దేశం ఏమిటి?
   ఎ) గ్రామ పంచాయతీలను నిర్వహించడం
   బి) పంచాయతీ ప్రెసిడెంట్ ఇచ్చిన తీర్పులను కొట్టేయడం
   సి) హైకోర్టు అప్పీలుకు అనుమతి ఇవ్వడం
   డి) గ్రామీణ ప్రజలకు త్వరగా ఎక్కువ ఖర్చు లేకుండా న్యాయాన్ని అందించడం
4. 73, 74వ రాజ్యాంగ సవరణ చట్టాలు కింది వాటిలో ఏ రాష్ట్రాలకు వర్తించవు?
   ఎ) గోవా, జమ్ము–కశ్మీర్, పాండిచ్చేరి
   బి) ఢిల్లీ, గోవా, మిజోరాం, మేఘాలయ
   సి) మేఘాలయ, నాగాలాండ్, మిజోరాం
   డి) సిక్కిం, అసోం, మిజోరాం
5. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థను ఏ ముఖ్యమంత్రి కాలంలో ప్రవేశపెట్టారు?
   ఎ) నీలం సంజీవరెడ్డి
   బి) దామోదరం సంజీవయ్య
   సి) కాసు బ్రహ్మానందరెడ్డి
   డి) పి.వి. నరసింహారావు

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) డి; 4) సి; 5) ఎ.

సమభార రేఖలు అని వేటిని అంటారు?

వాతావరణ పీడనం – పీడన మేఖలలు

మన చుట్టూ ఉన్న గాలిలో చాలా వాయు పరమాణువులు ఉంటాయి. ఆ పరమాణువులు ఒకదానిపై ఒకటి ఒత్తిడిని కలిగిస్తాయి. లేదా వాటి దారిలోకి వచ్చిన వాటిపై ఒత్తిడి కలిగిస్తాయి.

ఏ వస్తువు పై అయినా చూపే ఒత్తిడి ప్రభావాన్ని 'వాయు పీడనం' అంటారు. గాలి పై నుంచే కాకుండా అన్ని వైపుల నుంచి పీడనాన్ని కలిగిస్తుంది. గాలికి బరువు ఉంటుంది అని కనుగొన్న మొదటి శాస్త్రవేత్త గెలీలియో.

- వాయు పరమాణువులు వేడెక్కినప్పుడు వాటికి ఎక్కువ శక్తి లభించి వేగంగా కదులుతాయి. దీనివల్ల ఒత్తిడి పెరుగుతుంది. ఎక్కువ పరమాణువులు వాతావరణంలోని పైపొరలోకి వెళ్లినప్పుడు భూమికి దగ్గరగా వాటి సంఖ్య తగ్గుతుంది. అదేవిధంగా పీడనం తగ్గుతుంది.
- గాలి వేడెక్కినప్పుడు పీడనం తగ్గి, గాలి చల్లబడినప్పుడు పీడనం పెరుగుతుంది. గాలి, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.
- వేడెక్కిన గాలి పైకి వెళుతున్న కొద్దీ భూమి ఉపరితలం నుంచి పొందిన శక్తిని వేడిమి రూపంలో కోల్పోవడం మొదలు పెడుతుంది. శక్తి తగ్గినప్పుడు పరమాణువుల వేగం తగ్గి, మందకొడిగా తయారై దగ్గర దగ్గరవుతాయి. గాలి చల్లబడి గట్టిగా అవుతుంది. ఇలా చిక్కబడిన గాలి భూమ్యాకర్షణ శక్తి వల్ల ఉపరితలం దగ్గరకు వస్తుంది. చల్లటి గాలి కిందికి దిగిన చోట వాయుపీడనం పెరుగుతుంది.
- భూమిలో ఒక భాగం వేడెక్కి పీడనం తగ్గిందంటే.. అక్కడ తక్కువ పరమాణువులు, ఎక్కువ ఖాళీ ఉందని అర్థం. అధిక పీడనం ఉన్న ప్రాంతాల నుంచి గాలి ఈ ఖాళీ ప్రదేశాల వైపు కదులుతుంది. అందువల్లే గాలి ఎక్కువ పీడనం ఉన్న ప్రాంతాల నుంచి తక్కువ పీడనం ఉన్న ప్రాంతాలకు వీస్తుంది.

వాతావరణ పీడనం

ఏదైనా ఒక ప్రదేశంపై ఉన్న వాయువుల పొర బరువును ఆ ప్రదేశానికి సంబంధించిన 'వాతావరణ పీడనం' అంటారు. వాతావరణ పీడనాన్ని కొలిచే సాధనం భారమితి. కాబట్టి దీన్ని భారమితి పీడనం అంటారు.

భారమితిలో పాదరస మట్టం అకస్మాత్తుగా తగ్గడం తుపాను రాకను తెలుపుతుంది. అదేవిధంగా భారమితిలో పాదరస మట్టం పెరగడం ప్రశాంత వాతావరణాన్ని తెలుపుతుంది.

సముద్రమట్టం వద్ద సామాన్య (లేదా) ప్రామాణిక వాతావరణ పీడనం ఉన్నప్పుడు పాదరస మట్టం ఎత్తు 760 మి.మీ. లేదా 29 అంగుళాలుగా ఉంటుంది. భారమితిలో పాదరస మట్టం 760 మి.మీ. ఉన్నప్పుడు వాతావరణ పీడనం 1013.2 మిల్లీబార్లుగా ఉంటుంది. పాదరస మట్టం ఎత్తు 3 మి.మీ. అయితే అది 4 మిల్లీబార్ల వాతావరణ పీడనానికి సమానం.

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జాగ్రఫీ

వాతావరణ పీడనాన్ని ప్రభావితం చేసే అంశాలు:

ఎత్తు

భూమి ఆకర్షణ శక్తి వల్ల వాతావరణం కింది పొరలు దట్టంగా ఉండి అధిక పీడనం కలిగిస్తాయి. కాబట్టి భూ ఉపరితలం నుంచి పైకి వెళ్లే కొద్దీ పీడనం తగ్గుతుంది. ప్రతి 10 మీటర్ల ఎత్తుకు ఒక మిల్లీబారు చొప్పున (లేదా) 300 మీటర్లకు 34 మిల్లీబార్ల పీడనం తగ్గుతుంది.

ఉష్ణోగ్రత

వేడెక్కిన గాలి వ్యాకోచించి తేలికగా ఉంటుంది. చల్లటి గాలి సంకోచించి ఎక్కువ బరువుగా ఉంటుంది. ఉష్ణోగ్రత పెరిగితే పీడనం తగ్గుతుంది. ఉష్ణోగ్రత తగ్గితే పీడనం పెరుగుతుంది. ఉష్ణోగ్రత, పీడనం విలోమ సంబంధాన్ని కలిగి ఉంటాయి.

నీటి ఆవిరి

పొడి గాలి కంటే నీటి ఆవిరి తేలికగా ఉంటుంది. కాబట్టి వాతావరణంలో నీటి ఆవిరి పరిమాణం ఎక్కువైతే పీడనం తగ్గుతుంది.

పీడన మేఖలలు

క్షితిజ సమాంతరంగా భూమి ఉపరితలంపై వివిధ పీడన మేఖలలు ఏర్పడ్డాయి. అధిక, అల్పపీడన మేఖలలు ఒకదాని తర్వాత ఒకటిగా ఏర్పడ్డాయి.

- భూగోళంపై మొత్తం 7 పీడన మేఖలలు ఉన్నాయి.

భూమధ్యరేఖ అల్పపీడన మేఖల

ఇది 10° ఉత్తర అక్షాంశం నుంచి 10° దక్షిణ అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది. ఇది అధిక ఉష్ణోగ్రతల వల్ల ఏర్పడింది. దీన్ని నిర్వాత మండలం, డోల్‌డ్రమ్, ప్రశాంత మండలం అని కూడా అంటారు. ఈ మేఖలలో సూర్యకిరణాలు నిట్టనిలువుగా ప్రసరించడం వల్ల రోజూ సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. ఈ విధమైన వర్షపాతాన్ని 'సంవహన వర్షపాతం' అంటారు.

ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల

ఇది $23\ 1/2^\circ$ ఉత్తరార్ధగోళం నుంచి 35° దక్షిణార్ధ గోళంలో విస్తరించి ఉంది. భూమధ్యరేఖ నుంచి పైకి తేలి వచ్చే వాయువులు సంకోచించి ఇది ఏర్పడుతుంది. ఈ మండలాన్ని 'నిమజ్జిత మండలం' అంటారు.

ఉప ధ్రువ అల్ప పీడన మేఖల (లేదా) సమశీతోష్ణ అల్పపీడన మేఖల

ఈ మేఖలలు 45°–$66\ ^1/_2{}^\circ$ అక్షాంశాల మధ్య, పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాలు మధ్య భాగంలో ఏర్పడతాయి. ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల నుంచి వచ్చే వేడి గాలులు ధ్రువ అధిక పీడన మేఖల నుంచి వీచే చల్ల గాలులు అవిసరణం చెందడం వల్ల అల్పపీడన మేఖల ఏర్పడుతుంది.

ధ్రువ అధిక పీడన మేఖల

ఇది 75° నుంచి 90° అక్షాంశాల మధ్య, అతిశీతల ప్రాంతం, అధిక గురుత్వాకర్షణ బలాలు పనిచేయడం వల్ల ధ్రువ ప్రాంతాల్లో అధిక పీడన మేఖలలు ఏర్పడతాయి. ఈ ప్రాంతంలో సూర్యకిరణాలు ఏటవాలుగా ప్రసరించడం వల్ల అధిక పీడనాలు ఏర్పడతాయి.

పీడన ప్రవణత

ఒక ప్రమాణ వైశాల్యం ఉన్న భూభాగంపై పీడనంలో కలిగే మార్పు రేటును 'పీడన ప్రవణత' అంటారు.

ముఖ్యాంశాలు

- సూర్య గమనాన్ని బట్టి అల్ప, అధిక పీడన మేఖలలు ఉత్తరం వైపు, దక్షిణం వైపు జరుగుతూ ఉంటాయి.
- భూగోళంపై ఇప్పటి వరకు నమోదైన అధిక వాతావరణ పీడనం 1083.3 మిల్లీ బార్లు. 1963 డిసెంబర్ 31న సైబీరియాలోని అగాటా వద్ద దీన్ని గుర్తించారు.
- 1979 అక్టోబర్ 12న మెరియానా ద్వీపాల్లో 'టిప్' అనే చక్రవాతంలో గుర్తించిన అత్యల్ప వాతావరణ పీడనం 870 మిల్లీబార్లు.
- ప్రపంచపటంలో సమానమైన పీడనం ఉన్న ప్రదేశాలను కలుపుతూ గీసిన రేఖలను 'సమభార రేఖలు' అంటారు. ఇవి వేసవిలో భూభాగంపై ఉత్తర దిశకు, సముద్రంపై దక్షిణం వైపు వంగి ఉంటాయి.
- శీతాకాలంలో సమభార రేఖలు భూమి మీద దక్షిణం వైపు సముద్రం మీద ఉత్తరం వైపు వంగి ఉంటాయి.

మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలో ప్రతి 300 మీటర్ల ఎత్తుకు ఎన్ని మిల్లీబార్ల వాతావరణ పీడనం తగ్గుతుంది?
   1) 1 మిల్లీబారు 2) 12 మిల్లీబార్లు
   3) 34 మిల్లీబార్లు 4) 30 మిల్లీబార్లు
2. పశ్చిమ పవనాలు, ధ్రువ పవనాల మధ్య ఏర్పడిన అల్పపీడన మేఖల?
   1) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
   2) ఉపధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) అధిక పీడన ధ్రువ మేఖల
3. అధిక గురుత్వాకర్షణ బలాల వల్ల ఏర్పడ్డ పీడన మేఖల?
   1) అధిక పీడన ధ్రువ మేఖల
   2) ఉప ధ్రువ అల్పపీడన మేఖల
   3) ఉప ఆయనరేఖ అధిక పీడన మేఖల
   4) భూమధ్యరేఖ అల్పపీడన మేఖల
4. ఉరుములు, మెరుపులతో సంభవించే వర్షపాతం?
   1) చక్రవాత 2) పర్వతీయ
   3) నిమ్నోన్నత 4) సంవహన
5. కింది వాటిలో అభిసరణ మండలం ఏది?
   1) భూమధ్యరేఖ అల్పపీడనం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడనం
   3) ఉపధ్రువ అల్పపీడనం
   4) ధ్రువ అధిక పీడనం
6. వాతావరణ పీడనాన్ని కొలవడానికి ఉపయోగించే పరికరం?
   1) హైగ్రోమీటర్ 2) హైడ్రోమీటర్
   3) బారోమీటర్ 4) ప్రెజర్ గేజ్
7. కింది వాటిలో ఏ గాలి ఎక్కువ పీడనాన్ని కలిగిస్తుంది?
   1) తడి గాలి 2) పొడి గాలి
   3) రెండూ సమాన పీడనాన్ని కలగజేస్తాయి
   4) ఏదీకాదు
8. భూమధ్యరేఖ అల్పపీడన మండలం ఏయే అక్షాంశాల మధ్య విస్తరించి ఉంది?
   1) 0°–15° 2) 0°–5°
   3) 20°–40° 4) $66\ ^1/_2{}^\circ$ – 90°
9. సంవహన ప్రక్రియ అధికంగా జరిగే మండలం?
   1) భూమధ్యరేఖ అల్పపీడన మండలం
   2) ఉప ఆయనరేఖ అధిక పీడన మండలం
   3) ఉపధ్రువ అల్పపీడన మండలం
   4) ధ్రువ అధిక పీడన మండలం
10. పీడన ప్రవణత అంటే?
   1) ఉత్తరం నుంచి దక్షిణ దిశగా ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే వ్యత్యాసం
   2) ప్రతి యూనిట్ దూరానికి పీడనంలో చోటు చేసుకునే తరుగుదల
   3) ప్రతి యూనిట్ దూరానికి పీడనం పెరుగుదల
   4) ఏదీకాదు

సమాధానాలు

1) 3	2) 2	3) 1	4) 4
5) 1	6) 3	7) 2	8) 2
9) 1	10) 2		

విద్య, ఉద్యోగ సమాచారం

కేజీబీవీల్లో 1,095 నాన్ టీచింగ్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి టైప్–3, టైప్–4 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి మాత్రమే దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,095.
» **పోస్టుల వివరాలు:** టైప్–3 పోస్టులు–564, టైప్–4 పోస్టులు–531.
» **టైప్–3 పోస్టులు:** ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్–77, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్–134, ఏఎన్ఎం–110, అకౌంటెంట్–11, అటెండర్–28, హెడ్ కుక్–22, అసిస్టెంట్ కుక్–89, డే వాచ్‌మెన్–18, నైట్ వాచ్‌మెన్–26, స్కావెంజర్–33, స్వీపర్–16.
» **టైప్–4 పోస్టులు:** వార్డెన్–86, పార్ట్ టైం టీచర్–122, చౌకీదార్–77, హెడ్‌కుక్–76, అసిస్టెంట్ కుక్–170.

అర్హతలు

» హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్వీపర్, స్కావెంజర్, వాచ్ ఉమెన్, చౌకీదార్, అటెండర్ వంటి పోస్టులకు ప్రత్యేక విద్యార్హత తప్పనిసరి కాదు.
» కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్/డిగ్రీ+ కంప్యూటర్ కోర్సు, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌కు పదో తరగతి, సంబంధిత ట్రేడ్ సర్టిఫికెట్, ఏఎన్ఎంకు ఇంటర్+ఏఎన్ఎం శిక్షణ, వార్డెన్‌కు/పార్ట్‌టైం టీచర్‌కు డిగ్రీ+ బీఎడ్/ఎంఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** వాక్ ఇన్ ఇంటర్వ్యూ, మెరిట్, రిజర్వేషన్, లోకల్ క్యాండిడేట్ ప్రాధాన్యత ఆధారంగా ఎంపికచేస్తారు. జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ ద్వారా తుది ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సంబంధిత జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కార్యాలయం చిరునామాకు పంపించాలి.
» **ఇంటర్వ్యూ తేది:** 23.01.2026 నుంచి 24.01.2026.
» **అభ్యర్థుల తొలి జాబితా లిస్ట్ తేది:** 28.01.2026.
» **ఉద్యోగంలో చేరాల్సిన తేది:** 01.02.2026
» **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://apkgbv.apcfss.in

ఆనందభైరవి రాగాన్ని ఉపయోగించిన తొలి వాగ్గేయకారుడు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ సాహిత్యం

తెలంగాణ ప్రాచీన కవులు

పాల్కురికి సోమనాథుడు (1160-1240)

జన్మస్థలం: వరంగల్ జిల్లా జనగామ సమీపంలోని పాలకుర్తి.

బిరుదులు: ప్రథమాంధ్ర విప్లవ కవి, దేశీ కవిత్వోద్యమ పితామహుడు.

రచనా శిల్పం: 'అల్పాక్షరాల అనల్పార్థ రచన'

రచనలు:

1. **పద్య ప్రకృతులు:**
   అనుభవసారం, చతుర్వేదసారం, చెన్నమల్లు సీసములు, వృషాధిప శతకం
2. **లఘుకృతులు:**
   బసవరగడ, నమస్కార గద్య, శరణుబసవ గద్య, బసవాష్టకం, బసవోదాహరణం, బసవ లింగ నామావళి.
3. **ద్విపద కావ్యాలు:**
   బసవ పురాణం, పండితారాధ్య చరిత్ర, మల్లమదేవి పురాణం (అలభ్యం).

పాల్కురికి సోమనాథుడు కాకతీయుల కాలానికి చెందినవాడు. పరిశోధకులు పాల్కురికి సోమనాథుణ్ని 'తెలంగాణ ఆదికవి'గా పేర్కొంటారు. తెలుగు కవితా ప్రపంచంలో ప్రథమాంధ్ర విప్లవ కవి పాల్కురికి సోమనాథుడు. తెలుగు సాహిత్యంలో శైవ సాహిత్యానికి సుస్థిర స్థానం సంపాదించి పెట్టిన వారిలో పాల్కురికి ఆద్యుడు, అగ్రగణ్యుడు. పాల్కురికి సోమనాథుడు ద్విపద కావ్య ప్రక్రియకు ఆద్యుడు. ఉదాహరణ కావ్య రచనకు మార్గదర్శకుడు.

సంఖ్యా నియమం, మకుట నియమం ఉన్న మొదటి శతకం వృషాధిప శతకం. పాల్కురికి సోమనాథుడి తొలి రచన అనుభవసారం. తెలుగు సాహిత్యంలో శుద్ధమైన తొలి దేశీ స్వతంత్ర పురాణంగా బసవ పురాణం పేరొందింది. ఇది ఏడు ఆశ్వాసాల ద్విపద కావ్యం. సమకాలీన సమాజాన్ని చిత్రించిన తొలి తెలుగు సాంఘిక కావ్యం బసవ పురాణం. పాల్కురికి సోమనాథుడి ద్విపద బసవ పురాణాన్ని పిడుపర్తి సోమన పద్యకావ్యంగా రాశారు.

రుద్రపశుపతి, గొడగూచి, బెజ్జ మహాదేవి, ఉడుమూరి కన్నప్ప, ముగ్ధ సంగయ్య, చిరుతొండ నంబి లాంటి చిన్నపాత్రలకు పాల్కురికి సోమన కావ్య ప్రవేశం కల్పించారు. 'ఉరుతర పద్యోక్తులకంటే సరసమై ఎరిగిన జాను తెనుగు' అన్న కవి పాల్కురికి సోమనాథుడు. ఇతడి చివరి కృతి పండితారాధ్య చరిత్ర. తెలుగులో తొలిసారిగా జీవిత చరిత్ర రాసింది పాల్కురికి సోమనాథుడే అని విమర్శకుల అభిప్రాయం. తొలి తెలుగు విజ్ఞాన సర్వస్వంగా పండితారాధ్య చరిత్రను విమర్శకులు ప్రశంసించారు.

బద్దెన (13వ శతాబ్దం)

బిరుదు: కమలాసనుడు

రచనలు:
నీతిశాస్త్ర ముక్తావళి, సుమతీ శతకం.

బద్దెన కాకతీయుల సామంతరాజు. వేములవాడ చాళుక్య రాజు భద్రభూపాలుడే 'బద్దెన' అని చరిత్రకారుల అభిప్రాయం. ఇతడు రచించిన 'నీతిశాస్త్ర ముక్తావళి' ఒక గొప్ప రాజనీతి గ్రంథం. తెలుగులో వచ్చిన నీతి శతకాల్లో అగ్రగణ్యమైంది సుమతీ శతకం. ఇది కంద పద్య రచనలో వెలువడింది.

గోన బుద్ధారెడ్డి (13వ శతాబ్దం)

బిరుదులు: కవి కల్పతరువు, కవిలోక భోజుడు.

రచన: రంగనాథ రామాయణం

కవితా శైలి: సరళం, పండిత పామర జన రంజకం

గోన వంశ రాజులు కాకతీయుల సామంతులు. వీరు రాయచూరు ప్రాంతాన్ని పరిపాలించేవారు. గోన బుద్ధారెడ్డి నిజాం రాష్ట్రంలోని రాయచూరు ప్రాంతాన్ని పాలించినట్లు 'బూదపూరు, రాయచూరు శాసనాలు' తెలుపుతున్నాయి. గోన బుద్ధారెడ్డి 'పాత్యగేయేచ మధురం' అనే కావ్యోక్తిని దృష్టిలో పెట్టుకొని రంగనాథ రామాయణాన్ని దేశీ ఛందమైన ద్విపదలో రచించాడు. తెలుగులో వచ్చిన రామాయణ కావ్యాల్లో మొదటిది రంగనాథ రామాయణం. ఇది ద్విపద ప్రక్రియకు చెందిన రచన. గోన బుద్ధారెడ్డి రంగనాథ రామాయణాన్ని యుద్ధకాండ వరకు మాత్రమే రాశాడు. ఉత్తర కాండను ద్విపదలో రాసిన సోదర జంట కవులు కాచవిభుడు, విఠలనాథుడు. తెలుగులో వెలువడిన ద్విపద కావ్యాల్లో ప్రథమ గౌరవం పొందిన రచన రంగనాథ రామాయణం.

మారన (13వ శతాబ్దం)

రచన: మార్కండేయ పురాణం

మార్కండేయ పురాణాన్ని ప్రథమాంధ్ర మహాపురాణంగా పిలుస్తారు. అష్టాదశ పురాణాల్లో ఇది ఏడోది. మార్కండేయ పురాణం కృతిపతియైన 'నాగయగన్నడు' కాకతీయ రెండో ప్రతాపరుద్రుడి సేనాపతి. మార్కండేయ పురాణం తెలుగులో అనేక మనోహర కథలకు పుట్టినిల్లు. మార్కండేయ పురాణం ఎనిమిది ఆశ్వాసాల చంపూ కథాకావ్యం.

శరభాంకుడు

కాలం:
రెండో ప్రతాపరుద్రుడి సమకాలీకుడు.

రచన: శరభాంక లింగమ శతకం

పోతన (1420-1480)

నివాసం: బమ్మెర (ఓరుగల్లు)

తల్లిదండ్రులు: కేసన, లక్కమాంబ

బిరుదులు:
సహజ పండితుడు, నిగర్వ చూడామణి.

కవితాశైలి:
మధుర కవితా నిర్మాణం (అతి మధురం)

రచనలు: వీరభద్ర విజయం, నారాయణ శతకం(అలభ్యం), భోగినీ దండకం, మహాభాగవతం.

శ్రీనాథుడి సమకాలీకుల్లో అగ్రగణ్యుడు పోతన. కృతిని మానవులకు అంకితం చేయనని ప్రతిజ్ఞ చేసిన తొలి తెలుగు కవి పోతన. 'సత్కవుల్ హాలికులైననేమి' అని పోతన ప్రకటించాడు. పోతన సర్వజ్ఞ సింగ భూపాలుడు అనే రాజును తిరస్కరించాడు. పోతన భాగవతాన్ని రాస్తూ 'నా జననంబు సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్' అని చెప్పుకున్నాడు. భాగవత పురాణంలో ద్వాదశ స్కంధాలున్నాయి. పోతన భాగవతాన్ని శ్రీరామచంద్రుడికి అంకితమిచ్చాడు. తెలుగు వాఙ్మయ ప్రపంచంలో పోతనను చిరంజీవిని చేసిన రచన భాగవతం. ఇందులో ప్రధానంగా భక్తి మార్గ ప్రశంస ఉంది. భాగవతాన్ని శుకమహర్షి మోక్షశాస్త్రంగా పేర్కొన్నాడు.

తెలుగు భాగవత పురాణంలో పంచమ స్కంధాన్ని బొప్పరాజు గంగన, షష్ఠమ స్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను వెలిగందుల నారయ రచించగా, 1, 2, 3, 4, 7, 8, 9, 10 స్కంధాలను పోతన రచించారు. క్రీ.శ.1848లో పురాణం హయగ్రీవ శాస్త్రులు తొలిసారిగా భాగవతాన్ని ముద్రించారు. శ్రీకృష్ణుని బాల్య క్రీడలు భాగవతంలోని దశమ స్కంధంలో ఉన్నాయి.

'కమలాక్షునర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ...' అంటూ పోతన ప్రహ్లాద చరిత్రం ఘట్టంలో తన భక్తి పారవశ్యాన్ని చాటుకున్నాడు.

'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై...' అనే ప్రసిద్ధ పద్యం పోతన భాగవతంలోని గజేంద్రమోక్షం ఘట్టంలోనిది.

భాగవతంలో మధురభక్తికి చక్కని ఉదాహరణగా దశమస్కంధంలో శ్రీకృష్ణుడి రాసక్రీడల సందర్భంలో పోతన చెప్పిన 'నల్లని వాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై..' పద్యాన్ని చెప్పుకోవచ్చు.

పిల్లలమర్రి పిన వీరభద్రుడు (15వ శతాబ్దం)

పూర్వీకులు:
నల్లగొండ జిల్లా పిల్లలమర్రి నివాసులు

ఆస్థానం: సాళువ నరసింగరాయలు

రచనలు:
శృంగార శాకుంతలం, జైమినీ భారతం.

శ్రీనాథుడి కాలం నాటికి పిల్లలమర్రి వంశస్థులు నెల్లూరులో ప్రధానులుగా ఉండేవారు. పిల్లమర్రి పిన వీరభద్రుడు 'వాణి నా రాణి' అని ఆత్మవిశ్వాసాన్ని ప్రకటించాడు. ఇతడు రచించిన సుప్రసిద్ధ కావ్యం శృంగార శాకుంతలం. దీనికి శకుంతలా పరిణయం అనే పేరుంది. శృంగార శాకుంతలం నాలుగు ఆశ్వాసాల శృంగార ప్రబంధం. ఈ గ్రంథ కృతిపతి చిల్లర వెన్నయామాత్యుడు. జైమినీ భారతం కృతిపతి సాళువ నరసింగరాయలు. కురుక్షేత్రం తర్వాత ధర్మరాజు చేసిన అశ్వమేథ యాగం గురించి జైమిని మహర్షి జనమేయుడికి చెప్పిన కథే జైమినీ భారతం ఇతివృత్తం.

చరిగొండ ధర్మన్న (1480-1530)

జన్మస్థలం: పాలమూరు జిల్లా చరికొండ

బిరుదులు: శతలేఖినీ సురత్రాణ, శతఘంట సురవృతాణుడు.

రచన: చిత్ర భారతం.

ఇది ఎనిమిది ఆశ్వాసాల ప్రబంధం. చిత్రభారతానికి మూలం పద్మపురాణం. దీని కృతిపతి ఎనుమలూరి పెద్దన మంత్రి.

అద్దంకి గంగాధరుడు 1525-1585

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: తపతీ సంవరణోపాఖ్యానం

అంకితం: ఇబ్రహీం కుతుబ్‌షా

తపతి సంవరణోపాఖ్యానం ఐదు ఆశ్వాసాల ప్రబంధం. ఇది చక్కటి లోకోక్తులతో, 24 రకాల వర్ణనలతో కూడుకున్న ప్రబంధం. మహమ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి అద్దంకి గంగాధరుడు. ఇబ్రహీం కుతుబ్‌షా తెలుగు కవులకు ఆశ్రయమిచ్చి, తెలుగువారితో స్నేహభావంతో మెలిగాడు.

పొన్నికంటి తెలగన (1520-1580)

ప్రాంతం: గోల్కొండ నివాసి

రచన: యయాతి చరిత్ర

పొన్నికంటి తెలగననే పొన్నగంటి తెలగనార్యుడు అని పిలుస్తారు. తొలి అచ్చ తెలుగు కావ్యం యయాతి చరిత్ర. ఈ గ్రంథ కృతిపతి అమీన్ ఖాన్. ఇతడు ఇబ్రహీం కుతుబ్‌షాకు సామంతుడు. యయాతి చరిత్ర అయిదు ఆశ్వాసాల శృంగార కావ్యం.

మరింగంటి సింగరాచార్యులు (1520-1590)

బిరుదులు: శతఘంటావధాని, అష్టభాషా కవితా విశారదుడు

రచనలు:
నిరోష్ఠ్య రామాయణం (దశరథరాజ నందన చరిత్రం), సీతాకళ్యాణం(శుద్ధాంధ్ర ప్రబంధం), తారక బ్రహ్మ రామ శతకం, రామకృష్ణ విజయం(ద్వ్యర్థి కావ్యం), నలయాదవ రాఘవ పాండవీయం(చతుర్థీ కావ్యం), శ్రీరంగ శతకం.తెలుగులో మొదటి నిరోష్ఠ్య రచన దశరథ రాజనందన చరిత్రం. మొదటి అచ్చ తెలుగు నిరోష్ఠ్య రచన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణం. తెలుగులో త్ర్యర్థి, చతుర్థి కావ్యాల రచనలకు ఆద్యుడు మరింగంటి సింగరాచార్యులు.

ఎలకూచి బాలసరస్వతి (17వ శతాబ్దం)

జన్మస్థలం: మహబూబ్‌నగర్ జిల్లా

ఆస్థానం: సురభిమాధవ రాయలు

సంస్థానం: జటప్రోలు

రచనలు: రాఘవ యాదవ పాండవీయం (నాలుగు ఆశ్వాసాల కావ్యం), సుభాషిత త్రిశతి అనువాదం, మల్లభూపాలీయం (నీతి శతకం), చంద్రికా పరిణయం (ప్రబంధ కావ్యం), సురభి మల్లా! వైదుషీ భూషణా! (వైరాగ్య శతకం), రంగ కౌముది (యక్షగానం).

భర్తృహరి సుభాషిత త్రిశతిని తెలుగులోకి అనువదించిన తొలి వ్యక్తి ఎలకూచి బాలసరస్వతి. ఇతడే ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యాత. తెలుగులో త్ర్యర్థి కావ్యమైన 'రాఘవ యాదవ పాండవీయం'ను ఎలకూచి బాలసరస్వతి రచించి తిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చాడు.

కంచర్ల గోపన్న (1620 - 1684)

జన్మస్థలం: ఖమ్మం జిల్లా నేలకొండపల్లి

బిరుదు: భక్త రామదాసు

రచనలు: దాశరథీ కీర్తనలు, దాశరథీ శతకం, దాసబోధ.

నిజాం పరిపాలకుడైన అబుల్ హసన్ తానీషా వద్ద మంత్రులైన అక్కన్న, మాదన్నల మేనల్లుడే కంచర్ల గోపన్న. ప్రభుత్వ ఖజానాకు జమ చేయకుండా భూమి శిస్తులను దుర్వినియోగం చేశాడన్న ఆరోపణలతో తానీషా గోల్కొండ కోటలో రామదాసును బంధించాడు. భద్రాచలంలోని రామదాసు మండపంలో రామదాసు రాసిన 220 కీర్తనలు చెక్కబడి ఉన్నాయి. ఇతడి కీర్తనలు 'భజన సంప్రదాయానికి' చెందినవి. ఆనందభైరవి రాగాన్ని మొదట ఉపయోగించిన వాగ్గేయకారుడు రామదాసు. 'రామదాసు చరిత్ర' రచయిత సింగిరి దాసు.

గతంలో వచ్చిన ప్రశ్నలు

1. పొన్నికంటి తెలగన రాసిన అచ్చ తెలుగు కావ్యం?
   1) సౌందరనందం 2) నాగానందం
   3) రాజశేఖర చరిత్ర
   4) యయాతి చరిత్ర
2. తెలుగు సాహిత్యంలో రెండో యుగకర్త?
   1) పాల్కురికి సోమన
   2) నన్నయ 3) తిక్కన
   4) నన్నెచోడుడు
3. మార్కండేయ పురాణాన్ని మారన ఎవరికి అంకితమిచ్చాడు?
   1) మల్ల సైన్య విభుడు
   2) నాగయ గన్న విభుడు
   3) ఎల్లయ సైన్యనాథుడు
   4) నాగయ మేచవిభుడు

సమాధానాలు

1) 4; 2) 1; 3) 2.

Which file is responsible to start MS-Word?

BANK EXAMS

COMPUTER AWARENESS

MS - WORD

1. Which is not a font style?
   1) Bold 2) Superscript
   3) Italic 4) Regular
   5) None of above
2. What is gutter margin?
   1) Margin that is added to right margin when printing
   2) Margin that is added to the left margin when printing
   3) Margin that is added to the outside of the page when printing
   4) Margin that is added to the binding side of page when printing
   5) None
3. Landscape is?
   1) A font style 2) Paper Size
   3) Page Layout
   4) Page Orientation
   5) None
4. Typeface option will come under which menu?
   1) Edit 2) View 3) Format
   4) Tools 5) None of above
5. Background color on a document is not visible in?
   1) Web layout view
   2) Print Preview
   3) Reading View
   4) Print Layout view 5) None
6. What is a portion of a document in which you set certain page formatting options?
   1) Page Setup 2) Section
   3) Page 4) Document
   5) None of above
7. Which of the following is not available on the Ruler of MS Word screen?
   1) Tab stop box 2) Left Indent
   3) Right Indent 4) Center Indent
   5) None of above
8. Gutter position can be set in following positions
   1) Left & Right 2) Left & Top
   3) Left & Bottom
   4) Left Only 5) None of above
9. What is the Short cut key for line break?
   1) CTRL + Enter
   2) Alt + Enter 3) Shift + Enter
   4) Space + Enter
   5) None of above
10. By pressing F12, which of following will happen?
    1) Save As dialog box will open
    2) Save dialog box will open
    3) Open dialog box will open
    4) Close dialog box will open
    5) None of above
11. Which key will open an Open dialogue box?
    1) F12 2) Alt + F12
    3) Ctrl + F12 4) Shift + F12
    5) None of above
12. How will MS Word will respond in repeated word ?
    1) A Green wavy line under the repeated word
    2) A Red wavy line under the repeated word
    3) A Blue wavy line under the repeated word
    4) A pink wavy lines under the repeated word
    5) None of above
13. What is the use of "All Caps" feature in MS - Word?
    1) It changes all selected text into Capital Letter
    2) It adds captions for selected Image
    3) It shows all the image captions
    4) It changes some text into Capital Letter
    5) None of above
14. Which file is responsible to start MS Word?
    1) Winword.exe 2) Win.exe
    3) Word.exe 4) Wordwin.exe
    5) None of above
15. To keep track of different editions of a document which feature we will use?
    1) Editions 2) versions
    3) Tracks 4) Traces
    5) None of above
16. Which is not a type of margin?
    1) Top 2) Left 3) Right
    4) Center5) None of above
17. What will be the use of Ctrl + J?
    1) Insert Image
    2) Insert Hyperlink
    3) Align Justify
    4) Search file 5) None of above
18. What shortcut will we use to align center?
    1) Ctrl + A 2) Ctrl + E
    3) Ctrl + D 4) Ctrl + B
    5) None of above
19. Which shortcut will we use to make text Italic?
    1) Ctrl + U 2) Ctrl + T
    3) Ctrl + I 4) Ctrl + P
    5) None of above
20. How to use Format Painter multiple times?
    1) By Click on Lock Format Painter Icon
    2) Format Painter cannot be use multiple times
    3) By Double Click on the Format Painter Icon
    4) By Double Click on the Format Painter Icon
    5) None of above
21. What is place to the left of horizontal scroll bar?
    1) Indicators 2) Split buttons
    3) Tab stop buttons
    4) View buttons
    5) None of above
22. Where can you find the horizontal split bar on MS-Word screen?
    1) On the top of vertical scroll bar
    2) On the bottom of vertical scroll bar
    3) On the left of horizontal scroll bar
    4) On the right of horizontal scroll bar Comment on this question
    5) None of above
23. Tabs stop position cannot be the following alignment?
    1) Decimal Alignment
    2) Center Alignment
    3) Bar Alignment
    4) Justify Alignment
    5) None of above
24. What is the use of bookmarks?
    1) To correct the spellings.
    2) To jump to a specific location in the document
    3) To ignore spelling mistakes
    4) To save alignments as it is
    5) None of above
25. Which feature is used to replace straight quotes with smart quotes as you type?
    1) Auto Correct as you type
    2) Auto Change as you type
    3) Auto Ignore as you type
    4) Auto Format as you type
    5) None of above
26. Ctrl + D is short cut used for?
    1) Open Dialogue Box
    2) Font Dialogue Box
    3) Save as Dialogue Box
    4) Save Dialogue Box
    5) None of above
27. Ctrl + G is shortcut for?
    1) Open Find and Replace Dialog box with activating Goto Tab
    2) Open Find and Replace Dialog box with activating Find Tab
    3) Open Find and Replace Dialog box with activating Replace Tab
    4) Open Goto Dialog box
    5) None of above Comment on this question
28. Ctrl + H is short cut for?
    1) Open Insert Dialog box activating Insert Hyper Link Tab
    2) Open Find and Replace Dialog box with activating Go to Tab
    3) Open Find and Replace Dialog box with activating Find Tab
    4) Open Find and Replace Dialog box with activating Replace Tab
    5) None of above
29. What can be searched by find?
    1) Format 2) Characters
    3) Symbol 4) All of above
    5) None of above
30. On which page the header or the footer is printed by default?
    1) On first page
    2) on last page
    3) on alternate page
    4) Every page 5) None of above
31. Which of these toolbars allows changing of Fonts and their sizes?
    1) Standard 2) Formatting
    3) Options 4) Review
    5) None of above
32. To spell check which function key you will press?
    1) F5 2) F6 3) F7
    4) F8 5) None of above
33. How to insert a sound file in word document?
    1) From insert -> sound menu option
    2) From insert -> object menu option
    3) From insert -> subject menu option
    4) From insert -> file menu option
    5) None of above
34. How many maximum number of columns can be inserted in the word document?
    1) 45 2) 50 3) 55
    4) 65 5) None of above
35. What is smallest and largest available font on formatting toolbar?
    1) Smallest 8 and Largest 70
    2) Smallest 5 and Largest 72
    3) Smallest 8 and Largest 72
    4) Smallest 5 and Largest 70
    5) None of above
36. Why drop cap is used in document?
    1) To get all first character capital
    2) To get all first character small
    3) To begin a paragraph with a large dropped initial capital letter
    4) To begin a paragraph with a large dropped initial small letter
    5) None of above
37. What is Macro?
    1) Small add-on programs that are installed afterwards if you need them
    2) Type of high level programming language
    3) Type of low level programming language
    4) Small programs created in MS-Word to automate repetitive tasks by using VBA
    5) None of above
38. Which among following can be a vertical separation between columns?
    1) Margin 2) Header
    3) Orientation 4) Gutter
    5) None of above
39. To change the typeface of a document, we will choose following menu option:
    1) Edit 2) View 3) Tools
    4) Format 5) None of above
40. To auto fit the width of column:
    1) Double click the left border of column
    2) Double click the right border of column
    3) Double click the column header
    4) None of above
    5) All the above
41. What is the default font size of a new Word document based on Normal template?
    1) 8pt 2)10pt 3) 12pt
    4)14pt 5) None of above
42. Which of following line spacing is invalid?
    1) Single 2) Double
    3) Triple 4) Multiple
    5) None of above
43. Format painter tool can be found in?
    1) Options toolbar
    2) Standard toolbar
    3) Formatting toolbar
    4) Drawing toolbar 5) None
44. Which among following is correct extension of word files?
    1) xls 2) doc 3) ppt
    4) dcw 5) None of above
45. You can jump to the next column by?
    1) Press Alt + Down-arrow
    2) Clicking with your mouse on the next column
    3) Both of above
    4) None of above
    5) Press Alt + 5 arrow

Key

1) 2; 2) 4; 3) 4; 4) 3; 5) 2; 6) 2; 7) 4; 8) 2; 9) 3; 10) 1; 11) 3; 12) 2; 13) 1; 14) 1; 15) 2; 16) 4; 17) 3; 18) 2; 19) 3; 20) 3; 21) 4; 22) 1; 23) 4; 24) 2; 25) 4; 26) 2; 27) 1; 28) 4; 29) 4; 30) 4; 31) 2; 32) 3; 33) 2; 34) 1; 35) 3; 36) 3; 37) 4; 38) 1; 39) 4; 40) 2; 41) 3; 42) 3; 43) 2; 44) 2; 45) 3.